భారతి

సాహిత్య మాస పత్రిక
జూన్ 1985



కొత్త సీరియల్ "సమిథలు" – దిలావర్

పెద్దకథ "శారద నిర్ణయం" – అన్నపూర్ణ

గిరీశం – ది కెరీరిస్ట్ సింబల్ – బ్రహ్మానంద

పుత్రుడు కదా? – కృష్ణా రెడ్డి

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

జూన్ - 1985

సంపుటము : 62   సంచిక : 6

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

జూన్ 1985

ముఖచిత్రం

ప్రముఖ నర్తకి కుమారి అనూరాధ

కుమారి జొన్నలగడ్డ అనూరాధ

సి. ఎ. ఆర్.



వర్తమాన కూచిపూడి నృత్య కళాకారులలో కుమారి జొన్నలగడ్డ అనూరాధ ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కుంది. ఈమె నాలుగేళ్ల వయసులోనే నాట్యం పట్ల అభిరుచిని కనపరచింది. వేదాంతం జగన్నాథశర్మ, చింతా రాధాకృష్ణమూర్తి, వెంపటి చినసత్యం, కుమారి శోభానాయుడు ఈమెకు గురువులు.

అనూరాధ 1976లో గుంటూరు బాలానందకేంద్రం, 77లో అఖిలభారత నాట్యపోటీలలో, 79లో రాష్ట్ర బాలల అకాడమీ నిర్వహించిన నృత్య పోటీలలో ప్రథమురాలుగా వచ్చింది.

1981లో ఈమె ప్రతిభను గుర్తించి రాష్ట్ర నృత్య అకాడమీ ప్రత్యేక శిక్షణకోసం ఈమెని ఎంపిక చేసింది.

శోభానాయుడుతో కలిసి ఈమె ఏసియాడ్‌లోను, మద్రాసు మ్యూజిక్ అకాడమీలోను ప్రదర్శనలను ఇచ్చింది. "శ్రీకృష్ణ పారిజాతం" నృత్య నాటికలో ఆమె అభినయించిన నారద పాత్ర ప్రశంసాపాత్రమయింది.

అంగవిన్యాసంలో, అభినయంలో, హావభావ ప్రకటనలో విశేషమైన ప్రతిభను అనూరాధ వ్యక్తం చేసింది. కూచిపూడిలో సిద్ధహస్తురాలయిన ఈమె భరతనాట్య పద్ధతిలోనూ పాండిత్యం సంపాదించింది; అన్నమాచార్య సంకీర్తనలకు అనుగుణంగా అభినయించడంలో ఈమెకు ఒక ప్రత్యేకత ఉంది.

నృత్యంతోపాటు చదువు కూడా శ్రద్ధగా సాగిస్తూ అనూరాధ ఇంటర్మీడియేట్ పరీక్షకు వెళ్ళింది. కూచిపూడిలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని ఉవ్విళ్ళూరుతూ నిర్విరామకృషి చేస్తున్న నర్తకి అనూరాధ. ఈమె తల్లిదండ్రులు శ్రీమతి నాగలక్ష్మి, శ్రీ లక్ష్మీనారాయణగార్ల ప్రోత్సాహంతో నే తానింతవరకు రాగలిగానని అనూరాధ అంటుంది. ఆమె కృషి సఫలం కాగలదని ఆశిద్దాము.

శ్రీ ముదివేడు ప్రభాకరరావు

రక్తాక్షికి రారాజు అల్లూరి సీతారామరాజు

(జననం 4-7-1897 : నిర్యాణం 7-5-1924)

శ్లో॥ సరస్వతీ భాసమాన వీణోజ్జ్వల కరాంబుజామ్ ।
రక్తాక్షి సంజ్ఞికాం దేవీం ప్రపద్యే వాగ్విభూతిదామ్॥

వాగ్విభూతిని ప్రసాదించే సరస్వతీదేవి నేటి 'రక్తాక్షి' సంవత్సరానికి అధిష్ఠాత్రి. సరిగ్గా అరవై సంవత్సరాల క్రితం అంటే రుధిరోద్గారి 1924 జనవరి నెలలో దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారిచే ఆంధ్రసాహిత్య సరస్వతీ సమారాధన కోసం 'భారతి' మాసప్రతిక ప్రారంభించ బడింది ఈ 'రుధిరోద్గారి' 1984 జనవరి తో 'భారతి' సాహిత్యషష్టిపూర్తి చేసుకొంది. 1984 ఏప్రిల్ నుంచి 'రక్తాక్షి' ప్రారంభం. ఇది అపూర్వమైన అంశం ఎందుకంటే, 'భారతి' పుట్టిన నాలుగునెలల తర్వాత రక్తాక్షి - వైశాఖ మాసంలో అనగా 1924 మే నెల, 7వ తేదీన మహాయోగిపుంగవుడు, శ్రీరాజ రాజేశ్వరీ మంత్రోపాసకుడు, మన్యవిప్లవ వీరుడు, భారత స్వాతంత్ర్య స్వేచ్ఛాసమర యోధుడు అయిన శ్రీ అల్లూరి సీతారామరాజును 'గుడాల్' అనే తెల్లదొర చెట్టుకు కట్టించి దారుణంగా కాల్చి చంపాడు. దేశ స్వాతంత్ర్యం కోసం రాజు తన రక్తాన్ని తర్పణం చేసింది ఈ 'రక్తాక్షి' సంవత్సరం లోనే. ఈ 'రక్తాక్షి' మే నెల 7వ తేదీకి రాజు మరణించి 60 సంవత్సరాలు పూర్తయింది.

అరవై సంవత్సరాలలో గుడి (ి)తో అంతమయ్యే ఏడు సంవత్సరాలు అరిష్టదాయకాలు. వీటినే 'ఇకారాంత వర్షసప్తకం' అంటారు. అవి - కాళయుక్తి, సిద్ధార్థి, రౌద్రి, దుర్మతి, దుందుభి రుధిరోద్గారి, రక్తాక్షి అనునవి. అరవై ఏండ్లక్రితం ఈ ఏడు సంవత్సరాల కాలంలో ప్రపంచంలోనే మహాసంక్షోభం సంభవించినట్లు చరిత్రే ఋజువు పరుస్తోంది. ఇక ఆ కాలంలో బానిసత్వంలో మగ్గిపోతున్న భారతదేశం సంగతి చెప్పనక్కర లేదు. 1918 - 1924 మధ్య కాలం భారతదేశానికి గొప్ప పరీక్షాసమయం. దేశం అతివాదుల చేతుల్లోనో, మితవాదుల చేతుల్లోనో, ఏదో ఒకటి తేల్చుకోవలసిన విధంగా క్లిష్టపరిస్థితి సంభవించిన కాలం.

పై చెప్పబడిన ఏడు వత్సరాల్లో రుధిరోద్గారి, రక్తాక్షులు సంక్షోభాన్ని విప్లవాన్ని తీవ్రతరం చేసినకాలం.

ఆహవే నిహతా స్సర్వే భూపా, రోగై స్తథాజనాః ।
తథాపి తత్ర జీవంతి రుధిరోద్గారి వత్సరే ॥

యుద్ధంలో రాజులందరూ మరణిస్తారు. రోగాలతో జనులు నశిస్తారు. అయినప్పటికీ రుధిరోద్గారిలో జనులు కొందరు జీవిస్తారు. ఇది 'రుధిరోద్గారి' కథ అయితే— రక్తాక్షి సంవత్సరానికి 'శని' ప్రభువు అధర్మం, అల్పవృష్టి, నీచకర్మాసక్తి, నీచవృత్తి, సంక్షోభం, చోరబాధ, యుద్ధం, రాజవైరం ఫలాలు.

రక్తాక్షి వత్సరే సస్యవృద్ధి ర్వృష్టిరనుత్తమా।
ప్రేక్షన్తే సర్వదాఽన్యోన్యం రాజానో రక్తలోచనాః॥

సస్యవృద్ధి వున్నప్పటికీ రక్తాక్షి సంవత్సరానికి సంరంభం, సంక్షోభం, విప్లవం, రాజులు పరస్పరం రక్తలోచనాలతో చూచుకోవడం మనకు కనబడుతూనే వుంది. ఈ సంవత్సరం భారతదేశమే తీసుకోండి. అస్సాంలో పంజాబులో, ఆంధ్రప్రదేశ్‌లో ఎంత రక్తపాతం! పొరుగు దేశమైన శ్రీలంకలో ఎంత హింసాకాండ! మారణహోమం!! ఈ సంవత్సరానికి రాజైన 'శని', రవి సంయోగాన్ని పొంది ప్రపంచానికి శాంతిని కలుగజేయునటుల భగవంతుడను గ్రహించును గాక!

అందుకే బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 1924 రక్తాక్షి సంవత్సర 'ఆశంస'లో, "సీ, వనురక్తాక్షివిగాఁగ మాతెదవు రక్తాక్షీ! సమీక్షింపగన్" అని ఆనాటి దేశపరిస్థితి సమీక్షించి తమ ఆశంసను వ్యక్తంచేశారు. సంప్రదాయజ్ఞులు రక్తాక్షిని నిర్వచిస్తూ అక్షివీక్షణేనైవ అనురక్తం జనయంతీ" అనడం జగద్ధితాన్ని కాంక్షించడమే కదా!

కాని 'రక్తాక్షి' రక్తాక్షి కాక వేరొక్కటైతే దానికా పేరెందుకు. మనదేశచరిత్రే తీసుకొందాం ! 1957లో మనం ప్రథమస్వాతంత్ర్య సంగ్రామమని చెప్పుకొన్న సిపాయి పితూరి ప్రారంభింపబడింది? ఇది 1857 నుండి 1859 వరకు రెండేండ్లు నడిచింది. సరిగ్గా 65 సంవత్సరాలతర్వాత 1922లో అల్లూరి సీతారామరాజు మన్య విప్లవం లేవదీసాడు. ఇది రెండేండ్లు 1922 నుండి 1924 వరకు తర్వాత సరిగ్గా 60 సంవత్సరాల తర్వాత నేడు 1984 రక్తాక్షి వత్సరం స్థితి ఎలా వుంది ? ఆనాడు సీతారామరాజు సాంఘిక న్యాయం కోసం స్వాతంత్ర్య సమరాన్ని సాయుధంగా నిర్వహించాడు. నేడు కూడా మనకా పరిస్థితి తప్పటం లేదంటే స్వాతంత్ర్యం వచ్చి 37 సంవత్సరాలైనప్పటికీ మన దేశ ప్రజలకింకా సాంఘిక న్యాయం చేకూర లేదంటే మనకు లభించింది రాజకీయ స్వాతంత్ర్యమా ? ఆర్థిక స్వాతంత్ర్యమా ? లేక వట్టి వాక్ స్వాతంత్ర్యమా ? అనే సందేహం కలగక మానదు. వాక్ స్వాతంత్ర్యం కోసమే అయితే అది మనకు బ్రిటిష్ మహాయుగంలోనే వుందని జ్ఞప్తి చేసుకోవటం మంచిది.

ఇంతకూ ఎవరీ అల్లూరి సీతారామరాజు ? అరవై సంవత్సరాల క్రితం దేశంకోసం ఆసువులు కోల్పోయిన వానిని, తెలుగువారు ఎప్పుడో మరచిపోయిన వానిని ఒకసారి జ్ఞాపకం చేసుకొందాం !

సీతారామరాజు క్షత్రియుడు. కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలోని అల్లూరు యింటిపేరుగా గలవాడైనా 4–7–1897లో విశాఖ జిల్లాలోని 'పాండ్రంకి'లో జన్మించాడు. వేంకటరామరాజు, సూర్యనారాయణమ్మల ప్రథమ పుత్రుడు. ఈయన కొక చెల్లెలు సీతమ్మ (1901), తమ్ముడు సత్యనారాయణరాజు (1906) లోను పుట్టిరి. తండ్రి ఒక ఫోటోగ్రాఫర్. 1908లోనే ఆగస్టులో కలరా సోకి మరణించాడు. 4-7-1902 లో అక్షరాభ్యాసం అయినప్పటినుండి రాజు ఒక్కొక్క తరగతి ఒక్కొక్క ఊరిలో చదువుతూ 2–7–1913 లో 4వ ఫారంతో చదువు నిలిపివేసాడు. పాఠశాలలో ఇతని ప్రాణస్నేహితుడు మద్దూరి అన్నపూర్ణయ్య. అతనితో రాజు యిట్లనెడివాడట. "ఇది విద్యయా ? మనదేశ విద్యయే నిజమగు విద్య. నేను సన్యాసి నయ్యెదను. లోకోద్ధరణ కుపకరించు విద్యయే విద్య"

(ఆంధ్రభారతి, శ్రీ రామరాజ ప్రశంస— మద్దూరి అన్నపూర్ణయ్య, జూన్, 1928 పుట 58) ఇటువంటి స్వతంత్ర భావన కలవానికి ఆంగ్ల విద్యాభ్యాసం ఎలా రుచిస్తుంది ? 1913 నుండి 1915 వరకు సంస్కృతాన్నీ, జ్యోతిషాది అనేక శాస్త్రాలనీ కవిరాజు వత్సవాయి నీలాద్రిరాజుగారి వద్దా, సూరి సుబ్బయ్యశాస్త్రి గారివద్దా అభ్యసించాడు.

26– 4- 1916లో గురువుగారి అనుజ్ఞపొంది ఉత్తర భారత దేశయాత్రచేసి వచ్చాడు. యాత్రంతా కాలినడకనే సాగించాడు. 1918లో మరలా రెండవసారి ఉత్తర దేశాన్ని చుట్టివచ్చాడు. బ్రహ్మచర్య వ్రతాన్ని ఆమరణాంతం పాటించిన ఉత్తమ యువకుడు రాజు. ఇతడు రాజ రాజేశ్వరీ మంత్రోపాసకుడనే సంగతి చాల మందికి తెలియక పోవచ్చు. కాని ఇది యదార్థము.

" ఓం ఐం హ్రీం శ్రీం క్లీం మమ జనని
పార్వతీ విద్యాం దేహి దేహి స్వాహా"

అన్నది శ్రీ రాజేశ్వరీ మంత్రం. 21 అక్షరాలు కలది. ఈ మంత్రాన్ని రాజు లక్షసార్లు జపించినవాడు యోగివలె సాత్వికాహారం తీసుకొని బ్రహ్మచర్య వ్రతం పాటిస్తూ, ఇతర దుర్వ్యసనాలేవీ లేకుండా యుండిన నిష్ఠా పరుడు. ఇట్లున్నవాడికి దేవి ప్రత్యక్షమై యిష్టార్థ మనుగ్రహిస్తుంది. ఈ జపం పూర్తయిన తర్వాత రాజుకు అంతర్వాణి ప్రబోధం కల్గింది. అక్టోబరు 1918 లో కృష్ణదేవు పేటలోని "కొంగ శింగి" వద్ద గల మోదుగు చెట్టు కింద మండల దీక్ష పూర్తి చేశాడు రాజు 1919 మార్చిలో తాండవనది, దానిలో గలియు ఉపనది సంగమ స్థానంలో ఆశ్రమ స్థాపనచేసి దానికి " శ్రీరామ రాజేంద్ర విజయనగర" మని నామకరణం చేశాడు.

ఇటువంటి యోగి విప్లవవీరుడెలా అయ్యాడు? అదే అదే ఆశ్చర్యం. రాజు జన్మతః క్షత్రియుడు. కర్మణా బ్రాహ్మణుని వలె సాత్వికుడైనవాడు. స్వామి రామతీర్థవలె "స్వరాజ్యమిందు లేదా మరణ మొసంగుడు (గివ్ మి లిబర్టీ ఆర్ గివ్ మి డెత్) అన్న రాజుకూడా మొదట ఆత్మస్వరాజ్య సంపాదనకై పాటుపడిన వాడే కాని ఏజన్సీ వాసుల కష్టాలను కళ్లారాచూచి విప్లవానికి నాయకత్వం వహించాడు.

బాల్యంలోనే 1906లో 'వందేమాతరం' ఉద్యమంలో పాల్గొన్న తండ్రి తనను ప్రోత్సహించాడు. తిలక్, లజపతిరాయ్, అరవింద ఘోష్, సుభాష్ చంద్ర బోస్, పంటివారి వ్రాతలు, ఉపన్యాసాలు రాజును అతివాదిగా చేసాయి. విప్లవభావాలు, దేశభక్తి, జాతీయోద్యమం యివన్నీ చిన్న నాటనే తండ్రి మూలంగా రామరాజు హృదయంలో హత్తుకొన్నాయి. రాజకీయంగా రాజు కాంగ్రెసులోని అతివాద వర్గానికి చెందినవాడు. 1919లో గాంధీగారు రాజకీయరంగ ప్రవేశం చేయటంతో అతివాదుల బలం క్రమంగా తగ్గుతూ అహింసా సిద్ధాంతవాదుల సంఖ్య పెరిగింది. దీనితో భగత్‌సింగ్ వంటి యువకులు,బోస్‌వంటి నాయకులు, రామరాజువంటి స్వతంత్ర భావన కలవారు వేర్వేరుగా స్వేచ్ఛాసమరం సాగించ వలసిన పరిస్థితి ఏర్పడింది. 1913-18 ప్రాంతాలలోనే రాజు మన్య ప్రజల స్థితిగతులు తెలుసుకొన్నవాడు.

1920లో విశాఖజిల్లా ఏజన్సీలోని గూడెం తహసీలుదారుగా బ్యాస్టియన్ అనే క్రైస్తవు డుండేవాడు. ఓవర్‌సీరు 'సంతానంపిళ్ళె' అనే తమిళుడు. వీరిద్దరి దౌర్జన్యాలకు, దుండగాలకు అంతులేదు. రాజు స్వయంగా పంచాయితీ స్థాపన చేసి న్యాయవిచారణ చేస్తూ మద్యపాన

నిషేధం, జరిమానా విధిస్తూవచ్చాడు. ప్రజలవైపు నిలబడి రాజు కలెక్టరుకు 'బ్యాస్టియన్' అన్యాయాలను తెలుపుతూ పిటీషన్ పంపాడు. దానితో రాజుకు బ్యాస్టియన్ ఆగర్భ శత్రువై కూర్చున్నాడు. రాజుకు భూమిని యినాంగా యిచ్చి హాలికుడుగా చేయాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నం విఫలమైంది.

సీతారామరాజు కాషాయవస్త్రం, తుమాలా వేసికొని తిరిగేవాడు. బొమ్మువరకు గడ్డం. చేతిలో ఒకటిన్నరగజాల పొడవైన వెండి తాపడం చేసిన మోదుగ బెత్తం వుండేది. వ్యక్తి 5అడుగుల 4అంగుళాల ఎత్తు. గొరిల్లా యుద్ధాన్ని శివాజీవలె నడుపగల సమర్థుడు.

రాజు ఉద్యమాన్ని సమర్థిస్తూ 150 మంది పితూరీదార్లు ఉండేవారు. వారిలో గాంగంటందొర, గాంమల్లుదొర అనే సోదరులు కంకిపాటి ఎండుపడాలు, సంకోజిముక్కుడు, గోకిరి ఎర్రేశు, మట్టడపు వీరయ్యదొర బొంకుల మోదిగాడు, అగ్గిరాజు, మున్నగువారు ముఖ్యులు. వేంకట కృష్ణంరాజు పేరిచెర్ల సూర్యనారాయణరాజు అనేవారు ప్రచారకులు. పితూరీ దార్లకు పెదమపురం శరభన్నపాలెం, లింగాపురం ముఖ్య కేంద్రాలుగా వుండేవి.

పితూరీ ప్రారంభించడానికి ముందు రాజు తన అనుచరులతో కలిసి సభచేసి వారిని ఉద్బోధించిన తర్వాత 'శాంబరి' పర్వతంపై రాజరాజేశ్వరిని సందర్శించి మండలదీక్ష తీసుకొన్నాడు. దాదాపు 3 నెలలు గూడెం కొండలలో దాగి తపోశక్తిని సంపాదించి 1922 ఆగస్టు 15 ప్రాంతంలో బయటకు వచ్చాడు. 19-8-1922న మహా రుద్రాభిషేకం. శివజాగరణ చేశాడు.

22-8-1922న మొదటి ముట్టడి. చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి. "మేముపట్టపగలు పోలీస్‌స్టేషనును దోపిడి చేయనున్నాము. మీకు ధైర్యమున్నచో మమ్ము ఎదుర్కొనుడు" - సీతారామరాజు అని ముందుగానే హెచ్చరించాడు. అనుకొన్న ప్రకారం ఆయుధసామగ్రి అంతా దోచుకుని పోలీసుల డైరీలో 'సీతారామరాజు' అని సంతకం చేశాడు.

23-8-1922 కృష్ణదేవుపేట పోలీస్‌స్టేషన్, మరునాడు రాజవొమ్మంగి స్టేషన్‌పై దాడి. హెమన్‌హార్ డి యస్.పి. నాయకత్వంలో ప్రభుత్వసైనికుల ఓటమి. ఇది రెండవ ముట్టడి.

మూడవముట్టడిలో 19-9-22 ఆంగ్లసేనాని జాన్ ఓడిపోయి కాలికి బుద్ధి చెప్పాడు. 21-9-22న మహాకాళి పూజ చేయుచుండగా టాల్బార్టు. సాండర్సు దాడి జరపడం - విప్లవకారులు వీరోచితంగా పోరాడడం - సాండర్సు పలాయన మంత్రం పఠించడం జరిగాయి. కాళీ పూజనిర్విఘ్నంగా జరిగిపోయింది.

24-9-1922న స్కాట్‌కవర్డు, హైటర్ అనే ఆంగ్ల సేనానులు జర్మనీ యుద్ధంలో పాల్గొన్నవారు, దమనపల్లిఘాట్ చేరారు. రాజు 10 మందిని మాత్రమే వీరిపై పంపాడు. ఆంగ్ల సైనికులు 50 మంది వున్నారు. పెద్ద బండరాయికి చాటుగా ఒక పితూరీదారుడు దాగి యిరుకైన త్రోవలో వస్తున్న యిద్దరు సేనానుల గాక తెల్పగా కంకిపాటి ఎండుపడాలు కాల్పులకు యిద్దరూ క్రింద పెద్ద కాల్వలోపడి మరణించారు. ఈ ఘట్టం పితూరీ చరిత్రలోనే కాదు, ఆంధ్రదేశ చరిత్రలోనే అతి ముఖ్యమైంది. ఇది నాల్గవ ముట్టడి.

15-10-1922 నాఫ్ అనే హోంసభ్యుడు గొరిల్లాయుద్ధం ఆపడానికి వచ్చాడు. విఫలుడై వెళ్ళాడు. రాజు గోదావరికలెక్టరు ప్రేకనును తనతో పోరుకైనా, మాటాడుటకైనా రమ్మన్నాడు. కాని ఆయన రాలేదు. రంపచోడవరంలో జనరల్ జాన్ ఓడిపోయి వెనుతిరిగాడు. రామవరం ప్రాంతంలో 'సాండర్సు' మరలా విఫలుడై తిరోగమించాడు.

ఇంతవరకు రాజుకు 5సార్లు ఘనవిజయాలు కల్గాయి. ఆరవసారి ముట్టడితో అపజయం కల్గడం ప్రారంభించింది. 'కొండపల్లి'ని ప్రభుత్వం పితూరీదార్ల ఆహూకి యివ్వలేదని దగ్గం చేసింది.

6-12-1922 ఉదయం జాన్ సేనాని పెద్దగడ్డపాలెం కాల్పులలో 4గురు విప్లవకారులు చనిపోవడం. ఒకరు లొంగిపోవటం జరిగెది. రాజువద్దగల మందుగుండు సామగ్రి ప్రభుత్వ వశమైంది. అదేరోజు సాయంత్రం 'హాఫెల్' 'స్విన్' అనే ఆంగ్లసేనాను లిద్దరూ రెండువేల గుండ్లుగల మెషీన్ గన్‌తో కాల్పులు జరిపించారు. 8మంది పితూరీదార్లు చనిపోయారు. నలుగురు పట్టుబడ్డారు. రాజు, అతని అనుచరులు ముగ్గురు తప్పించుకొన్నారు.

1923జూన్ నెలలో రాజు సైన్యసమీకరణ చేశాడు. ప్రభుత్వం పితూరీనణచడానికి గట్టిచర్యలు తీసుకొంది. కఠిన పాషాణహృదయుడైన గుడాల్‌ను అస్సాంనుండి రప్పించడం. ఒకప్పుడు పల్నాటి తాలూకాలో 'కన్నెకంటి హనుమంతు' తిరుగుబాటునణచిన 'రూథర్ ఫర్డును' గోదావరిజిల్లా కలెక్టరుగా వేయడం-రాజును అతని అనుచరుల్ని పట్టియిచ్చిన వారికి పెద్ద మొత్తంలో బహుమతులు ప్రకటించడం ప్రధానమైనవి. పితూరీదార్లు పలచబడ్డారు. గాం మల్లుదొర పట్టుబడ్డాడు. అగ్గిరాజు ద్వీపాంతర శిక్షపొందాడు.

1924 మేనెల 7వతేదీ ఉదయం ఆరుగంటలకు రాజు 'మంప' మున్సబుతో తన్ను పట్టియిచ్చిబహుమతి తీసుకొమ్మన్నాడు. కాని ఆయన నిరాకరించాడు. కొయ్యూరులోని సైనిక శిబిరానికి తానక్కడవున్న విషయం ఒక పశువుల కాపరి ద్వారా తెల్పగా హుటాహుటిని సైనికులు జమేదారుతో వచ్చి రాజును బంధించి తీసుకువెళ్లారు. మేజర్ గుడాల్ వారిని మందలించి కట్లు విప్పించి రాజుతో కొంతసేపు మాటాడాడు. భారతీయ రాజ్య స్థాపనమే తన ధ్యేయమని రాజు నొక్కిచెప్పాడు. దమనపల్లి ఘాటులో ఆంగ్లేయుల నేల చంపావని 'గుడాల్' అడగగా అది తన అనుచరుల వీరకృత్యమని రాజు ప్రశంసించాడు. అయితే

తానూ కాల్చడానికే నిశ్చయించానని గుడాల్ నవ్వగా, రాజు తనను న్యాయస్థానంలో ఎందుకు పెట్టవని ప్రశ్నించాడు. గుడాల్ అది పెడ చెవినిపెట్టి రాజును చెట్టుకు కట్టించి జమేదారుతో కాల్చమన్నాడు. ఆ గుండు గురితప్పటతో గుడాల్ ఆగ్రహావేశపరవశుడై రివాల్వర్‌తో రాజుగుండెను గురిచూచి కాల్చిచంపాడు. వరుసగా నాల్గయిదు గుండ్లు రాజు గుండెలో దూసుకు పోయాయి. రాజు స్వయంగా పట్టుబడ్డాడు కాని ఆయన్ను పట్టిబంధించడం ఎవరి తరంకాదు.

విచారణ లేకుండా ఒక మహాయోగి పుంగవుని కాల్చిచంపడం అనాగరిక కృత్యం. బ్రిటిష్ సామ్రాజ్యానికిది తీరని కళంకం. 8వతేదీ ప్రజలు రాజు శవాన్ని గుర్తించి దహనం చేయించి చితాభస్మాన్ని తాండవనదిలో కలిపారు. హత్యజరిగిన సాయంత్రం రూథర్‌ఫర్డ్, స్పీన్ వచ్చి 'గుడాల్'ను మందలించాడు. గాని అంతరాంతరాల్లో సంతోషించాడు. తర్వాత అందరూ కలిసి తప్పించుకోవడానికి ఒక ఎత్తు వేశారు. తాము రాజును పట్టుకొనగా అతడు పారిపోవుటకు ప్రయత్నించాడని, అలా పారిపోతుండగా కాల్చిచంపామని కథను అల్లి ఎందుకైనా మంచిదని దీర్ఘకాలం సెలవుమీద వెళ్లిపోయారు.

13-4-1919లో జలియన్‌వాలాబాగ్ సామూహిక హత్యలలో కాల్పులు జరపడానికి జనరల్ డయర్ కు ఎవరు అనుమతి యిచ్చారు? "హు ఆస్క్‌డ్ యు టు ఓపెన్ ఫైర్ ?" అని గవర్నర్ జనరల్ అడిగిన ప్రశ్నకు డయర్ నిరుత్తరుడైనాడు. కాని తర్వాత ప్రభుత్వంచే గొప్ప బహుమతే అందుకున్నాడు. ఆ విధంగా విచారణ లేకనే గుడాల్ రాజును కాల్చి చంపాడు. కృష్ణదేవు పేటలో శరభన్న పాలెం పోయేమార్గలో రాజుగారి స్మృతి చిహ్నం దహనం జరిగిన ప్రదేశంలోనే ఏర్పరచబడింది. "ఆంధ్రవీర శ్రీ అల్లూరి రామరాజుగారి భౌతిక దేహ దహన పవిత్ర క్షేత్రం" అని దానిపై వ్రాయబడింది. రామరాజు పితూరీ నణచడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి 53 లక్షలు ఖర్చయింది. అనేక ఉద్యోగులు, సైనికులు, ఆయుధ సామగ్రి నష్టమయింది. హత్య కావింపబడినప్పుడు రాజు వయస్సు 27సంవత్సరాలు.

రామరాజు చనిపోయిన తర్వాతనే ఆయన గొప్పతనం మన దేశ నాయకులకు తెలిసి వచ్చింది. "తనకు తెలిసినంత వరకూ వేళ్లపైన లెక్కించ దగిన మహనీయులలో రాజు ఒకడని" నెహ్రూ ప్రశంసించాడు. "ఆయన కార్యదీక్ష, పట్టుదల, ధైర్య సాహసాలు ఆయన కీర్తిని నలు దిశల వ్యాపింప జేసినదని" సుభాష్‌చంద్రబోస్ వ్యాఖ్యానించాడు. మన ఆంధ్ర నాయకుడేమన్నాడో చూడండి. "రాజు అతని అనుచరులు దోపిడి కాండ్రని దేశభక్తులు కారని" అప్పటి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ప్రెసిడెంటు శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు 30-8-1922 లో పెద్దాపురం కాంగ్రెసు సంఘానికి పంపిన తంతీ వార్తలో తెలిపాడు. ఎవరు దోపిడీ కాండ్రు ? వ్యాపార మిషతో దేశాన్ని దోచుకున్న ఆంగ్లేయులా ? లేక స్వాతంత్ర్యం సంపాదించామని దేశం దోచుకుంటున్న నేటి నాయకులా ? రామరాజు ప్రకాశానికే మాత్రం తీసిపోని దేశ భక్తుడు. 'యంగ్ ఇండియాలో' 'ఆంధ్ర హీరో' అని ప్రశంసించిన గాంధీ మహాత్ముని వాక్యాలు చూడండి. "దో ఐ హావ్ నో సింపథీ విత్ అండ్ కెనాట్ అడ్మైర్ ఆర్మ్‌డ్ రెబెలియన్, ఐ కెనాట్ విత్ హోల్డ్ మై హోమేజ్ ఫ్రం ఎ యూత్, సో బ్రేవ్, సో సాక్రిఫైసింగ్, సో సింపుల్ అండ్ సో నోబుల్ ఇన్ కారెక్టర్ యాజ్ ఎంగ్ శ్రీ రామరాజు. ఇఫ్ ది ఫాక్ట్స్ కలెక్టడ్ బై శ్రీ అన్నపూర్ణయ్య ఆర్ ట్రూ, రాజు వజ్ నాట్ ఎ ఫితూరీ బట్ ఎ గ్రేట్ హీరో," (యంగ్ ఇండియా, 18-7-1929)

రాజుతల్లి 1953 లోను, చెల్లెలు 1964 లోను మరణించారు. ఆయన తమ్ముడు అల్లూరి సత్యనారాయణరాజు సజీవులై వున్నారు. గాంధేయ వాదిగా జైలుశిక్ష ననుభవించినవారు. జైలులో రాహుల్ సాంకృత్యాయన్ వ్రాసిన 'ఓల్గా సేగంగా' వంటి గ్రంథాల్ని అనువదించినవారు. సీతారామరాజు బుర్రకథ వ్రాశారు. పెద్దాపురం బూరుగుపూడి ప్రాథమిక పాఠశాలా ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైరయినారు. చాల బీద స్థితిలో ఉన్న వీరికైనా మన ప్రజా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తే అదే పదివేలు.

ఒకసారి అతివాదవర్గానికి చెందిన వారిని ఉద్దేశిస్తూ గాంధీ యిలా అన్నాడు. లెట్ మి ఎంఫసైజ్ దట్ దేర్ షుడ్ బీ నో అండర్ గ్రౌండ్ యాక్టివిటీ. దేర్ షుడ్ బీ నో సీక్రెట్ మూవ్‌మెంట్. ఇట్ ఈజ్ ఎ సిన్" అని కాని సీతారామరాజు సాయుధ పోరాటాన్ని నిరసించిన అహింసా సిద్ధాంత మార్గ ప్రవక్త మహాత్మాగాంధీ 1947 లో స్వాతంత్ర్యమైతే సాధించారుగాని ఆయన కళ్ళఎదుటే ఎంత రక్తపాతం జరిగింది? చివరికి తాను 1948లో ఏమయ్యాడు? విప్లవ వీరుడని చెప్పి రాజును ఒక విదేశీయుడు కాల్చగా, గాంధీని ఒక స్వదేశీయుడే కాల్చి చంపాడు. చూచారా! న్యాయానికి, ధర్మానికి - అతివాదమైనా. మితవాదమైనా - దక్కే ఫలితం !! రాజే గనుక అహింసామార్గంలో వెళ్ళివుంటే మరో గాంధీ మహాత్ముడయ్యేవాడు ! యోగమార్గంలో వెళ్లివుంటే మరో అరవిందఘోష్ అయ్యేవాడు ! అరవిందుడు కూడా మొదట విప్లవవాదియే. ఇప్పుడు మనం గాంధీ గారిని విస్మరించాం- రామరాజును అంతకు ముందే మరచిపోయాం. రెంటికి చెడిన రేవళ్లయ్యాం- భ్రష్టస్య కావా గతిః ?

రాజు 'వందేమాతరం' ఉద్యమానికి చెందిన వీరుడు. ఆయన నినాదం "వందేమాతరం మనదే రాజ్యం" రాజరాజేశ్వరీ భక్తుడైనా మహాకాళిని ఎందుకు పూజించాడు ? దీనికి రామకృష్ణ పరమహంస సమాధానం చూడండి. "ఔట్ సైడ్ మై మదర్ ఈజ్ టెరిబుల్ బట్ ఇన్ హర్ హార్ట్, షి ఈజ్ ఫుల్ ఆఫ్ మెర్సీ — హౌ1 దొ టెర్రిబుల్ ఒన్, ఎవర్ మోర్ ప్రొటెక్ట్ అజ్ ఫ్రం ఇగ్నొరెన్స్

విత్ డ్రై స్వీట్ కంపాషనేట్ ఫేస్" రాజు విప్లవ స్వభావం కూడా సరిగ్గా యిటువంటిదే. రాజరాజేశ్వరికీ, మహా కాళికి అభేద ప్రతిపత్తిని భావించినవాడు రాజు. ఆత్మ స్వాతంత్ర్యం కంటే దేశ స్వాతంత్ర్యమే ధ్యేయంగా పోరాడినవాడు.

రాజు 'రక్తాక్షి' సంవత్సరం కీర్తిశేషుడైనాడని ఆయన జీవిత చరిత్రలో చదవగానే నాకు ఏనుగంత బలం వచ్చింది. కొండంత ఆత్మ విశ్వాసం ఏర్పడింది. ఆ అంకురిత ఆత్మ విశ్వాసంతోనే, ఆ ఆవేశపూరిత హృదయంతోనే ఈ గేయం వ్రాసి 'భారతి' పాఠకులకు సమర్పించుకుంటున్నాను. సహృదయ పాఠకులు ఈ కవితను ఆనందా శ్రువులతో ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాను.

1

రక్తాక్షరాలతో లిఖించాడు రాజు
ఈ రక్తాక్షి సంవత్సరాన్ని !
రక్తతర్పణం చేశాడు, దేశ
విముక్తి కోసం నిండుప్రాణాన్ని ! !
ఈ తిరుగుబాటు ఉదంతాన్ని
సువర్ణాక్షరాలతో లిఖించుకోలేని
చరిత్రహీనులం మనం
ఇప్పటికి శేషప్రశ్నగానే మిగిలిపోయాం !
చరిత్ర పుటల్ని షరాబుఖాతాలా
ఖరాబు చేసుకొన్నాం ! !
ఆ అమర వీరుని జ్ఞాపకార్థం
అశ్రుతర్పణ మాచరించని మనం
భావి భారత భాగ్య విధాతలం !
ఆ జాతిపితనైనా అనుసరించక
అధోగతిలో అఘోరిస్తున్నాం ! !

2

రక్తాక్షికి రాజెవరని యడిగితె
సీతారామరాజనుటకు భయపడకు !
అల్లూరి సీతారామరాజు !
అతడే రక్తాక్షికి రాజు ! !
రాజంటే యింద్రుడా ?
అమృతం గూడు కట్టిన దొర ఆ చంద్రుడా ? ?
శత్రుల పాలిటి రారాజు !
ఆర్తుల పాలిటి రేరాజు ! !
కూడు, గూడు, గుడ్డలేని
గూడెం లోని మన్యప్రజలు
కరుడు గట్టిన 'బ్యాష్టియన్'
కరాళ దౌష్ట్యానికి రోజూ
బలి పశువులు కావడం
కళ్లారా జూచిన రాజు.........
కళ్లెఱ్ఱ జేసిన రాజు.........
తెల్ల దొరల ఎఱ్ఱటి రక్తం
కళ్ల జూచి మహాకాళికి
బలి యిచ్చిన రాజు.......
అతడే రక్తాక్షికి రారాజు !
అల్లూరి సీతారామరాజు ! !
రక్తాక్షికి రాజెవరని యడిగితే
సీతారామరాజనుటకు భయపడకు ! !

3

సీత కోసం పరితపించి
శత్రు సంహారం చేసిన
శ్రీరామచంద్రుని కంటే
ప్రేమించిన 'సీత' మరణించగా
తన పేరుతో ప్రియురాలిని శాశ్వతం చేసిన
'సీతా' రామరాజెంత అమృత హృదయుడో !
ఎంతటి సహృదయ ప్రేమికుడో ! !
మూడు పాదాలా ధర్మధేనువు
ముచ్చటగా నడిచే యుగంలో
రాముడు నరుడైన దేవుడై
ధర్మాన్ని ఉద్ధరించడంలో గొప్పలేదు—
'ఒంటికాలిమేక' వంటి
కుంటి కాలి కలియుగంలో
ఒంటరిగాడైన రాజు—
ఆంగ్లేయులు మన్య ప్రజకు చేస్తున్న అన్యాయం
అసహాయ శూరుడుగా ఆనాడే ఎదిరించి,
న్యాయం కోసం సాయుధ పోరాటం సాగించి,
తెల్ల దొరల కసికీ,
రక్తాక్షి రక్కసికీ,
అమానుషంగా హతం కావడం
అది ఆయన తప్పు కాదు—
కలిసిరాని కాలానిది !
తెలివిలేని ప్రజలది ! !

4

గతంలో—
అరవై సంవత్సరాల క్రితం,
తన విలక్షణ వ్యక్తిత్వంతో
విప్లవ శంఖారావం పూరించిన వాడు,
అరక్రాంత నేత్రుడు
అన్యాయం పై తిరుగుబాటు
ఆనాడే కాదు—
ఏనాడూ వుంది—
ఎప్పటికీ కొనసాగుతూనే వుంటుందని
చెప్పిన మూడు పదులు దాటని యువకుడు,
విప్లవ వైతాళికుడు —
రవి అస్తమించని శ్వేత సామ్రాజ్యానికి
సింహస్వప్నమై గడగడలాడించిన వాడు,

ముప్పతిప్పలు పెట్టి మూడు చెఱువుల నీళ్లు
తప్పక తాగింపజేసినమొనగాడు.
వట్టి రాజెలా అవుతాడు, ?
కోటి సూర్య సమ ప్రభుడు !
రక్తారుణ విప్లవ శేఖరుడు !!

5

ఈ షష్టి సంవత్సరాల చరిత్రగతి
ఒకే స్థితిలో వున్నదంటే—
మన మెంతటి దుస్థితిలో వున్నామో
ఎంతగా దిగజారిన పరిస్థితులకు వారసుల మయ్యామో
ఊహించుకోలేమా ?
పునరావృతం కావడమే చరిత్రగతి అయితే
ఈ విశాల భారతదేశ చరిత్రలో
అరవై సంవత్సరాలొక పెద్దకాల పరిమాణమా ?
అసలు పరిణామమే లేని చరిత్ర మనది !
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది ! !
అందుకే అంతంలేని ఈ కథ నడుస్తూనే వుంది !
ఫలితంలేని పోరాటం వల్ల ప్రయోజనం లేదు ! !
"ఈ సామాజిక రుగ్మతకు సాయుధ పోరాటమే
సరైన శస్త్రచికిత్స" అని ఆనాడే చేసిచూపాడు రాజు !
నిన్న మొన్నటిదాకా శ్రీశ్రీ గొంతుచించుకొన్నాడు రోజూ ! !
పోరాటానికి కింకా పూర్తిగా సమాయత్తం కాని
ప్రజలతో విసుగెత్తిన కవుల కంఠాలు
క్రమంగా వినబడక పోతున్నాయ్ !
కలాలు వ్రాయడం మానుకొంటున్నాయ్ ! !
నేటి సామాన్య మానవుని అనుక్షణ నిరీక్షణ
నిత్యావసర వస్తువుల కోసమా ? కాదు—
నిత్యజీవితమహా సంగ్రామ రంగంలో
భూనభోంతరాళాలు దద్దరిల్లే విప్లవ ధనుష్టం కారం కోసం !–
ఈ సామాజిక సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ! !

6

సంఘర్షణ! సంఘర్షణ!!
సంఘంలో శాశ్వత ఘర్షణ!!
ఈ సంవత్సర లక్షణ లక్షితం!
రక్తాక్షికి రక్తారుణ తిలకం!!
ఈ సంవత్సరదేవికి లేదు పారాణి!
ఆమె విప్లవమంత్ర పరాయణి!!
రక్తాక్షరాలతో లిఖించాడు రాజు
ఈ రక్తాక్షి సంవత్సరాన్ని!
రక్తితర్పణం చేశాడు. దీనుల
విముక్తికోసం నిండుప్రాణాన్ని!!
మహాయోగి పుంగవుడు!
మహాకాళి భక్తుడు!!
మహామంత్ర జాపకుడు!
విప్లవ మంత్ర పరాయణుడుగా
ఎలా పరిణమించాడు?
అదేఅదే ఆశ్చర్యం!
అందరికీ పరమాశ్చర్యం!!

7

'సాదురేగితే తలపొలాన
నిలవదురా' యని
తెల్లవాడి గుండెల్లో
నిద్దుర పోయినవాడు—
వాడి ప్రక్కలోన బల్లెంగా
బైతాయించిన వాడు—
మన్య విప్లవ విరూపాక్షుడు!
మన్యుప్రేరిత వీరభద్రుడు!!
అభిమన్యునిలా—
సామాన్యులకు సైదోడై నిల్చిన
మాన్యుడు! మన నాయకుడు!!
రారా! ఆంధ్రసోదరా!!
రక్తాక్షికి రారాజురా!
అల్లూరి సీతారామరాజు!!
అన్యాయం జరిగే చోటల్లా
అరుణ కమలాక్షుడై
రక్తాక్షుడై విజృంభించే వీరుడురా!
వాడి మయూఖుని
వేయి కిరణాల వేడిరా!!
రక్తాక్షికి రక్షాకవచంరా!
ఆంధ్రులకే శ్రీరామరక్షరా!!
అల్లూరి సీతారామరాజు!

8

సోదరా!
ఒక్క రక్తాక్షికే కాదురా!!
రుధిరం లావాద్రవంలా కరిగించే 'రుధిరోద్గారి'కి,
రక్తాన్ని బడబాగ్నిగా మార్చే 'రక్తాక్షి'కి,
క్రోధం సుడిగుండమై కోసే 'క్రోధన'కి,
అక్షయంగా న్యాయం జయించే 'అక్షయ'కి
ఈ సంవత్సర చతుష్టయానికి
చతుర్ముఖ బ్రహ్మగా
మరలా ప్రభవిస్తాడురా మనరాజు!
సంకల్ప సూర్యోదయుడై
సిద్ధిని సాధిస్తాడురా మహారాజు!!
అందుకేనోయ్! ఆంధ్రసోదరా!
రక్తాక్షికి రాజెవరని యడిగితె
సీతారామరాజనుటకు భయపడకోయ్!!

9

రక్తాక్షికి రారాజురా! —సై—
ఆర్తులకూ రేరాజురా! —సై—
కొంపలు కాల్చిన ఆంగ్లేయుల్ని

'రంపం'లా కోసాడురా! —సై—
'దమనపల్లీ ఘాటు'లో, —సై—
దానవుల్ని దహించాడురా! —సై—
కానీ.........
ఎదురులేని ఏకైక వీరులు
రామరాజు పితూరిదారులు,
ఒక్కరొక్కరె కన్ను మూశారా.... అయ్యో....
దారిలోనే ఒక్కరొక్కరు కన్నుమూశారా!
'కొంతపల్లి' రెండుసార్లూ
కాలిపొ'వుట చూడలేకా
'మంప' దగ్గర తనకుతానే
లొంగి పోయెర రామరాజూ.... అయ్యొయ్యో....
లొంగిపోయెర రాజరాజూ....

10

మండుటెండా........
ఎండు గుండే........
పచ్చిగూండా 'గుడాల్'
బ్రిటిష్ గుండెలు తీసిన
రాజు గుండెనే
గురిచూచి కొట్టాడురా,
అరెరే! గుండ్లు పేల్చి చంపాడురా!!
అది శిక్షకాదు- ఉరిశిక్ష కాదురా- గుడాల్.......
నీవు చేసినది హత్యరా!
అమానుష హత్యరా!!
నీవొక పైశాచిక నృత్యం చేసిన కృత్యమురా!!!
మా రాజుకు మృత్యువు లేదురా!
రారా!! రారా! ఆంధ్ర సోదరా!
రక్తతర్పణం చేసిన రాజుకు
అశ్రుతర్పణం ఆచరించరా!
'వందేమాతరం' కీర్తితోరణం
దిగంతాల వ్యాపించెరా!!

అన్యాయం నశించాలి ! విప్లవం వర్ధిల్లాలి !!

అల్లూరి సీతారామరాజు పై వెలువడిన గ్రంథాలు వ్యాసాలు - సమీక్షలు

జీవిత చరిత్రలు

1. అల్లూరి సీతారామరాజు చరిత్ర—భమిడి సత్యనారాయణ
2. అల్లూరి సీతారామరాజు చరిత్ర—యర్రమిల్లి నరసింహారావు
3. అల్లూరి సీతారామరాజు చరిత్ర—పొన్నలూరి రాధాకృష్ణమూర్తి
4. సీతారామరాజు చరిత్ర —దాలినాయుడు
5. అల్లూరి సీతారామరాజు చరిత్ర—కొడాలి లక్ష్మీనారాయణ

వ్యా సా లు

6. 'మ్రొక్కు' —భమిడిపాటి సత్యనారాయణ, శారదా ప్రెస్ ప్రచురణ (1922)(రాజు, అతని అనుచరులు దోపిడీ కాంద్రని, దేశభక్తులు కారని అప్పటి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ప్రెసిడెంటు శ్రీ టంగుటూరి ప్రకాశం గారు 30-8-1922వ తేదీన పెద్దాపురం కాంగ్రెస్ సంఘానికి పంపిన తంతీ వార్తను విమర్శిస్తూ వ్రాసిన 60 పు. వ్యాసం)
7. చిచ్చుల పిడుగు-పితూరి —మద్దూరి అన్నపూర్ణయ్య (పై సందర్భంలోనే రాజుగారి బాల్య మిత్రుడు రాజును సమర్థిస్తూ వ్రాసిన వ్యాసం)
8. శ్రీ రాజరాజ ప్రశంస —డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంధ్ర భారతి, జూన్ 1928,పుటలు 57-58.
9. శ్రీ రామరాజ ప్రశంస —మద్దూరి అన్నపూర్ణయ్య, ఆంధ్ర భారతి. జూన్ 1928 పుటలు 58-62
10. శ్రీ అల్లూరి రామరాజుగారు —(బాల్యంలోతీసిన ఫోటోతోసహా) భారతి, విభవ, ఆషాఢమాసం జులై 1928 (కలగూరగంప) పుటలు - 136-137
11. 'ది ఆంధ్ర హీరో' (ఆంగ్లవ్యాసం) —"ది యంగ్ ఇండియా" 18 - 7 - 1929 ఎం. కె. గాంధీ.

నా టి క లు - బు ర్ర క థ లు

12. సీతారామరాజు మరణకారణము (రాజకీయ నాటిక) — ఖండవల్లి రాజారావు. ప్రచురణ - దండోరా కచేరీ; రాజమహేంద్రవరం.
13. సీతారామరాజు (బుర్రకథ) — అల్లూరి సత్యనారాయణరాజు (రాజుగారి తమ్ముడు)
14. అల్లూరి సీతారామరాజు (నాటిక) —పడాల రామారావు


స మీ క్ష లు

15. సీతారామరాజు మరణకారణము — పుస్తక సమీక్ష భారతి, ప్రభవ ఫాల్గుణము మార్చి, 1928 పుట-512
16. శ్రీఅల్లూరి సీతారామరాజు చరిత్ర —కొడాలి లక్ష్మీనారాయణ పుస్తక సమీక్ష; ఆంధ్రజ్యోతి 19-12-1965
17. యాన్ ఆథెంటిక్ హిస్టరీ ఆఫ్ అల్లూరి సీతారామరాజు— కె. లక్ష్మీనారాయణ. బుక్ రెవ్యూ,'ది హిందూ' 12-12-1965 పి.వి.యల్. నరసింహారావు.

ఇవిగాక ఆంధ్రపత్రిక,కృష్ణాపత్రికల్లో రాజును గూర్చి అనేకులు వ్యాసాలు ప్రచురించినట్లు తెలుస్తోంది. 'భారత స్వాతంత్ర్య సంగ్రామ రంగంలో అల్లూరి సీతారామరాజు పాత్ర' పై పరిశోధన చేసే వారికి పై సూచిక ఉపకరిస్తుందని భావిస్తాను.

పుత్రుడు కదా?

పులికంటి కృష్ణారెడ్డి



చెక్కిన చెక్కపేడులా సన్నంగా ఉన్న ఆ కుర్రవాడు బాట పక్కన నిటారు కొమ్మలా నిలబడి ఉన్నాడు - మౌనంగా !

మసి పేలికల్ని చుట్టచుట్టి వాడితల మీద పెట్టినట్లు గూడు కట్టుకొన్న వెంట్రుకలు.... గుంటలు పడిన కండ్లు .... ఆ కండ్లల్లో ఎర్రజీర...బాగా లోతుకు పీక్కుపోయిన దవడలు .... మాసిన బట్టలు ... ఆ కుర్రవాడి వయస్సు యిరవై ఏండ్లకు అటోయిటోగా ఉంటుంది.

ఎదురుగా ఎదో ఒక దేవాలయ మహాద్వారాన్ని తలపింప చేస్తున్నట్లు రైల్వేస్టేషన్ బిల్డింగ్స్... ఆ బిల్డింగ్స్‌కు ఎదురుగా తూర్పు పడమరలుగా సాగిపోతున్న వెడల్పయిన బాట....ఆ బాట మీద నుండి పడమర వైపుగా వెళ్ళితే మిద్దెలు....మేడలు .... ఆ మిద్దెలు మేడల్లో ఖరీదైన మనుష్యులు ... ఆ ఖరీదైన మనుష్యుల కోసం అంతకంటే ఖరీదైన వస్తువుల్ని నిల్వ చేసుకొన్న అంగళ్ళు వగైరా...వగైరాలు - తూర్పు వైపుగా వెళ్ళితే గుంపులు గుంపులుగా మనుష్యులు ... ఆ మనుష్యులు హడావిడిగా చేస్తున్న రంపులు వేళాపాళా లేకుండా కొనసాగిపోతుంటాయి !

ఏడుకొండలవాడి నిత్య కళ్యాణం లాగా గుంపుల రంపుతో నిరంతరం జాతర చేసుకొంటున్న ఆ కూడలికి ఒక పేరు పెట్టుకొనే ఓపికలేని జనం— అరువు తెచ్చుకొన్న ముద్దుల పేరు బస్‌స్టాండ్!

రైల్లో సీటు దొరకని వాళ్ళు బస్‌స్టాండ్‌కు, బస్సులో సీట్ దొరకని వాళ్ళు రైల్వేస్టేషన్‌కి - పార్టీలో టిక్కెట్టు దొరకని రాజకీయనాయకులు పార్టీలు ఫిరాయించినట్లు యిటునుండి అటు, అటు నుండి యిటు తిరుగుతుంటారు. ఇటునుండి అటు నడిచినా, అటునుండి యిటు నడిచినా రైల్వేస్టేషన్ నుండి బస్‌స్టాండ్‌కు అయిదునిముషాల కంటే ఎక్కువకాలం పట్టదు గనుక, ఆ మధ్య ప్రాంతం వచ్చే పొయ్యేజనంతో సమ్మర్దంగా ఉంటుంది.

ఒకానొక ప్రాంతంలో - తనకు పలుకుబడి విరివిగా ఉంటుందన్న ప్రాంతంలో నమ్మకంగా నామినేషన్ ఫైల్‌చేసిన ఎమ్మెల్యేలాగా ఆ కుర్రవాడు సరిగ్గా అట్లాంటి ప్రాంతాన్నే ఎన్నిక చేసుకొన్నాడు.

బాట పక్కన నిలబడి ఒకసారి దీనంగా, మరొకసారి కోపంగా, ఇంకొకసారి నిస్సహాయంగా చూస్తున్నాడు వాడు. వాడు చూస్తున్నది వస్తూపోతూ ఉన్న జనాన్నికాదు. ఇంత కాలం తనకు నిలువనీడనిచ్చిన స్టేషన్ బిల్డింగ్స్‌నికాదు. అటుయిటుగా వ్యాపించి ఆకలిని తీర్చలేని టీ అంగళ్ళను కాదు - తన ముందర పడివున్న శవాన్ని !

ఆ స్టేషన్ ముందర విశాలమైన బాటలో అంతకు ముందుగానే ఆరడుగుల పొడవు, నాలుగడుగుల వెడల్పు స్థలాన్ని శుభ్రపరచినాడు.

ఆ స్థలంలో శవాన్ని పడుకోబెట్టినాడు. ఆ శవంపైన చాలీచాలని ఒక గుడ్డను కప్పినాడు. ఆ గుడ్డమీద అక్కడొకటి అక్కడొకటిగా నాలుగుపువ్వులు పెట్నాడు. తల దగ్గర కాసంతమట్టిని కుప్పద్దోసి, నాలుగు సాంబ్రాణివత్తులు కూడా వెలిగించి కుప్పదోసిన మట్టిలో కుచ్చినాడు. ఆ శవానికి పక్కన్నే ఒక తువ్వాలు గుడ్డ పరిచినాడు. ఆ తరువాత జేబులో చెయి పెట్టి పదిపైసల బిళ్ళచేతి కందుకొన్నాడు. చేతులు జోడించి శవాని కొక్క నమస్కారం పెట్టి, ఆ పదిపైసల బిళ్ళని కండ్లకద్దుకొని ఆ తువ్వాలు మీదికి విసిర్నాడు. ఆ తరువాత ఆ దృశ్యాన్ని పరికించిచూచినాడు. ఒక చిత్రాన్ని అత్యంత శ్రద్ధతో పూర్తిచేసిన చిత్రకారుడి లాగా !

ఇప్పుడా శవం పక్కన్నే మౌనంగా నిలబడు కొన్నా ఆ కుర్రవాడు - ఒకసారి కోపంగా, మరొకసారి దీనంగా ఇంకొకసారి నిస్పహాయంగా - ఆ శవంవైపు చూస్తున్నాడు. వాడేకాదు - వస్తూ పోతూన్న వాళ్ళకూడా చూస్తున్నారు.

చూస్తున్న వాళ్ళకు తెలుసు అది అనాథ ప్రేతమని !- అనాథప్రేత సంస్కార పుణ్యం కంటే గొప్ప పుణ్యం మరొక్కటి లేదనీ వాళ్ళకు తెలుసు. అందుకే కొందరు ఆ దృశ్యం కంట పడగానే జేబుల్లో చేతులుపెట్టి చేతి కొచ్చిన పావలా పరకా ఆ తుండు గుడ్డ మీదికి విసిరేసి అంతో యింతో పుణ్యాన్ని మూటగట్టుకొంటున్నారు. కొందరు నిట్టూరుస్తున్నారు. మరి కొందరు నిస్సహాయంగా చూస్తూ ముందుకు కదిలిపోతున్నారు.

"ఛీఛీ ! ఏం దేశమో ! ఏం పాడో ! ఇంక ఈ దేశం బాగు పడ్తుందా ? ఈ ఆకలిచావుల్ని, ఈ అనాథ ప్రేతాల్ని పట్టించుకొనే యోగ్యతలేదు. కానీ, ఏఁవో వొరగ బెట్టి పోతారంట !- సిగ్గూ ఎగ్గూ లేకపోతే సరి !- ఆ మైకులు గొంతులు చించుకునేదిచూస్తే..."

"ఒక ప్రగతి కాముకుడు జేబులో చెయ్యిపెట్టకుండా తెగ బాధపడిపోతున్నాడు.

"దేశాన్ని గురించి ఆలోచించే రోజులు ఎప్పుడో పోయ్ నాయ్ బాబూ ! పీనుగుల్ని మింగే వాడొకడైతే ఏనుగుల్ని మింగే వాడొకడుగా తయారైనారు. మా కాలంలో ...." ముందు తరాలకు చెందిన ఒక వృద్ధుడు తన తరాన్ని తలచుకుంటుంటే గుబురు మీసాల మాటున తృప్తి తొంగిచూస్తూ ఉంది.

"ఆ పీనుగుల్ని మింగే మహానుభావుడెవడో ఈ పీనుగను కూడ అట్లా మింగేస్తుంటే ఏ బాధా లేకపొయ్యేది."

ఆ మాటతో అనాథ ప్రేతాన్ని అస్తవ్యస్తంగా తయారయిన దేశాన్ని మరిచి ఆ యిద్దరు కలగలిసి నవ్వుకొన్నారు.

ఆ దారి వెంబడి మనుష్యులు వస్తున్నారు. పోతున్నారు. వస్తూ పోతూ తలకొక తీరుగా మాట్లాడుతున్నారు. నోరాడని వాళ్ళ చేయి మాత్రం ఆడుతూ ఉంద. పదిపైసలో ఇరవై పైసలో ఆ తుండుగుడ్డ మీద పడుతూ ఉంది.

వీటికన్నిటికీ అతీతుడైనట్లు ఆ కుర్రవాడు శవం పక్కన చెక్కిన బొమ్మలా నిలబడు కొన్నాడు.

ఈ దృశ్యాన్ని మనుష్యులు చూసినట్లే కాల పురుషుడు కూడ చూస్తున్నాడు. అయితే వాడు కరుణారహితుడు. అందుకే తనకేమీ పట్టనట్లుగా వాడు ముందుకు సాగిపోతున్నాడు.

పొద్దు నడిమిట్టకెక్కి మిడిసి పడ్తూఉంది.

తల దగ్గర ముట్టించిన సాంబ్రాణి వత్తులు కాలికాలి బూడిదగా రాలి, తన అర్హతను గురించి ఆలోచించకుండాయిసుకలో చేరిపోవాలని ప్రయత్నించి, ఆ తరువాత గాలి కెగిరిపోయింది - ధనికుడితో చేయి కలపాలని ప్రయత్నించి విఫలుడైన పేదవాడిలాగా......ఆ శరీరాన్ని వదిలి వెళ్ళిపోయిన జీవుడిలాగా !

శవం మీద అక్కడొకటి అక్కడొకటి పెట్టిన పూలు ఎండ దెబ్బకు వాడి వత్తలైనాయి.

ఉదయాన్నుండి నిలబడి నిలబడి, ఆ కుర్రవాడి కాళ్ళు గుంజుతున్నాయి. కడుపులో పేగులు కలబడుతున్నాయి. కండ్లు గిర్రున తిరుగుతున్నాయి. నిలబడలేక, కూర్చోలేక సతమతమై పోతున్నాడు.

పడుకోబెట్టి ఉండేది జీవం లేని శవం.

నిలబడుకోని ఉండేది జీవచ్ఛవం,

అంతే తేడా !!

అయితే జీవచ్ఛవంలాంటి ఆ కుర్రవాడు మాత్రం నిలబడలేక నిలబడుకొన్నా, వచ్చేపొయ్యేవాళ్ళు వేస్తున్న డబ్బు వైపు ఒకచూపు చూస్తున్నా - వాడి మనస్సు మాత్రం దాదాపు ఏడెనిమిదేండ్ల వెనక్కు వెళ్ళింది.

అప్పుడు ఆ శవంలో జీవుడున్నాడు.

ఆ జీవుడు సటపటమైన జీవుడు కాదు. ఎందరో ఎస్జివోల పాలిట హెడ్ ఆ జీవుడు. ఆ రోజుల్లో ఆ జీవుడికి చాలాచాలా పేర్లుండేవి.

"యముడ్రా తండ్రీ!" అని ఒక్కడంటే, కాదురా! యముడెత్తుకొని పోతుంటే జముడులో పడిన పిడుగు!" అని యింకొక్కడనేవాడు. 'ఈ వెధవఎట్లా చావు చస్తాడో కానీ, యిప్పుడే మనల్ని చంపి చట్లో పెట్టేస్తున్నాడు.' అని తన అక్కసంతా వెళ్ళగక్కేవాడు యింకొక్కడు

ఎవ్వరెన్ని విధాల ఎత్తిపోసినా అరటిపండులో సూది గుచ్చినంత సూక్ష్మంగా మాట్లాడే స్వభావాన్ని సొంతం చేసుకొన్న ఆ జీవుడు - అధికారుల్ని అరచేతిలో పెట్టుకొని ఆడించేవాడు.

ఇక ఆఫీసులో అతడాడిందాట ! పాడిందిపాట !!

ఆడింది ఆట ! పాడింది పాటగా - జీవితం కొనసాగేవాళ్ళ అలవాట్లు కూడా సాధారణంగా అదుపు ఆజ్ఞల్ని అధిగమించే ఉంటాయ్ !

ఆఫీసులోనే కాదు - అయ్యగారు యింట్లో అడుగు పెట్టినా అంతే !

ఇంటికి వస్తూ వస్తూ కప్పను మింగిన పాము కడుపులా ఉబ్బిన జేబును అయ్యగారు ఒక్కసారి అలవోకగా తడిమి చూస్తాడు. కండ్లల్లో తృప్తి........ పెదవులపై చిరునవ్వు తొణికిసలాడుతూ ఉంటుంది. అప్పుడయ్యగారికి తన ఒక్కగానొక్కకొడుకు మనసులో మెదలడు. ఒక్కటిన్నర దశాబ్దం తనతో కాపురం వెలిగించి కష్ట సుఖాల్ని పంచుకొన్న అర్ధాంగి ఆశలు అసలే మనసుకు తోచవు. అయితే రకరకాల సీసాల్తో రమ్యంగా అలంకరించుకొన్న బ్రాందీ అంగడి మాత్రం గిలిగింతలు పెట్టి ఆహ్వానిస్తుంది. వెళ్ళి అరసీసా మందుకొని జేబులో భద్ర పరచుకుంటాడు.

ఆ జీవుడు ఏది మరిచి మరేది మరచిపోకున్నా యిది మాత్రం మరిచిపోడు. ఆ రోజు తన అదనపు సంపాదనలో ఆ మాత్రం ఖర్చు పెట్టకపోతే-ద్రవ్య మారక సిద్ధాంతమే దెబ్బతింటుందని ఆతని ప్రగాఢ విశ్వాసం.

ఆతడు యింట్లో అడుగుపెట్టి ఆఫీసు వేషం విప్పి లుంగీలో దూరి ముఖప్రక్షాళనం చేసుకొనేసరికి - అతగాడి అభ్యంతర మందిరంలో కుర్చీ, కుర్చీముందర టీపాయ్, ఆ టీపాయ్ మీద శుభ్రంగా కడిగిన గ్లాసు........ సోడాలు, మంచు ముక్కలు - మధ్య మధ్య నంజడానికి మాంసం ముక్కలు కాకపోయినా వేడివేడి పకోడీలు సిద్ధంగా ఉండాలి.

ఈ పనులన్నీ చేసి పెట్టాల్సిందెవరు ? ఇంట్లోనౌకరా? నౌకరంటూ ఒకడుండేగదా? కట్టుకొన్న పెండ్లామా? ఆమె కొంతకాలం తన ఓపికను పరీక్షించుకో గలిగినంత మేరకు పరీక్షించుకొని, ఆ తరువాత పోట్లాడి. కొట్లాడి, తన్నులు తిని. తిన్నా ఫరవాలేదనుకొని ఆ పనికి రాజీనామా చేసింది.

రాజీనామా చేసేహక్కు వ్యక్తిగా అయితే అందరికీ ఉన్నట్టే ఆమెకు కూడా ఉంది. అయితే —

ఆమె చేస్తున్న ఉద్యోగం ప్రభుత్వ పరమయింది కాదు. అది సంసారం. అతడు భర్త, ఆమె భార్య. ఇందుకు సాక్షులుగా అగ్ని ఉన్నాడు. సురలు ముక్కోటి దేవతలున్నారు. సూర్యచంద్రులున్నారు. నక్షత్రాలున్నాయి. ఇవీ చాలవను కొంటే భూమ్యాకాశాలున్నాయ్ - కావలసినంత విశాలంగా !

వీళ్ళందర్నీ అడ్డంపెట్టుకొని అతడామెను సతాయిస్తున్నాడు. ఆమె సాధ్వి. ఆ సతాయింపుల్ని సాధింపుల్ని పడకూడదను కొంటూనే పడుతూ ఉంది. సహనం నశించినపుడు తిరగపడ్తూ ఉంది. తిరగబడినపుడు తప్పని సరిగా తన్నులు తింటూ ఉంది.

వీళ్ళిద్దరి మధ్య పడి నలిగి పోతున్నాడు - పదేండ్లవయస్సులో ఏడవ తరగతి చదువుకొంటున్న వాళ్ళ ఏకైకపుత్రుడు. తండ్రి చేస్తున్నది అక్షరాలా తప్పని తెలుసు. ఆయినా నిలదీసి ఆడిగే వయసు కాదు. తల్లి వాదనలో వేదనలో అర్థముందని తెలుసు. అయినా ఆమె పక్షాన నిలబడలేడు. అటునూయి, ఇటుగోయి, ఏంచేయాల్నో ఆ పసి బుర్రకు తోచలేదు. తోచలేదని వాడు ఆలోచించడం మానుకోలేదు.

ఆ లేతమనసు ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేసింది.

తల్లి చేస్తున్న పనుల్నియిక మీదట తాను చేయాలని నిర్ణయించు కొన్నాడు.

తండ్రి రాత్రి ఏడెనిమిది గంటలప్పుడు యింట్లో అడుగు పెట్టేసరికి తల్లి ఏగదిలోనో గోడకు చేరగిలబడి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉంటుంది. ఆ కుర్రవాడు మాత్రం, 'కీ' యిచ్చిన మరబొమ్మలాగా తిరుగుతూ తండ్రి ఆభ్యంతర మందిరంలో కుర్చీవేస్తాడు. ఆ కుర్చీ ముందర టీపాయ్, దాని మీద శుభ్రంగా కడిగిన గ్లాసు, మంచు ముక్కలు, సోడాలు అమర్చి పెడతాడు. అటుపై వెళ్ళి కూర్చుని తన చదువుతో తాను కుస్తీపడుతుంటాడు.

తండ్రి తాగుతూ తాగుతూ అట్లానే కుర్చీకి చేరగిల పడి నిద్రపోవచ్చు. తల్లి వంటింట్లో గోడకు చేరగిలబడి ఏడుస్తూంటే ఒక్కొక్క రోజు తెల్లవారిపోవచ్చు. ముందర వేసుకొన్న పుస్తకాల మీదనే పడి ఆ పసి మనసు కునుకు తీయవచ్చు !

ఎవరు తిన్నారు ? ఎవరు తినలేదు ? అని పట్టించుకొనే స్థితి చేయిదాటి ఆ యింట్లో ఎంతో కాలమైపోయింది కాబట్టి - ఆ రాత్రి ఎవరిలోకం వాళ్ళదవుతుంది. వండిన కూడు ఏ కుక్కలకో బిచ్చగాళ్ళకో దక్కుతుంది ఆ మరునాడు.

అయితే యింట్లోయిప్పుడు ముందు మాదిరి రంపులు రచ్చలు లేవు.

కాలం కాస్త ప్రశాంతంగా వెళ్ళిపోతున్నట్లే అనిపించింది.

కుర్రవాడు కళాశాల్లో అడుగు పెట్నాడు.

కనీసం కొడుకైనా ప్రయోజకుడై చేతి కందొస్తే అదే చాలును కొని ఆ తల్లి శతకోటిదేవుళ్ళకు ముడుపులుగట్టి మొక్కుతూఉంది. మొక్కిన మొక్కులన్నీ ఫలించేటట్లుగా ఉంటే ! ఈ దేశంలో దేవుళ్ళు అరనిముషం విశ్రాంతికి అలమటించవలసిందే !

కుర్రవాడు కాలేజీకి వెళ్ళి వస్తున్నాడు. తండ్రి ప్రవర్తనలో ఏ మార్పు కనబడకపోగా, తెచ్చుకుంటున్న మందులో మాత్రం మార్పు కనిపించింది. అది అరనుండి ముక్కాలు సీసాకు పెరిగింది. తల్లి మనో వేదనతో కుంగి కుంగి ఒక మంచానికి లొంగి పోవడానికి శక్తినంతా కూడగట్టుకొంటూ ఉంది.

ఎప్పుడూ ఏడుస్తూ తన రాతను తలచుకొని వాపోతూ జీవిత మంటే పట్టిపట్టనట్టుగా ఉండే యిల్లాలి మొగం మొత్తింది అయ్యగారికి అందుకే యింట్లో అడుగు పెడ్తే చాలు "ఛీఛీ ! ఏం కొంపో! పాడు కొంప! ఇంత కంటే దెయ్యాల కొంప నయం మనసుకు సుఖములేదు. శాంతిలేదు." అంటూ తాగకముందే తాగినకోతి మాదిరి ఎగిరెగిరిపడు తున్నాడు.

ఇవన్నీ తల్లిచెవిని పడుతున్నా పడనట్లే ఆమె చేతనైనంత మట్టుకు సంసారాన్ని నెట్టుకొని పోతూఉంది. కుర్రవాడు తన కర్తవ్య నిర్వహణలో ఏలోటు రాకుండా జాగ్రత్తపడు తున్నాడు.

రోజులు దొర్లి పోతున్నాయ్!

అయితే ఉన్నట్లుండి కుర్రవాడి కొకరోజు ఒక చిలిపి కోరిక పుట్టింది.

అది వాడి తప్పుకాదు.

నూనూగు మీసాలు మిసమిసలాడే వయసు. తోడుగా కాలేజీ వాతావరణం. ఒంటికి నీరు పట్టినట్లే బుద్ధి పదునెక్కింది. తనకుతానుగా ఆలోచించుకొనే స్థాయికి ఎదిగినాడు.

"తండ్రి యిన్నాళ్ళుగా తాగుతున్నాడు కదా! ఎందుకు? తల్లి వద్దంటున్నది. తనమాట వినలేదని తగువు లాడింది. తన్నులు తినింది. ఇప్పుడేమీ చేయలేని స్థితిలో దినదినానికి కుంగి కృశించి పోతూఉంది. అయినా తండ్రికి చీమ కుట్టినట్లని పించకుండా సీసాలకు సీసాలు ఖాళీ చేస్తున్నాడే? ఎందుకు తాగుతున్నట్లు? అందులో ఏదో ఒక ఆనందం లేకపోతే ఆయన ఎందుకింత పట్టింపుగా తాగుతాడు? ఇదే నిజమైతే ఆయన పొందే ఆనందం ఎట్లా ఉంటుందో?"

ఇట్లా రకరకాల ఆలోచనల్తో వాడిమనసు సతమత మవుతూ ఉంది. థీరీతోనే తికమక పడడ మెందుకు? ప్రాక్టికల్‌గా చూస్తే సరిపోలా? అన్నస్థితికి ఆయత్త మవుతూఉంది.

కోడెవయస్సులో కోరికలు తాడు విడిచిన బొంగరాలు!

ఒకానొకరోజు తండ్రి తాగుతూ తాగుతూఉండి, తాగుతున్న గ్లాసును అట్లానే టేబిల్‌మీద పెట్టి నిండిన కడుపును నిమురుకొంటూ బాత్‌రూంలోకి జొరబడినాడు!

అంతే! కుర్రవాడు ఒక్క గుక్కలో గబగబ రెండుగుక్కలు మింగి, తండ్రికి సందేహం రాకుండా వుండడానికి మళ్ళీ గ్లాసును యథావిధంగా నింపి తండ్రి వచ్చేలోపుగానే అక్కడినుండి ఉడాయించి నాడు. యథావిధంగా పుస్తకాల ముందు కూర్చున్నాడు.

మింగేటప్పుడు గొంతు కాస్తంత మండి నట్లనిపించినా,కడుపులో పడిన తరువాత ఏమీ అనిపించలేదు. అయితే కొంచెం సేపటికి కన్నులు మూతలు పడుతున్నట్లుగా— మూతలుపడ్తూ తిరుగుతున్నట్లుగా... శరీరం అమాంతంగా ఎక్కడికో తేలిపోతున్నట్లుగా.... ఒక విచిత్ర మైన అనుభూతి. మళ్ళీ అదంతా ఏమీ లేదనుకొన్నాడు. తల విదిలించు కొన్నాడు. స్థిమితంగా కూర్చోవాలను కొన్నాడు. కానీ కుదరలేదు. అందుకే మెల్లగాలేచి వెళ్ళి పడుకొన్నాడు.

పడుకున్న దొక్కటే తెలుసువాడికి :—

తెల్లవారింది!

అతి మామూలుగా తెల్లవారింది. తెల్లవారడంతో నిమిత్తం లేని తండ్రి తన అలవాటు మేరకు మామూలుగానే నిద్ర లేచినాడు. మామూలుగా మగత నిద్రకే అలవాటు పడిన తల్లి తెల్లవారడంతో నిమిత్తంలేకనే లేచి తన పనులు తాను నిర్వహించింది. స్నానపానాదులు ముగించి అయ్యగారు మామూలుగానే ఆఫీసుకు బయలు దేర్నారు. అయితే కుర్రవాడికి మాత్రం అమితోత్సాహంగా తెల్లవారింది. తనలో ఒక కొత్తతెంపు. ఆతెంపు తనకే ఎంతో కొత్తగా అనిపిస్తూ ఉంది.

'ఓహో! ఇదా కథ'?! అని అనుకొంటూ హాయిగా నవ్వు కొన్నాడు.

ఆ ఆనందాన్ని తాను పంచుకోవాలి. ఎవరితోనైనా పంచుకో వాలి. అయితే ఎవరున్నారు తనకు? కాలేజీలో ఆత్మీయులు. అందుకే వాడు ఆదరా బాదరా కాలేజీకి పరుగులు మీద వెళ్ళినాడు.

దీనికంతటికీ అతీతంగా తన బతుకు ఎట్లా తెల్లారుతుందో ? అని ఆలోచనల్లో పడింది ఆ పిచ్చితల్లి.!

అయితే ఆరోజు ఆఫీసులో అయ్యగారి ఆలోచనలుమాత్రం విపరీతంగా కొనసాగుతున్నాయి. బతుకు వెలితి....కూర్చున్న కుర్చీ వెలితి. ఆఫీసు వెలితి. కడకు ఈ ప్రపంచమే మహావెలితిగా కనిపిస్తూ ఉంది. ఆ వెలితిని పూడ్చుకోవడమెట్లా అన్న ఆలోచనల్లో పడింది అయ్యగారి మనస్సు.

"నేను సంపాదిస్తున్నాను. ఒక్కచేత్తోగాదు, రెండుచేతుల్తో. నా సంపాదనతో పోలిస్తే నాఖర్చేపాటి? - ఏదో అలవాటు. ఎట్లా అల వాటయ్యిందో అయిపోయింది. ఇప్పుడు పొమ్మంటే పోతుందా ? పోనీ దీనివల్ల యింట్లో వచ్చిన యిబ్బందేఁవి? వీళ్ళకేం కొరత జరిగింది ? తినడానికి తిండి, కట్టడానికి బట్ట, ఉండడానికొక కొంప-అదేఁవీ సటు పటమైనది కాదే? సకల సౌకర్యాలు కలిగిన కొంప. ఇంత చేసినా వీళ్ళకేఁవైనా కృతజ్ఞత ఏడ్చిందా? పైగా దెప్పులు. లొంగకపోతే ఏడ్పులు. ఛ!ఛ! సుఖము శాంతీ లేని బతుకొక బతుకా?"

ఇట్లా కొనసాగిన అతగాడి ఆలోచనలు అది బతుకు గాదని తేల్చి సుఖము శాంతి లభించగల యింటికోసం అన్వేషణ ఆనాటినుండే ఆరంభించింది.

చేతి నిండుకు డబ్బుండాలే కానీ ఈ విశాల ప్రపంచంలో చిన్న యిండ్లకేం కొదవ?-

అయ్యగారు సుఖసంతోషాలకు నిలయమైన ఒక చిన్న యిందిని ఎన్నుకొని ఆ యింటితో కొద్దికొద్దిగా పరిచయాన్ని పెంచుకొంటూ డబ్బు పోయినా సుఖం దక్కుతుందన్న తృప్తిలో పడి. ఆ తరువాత చిన్నావిడ మాయలోపడి, కడకు ఆ యింటికి దాసానదాసుడై కూర్చున్నాడు.

మొదటిరోజు రెండు గుక్కలు........ రెండవరోజు నాలుగు గుక్కలు మూడవరోజు తొమ్మిది గుక్కలుగా అలవాటుపడిన కుమార రత్నం కాలేజీకి చిక్కంగా మూడు నామాలు పెట్టి తండ్రి ఖాళీ చేసిన అభ్యంతర మందిరానికి చక్కగా తాను వారసుడై కూర్చున్నాడు.

ఇప్పుడతడు తండ్రికి మించిన తనయుడు !

ఇంకేముంది?

రోజులు హుషారుగా గడుస్తున్నాయ్!

అయితే ఆ యింట్లో ముగ్గురివి మూడుదోవలైనాయ్.

చిన్నింట్లో అయ్యగారు అమ్మగారి పెద్ద పెద్ద కోరికల్ని తీర్చ డానికి పెద్ద ఎత్తున ఎత్తులు ప్రారంభించి ఒకానొకశుభముహూర్తాన పట్టుబడి పదహారు కమ్ములకివతల్నే ఉండడానికి పడరానిపాట్లు పడ వలసి వచ్చింది.

ముందు మందు, తరువాత క్లబ్బులు. అటునుండి అటే అశ్వ మేధయాగాలు కొంప నాలుగు దోవలు చేస్తున్నాడు కొడుకు.

అబ్బ కొడుకులు అతిరథమహారథులై నిర్వహిస్తున్న ఘన కార్యాల్తో తృప్తిపడి, 'ఈ జన్మకింతమట్టుకు చాలురా తండ్రీ!! అని ఆ మహాతల్లి తృప్తిగా కడపటి శ్వాస విడిచింది.

తాళి గట్టిన భార్యపోయినా, కొడుకు కొరగాని వాడైనా, చిన్నింటావిడ పెద్దింటావిడ అయింది కదా? అని అయ్యగారు అక్కడికి వెళ్తే మెడబట్టి గెంటలేదు కానీ - అంతకంటే ఎక్కువగానే గౌరవించింది.

మళ్ళీ ఒక శుభముహూర్తాన తండ్రీ కొడుకులు కలుసుకొన్నారు- నడివీధిలో !-

ఒకరి మొగం ఒకరు చూసుకొన్నారు. ఒక్కక్షణం చూపుల్తో చూపులుకలిసే సరికి తలలు వంచుకొన్నారు. ఆ మీదట ఒకర్నొకరు గఖాలున కౌగలించుకొన్నారు. కుమిలికుమిలి ఏడ్చుకొన్నారు.

అయితే ఏం ప్రయోజనం?

ఆ బాధ ఆరేదా? తీరేదా??-

నిలువనీడలేదు. చేతిలో డబ్బులేదు.

ఈ లోకంలో ఈ రెండూ లేనివాళ్ళ గతి సరేకానీ-ఉండి పోగొట్టుకొన్న వాళ్ళగతి?- కుక్కలకంటే హీనమైన గతి!

అందుకే "ఉండే వాడికి ఒక్కయిల్లయితే అడుక్క తినేవాళ్ళకు అరవైయిండ్లు" అన్న సామెతను సార్థకం చేయడానికి దేశం మీద పడినారు.

ఒక్క పల్లెకాదు. ఒక్క పట్టణం కాదు ఒక్క ఊరుకాదు. ఒక్కవాడకాదు. తిరగనిచోటు లేదంటూ జానెడుపొట్టకు మానెడువేషాలు మార్చినారు. పెట్టినమ్మ పెట్టింది. తిట్టినమ్మ తిట్టింది. పెట్టినా తిట్టినా అబ్బా కొడుకుల కిప్పుడు సమదృష్టి అలవడింది. అయినా తిరగడానికి వయస్సు అడ్డు పడింది.

అందుకే వాళ్ళు తమ బతుకుల్ని ఒక యాత్రాస్థలంలో రైల్వే స్టేషన్‌కి పరిమితం చేసుకొన్నారు.

దినము కొత్తమొగాలే! ఆ కొత్తమొగాలకు వీళ్ళు కొత్తబిచ్చగాళ్ళే!- అయితే ఈ పాతబిచ్చగాళ్ళు మాత్రం సొలు మారకుండా పొద్దస్తమానం ఎత్తినచెయ్యి దించకుండా దండాలు పెడ్తున్నారు. చాచినచేతికి వచ్చినంత చాలని తృప్తిపడుతున్నారు. అయితే ఈ జీవితాలు ఎప్పటికైనా అశాశ్వతాలే అని వాళ్ళకొక శాశ్వతమైన నమ్మకం కుదిరింది. అందుకే ఆరోజు సంపాదన ఆరోజే ఖర్చు పెడుతున్నారు- దయాదాక్షిణ్యాలు ఈ లోకంలో యింకా గొడ్డుపోలేదన్న నమ్మకంతో!

ఏ పూట కాపూట గడిచి పోతూంటే గతాన్ని గురించి ఆలోచించ వలసిన అవసరమే లేకపోయింది. అయితే ఒకానొకదినం రాత్రి తండ్రి చెప్పకుండా చెందకుండా జీవితాలు అశాశ్వతాలని నిరూపించి వెళ్ళి

పోతే- కొడుకు ఆలోచనలో పడినాడు. పుత్రుడు కదా? పున్నామ నరకంమాట దేవుడెరుగును కానీ కనీసం దహనం చెయ్యాలిగదా?దహనం చెయ్యాలంటే - నలుగురు వాహకులు....పాడె...ఆరుమూరల తెల్లగుడ్డ కనీసం నలభై యాభై రూపాయలన్నా కావాలి. అందుకే స్టేషన్ కెదురుగా శవాన్ని పడుకోబెట్టి శవసంస్కారానికోసరం భిక్షమడుగుతున్నాడు! ....•••

పొద్దుబాగా వాటారింది. వాడికాళ్ళు కుక్కలు పీకినట్లు పీకుతున్నాయి. నోరు పిడచ గట్టకపోతా ఉంది. కండ్లు తిరుగుతున్నాయి. ఎంత ఓపికను కూడదీసుకొన్నా, నిలబడడం కష్ట సాధ్యంగా ఉంది.

ఒక్కసారి నిస్సహాయంగా తండ్రి శవం వైపు మరొక్కసారి తుండుగుడ్డమీద పడిన డబ్బు వైపు చూసినాడు.

మహాగా ఉంటే ఆ డబ్బు పదిరూపాయలకు లోపుగానే ఉంటుంది.

కనీసం నలభైయాభైరూపాయలన్నా లేకుంటే శవదహనం చేయడానికి వీలుకాదు - వాలిన పొద్దు ఒకరి కోసం ఎదురుచూడదు. ఏం చేయాలి ? ఏం చేయాలి ? అని ఆలోచిస్తూ ఆలోచిస్తూ వున్న ఆ కుర్రవాడు ఉన్నట్లుండి ఆ తుండు గుడ్డమీద డబ్బును గబగబ జపురుకొన్నాడు. అంతకంటే గబగబ ముందుకు నడిచినాడు బస్టాండుకు సమీపంలో వున్న సారా కొట్లోకి!-

చేతిలో వున్న డబ్బును పైసలతోసహా చెల్లించినాడు. ఆ డబ్బుకు వచ్చినంత వాడు యిచ్చినంత అమృతం కంటే ఆనందంగా సేవించినాడు. ఇప్పుడు కాళ్ళు పీకడంలేదు. కడుపులో మంటలేదు. కండ్లు బైర్లు కమ్మడంలేదు. శవదహనం ఎట్లా ? అన్న తపనేలేదు.

వాడికి తృప్తిగా ఉంది.

అయితే నోరు మాత్రం వాగుతూఉంది.

"ఒరే తండ్రీ ! నిన్ను 'తండ్రీ !' అనడంవే తప్పురా ! ఏం చేద్దాం ? నువ్వు నన్ను కన్నావు. నేను నీకు పుట్నాను. అందుకే 'తండ్రీ !' అనాల. అనకుంటే తప్పదు. అయినా నిజంగా నువ్వు తండ్రివే అయ్యుంటే - నాతో చిన్నప్పుడల్లా పస్తు చెయ్యించేవాడివేనా ? చెయ్యించినావు కాబట్టే చెడిపొయ్‌నా ! నువ్వుచెడిపొయ్‌నావ్. నేనూ చెడిపొయ్‌నా ! ఇద్దరంవూ చెడి కొంపను మూడార్దోవలు చేసినాం. అందుకేరా తండ్రీ నీకీగెతి. చేసినోడికి చేసుకొన్నంత అనుభవించక తప్పుతుందా ! అనుభవించు." అని నోటికొచ్చినట్లు వాగుతూ తూలుతూ సోలుతూ యథా స్థానానికి చేరుకొన్నాడు.

చేరుకొంటే ఏముందక్కడ ?

అప్పటికే మునిసిపాల్టీ వాళ్ళ బండి ఆ అనాథప్రేతాన్ని మీది కెక్కించుకొని ముందుకు సాగిపోతూ ఉంది.

తండ్రి ఏమైపొయ్‌నాడో తెలియకుండా పాపం ! తనయుడు మూతలు పడుతున్న కండ్లను తెరవలేక తెరిచి వెదుకుతున్నాడు. కనపడక పోయేసరికి 'బోరో !' మని ఏడుస్తున్నాడు. ఏడుస్తూ తన తండ్రిని ఎవరో అపహరించుకపోయినట్లు అందరి వైపు సందేహంగా చూస్తున్నాడు. తన చూపుల్ని అర్థం చేసుకోలేని లోకం....తన బాధను అర్థం చేసుకోలేని లోకం తనదారిని తాను పోతూంటే కసి కసిగా చూస్తూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.

వాడు ఏడుస్తున్నది - తండ్రికి దహనసంస్కారాలు చేసే అదృష్టం తనకు దక్కలేదే అన్న బాధతోకాదు. పుత్రుడుగా పున్నామ నరకం నుండి రక్షించ లేకపోయానే ! అన్న తపనతోకాదు. ఆ శవమే అడ్డముంటే యింకొక్క పూట యిట్లాంటి తృప్తి మిగిలేదే ! అన్న బాధతో !

అవునుమరి !

వాడు పుత్రుడు గదా ?

డా॥ కె. ఓబిరెడ్డి

నాథ సంప్రదాయము

"నాథ సంప్రదాయము తాత్త్వికముగా ఒక యోగ సంప్రదాయము. ఈ సంప్రదాయము సిద్ధమతములోని ఒక విశేషరూపమునకు ప్రాతినిధ్యము వహించునని" డాక్టర్ శశిభూషణదాసు గుప్త అభిప్రాయము.[1] ఈ సిద్ధమతము అతి ప్రాచీనమైనది. నాథ సంప్రదాయమును గూర్చి భారతదేశములో ముఖ్యముగా మహారాష్ట్రమున ప్రచారము గావించిన ప్రథమకవి మాలూ పండితుడు. అతడు మహారాష్ట్ర భాషలో ఓవీ వృత్తములో 'నవనాథ భక్తి సారము' అను పేర క్రీ. శ 1319లో నాథుల చరిత్రను కావ్యబద్ధము గావించెను. ఈ సంప్రదాయమును గురించి సంస్కృత, హిందీ తదితర భాషలలో ఎన్నియో గ్రంథములు వెలువడినను అవి కేవలము సిద్ధాంతపరమైనవి. నవనాథుల చరిత్రమును ఆంధ్రభాషలో కావ్యబద్ధము చేసిన ప్రథమాంధ్రకవి గౌరన అని చెప్పవచ్చును. తన కావ్యమునకు శ్రీగిరి రచించిన గ్రంథము మాతృకయని అతడు చెప్పినను అది ఇంతవరకు లభ్యము కాలేదు. నవనాథులను గురించి ఆంధ్రులకు తొలిసారిగా పరిచయముచేసిన కీర్తి గౌరన కే దక్కినది. అతని అనంతరము అనంతామాత్యుడు [క్రీ. శ. 1485] 'భోజరాజీయము'లో భోజుని మృగయా వినోదమును వర్ణించుచు ఒక సిద్ధుని ప్రస్తావించెను.[2] భోజుడు అలసి ఒక మఱ్ఱిచెట్టు క్రింద విశ్రమించుచుండగా ఆ సిద్ధుడు తలక్రిందులుగా తపస్సుచేయు చుండెను. అతని పేరు 'సర్పటి'. అతడు ధారానగరమునకు పోయి భోజుని కొలువు చనికెను. సువర్ణము గావించెను. మహారాష్ట్ర భాషనుండి తెలిగించబడిన 'భక్తిసార నవనాథ చరిత్రము' నందలి రససిద్ధుడైన చర్పటి నాథుడే ఈ సర్పటి కాబోలును.

"నాథులలో మిక్కిలి ప్రసిద్ధిచెందిన గోరక్షుడు అస్తవ్యస్థముగానున్న పండ్రెండు శాఖలను ఒకటిగాచేసి వానికి 'బారహపంథీ' యోగులని పేరు పెట్టినట్లు మనకు నాథ సంప్రదాయ చరిత్రనుబట్టి తెలియును.[3] దక్షిణదేశములో ముఖ్యముగా ఆంధ్రదేశములో ఆ శాఖలలో నేదియు స్థాపింపబడలేదని ఔత్తరాహులు రచించిన నాథ సంప్రదాయ చరిత్రలనుబట్టి స్పష్టమగును. కాని ఆంధ్రదేశమున నాథ సంప్రదాయముల కేంద్రమేదియు లేని యెడల, అది అల్పముగానో, అధికముగానో నాథసంప్రదాయమును గూర్చి ప్రచారము చేయనియెడల గౌరన నవనాథ చరిత్రను ఏల వ్రాసి యుండునో అనూహ్యము. దీనినిబట్టి ఆంధ్రదేశములో నాథసంప్రదాయము సర్వత్ర వ్యాపించి యుండక పోయినను పరిమిత ప్రదేశములోనైన దానికి స్థానముండెనని అది శ్రీశైల పర్వత ప్రాంతమే కాగలదని తోచును. [కర్ణాటకమున ఈమత ప్రసిద్ధి శాసనములవల్ల తెలియుచున్నది. కర్ణాటకమునకు శ్రీశైలము సరిహద్దు గనుక - శ్రీశైల లింగమును సకల వర్ణాలవారును ముట్టుకొనవచ్చును. ఈ సంప్రదాయము శైవమే కనుక ఆంధ్రప్రాంతమున ఇందునకనే నాథమత వ్యాప్తి అనుకొనవచ్చు.] శ్రీశైల మల్లికార్జునుడు నాటినుండి నేటివరకు శైవులచే ఆదినాథునిగా పూజింప బడుచుండుట కూడ ఒకానొక కాలమున అచ్చట నాథ సంప్రదాయ కేంద్రము నెలకొని యుండెనని భావించుటకు వీలగుచున్నది.

శ్రీ ముక్తికాంత భిక్షావృత్తి రాయడు శ్రీశైల మఠాధిపత్యము వహించిన కాలములో నవనాథచరిత్ర రచనకు గౌరనను ప్రోత్సహించెను. దక్షిణకాశియని ప్రసిద్ధి చెందిన శ్రీశైలమునకు చైనా, టిబెట్టు, నేపాలు, ఆఫ్ఘనిస్థాన్ మొదలగు దూరదేశములనుండి, భారతదేశములోని పలుప్రాంతముల నుండి యోగులు, సిద్ధులు, యాత్రికులు మొదలైనవారు వచ్చుచుండిరనుటలో సందేహములేదు. నవనాథ చరిత్రకారుడగు గౌరన వారితో సంబంధమేర్పరచుకొని వారు అందించిన సమాచారమును అనుసరించి ఈ ద్విపద కావ్యమును నిర్మించినట్టు విశదమగుచున్నది. అతడు మహారాష్ట్ర భాషలో రచించిన నవనాథ భక్తిసారము, సంస్కృత స్కంద, నారద పురాణములను, కన్నడములో చామరస [క్రీ. శ 1450] రచించిన ప్రభులింగలీలను కూడ తన కథారచనకు కొంతవరకు ఉపయోగించుకొన్నట్లు అనేక దృష్టాంతములు గలవు.

ఆంధ్రదేశములో తిక్కన అనంతరము వైదిక మతమే గట్టిగా వేరూనినది. ఆ వటవృక్ష ఛాయలో నాథ సంప్రదాయము ఎదుగు బొదుగు లేక నశించిపోయినదని చెప్పవచ్చును. మనుమసిద్ధి తండ్రి 'చోడ తిక్కరాజు' పరిపాలన కాలమునందు క్రీ. శ. 1245లో ఒక శాసనము వెలసినది. అది నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకాలో బయటపడినది. దీనిలో రసాయన, పదాంజన, ఘటిక, కన్యకావాద, మంత్రవాద, ధ్మ్రామవాద, రసవాద, గారుడవాద మొదలగు విద్యలు ప్రచారము పొందినట్లు పేర్కొనబడినది. వీనితోబాటు ఆ శాసనమున

సిద్ధవ్యాళి, నాగార్జున, సిద్ధబుధుల నామములు చోటుచేసి కొన్నవి. "సహజయాన సిద్ధులలో వ్యాళి [ఖలిఫ] ఒకరు అని మహాపాదిత రాహుల్ సాంకృత్యాయన్ రచించిన పట్టికనుబట్టి తెలియును."[4] గౌరన నవనాథ చరిత్రలో ఈ ముప్పురు కథానాయకులుగా నున్నారు. దీనినిబట్టి క్రీ. శ. 15వ శతాబ్దికి పూర్వము వారు ఆంధ్రదేశములో ప్రసిద్ధిచెందినట్లు విశదము కాగలదు. గౌరన వారిని నాథులుగా పేర్కొనినాడు. వారికి శిష్యసంతతి కూడ కలదు.

నవనాథులెవరు:-

నవనాథులెవ్వరు ? అను ప్రశ్నకు గౌరన నవనాథ చరిత్ర వలన సమాధానము లభించుట కష్టము. గౌరనకు పూర్వుడైన జక్కన "విక్రమార్కచరిత్రము"లో (6-4) తొమ్మండుగురు నవనాథుల పేర్లు గలవు. గౌరన నవనాథ చరిత్రమును పరిశీలించిన యెడల ఈ క్రింది నామములను నవనాథులవిగా పేర్కొనవచ్చును. 1. మత్స్యేంద్ర నాథుడు, 2.చౌరంగి, 3. గోరక్షుడు 4. మేఘనాథుడు, 5. విరూపాక్ష నాథుడు 6. నాగార్జునుడు 7. ఖనికుడు, 8. మంజునాథుడు, 9. సిద్ధ బుద్ధుడు. జక్కన పేర్కొనిన నవనాథుల నామములతో కొలదిగా సరిపోలుచున్నవి. జక్కన పేర్కొనిన ఖరుడు గౌరన పేర్కొనిన ఖనికుడు ఒకడేనని తోచును.

నవనాథులను గురించి మహారాష్ట్ర, హిందీ, తెలుగుభాషలలో గ్రంథములు రచింపబడినవి కాని అన్ని సాహిత్యములలోను వీరినామములు కలియుట లేదు. ఈ నాథ మతమునకు మూల పురుషుడైన మత్స్యేంద్రనాథుడు, చౌరంగి, గోరక్షుడు మొదలగు కొన్ని నామములు మాత్రము అన్ని భాషలలోను సమానముగా నున్నవి.

నాథశబ్దార్థము :

నాథ మతము లేక నాథ సంప్రదాయమునకు సంబంధించిన ప్రామాణిక గ్రంథములలో నాథ శబ్దమునకు శాబ్దిక, సైద్ధాంతిక అర్థములు లభించును. 'రాజగుహ్యము' అనుసరించి 'నా' అనగా అనాది రూపము, 'థ' అనగా భువనత్రయమును స్థాపించుట. అనాదిగా నున్న తత్త్వమే నాథతత్త్వము. అది భువనత్రయ స్థితికి కారణము.

"నకారో నాదిరూపం థకారః స్థాప్యతే సదా
భువనత్రయమేవైకః శ్రీ గోరక్ష నమోస్తుతే"[5]

'శక్తిసంగమ తంత్రము' అనుసరించి 'నా' అనగా నాద బ్రహ్మము. అది మోక్ష ప్రదానము చేయును. దానిని గురించి జ్ఞాన బోధ చేయును. 'థ' అనగా అజ్ఞాన సామర్థ్యమును నిలుపుదల చేయును.

"శ్రీ మోక్ష దాన దక్షత్వాత్ నాద బ్రహ్మను బోధనాత్
స్థగిత జ్ఞానవిభవాత్ శ్రీనాథ ఇతిగీయతే"[6]

ఈ రెండు గ్రంథముల ననుసరించి నాథ తత్త్వం పరమ తత్త్వము. అది భువనత్రయ కారణము, పరమజ్ఞానదాత, మోక్షదాత. "దీనిని 'గోరక్ష సిద్ధాంత సంగ్రహము' కూడ బలపరచును. ఆ గ్రంథమునను సరించి సృష్టిస్థితి లయ ప్రక్రియలో శక్తి విశ్వమును సృజించును. శివుడు దానిని పరిపాలించును. కాలుడు దానిని సంహరించును. నాథుడు ముక్తినొసగును."[7] ఈ నాథునికి మూడు రూపము లుండును. అద్వైత పరమైన నాథుడు ప్రాప్యదేవత. నిరాకార జ్యోతి రూప నాథుడు ధ్యేయము. ఆదిగురు రూపములో సాకారనాథుడు ఉపాస్యము"[8] "ఈ అద్వైత పరమైన నాథుడు ద్వివిధములైన (నాథ రూప, బిందురూప) సృష్టికి మూలము."[9] సంసార సంబంధమైన పద్ధతి ఒడుదొడుకులతో కూడి యున్నదని ఒకచోట చెప్పబడినది."[10] ఉదాహరణార్థము సంసార పద్ధతిలో ధర్మ, అర్థ, కామ, మోక్ష క్రమము స్వీకరింపబడును. కాని ఈ క్రమములో మోక్షమునకు ప్రథమ స్థానమీయక అంతిమ స్థానమీయబడినది. "నాథమతమును అనుసరించి వీనిక్రమమిది- మోక్షము, ధర్మము, అర్థము, కామము. ఈ మతమునకు అన్నిటికంటె ముఖ్యమైన పురుషార్థము మోక్షము. అనగా మోక్షదాత నాథుడే ఈ మతమునకు సర్వస్వము"[11]

నాథ శబ్దమునకు చేసిన శాబ్దిక, సైద్ధాంతిక వ్యాఖ్యలలో భేద మేమియు అగపడదు. ఉభయ వ్యాఖ్యలలోను నాథశబ్దము పరమ తత్త్వమును సూచించును. బౌద్ధ సహజసిద్ధుల 'బౌద్ధగాన ఓ దోహా'లో నాథ శబ్ద ప్రయోగము కలదు. సంస్కృత టీకాకారుడు మునిదత్తుడు నాథ శబ్దమునకు 'సద్గురు'అని అర్థము చెప్పెను. నాథుల సంప్రదాయిక అర్థమునకు దీనికి పొత్తు కుదురుటలేదు.

"గోరక్ష నాథుడు కూడా నాథ శబ్దమును ప్రయోగించెను. 'గోరఖబాణి'లో సంగ్రహింపబడిన రచనలలో నాథ శబ్దము రెండు అర్థములలో వ్యవహృత మైనది."[12] ఒక అర్థమేమనగా రచయిత య్యే నాథుడు. రెండవ అర్థమేమనగా బ్రహ్మ లేక పరమతత్త్వము, దీనికి ఉదాహరణము—

"తే నిశ్చల సదా నాథ కీసంగ ।
నాథ కహంథా సచ్ జగనాథాన్ ॥

నాథ సంప్రదాయమునకు సంబంధించిన సాహిత్యములో ప్రయుక్తమైన నాథ శబ్దమునకు పరమతత్త్వము లేక బ్రహ్మ, గురువు అను నర్థములున్నట్లు స్పష్టమగును.

"నిర్గుణ సంత (సాధు) సాహిత్యములో కూడ ఈ నాథ శబ్దము ప్రయోగింపబడినది. రామానందుని పేర ప్రసిద్ధిచెందిన 'రామ రక్ష' రచనలో నాథ శబ్దము 'నిరంజనుడు, ప్రాణపిండ రక్షకుడు అను అర్థములలో ప్రయోగింప బడినది."[13] "కబీరదాసు నాథ శబ్దమును మాయా విజేత అను నర్థములో ప్రయోగించెను. నాథుని త్రిభువన

యతి అని చెప్పెను"[14] ఇది గోరక్ష సిద్ధాంత సంగ్రహములోని వాక్యములకు అనుగుణముగా నున్నది.

"యోగశాస్త్రములో'గోరక్షసిద్ధాంత సంగ్రహము'ను అనుసరించి సృష్టి క్రమము ఇట్లున్నది. -శివుడు -భైరవుడు -శ్రీకంఠుడు -సదాశివుడు- ఈశ్వరుడు -రుద్రుడు -విష్ణువు -బ్రహ్మ -సృష్టి. ఈ క్రమములో నాథుడు ఈ సృష్టి క్రమమునకు పూర్తిగా అతీతుడు."[15]

"సిద్ధులు స్త్రీని స్వీకరింపలేదు. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, దేవతలు,శేషాది నాగులు, మనువు మొదలైన నరులు,అన్య పశుపక్ష్యాది జీవులు- ఇవన్నియు స్త్రీలయందు ఉద్భవించినవి. కేవలము నాథుడొక్కడే మాయా విజేత అని 'గోరక్ష సిద్ధాంత సంగ్రహము'లో చెప్పబడినది.[16] నాథుని పరమతత్త్వముగా స్వీకరించి అతనిని ప్రసన్నుని చేసికొనుటకై యోగ సాధనచేయు సాధకుల సంప్రదాయమే నాథ సంప్రదాయము. దీక్షానంతరము నామాంతములో నాథుడను బిరుదమును దాల్చినవారి సంప్రదాయమే నాథ సంప్రదాయము. హఠయోగ సాధన చేసినందువలన వారు యోగులని చెప్పబడిరి. "ఈ యోగి శబ్దమునకు అత్యంత విశాలమైన అర్థము కలదు. 'కాన్‌ఫటులు' కాని సాధకులెందరికో యోగ శబ్దము వ్యవహృతమగు చున్నది. సాధువులకు, చమత్కారము చేయువారికి, సన్యాసులకు కూడ ఈ శబ్దము ప్రయోగింపబడినది. "కర్ణములకు రంధ్రములు పొడిపించుకొనిన వారు 'కాన్‌ఫటుల'ని పిలువబడుదురు. దీక్షా సమయమున ఈ క్రియ యాచరింపబడును. ఈ 'కాన్‌ఫటులు' భిక్షకుల రూపములో, సన్యాసుల రూపములో మధ్యప్రదేశ్, గుజరాత్,మహారాష్ట్ర గంగానది ప్రాంతములలో. నేపాలులో కలరు".[17] బెంగాలుకు చెందిన 'రంగపుర' యోగులు శైవులు. వారు గోరక్షుని తమ ఆది గురువుగా పరిగణింతురు. తాము 'కాన్‌ఫటా' సంప్రదాయమునకు చెందినవారమని చెప్పుదురు. 'కాన్‌ఫటులు' గోరక్షనాథుని సంప్రదాయ పునఃసంఘటన కర్తగా లెక్కింతురు."[18] దర్శని శబ్దమునకు మూలము దర్శనము. ఈ దర్శనమును 'కుండలము' అని కూడ పిలుతురు. కర్ణములకు రంధ్రములు వేయించుకొని స్ఫటికము లేక తదితర ధాతువు లేక దంతముతో కుండలధారణ చేయుచున్నందు వలననే వీరిని 'దర్శనీలు' అందురు. ధనికులైన మహంతులు స్వర్ణముద్రను కూడ ధరింతురు.'కాన్‌ఫటులు', 'దర్శనీలు' ఒక విధమైన సంస్కారమును పొందినవారు అగుదురు. కాని 'దర్శనము'నకు ఆధ్యాత్మిక వ్యాఖ్యలు నాథ సంప్రదాయ గ్రంథములలో లభించును. ఈ దర్శనమును యోగులు దీక్షాసమయమున ధరింతురు. సాధకునికి పరమాత్మ దర్శనము లభించినదని దీని తాత్పర్యము. నాథ మార్గీయులు దీనిని అతి పవిత్రముగా పరిగణింతురు. అందుచేత దీనిని 'సావిత్రీ' అనికూడ పిలుతురు. కర్ణభేదనము వలన నాడీభేదనము జరుగును. దానివలన యోగ సిద్ధులు లభించునట. వివిధ ప్రదేశములలో నాథ మార్గీయులు వివిధ నామములతో వ్యవహరింపబడుచున్నారు. "బ్రిగ్స్" అభిప్రాయము ప్రకారము వీరు పంజాబు, హిమాచలప్రదేశ్, బెంగాలు, బొంబాయి మొదలైన ప్రాంతములలో 'నాథ' పేరుతోను, పశ్చిమ భారతములో 'ధర్మనాథి' తదితర ప్రాంతములలో 'గోరఖ్‌నాథి' 'కాన్‌ఫటా' అను పేళ్లతోను వ్యవహరింపబడుచున్నారు".'గోరఖ్‌నాథి' అను నామకరణము సంప్రదాయప్రవర్తకుడు లేక సంఘటన కర్త కారణముగానే జరిగినదని నిస్సందేహముగా చెప్పవచ్చును. "పంజాబు ప్రాంతములో మహమ్మదీయ వర్గములో కూడ యోగులు లభింతురు. వారిని 'రావల్' అను పేరుతో వ్యవహరింతురు".[19] నాథ సాహిత్యములో ఈ పేళ్ల ప్రయోగము కనబడదు. సిద్ధాంత ప్రతిపాదన సమయములో సామాన్యముగా 'నాథ సంప్రదాయము, సిద్ధమార్గము, యోగమార్గము యోగ సంప్రదాయము, అవధూత మతము, అవధూత సంప్రదాయము' మొదలైన నామ ప్రయోగములు గోచరించును. సిద్ధాంత ప్రతిపాదన దృష్ట్యా 'మహామహోపాధ్యాయ పండిత గోపీనాథ కవిరాజ్' సంవాద కవిత్వమున వెలువడిన 'గోరక్ష సిద్ధాంత సంగ్రహము' ప్రామాణిక గ్రంథము. దీనిలో ప్రతిపాదింపబడిన సిద్ధాంతములు గోరక్షాది సిద్ధులచే అనుసరింపబడినవి. నాథ సంప్రదాయమునకు సిద్ధమతశబ్ద ప్రయోగము ఈ గ్రంథములోనే లభించును. ఇతర మతములను, సంసార నిమగ్నమైన సంప్రదాయములను త్యజించి సిద్ధమతమునే ఆశ్రయింపుడని ఈ గ్రంథములో చెప్పబడినది.

"హఠయోగ ప్రదీపిక' టీకలో ఆదినాథుడే ప్రథమనాథుడని చెప్పబడినది. అతడు స్వయముగా శివుడని నాథ సంప్రదాయ వాదుల విశ్వాసము. మౌలికముగా సమగ్రనాథ సంప్రదాయము శైవమే. సర్వుల మూల ఉపాస్య దేవత శివుడు.

స్వతంత్రముగానున్న కాపాలిక మార్గము కొంతకాలమునకు గోరక్ష మార్గములో అంతర్భాగమైపోయెను. కాని గోరక్షమార్గీయులకు కాపాలికులకు కొన్ని భేదములు నేటికిని నిలిచియున్నవి. గోరక్ష మార్గీయులు చెవి మధ్య భాగములోనే కుండల ధారణ చేయుదురు కాని కానీఫాలు చెవి కొనలలో కూడ వాటిని ధరింతురు. జాలంధర నాథుని శిష్యునిపేరు కానీఫా, కానుఫా, కాన్హూపా. కాలాంతరములో జాలంధరనాథుని మతము కూడ గోరక్షనాథుని శాఖలో విలీనమైనది. ముద్రాధారణకు చెవికి రంధ్రము పెట్టుట ఆవశ్యకము. ఈ పని చిఱుకత్తితో గావింతురు. అందువలన 'క్షురికోపనిషత్తు'లో కత్తి మాహాత్మ్యమును గూర్చి వర్ణింపబడినది.

"ఈ కుండల ధారణ క్రొత్తదేమియు కాదు. ఎల్లోరా గుహకు చెందిన కైలాస శివ మందిరములో "శివుని మహాయోగిముద్ర" కనబడును. ఇందు శివుని చెవిలో పెద్దపెద్ద కుండలములున్నవి. ఈ మందిరము క్రీ. శ. 8వ శతాబ్దిలో నిర్మింపబడినది. కాని ఈ

కుండలములు 'కాన్‌ఫటా' యోగులవలె ధరింపబడియుండలేదు. కాని 'బ్రిగ్స్' ప్రకారము అవి 'కాన్‌ఫటా,' యోగులవలె ధరింపబడినవి. అంతియేగాక తమిళనాడుకు చెందిన ఉత్తర ఆర్కాట్ జిల్లాలో పరశురామేశ్వర' మందిరము కలదు. దానిలోని శివమూర్తికి చెవులలో 'కాన్‌ఫటా' యోగుల వలె కుండలములున్నవి. ఈ మందిరమును క్రీ. శ. 1126లో పునర్నిర్మించిరి. దీనినిబట్టి ఆ మూర్తి అంతకు చాల పూర్వమే స్థాపింపబడి యుండెనని తెలియును. శ్రీ టి. ఏ. గోపీనాథరావు ఈ లింగమును వర్ణించుచు ఇది క్రీ.శ. 2లేక 3వ శతాబ్దికి పూర్వమే వెలసినదని చెప్పిరి[20] "మత్స్యేంద్ర నాథునికి పూర్వమే కూడ కర్ణకుండలములు ధరించిన శివమూర్తులు ఉన్నట్లు దీనిని బట్టి ధ్రువపడును.

నాథ మతమును అనుసరించిన చాల జాతులు గృహస్థ జీవనమును గడుపుచున్నారు. యోగులలో వివాహ సంప్రదాయము కూడా బయలుదేరినది. అక్కడక్కడ బ్రాహ్మణులు వివాహ సంస్కారములు చేయించుచున్నారు. కొన్నిచోట్ల నాథ బ్రాహ్మణులను వారే ఆ పని నిర్వహించుచున్నారు. పంజాబులో గృహస్థ యోగులను 'రావల్' అని పిలుతురు. వీరు భిక్షాటనము చేయుదురు. ఏవో వింతలు చూపిగాని చేతలు చూపిగాని తమ పొట్టను పోషించు కొందురు. సాలెలు, గొల్లలు మొదలైన జాతులవారు గృహస్థయోగులుగా నున్నారు. నూలు వ్యాపారము యోగి జాతుల ప్రాచీన వృత్తి. వీరిలో అనేక మంది గృహస్థ యోగులు మహమ్మదీయులైనారు. వివాహ మంత్రములలో గోరక్ష మత్స్యేంద్ర నాథుల పేర్లు వినబడును. క్రీ.శ. 1921లో బెంగాలులోని గృహస్థ యోగుల సంఖ్య 3, 65, 910. నేడు వీరు తాము యోగి బ్రాహ్మణులమని చెప్పుదురు. కర్నాటకలో 'తొగ' అను పేరుగల గృహస్థ యోగుల సంఖ్య 6, 45, 000. వీరు నూలు వ్యాపారము ద్వారా జీవింతురు. క్రీ. శ. 1901 నాటి జనాభా లెక్కలను బట్టి ఈ విషయము మనకు తెలియును. ఈ విధముగానే ఉన్ని వ్యాపారము చేసి జీవించు గృహస్థ యోగులు పంజాబు తదితర ఉత్తర భారతదేశ ప్రాంతములలో ఉన్నారు.

అధస్సూచికలు :

1. అబ్‌స్క్యూర్ రిలీజీయస్ కల్ట్స్ - డా॥ శశిభూషణదాసుగుప్త పుటలు 191-193.
2. భోజరాజీయము - (అనంతమాతునమ్) - సం॥ కొండూరు వీరరాఘవాచార్యులు (2-53-97)
3. నాథసంప్రదాయ్ - హజారీ ప్రసాద్ ద్వివేదీ - పుటలు 10
4. పురాతత్వ నిబంధావళి - రాహుల్ సాంకృత్యాయన్, పుటలు 148-154.
5. నాథసంప్రదాయ్ - హజారీ ప్రసాద్ ద్వివేదీ - పుట3
6. ,, ,, ,, ,, - పుట3
7. గోరక్ష సిద్ధాంత సంగ్రహము— సం. డా॥ గోపీనాథ్ కవిరాజ్ పుటలు 49 & 51
8. ,, — సం. డా॥ గోపీనాథ్ కవిరాజ్ పుట 51.
9. ,, — సం. డా॥ గోపీనాథ్ కవిరాజ్ పుట 72.
10. ,, — సం. డా॥ గోపీనాథ్ కవిరాజ్
11. గోరక్షసిద్ధాంత సంగ్రహము— సం. డా॥ గోపీనాథ్ కవిరాజ్
12. గోరఖ్‌బాణి - సంపాదక్ ఔర్ టీకాకాత్ - డా॥ పీతాంబర్ వత్ బడత్వాల్ పుట-40
13. రామానంద కీ రచనాయో - సం పీతాంబర్ దత్‌బడత్వాల్, పుట 3
14. కబీర్ గ్రంథావళి - సం॥ శ్యామ సుందరదాసు, పుట 199
15. గోరక్ష సిద్ధాంత సంగ్రహము-సం. డా॥గోపీనాథ్ కవిరాజ్,59
16. ,, ,, ,, పుట 66
17. గోరఖ్‌నాథ్ అండ్ ది కాన్‌ఫటా యోగిస్ - బ్రిగ్స్, పుట1-2
18. నాథసంప్రదాయోర్ ఇతిహాస్, దర్శనీ ఓ సాధనాప్రణాళి - డాక్టర్ కళ్యాణ్ మల్లిక పుట 4
19. నాథ సంప్రదాయోర్ ఇతిహాస్, దర్శనీ ఓ సాధనా ప్రణాళి- పుట 9
10. ఇండియన్ యంటిక్వరీ - సంపుటము 40 - శ్రీ టి. ఏ. గోపీనాథరావు.

పై వ్యాసమును వ్రాయుటకు హిందీ మరియు ఆంగ్ల భాషల నుండి అనేక విషయములను తెలియజేసి నా కత్యంత సహకార ప్రోత్సాహము లిచ్చిన శ్రీమద్గురువర్యులు డా॥ పి. ఎల్, శ్రీనివాసరెడ్డి, ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు మరియు విమర్శకాగ్రేసరులైన శ్రీ బండ్లపల్లి ఓబులరెడ్డి గార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

బాధలచెట్టు

శిఖామణి

ఫలానాచోటని ఫలానారోజని
తెలియకుండా చెప్పాచెయ్యకుండా
ఎప్పుడో ఒకప్పుడు
అకస్మాత్తుగా అస్తవ్యస్థంగా
బాధలచెట్టు మొలిచేస్తుంది.
దానివేళ్లు ఎంతబలంగా లోతుగా ఉంటాయో
దానిచిగుళ్లూ కొమ్మలూ
అంత ఉన్నతంగా గొప్పగాఉంటాయి.

ఆచెట్టుకు మాట్లాడ్డంవచ్చు
పాటలు పాడ్డంవచ్చు
కథలు - కవిత్వంవచ్చు
నవ్వడం - ఏడ్వడంవచ్చు.
వీటన్నిటితోనూ అది జీవితాన్ని ఊపేస్తుంది.

ఆ చెట్టు నీడన కూచుంటే
అప్పుడే అల్లిన పచ్చికొబ్బరాకు చాపమీద
నగ్నంగా పడుకున్నట్టుంటుంది
ఆ చెట్టును తాకితే
తెగిన గాయంమీద గోర్వెచ్చనినీళ్లు పడ్డట్టు
అది ఖేదమో మోదమో
తేల్చుకోలేనట్టుంటుంది.

ఆ చెట్టును కావలించుకుంటే
ప్రియురాలిచుట్టూ చేతులుపెనవేసి
స్థనాలమధ్య మొహం దాచుకున్నట్టుంటుంది.

ఆ చెట్టును పలకరిస్తే
ప్రవాసంనుండి తిరిగివచ్చిన ప్రాణమిత్రుని
స్వచ్ఛమైన నవ్వులా పలకరింపులా ఉంటుంది.
ఆ చెట్టువంక చూస్తేచాలు
అప్పుడే నడకనేర్చుకుంటున్న కొడుకు
తండ్రిఒడిలో కూర్చోడానికి
ఎగబడుతున్నట్టు
కొమ్మలచేతులను చాపుతుంది.

యింతచేసినా - ఆ చెట్టునుచూస్తే
భయంగా బెరుగ్గా ఉంటుంది.
దూరం దూరంగా ఉంటే
అది భయపెడ్తుంది
సాహసించి దగ్గరకెళ్తే
సాదరంగా లోనికి తీసుకుంటుంది.

ధైర్యంగా మొదటికొమ్మ ఎక్కితే
చివరనున్న అమృతఫలం చేతికందుతుంది.
అప్పుడు ఆ చెట్టు
మాటగా, పాటగా, కథగా, కవిత్వంగా
కలగా - కన్నీరుగా రూపాంతరంచెంది
గొంగళిపురుగు సీతాకోకచిలకైనట్టు-
ఎగిరిబతుకు పుష్పంమీద వాలుతుంది.

శ్రవ్యనాటిక

రాజు-రజని

భట్టిప్రోలు కృష్ణమూర్తి

(గ త సం చి క త రు వా యి)

రాజ : మంజరీ! ఇంత ఉదయమే ఏమిటింత హడావుడిగా వచ్చావిలా?

మంజ : ఇదిగో - నీ వజ్రాలహారం- నీ ఉంగరం.........

రాజ : ఏమిటైంది మంజరీ? నీజన్మదినానికి బహుమానంగా ఇచ్చిన తరువాత నావెలా అవుతాయి అవి?

మంజ : నీ బహుమానాలు నాకక్కరలేదు. రాత్రి నీవు చేయించిన పనికి చాలా సంతోషం!

రాజ : రాత్రా? నేనా? ఏమి చేయించాను? నువ్వంటున్నది ఏమిటో ఏమీ బోధపడడం లేదు నాకు!

మంజ : ఎందుకు బోధపడుతుంది! జన్మదినోత్సవ వినోదాలలో అందరూ మునిగి ఉన్న అదనుచూసి దేవవర్మను విడిపించావు రాత్రి నువ్వు!

రాజ : ఆఁ? దేవవర్మ తప్పించుకున్నాడా? నిజం, మంజరీ! నీవిప్పుడు చెప్పేంత వరకూ నాకేమీ తెలియదు!

మంజ : నీ మాటలు నమ్మనా. ఇంకెవళ్ళకూ సాధ్యం కాదీపని. ద్వార పాలకులను బంధించి నోటిలో గుడ్డలు కుక్కి.........

రాజ : ఎవరింత సాహసానికి ఒడిగట్టారు? నిజం మంజరీ- భగవత్సాక్షిగా చెప్తున్నాను - నాకేమీ సంబంధం లేదిందులో. సునీల రాజ్యం వాళ్లు చేసిన పనే అయి ఉండాలి. ఎలా చేయగలిగారో అని ఆశ్చర్యంగా ఉంది. దేవవర్మ విముక్తుడు కావడం ఒక విధంగా మన రాజ్యక్షేమానికి మంచిదే - కాని శత్రువులు అంతఃపురాంగణాలలోనికే చొరబడి, కాపలాలో ఉన్న బందీని విడిపించ గలిగారంటే మన భద్రతా పద్ధతిలో లొసుగులు చాలా ఉన్నాయని తేట తెల్లమవుతూంది. అతి ప్రమాదకరమైన పరిస్థితి- పద, వెంటనే లోతుగా విచారణ చెయ్యాలి.

మంజ : నీవే విచారణా చేయనక్కరలేదు. నేనే కనుక్కుంటాను-ఎలా జరిగిందో ఇది. నేరస్థులను భగవంతుడు కూడా కాపాడలేడు నా దండన నుండి!

రాజ : మంజరీ! ఆగు, మంజరీ!

మంజ : (దూరంనుండి) అంతా నటన!

15

బలవంతవర్మ : వసంతా - ఇన్నాళ్లూ ఈ సంగతి చూచాయగా నన్నా నాకు చెప్పలేదేమమ్మా? ఎందుకు దాచి ఉంచావ్?

వసంత : విషయం ఇంత దూరం వెళ్తుందని నేనూహించ లేదు నాన్నా! అనుపానులు తీయడంలో ఇది సాయ పడ్తుందను కున్నాను.

బల : జరిగిందేదో జరిగింది. చూడు రాజకుమారీ- ఇది సాధ్యమయ్యే వ్యవహారం కాదు. నిన్నిక్కడ వదిలి మేము తిరిగి వెళ్లలేము. కన్నీరు కార్చకమ్మా. హృదయాను బంధాలకు మించిన అనుబంధాలు కొన్ని ఉన్నాయి జీవితంలో.

సుజాత : (వెక్కి వెక్కి ఏడుస్తూ) నే.... నేను రాలేను. మీరువెళ్లండి. అమ్మకూ, నాన్నకూ అన్నయ్యకూ అందరికీ చెప్పండి, నన్ను క్షమించమని.

బల : చూడండి రాజకుమారీ- మిమ్మును సురక్షితంగా అక్కడ అప్ప చెప్పే బాధ్యత మామీద ఉంది.

సుజా : నా మనస్సు నా స్వాధీనంలో లేదు. ఎందుకిలా అయిందో కూడా నాకుతెలియదు. ఏమైనా నేను రాలేను. మీరు వెళ్లండి. నేనసలు పుట్టనే లేదని అనుకోమని చెప్పండి.

బల : లాభంలేదమ్మా! బాధనంతా దిగమింగుకుని అన్నీ మరిచిపోవాలి నువ్వు.

సుజా : నన్ను క్షమించండి. వారికి దూరమై నేను బ్రతకలేను.

వసం : క్షమించడానికేముంది ఇందులో రాజకుమారీ? మీరులేకుండా మేమక్కడ అడుగు పెడ్తే మా కిద్దరికీ శిరచ్ఛేదం తప్పదు.

సుజా : అబ్బా- అలా అనకు వసంతా!

బల : వసంత అన్నది నిజమేనమ్మా! ప్రభువులు మమ్మును క్షమించరు. శత్రురాజ్యపు సేనాధిపతితో సునీల రాజకుమారి-వివాహమంటే అది తీరని అవమానంగా భావిస్తారు వారు. సునీల రాజ్యానికి శిరచ్ఛేదన ఇది అంటారు తల్లీ!

సుజా : ఇది ఒక యువతీ యువకులకు సంబంధించిన వ్యక్తిగతమైన విషయం - ఇందులో రాజ్యాల ప్రసక్తి దేనికి?

బల : కొన్నికొన్ని వ్యక్తిగతమైన న్యాయాలు సామాజిక న్యాయాలకు బలికాక తప్పదు తల్లీ! అందులోనూ సామాన్య ప్రజల జీవన భద్రతకు బాధ్యత వహించిన వ్యక్తుల విషయంలో అది మరింత నిజం. రాజసింహుడు ఈ రాజ్యపు శాంతిభద్రతల భారం భుజస్కంధాలమీద ఉన్న వ్యక్తి. నీవో - సునీలరాజ్యపు క్రమాగత వారసత్వంలో రెండవ స్థానంలో ఉన్నదానివి. నా మాట విను తల్లీ! ఇది సానుకూలమయ్యే వ్యవహారం కాదు. గుండె దిటవు చేసుకోవాలమ్మా!

వసం : చూడండి రాజకుమారీ - మిమ్మును మానాన్న పూటీమీద పంపారిక్కడికి ప్రభువులు.నాన్న మిమ్మునక్కడ అప్పగించిన తర్వాత కొన్నాళ్లు వేచిచూడండి. అప్పటికి ఈ జరిగిన దంతా మీరు మరచి పోగలరనే నా నమ్మకం.

సుజా : అసాధ్యం వసంతా.... ఏనాటికీ మరచి పోలేనిది.

వసం : కావచ్చు. అలాగే అయిననాడు, ఇక్కడికి రాకుండా ఉండలేరని మీకనిపించిన పక్షంలో అతి సులభంగా రావచ్చు మీరిక్కడికి. మా క్షేమంకోరైనా మీరీపద్ధతికి ఒప్పుకుంటారనుకుంటున్నాను.

బల : అవునమ్మా - వసంత చెప్పినది చాలా సవ్యంగా ఉంది.

సుజా : మీకే ఆపదా కలగడం నాకిష్టం లేదు.భరించలేనిది. మీరు తండ్రితో సమానులు. అక్కచెల్లెళ్లు లేనినాకు వసంత తోబుట్టువు లాటిది. (ఆగి) సరే-మీ ఇష్టప్రకారమే కానివ్వండి. కాని ఒకటి ....

బల : ఏమిటమ్మా అది ?

సుజా : ఈ సమస్యకు సమాధానం నాకు నేనే నిర్ణయించుకోవాలి. అందువల్ల ఈ సంగతి మన ముగ్గురిలో ఉండవలసిందేతప్ప పైకి పొక్కకూడదు ఆ మాట మీరిద్దరూ నాకివ్వాలి.

బల : అలాగే తల్లీ !

వసం : మీ ఇష్టప్రకారమే నడుచుకుంటాము రాజకుమారీ !

సుజా : ఎప్పుడు ప్రయాణం ?

బల : ఈ మధ్యాహ్నమే.

సుజా : ఈ ఒక్కరోజూ ఉండి రేపుదయం వెళ్తే ?



బల : చూడమ్మా- ఒక సంగతి, యువరాజ జన్మదినోత్సవం ముందు మన ప్రయాణం గురించి నేనెత్తితే యామినీదేవి ఎంత మాత్రమూ ఒప్పుకోలేదు. మిమ్మ నిక్కడే ఉండనివ్వమని అన్నారు. కాని నిన్న నేనీసంగతి ఎత్తుతే ముభావంగా మాట్లాడి 'మీ ఇష్టప్రకారం చెయ్యండి' అన్నారు. దీన్నిబట్టి చూస్తే ఈ వ్యవహారం ఆమె చెవులకూ పాకిందని గట్టి అనుమానం.

సుజా : ఏమైనా ఈ సాయంత్రం వారిని ఒక్కసారి కలిసి.... ....

బల : నీకు తెలియదు కాబోలు - అత్యవసరమైన పనిమీద ఈ తెల్లవారుఝామున సేనాధిపతి ప్రసేన నగరానికి వెళ్లారు. రేపటెల్లుండి కానీ తిరిగి రారు.

సుజా : (కొద్దిక్షణాలాగి) సరే- మధ్యాహ్నమే వెళ్లిపోదాం.

16

రాజ : రండి, కూర్చోండి. ఎవరు మీరు? నా తోపేం.... (అర్థోక్తిలో ఆగి ఆశ్చర్యంగా) ఆఁ! నువ్వా రజనీ! ఇదేమిటీ పురుషవేషం? ఎలావచ్చా విక్కడికి?

సుజా : నేనే, మీ రజనిని-ఎలా మాయ మయ్యానో అలాగే వచ్చేశాను మళ్లీ.

రాజ : రజనీ!

సుజా : రాజా!

రాజ : నువ్వు అవంతీ నగరానికి వెళ్లిపోయావని తెలిశాక నిన్ను మరి చూడలేనేమో అని ఎంత బాధపడ్డానో!

సుజా : నేనూ అంతే. క్షణమొక యుగంగా గడిచిందిన్నాళ్లూ. అక్కడ మరి ఉండలేక వచ్చేశాను మళ్లీ-అన్ని బంధాలూ తెంపుకుని-జీవితాంతం మీ పాదసన్నిధినే గడపడానికి!

రాజ : పాదసన్నిధినికాదు-ఈ నాహృదయ సీమలో-స్వర్ణపీఠం మీద.

సుజా : రాజా!

రాజ : రజనీ!

17

మంజరి: ముఖ్య సేనాధిపతిగారు రాచకార్యాలతో పూర్తిగా నిమగ్నులై ఉన్నారే!

రాజసింహుడు : ఆఁ? మీరా మంజరిదేవీ!

మంజ : లేవకు, లేవకు- కూర్చోబావా. నేనిప్పుడు రాజప్రతినిధిగా రాలేదు. మంజరిగా మటుకే.

రాజ : కూర్చో మంజరీ- నీరాక గమనించనే లేదు - ఈ పత్రాల పరిశీలనలో. ప్రభువుల కెలా ఉంది?

మంజ : అలాగేఉంది- పెద్దవయసు కదా! (ఆగి) ఎప్పుడూ రాలేదీ ప్రక్కకు. బావుందిక్కడ.

రాజ : జనసమ్మర్దం ఉండదిక్కడ. ప్రశాంతంగా ఉంటుంది.

మంజ : ఈమధ్య ఎక్కువకాలం ఈ విశ్రాంతి గృహం దగ్గరే గడుపుతూన్నట్లున్నావే?

రాజ : పేరుకే విశ్రాంతి మందిరం. మన దక్షిణ సరిహద్దున మిత్ర రాజ్యం అనుకున్నాం గాని, వీళ్లూ ఈమధ్య చిలిపికయ్యాలకు కాలుదువ్వుతున్నారు. తగిన చర్యలు తీసుకోడానికి మాటిమాటికీ రావలసి వస్తున్నదిక్కడికి.

మంజ : లేస్తున్నావేమి? కూర్చోబావా.

రాజ : సరస్సు సరిహద్దు పర్యాలోకన చెయ్యాలొకసారి. రేవులో నౌకసిద్ధంగా ఉంది. నువ్వు వస్తావా, చూసివద్దాం? చీకటి పడేలోగా తిరిగి రావచ్చు.

మంజ : ఊఁ పద.... ఈ పూలతోట చాలా బావుంది. కళాత్మక దృష్టి నీది.

రాజ : (నవ్వి) నాదేముంది? శ్రద్ధగా చూస్తున్న ఆ మాలీలదే గొప్పతనం.

మంజ : ఎంత కమ్మని వాసన! ఎన్ని ఆకు సంపెంగపూలో! ఈగుబురు పొదలో!

రాజ : అహఁ- నువ్వెళ్లకు. పాములుంటాయేమో! నే తెస్తాను.

మంజ : ఏమిటక్కడ మెరుస్తున్నది గడ్డిలో? ఆఁ, కాలిఅందె! ఎలా వచ్చిందిక్కడికి?

రాజ : ఏమిటి మంజరీ? ఏమిటది?

మంజ : ఇదిగో—

రాజ : కాలిఅందె!

మంజ : ఎవరో లలనాలలామ వయ్యారంగా ఈ నీతోటలో పూలు కోస్తున్నప్పుడు జారిపడి నట్లుంది. నీ ముఖ కవళిక లెందుకలా మారుతున్నాయి? విలాస కాలక్షేపానికి ఎవరైనా రమణీమణిని దాచి ఉంచావా నీ విశ్రాంతి గృహంలో?

రాజ : అలాటిదేమీ లేదు. ఎలావచ్చిందా అని చూస్తున్నాను. ఏనాడో జారిపడి ఈవాళ నీకంట బడి ఉండవచ్చు. లేక ఏకాకో.......

మంజ ; కాకమ్మ కబుర్లు చెప్పకు. చూద్దాం పద నీ విశ్రాంతి గృహం.

రాజ : రా మంజరీ. అవతల ఆలస్యమైతే పనికాదు. చీకటి పడిపోతుంది.

మంజ : ఆ సరిహద్దు సంరక్షణ కన్నా నా సరిహద్దు సంరక్షణ నాకు ముఖ్యం.

రాజ : ఆగు, మంజరీ— నామాట విను.

మంజ : నన్నడ్డగిస్తున్నావా లోనికి పోకుండా? లే, గుమ్మంలో నుండి లే!

రాజ : తప్పదా?

మంజ : తప్పదు.

రాజ : అయితే విను— ఈ లోపల ఉన్నది గాంధర్వ పద్ధతిలో నేను వివాహమాడిన నాభార్య, రజని.

మంజ : (మెరపుకొట్టి నట్లుగా) నీ.... భా.... ర్యా... ర....జ....ని....

రాజ : అవును. ఎప్పుడో ఎలాగూ బయట పడవలసిందే! ఇప్పుడేకానీ!

మంజ : ఎంత సాహసం! ఈ రాజ్యానికి కాబోయే మహారాణిని, నన్ను కాదని....... (కోపంగా) ఎవరా రజని?

రాజ : ఒక అనాథయువతి.

మంజ : ఒక రాజ్యాన్నే కాలదన్నడానికి నువ్వు సిద్ధపడేటంత సౌందర్యవతా అది! అడ్డులే, వెళ్లి కళ్లారా చూస్తాను ఆ భువనైక మోహినిని!

రాజ : ఇక్కడికే వస్తుంది - చూద్దువుగాని, రజనీ.... రజనీ! (కొద్ది క్షణాలాగి) ఇదిగో!

మంజ : (పట్టిలాగబట్టి) ఎక్కడినుండి ఊడిపడ్డావో గాని బంగారు తల్లీ, అంత సిగ్గెందుకు? ఏదీ, తలపైకెత్తు, మేల్ముసుగు తొలగించు! ఆఁ! ఆఁ!! సునీల రాజకుమారి సుజాత!!!

రాజ : (ఆశ్చర్యంగా) రాజకుమారి సుజాతా! ఏమిటి మంజరీ నువ్వంటున్నది? ఈమె ఉజ్జయిని నుండి..........

మంజ : హుఁ! ఉజ్జయిని!! ఒకసారి చూసిన మొహమెప్పుడూ మరిచిపోను నేను. చెప్పు నువ్వు సుజాతవు కావూ? ఇద్దరూ కలిసి నాతో నాటక మాడుతున్నారా?

రాజ : నేను నమ్మను.

మంజ : నమ్మనని నువ్వు వగలు పోయినంత మాత్రాన నిజం దాచలేరు మీరు. సరే.... కానీ!

రాజ : ఆగు మంజరీ (ఆగి) వెళ్లిపోయింది! సరే.... అరే, ఎందుకలా కన్నీళ్లు కారుస్తున్నావు? మంజరి పొరపాటుపడి ఉంటుంది. అంతేనా? ఊఁ అను రజనీ.

సుజా : (వెక్కుతూ) నేను నేను సుజాతనే! నన్ను మన్నించండి మిమ్మును మోసగించినందుకు.... ....

రాజ : ఆఁ! రాజకుమారి సుజాత! (ఆగి) ఆ వైభవాలన్నీ వదులుకుని నాకోసం వచ్చేశావా! లే, రజనీ-లే, ఏమైనా నాకెప్పుడూ నువ్వు రజనివే!

సుజా : రాజా!

రాజ : రజనీ! (కొన్నిక్షణాల మధురమైన వాద్యసంగీతం) చూడు, వ్యవధి ఎక్కువలేదు. పగబట్టిన త్రాచు ఎప్పుడు కాటువేస్తుందో

చెప్పలేము. పద నిన్ను మీ రాజ్యపు సరిహద్దుల్లో దింపేస్తాను. మళ్ళీ ఒక నెలలో.... ....

సుజా : లాభంలేదు దేవా ! సునీలరాజ్యం పొలిమేరలలో అడుగుపెట్టే హక్కిక నాకు లేదు: మీరెక్కడ ఉంటే అక్కడే చెల్లిపోవాలీ జీవితం!

రాజ : ఎంత త్యాగం చేశావు రజనీ! సరే... .... ప్రసేన మహారాజు మా మేనమామ అని నీకు తెలుసు కదూ? అక్కడి ముఖ్య సేనాధిపతి మా పినతల్లి భర్త. ఆయన పదవీ విరమణకు వ్యవధి కొన్నాళ్లే ఉంది. ఆ పదవికి నన్నురమ్మని ఆహ్వానించారు ప్రసేన ప్రభువులు, రజనీ,. ముందు నిన్ను పంపి ఒక వారం దినాలలో నేనూ వస్తాను. ఇక్కడి పరిస్థితులు చక్క బెట్టుకుని, అంతవరకు నువ్వు మా పినతల్లి దగ్గరే ఉండవచ్చు.

సుజా : మిమ్మును వదిలి వెళ్లడమా ? ఊఁ హూఁ —

రాజ : వెళ్లక తప్పదు రజనీ - ఇక్కడ నీకు రక్షణ తక్కువ.

సుజా : ఏదో భయంగా ఉంది దేవా ! మీకేమిటవుతుందో ఇక్కడ ?

రాజ : నాకా ? (నవ్వి) నాకేమీ భయం లేదు. సైన్యాలన్నీ నా కత్యంత విశ్వాసపాత్రమైనవి. సేనాధికారు లందరకూ నేనంటే ఎంతో గౌరవం. నన్నెవరూ ఏమీ చెయ్యలేరు, చెయ్యరు. ఆలస్యం వద్దు పద, ఈ రాత్రికి రాత్రే విశ్వాసపాత్రులైన అనుచరుల నిచ్చి పంపించేయాలి నిన్ను. (నవ్వుతూ) మళ్లీ నీ పురుష వేషానికి అవసరం పడుతుందిప్పుడు - పద.

18

మంజరి : (నవ్వుతూ) ఎలా ఉన్నావు రాజసింహా !

రాజ : ఈ భోజ్జాల అంగణంలోనా నన్ను బంధించేది మంజరీ ?

మంజ : అవునుగాని - రాత్రికి రాత్రి ఎక్కడ మాయం చేశావు సుజాతను ? చెప్పు — ఎక్కడికి పంపావు ? ఎక్కడ దాచావు దాన్ని ?

రాజ : ఆ అమాయకురాలిని కూడ బంధించి హింసించాలని ఉందా ?

మంజ : అమాయకురాలు ! శత్రురాజ్యపు ముఖ్య సేనాధిపతిని లొంగ తీసుకొని ఈ రాజ్యపు రహస్యాలన్నీ లాగడానికి సిద్ధపడిన మాయలాడి అమాయకురాలా ? నీవూ అమాయకుడివే - శత్రు రాజ్యపు కన్యతో సరాగాలు నెరపి ఈ రాజ్యానికే ఎసరు పెట్ట డానికి తయారయ్యావు ! రాజద్రోహివి !

రాజ : తిన్న ఉప్పు కెన్నాడూ ద్రోహం చెయ్యలేదు- చెయ్యను. రజని కూడా మన రాజ్యానికి ఏ విధమైన అపచారమూ చేయలేదు. వాళ్ల అన్నను విడిపించడం ఒక అపచారంగా భావించను నేను.

మంజ : మన రాజ్యానికి కాకపోయినా నా విషయంలో అది తీరని అపచారమే ! సరే, చూడు - నీవు బందీవన్న సంగతి పైవాళ్లె వళ్లకి తెలియదు. ఏదో అత్యవసరమైన పనిమీద ఎక్కడికో వెళ్లావని అనుకుంటున్నారందరూ. నా మాటవిని ఆ సుజాతను నా కప్పగించు. జరిగిన దంతా మరిచిపోతానని శ్రీరామ లింగేశ్వరుల పాదాలంటి ప్రమాణం చెయ్యి. మళ్లీ నువ్వు ముఖ్య సేనాధిపతివయి. ఈ రాజ్యానికి అధీశ్వరుడివి కూడా కావచ్చు కొద్ది రోజులలో.

రాజ : ఆ విధమైన ప్రలోభాలకు లొంగేవాడు కాడీ రాజసింహుడు !

మంజ : అలాగా ? చూడు - మనకోటలో భూగర్భ జలగృహం సంగతి నీకు తెలుసు ననుకుంటాను ?

రాజ : ఏం ? అక్కడ బంధిస్తావా నన్ను ?

మంజ : శిధిలా వస్థలో ఉన్నదాన్ని బాగు చేయిస్తున్నా నిప్పుడు. నీలీ సరస్సు నుండి తిన్నగా ఆ లోపలికి నీళ్ల తెచ్చి అది నింప డానికి సొరంగముంది కదూ ? (నవ్వుతూ) అదీ బాగవు తూంది. ఒక వారం పది రోజులలో అంతా సిద్ధమతుంది. నీకు రెండు రోజుల వ్యవధి ఇస్తున్నాను. ఈలోగా నా మాట వింటే సరేసరి— లేకపోతే నిన్నక్కడికి మార్చేస్తాను. ఇక్కడ ఉన్న స్వేచ్ఛ నీ కక్కడ ఉండదు. ఆ లోపల బోనులో సింహంలా తిరగడానికి మటుకు వీలు కలిగించే సంకెళ్లలో ఉంటావు నువ్వు ! మెట్ల దగ్గరకు మటుకు వెళ్ల లేవు. పనిపూర్తి అయిన తర్వాత లోపలికి గాలీ వెలుతురూ వచ్చే మెట్లగది రాతి పలకలు రోజుకొకటి చొప్పున బిగిస్తారు. ఆ వెనుక ఆ లోపలికి నీరు వదలి క్రమ క్రమంగా నీటి మట్టం పెంచుతారు. పది అడుగుల లోతు వచ్చేవరకు ! ఒక్క తాడు మటుకు నీ కందుబాటులో ఉంటుంది. ఎప్పుడు మనస్సు మార్చుకుంటే అప్పుడు ఆ త్రాడు లాగవచ్చు వెంటనే ఆ పైన గంట మ్రోగి నాకు కబురందుతుంది. బోధపడిందా ?

రాజ : బోధపడింది—నువ్వు రాక్షసివి ! నీ ఇష్టంవచ్చినట్లు చేసుకో. ప్రాణభీతి అన్నది ఏనాడూ లేదీ రాజసింహుడికి !

మంజ : (పకపక నవ్వి) చూద్దాం - ఎంత ధైర్యవంతుడివో ! (దూరం నుండి 'హారా హుషార్' అన్న హెచ్చరికలు)

19

సుజాత : నేను వచ్చేసిన ఆ రాత్రే బందీ చేశారా వారి ని వర్మగారూ?

బలవంతవర్మ : అవునమ్మా బందీ చేసి భోజ్జాల అంగణంలో ఉంచా రట ముందు. మీరు పంపిన కబురంది ఇక్కడకు నేను వచ్చి సుబల పురానికి వెళ్లేలోగానే వారిని అక్కడి నుండి మార్చే

శారు. ఎక్కడికి మార్చారో తెలుసుకోడానికి చాలా కష్ట మైంది-కానీ చివరకు కూపీ లాగాము. కోటలో భూగర్భ జల గృహం, నీలీ సరస్సునుండి లోపలకు నీరు పంపే సొరంగం, రెండూ బాగుచేస్తున్నారని తెలిసి అనుమానం వచ్చింది. ఆ లోపల వారిని ఉంచారేమోనని. చివరకు ఆ అనుమానం రూఢి అయింది. ఆ లోపల ఎవరో బందీ ఉన్నాడట—యువరాణి అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్తున్నదట.

సుజా : (భయంగా) ఆ లోపల నీళ్లు నింపుతారా ?

బల : అదే ఉద్దేశంలా ఉంది - వారిని బెదిరించి లొంగదీయడానికి.

సుజా : అలా లొంగే మనిషి కారు రాజసింహులు ! అయినా ఎంత రాక్షసత్వం ! ఆ యువరాణి మనిషేనా అని అనుమానం వస్తున్నది నాకు ! (ఆగి) వర్మగారూ, వారిని విడిపించే మార్గం లేదా ? మన ఝుంఝూ దళాలు వినియోగించి......

బల : అది కోటమధ్యలో ఉంది రాజకుమారీ ! అక్కడికి ప్రవేశం సంపాదించడం అసాధ్య మనిపిస్తున్నది. పని వాళ్లను కూడా సోదాచేసి వదులుతున్నారు లోపలకు. అయినా ప్రయత్ని స్తున్నాము తల్లీ ! అదృష్టం కలిసివస్తే......

సుజా : ప్రయత్నించండి - మీ శాయశక్తులా ప్రయత్నించండి. వేగం తిరిగి వెళ్లండి వర్మగారూ !

బల : రేపుదయానికల్లా అక్కడ ఉంటానమ్మా.

సుజా ; ఎన్నాళ్లలో పని పూర్తవుతుందని అంచనా?

బల : ఇంకొక వారం పట్టవచ్చు.

సుజా : వెళ్లండి - వేగం వెళ్లి ప్రయత్నించండి వర్మగారూ !

బల : ఆ విషయంలో నీకే సందేహమూ వద్దు రాజకుమారీ. (ఆగి) ఆఁ, చూడు తల్లీ......

సుజా : ఏమిటది ?

బల : నువ్వు సునీలపురానికి తిరిగి వెళ్లమని ప్రార్థన - అక్కడ అందరూ నీ రాకకోసం ఆతృతతో ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు రాజసింహుడు ఇక్కడి వాళ్లకు విరోధి అయ్యారు. కనుక మీ వివాహానికి ప్రభువుల వారి అభ్యంతరం లేదు. మరీ మరీ చెప్పమన్నారు రాణీ వారు మీకిది.

సుజా : వారు నన్నిక్కడ ఉండమని పంపారు. వారి అనుమతి లేకుండా రాలేను. అయినా - ముందు వారు విడుదల సంగతి తేలనివ్వండి. అప్పుడు చూదాం - ప్రస్తుతం ఆ సంగతి ఎత్త కండి.

బల : నీ ఇష్టం తల్లీ, వస్తాను - శెలవు రాజకుమారీ !

సుజా : మంచిది. విజయ వంతంగా పని నెర వేర్చుకు రండి.

20

మంజరి : చూడు, ఈవాళ సాయంత్రానికి సొరంగం పని పూర్తయి పోతుంది. మెట్ల గది కప్పు ఆఖరు రాతిపలక పనివాళ్లందరూ పైకి వెళ్లగానే తన స్థానంలో బిగుసుకు పోతుంది. రేపుదయం నుండి ఈ లోపలికి నీరు క్రమ క్రమంగా వదులుతారు. నా మాటవిను - అనవసరంగా ఎందుకు ప్రాణాలు పోగొట్టు కుంటావు ?

రాజసింహుడు : నీలాటి రాక్షసికి చేజేతా ఏనాడూ రజనిని అప్ప గించను నా నిశ్చయం మారనిది.

మంజ : ఊఁహుఁ హుఁ ?- చూద్దాం -ఇంకా నాలుగు రోజులు వ్యవధి ఉంది. అయితే ఒకటి - నన్ను ఇదే ఆఖరుసారి నీవు చూడడం—మనస్సు మార్చుకుంటే తప్ప ! వస్తాను.

రాజ : ఇక్కడకు వచ్చి నన్ను వేధించవద్దని నీకేనాడో చెప్పాను. నువ్వు వెళ్లవచ్చు.

మంజ : అదుగో ! ఆ పన్నెండో మెట్టు దాటి నా అడుగు పైన పడిం దంటే స్వయంగా నాతో మాట్లాడే అవకాశం నీకుండదు. ఆ గంటల్రాడు లాగితే తప్ప ! బాగా ఆలోచించుకో ! (దూరంగా) ఒకటి - రెండు - మూడు - నాలుగు - అయిదు ఆరు - ఏడు - ఎనిమిది - తొమ్మిది - పది - పదకొండు పన్నెండు (ఒక రెండు మూడు క్షణాలాగి) బావా ! (దగ్గరగా) బావా !

రాజ : ఏమిటిది ? వదులు నన్ను. (ఈ మాటలు మంజరి మాటల్ మధ్య, మాటి మాటికి అంటుంటాండు పెనగులాటలో)

మంజ : ఊఁ అనుబావా ! నా 'మంజరీ' అని మనసారా అను ! చిన్న ప్పటి నుండీ ఒకచోటే కలిసి మెలిసి పెరిగాం. ఆటపాటల్లో ఎన్నోసార్లు భార్యాభర్తలుగా నటించాం. ఒకసారి నన్ను నీ కౌగిట్లోబంధించు - బావా ! 'నువ్వు నాదానివే' అని నోరారా అను. ఈ జరిగినదంతా ఒక ఆట అనుకో ఒకపీడ కల అనుకో. అంతా మరిచిపోదాం - సుజాత కూడా నాకొద్దు నువ్వే కావాలి - బావా.........బావా ! ....బావా ! (మధ్యలో బావా అంటుంది.)

రాజ : మనకు ప్రాయం వచ్చి నప్పటి నుండీ నిన్నెప్పుడూ ఆ దృష్టితో చూడలేదు. నాకు చెల్లిలాటి దానివని తప్ప ఇంకే రకమైన

(తరువాయి 63వ పేజీలో)

డా॥ హెచ్. ఎస్. బ్రహ్మానంద

గిరీశం - ది కెరీరిస్ట్ సింబల్

"పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఒకడు ఏ వాదీ కాలేడు. ఒక వ్యక్తి ఏ వాదో అతడు చెప్పే కబుర్లను బట్టికాదు - మనం నిర్ణయించేది, అతడు ఏమిటి ఆలోచిస్తున్నాడు; ఏమిటి చేస్తున్నాడు ? అనే వాటిపై అతడు ఏ వాదో ఆధారపడి ఉంటుంది."

(వ్యాస చంద్రిక పు. 139)

కెరీ (రియ) రిజం అనేపేరిట ఒక మహా ఉద్యమం ఉంది. అది ఎంత రాజకీయోద్యమమో అంత సాహిత్య ఉద్యమమూ. అంచేత ఇక్కడ గిరీశం ది గ్రేట్ కేరాఫ్ కన్యాశుల్కం - పాత్రని కెరీరిస్టు లక్షణాలు పడతాయేమో పరిశీలించడం ద్వారా గురజాడ సాధించిన నాటక కళ(ఇది సర్దేశాయి తిరుమలరావుగారు ప్రవేశపెట్టిన పరిభాష)ను గురించి చర్చించడం వ్యాస ప్రయోజనం.

గిరీశం మీద ఇదివరకే కొన్నివందల పేజీలు రాశారు-ఇక్కడ మళ్ళీ రాయాల్సిన అవసరం ఏమొచ్చింది-అంటే కెరీరిస్ట్‌గా గిరీశాన్ని ఒక్క రమణారెడ్డి గారు తప్ప మరెవ్వరూ చూసి ఉండకపోవడమే: ఆయన సూచించి వదలిన అంశాన్నే ఇక్కడ మరోరకంగా చూడ్డం జరుగుతుంది.

"....ఒక వైయక్తిక లక్షణాన్ని గిరీశం మూర్తీభవించాడన్న మాట. నిజానికది అప్పుడపుడే బయల్పడుతూండిన సామాజిక రోగలక్షణానికి రూపకల్పనం మాత్రమే. ముందు ముందు మరెంతో తీవ్రతరమూ బహుళతరమూ కానున్న ఒక అంటు వ్యాధిని ముందుగానే కనిపెట్టి పేరుబెట్టి పోయిన భిషక్కు, గురజాడ అప్పారావు....గిరీశం పాత్ర మరలోనుంచి బయటపడ్డ వస్తువులాగా ఒక్క పెట్టున అప్పారావు 'మనః కార్మికశాల' నుంచి తయారై రాలేదు. మధురవాణీ అంతే. ఆ రెండుపాత్రలూ క్రమంగా వివర్ధనం చెందిన ప్రాణపూర్ణ పదార్థాలే. అందుచేతనే వాటికి అంత ఆకర్షణ. వట్టిహాస్యంకోసం తయారైన పాత్రకాదు గిరీశం. కొండు భట్టీయంలోనూ పూర్తి కాని రచనల తుంటల్లోనూ కన్పిస్తున్న ఈ పాత్ర, మరింత మహత్తర ప్రయోజనం కోసమే అవతరించింది. ఆ దేశానికీ ఆచరణకూ మధ్యగల భేదాన్ని చూపుతూ ఇతర పాత్రల నడవడికల్లో మెలికలు పెడుతూ, సంస్కరణ వాదంలోనే వున్న పంచమాంగ దళంలాగా తూట్లు కొడుతూ, పదార్థాన్నెప్పుడూ స్వార్థ దృష్టితోనే తప్ప వీక్షించలేని ఒక మానసిక ధోరణికీ, మనుష్యుల కూటమికీ సంకేతంగానే గిరీశం పాత్ర ఉద్దిష్టమయింది." (మహోదయం: పు. 388-396)

రమణారెడ్డిగారు ఇలా ఆ పాత్రను చూడటానికి.... తన తెలివితేటలన్నిటిని స్వప్రయోజనానికి ఉపయోగించుకునే ఒక వ్యక్తి అని నా ఉద్దేశ్యము....' అన్న గోవిందరాజుల వెంకటసుబ్బారావు గారి మాటలు(చూ. మహోదంయిం. పు. 391) ప్రేరకంగా కనిపిస్తాయి. ఈ వ్యాసం ఈ అభిప్రాయాన్ని విపులీకరించడానికి ప్రయత్నిస్తుంది. నాటకంలోని నిర్మాణాత్మకమైన ఉపపత్తుల ద్వారా స్ట్రక్చరలిజమ్ అన్న సాహిత్య విమర్శన నేపథ్యంలో ఈ ప్రయత్నం,ఈ అంశాన్ని వివరిస్తుంది.

* * *

కెరీరిజం - అంటే 'స్వార్థ' మని, 'స్వకార్యవాదమని' 'స్వక్షేమవాదమనీ,' బ్రతక నేర్వటమనీ' స్థూలంగా నిర్వచించుకోవచ్చు. జానపదసమాజాల్లోనే దీని తాలూకు ఆరంభం కనిపిస్తుంది. గిరిజన సమాజాల్లో కనిపించదు. అక్కడ మాటా - చేతా ఒకటిగానే ఉంటాయి. నాగరిక సమాజంలో ప్రతి మనిషిలోనూ కొద్దిగానో గొప్పగానో నిరపవాదంగా కనిపించే ఉద్యమమిది. సమతను సాధించిన రష్యా చైనా వంటి దేశాల్లో కూడా'స్వార్థం'తుడిచిపెట్టుకు పోయిందని ఎవరూ చెప్పలేదు. మనదేశం లాంటి 'రంగస్థలం' మీద చెప్పాల్సిన అవసరం లేనేలేదు. ఈనాడు రాజకీయ సాంస్కృతిక సాహిత్య ఉద్యమంలో అన్ని సిద్ధాంతాలకూ తిలోదకాలిచ్చి ఒక 'కెరియరిజంని' మాత్రమే అందరూ కావిలించు కొంటున్నారు. అందరూ 'మార్క్సిస్టులమే. అని ఒక బోర్డు తగిలించేసుకుంటున్నారు. ఆ బోర్డు తగిలించుకున్నాక వాడు ఏం కూసినా, చేసినా చెల్లిపోతోంది. అలాగే 'లింగ్విస్టిక్స్' అనే మాటా - ప్రతి ఒక్కడూ 'భాషాపరిశీలన'-అంటున్నాడు- ఎక్కడో చేకూరి రామారావుగారు రాశారు. 'ఈ దేశంలో సోషలిజమూ; లింగ్విస్టిక్సూ-అంత చీప్‌గా తయారయ్యా.' యని ఈ పరిస్థితికి మూలం అటు సిద్ధాంతాన్ని అయినా, ఇటు చదువునయినా 'మొక్కుబడి' చెల్లించడం కోసం వాడుకోవటం, నటించడం.

ఉపాధ్యాయునిగా నేను ఈనాడు చూస్తున్న మరో అద్భుతమైన విషయం-విద్యార్థి చదువు కావాలని వచ్చినట్టు మాతోనే నటిస్తున్నాడు.

వాడి పని పూర్తికాగానే వాడి అసలు స్వరూపం బయటపడుతోంది. వాడి కులమూ, వాడి కార్పణ్యమూ అంతా చదువయ్యాక చూపిస్తాడు. అందాకా వాడి 'మార్క్సిస్టు' - నటనాకౌశలానికి - జోహార్లు అర్పించాల్సిందే. అది విద్యార్థి తప్పుకాదు. ఉపాధ్యాయుడి నడత - విద్యార్థికి చుక్కాని గిరీశం ది గ్రేట్ - కూడా మాష్టారే - కాబట్టి అవాంఛనీయమైన 'కెరియరిజం' దృష్ట్యా ఆ పాత్రను చూస్తే తప్ప గురజాడ ఉద్దేశ్యం - మనకి అంచనాకి రాదు. అంచేత ఈ ప్రయత్నం.

వ్యాసం ప్రారంభించేముందు ఒక విషయం' ఈనాడు మనకో అందరికీ తెలిసినా ఒప్పుకోని సత్యమిది - మనం చెప్పేదానికీ చేసేదానికీ అసలు సంబంధంలేదని. దీన్నే ఆచరణ - నిమగ్నత-నిబద్ధత - అనే పేర్లతో మేధావులు తలలు పట్టుకుని చస్తున్నారు. ఎంతోరాస్తున్నాం ఉపన్యాసాలూ ఇస్తున్నాం. మనకాడికి వచ్చేటప్పటికీ సిద్ధాంతాలు పెదవుల్ని దాటిలోపలికి పోవటంలేదు. చెప్పింది చెయ్యం. చేసింది-చేసేది, చెప్పం. మనకు తప్పని తెలుసు-చేస్తున్నాం. ఆత్మద్రోహం-వెన్నుపోటు అని దీన్నే పిలవాల్సింది. ఈ మహాద్రోహానికి తొలి తెలుగు ప్రతీక గిరీశం.

ప్రతీక కాబట్టి గిరీశం చావలేదు. గురజాడ పోయాక గిరీశం ఎన్నో కొత్త కొత్త సిద్ధాంతాలు చదువుకున్నాడు. ఇటీవల చదువుకున్న చదువు 'మార్క్సిజం.' సమాజం మారుతోందని గుర్తించాడు. అలనాటి బుచ్చమ్మలు - వెంకటేశంలూ దొరకరని తెలిసిపోయింది. శ్రోతకు కావాల్సింది 'సమతా' వాదమని డైరీలో రాసేసుకున్నాడు. అంచేత భావకవిత్వం వదిలి విప్లవకవిత్వం రాస్తున్నాడు. ఎక్కడ 'కమ్యూనిజం' వచ్చేస్తుందోనన్న భయం పట్టి పీడిస్తోంది. అంచేత 'బాబూ ! ఈ దేశంలో కమ్యూనిజంరాదు' - అని నిర్వేదన ప్రకటిస్తూ సత్యాలకు ఒకో షరా, చుట్టి-జీవితం 'మామూలే' అని కూటసాక్ష్యం చెప్పే' రెనగేడ్'లా తప్పించుకు తిరుగుతున్నాడు ఈనాటి గిరీశం. పట్టుకునే సౌజన్యారావు పంతుళ్లే ఈనాడు కనిపించడం లేదు. చలాలు పోయారు. విశ్వనాథలూ గతించారు. శ్రీశ్రీలు మాత్రమే మిగిలింది. కాని గిరీశాల్ని వదిలేస్తున్నారు. కారణం శ్రీశ్రీకి కావాల్సిన 'సరుకూ' ఈనాడు గిరీశం నోట్లో వుంది కాబట్టే.

అసలు గురజాడను మళ్లీ ఈనాడు లేపుకువచ్చి 'అయ్యా గిరీశం గారిని మరలా సృష్టించండి - అని అడిగితే 'అమ్మ బాబోయ్ - ఆ గుంటడు చాలా మారిపోయాడు - నా గిరీశానికి మానవత్వైనావుంది. వీడు చెప్తున్నది నేనురికార్డు చెయ్యలేదండీ' అని అనకపోతే చూడండి — ఎందుకంటే ఈనాటి గిరీశం స్వకార్యం సాధించుకోవటంతోపాటు పరుల కార్యాన్ని ధ్వంసం చెయ్యటం కూడా అభ్యసించాడుకాబట్టి.

* * *

అంటే గిరీశం పాత్రను గురజాడ కల్పించాడనుకోవటం కన్నా ఒక వ్యవస్థ తాలూకు దౌర్భాగ్య లక్షణాలు గురజాడలో ప్రతిఫలిస్తే జరిగిన రూపావిష్కరణంగా గిరీశం పాత్రని చూడడం చాలా బాగుంటుంది.

నాకు బ్రతకటమే కావాల్సింది. సిద్ధాంతాల్లేవు - మన్నూ లేదు- అని అనుకోవటం ఈ 'మనిషి'లోని తాత్త్వికి దృక్పథం. ఈ మనిషినే కెరియరిస్ట్ - అని మనం గుర్తిస్తున్నది. వలసినచోట వలసినట్టుగా చెప్పటం - శ్రోతను మంచుముద్దపై కూర్చోబెట్టి 'తియ్యగా' కబుర్లు చెప్పటం - తప్పును ఒప్పుగా భాష్యం చెప్పడం - లేని పాండిత్యాన్ని ప్రకటించడం-కింద బడ్డా పై చేయి నాదే ననటం-కడకి ఏనకేనాప్యుపాయేన - అనుకున్నది సాధించటం - బాధ్యత మరొకరి మీద నెట్టడం - ఇది కెరియరిస్టు సాధారణ లక్షణాలు.

వాడికి ఒక పేరుండదు - నిర్దిష్టమైన తలిదండ్రుల పేర్లు - జన్మతిథి - కులం - వగైరాలుండవు. గురజాడ గిరీశాన్ని అలానే మలిచాడు. మిష్టర్ జె. ఎస్. గ్రీన్ - గిల్లుకు - హనుమాన్లు - తురక - అనబడే గిరీశం 'పంతులు' లుబ్ధకు పింతల్లి కొడుక'ట !

వాడిని అందుకే నియోగుల్లో నియోగిగా - వైదికుల్లో వైదికుడిగా - గురజాడ కల్పించాడు. వాడి ముందీ తేడాలు అప్పడాలే.

వాడు గ్రాసోవాసార్థి — చల్ది వణ్ణమూ తింఛాడు. పీడిత వర్గానికి చెందినా పీడక లక్షణాలున్నవాడు - వాడి విద్య 'టొబాకోపనిషత్తు' - వాడి మంత్రం 'చేగోడీచమే ! లక్ష్యం 'బ్రదకటం' అస్త్రం 'లెక్చెర్' రంగస్థలం 'బొంకులదిబ్బ.'

వాడి ప్రధాన స్వభావం- వైరుధ్యం అసలు కన్యాశుల్కంలోని పాత్రల్ని సంవిధాన దృష్టితో పరిశీలిస్తేనే గిరీశం పాత్రలోని వైరుధ్యం మనకి బోధపడేది.

కన్యాశుల్కంలోని పాత్రల్లో ఒక 'సంవిధానం' ఉంది. ఇది మంచి - అని, ఇది చెడు - అని వేర్పరచటం అసాధ్యమని (సౌజన్యారావు పంతుల నోట. పు. 253) అనిపించిన గురజాడ దీని కనుగుణంగానే ఒకేవర్గానికి - చెందిన వ్యక్తుల్ని - పరస్పర విరుద్ధ భావాలకు ప్రతీకలుగా గ్రహించి పాత్రలుగా నిలబెట్టాడు.

1 వైదికులు — లుబ్ధావధాని = అగ్నిహోత్రావధాని × కరటకశాస్త్రి

నియోగులు — రామప్పంతులు × సౌజన్యారావు

విధవలు — మీనాక్షి × బుచ్చమ్మ

కుర్రాళ్ళు — వెంకటేశం × మహేశం (శిష్యుడు)

ఇతివృత్తం — కన్యాశుల్కం — కాబట్టి పై పాత్రల్నే ఒకటి రెండు పాత్రల్ని చేర్చి మరోవర్గంగా నిలిపాడు.

11

వెంకమ్మ బుచ్చమ్మ సుబ్బమ్మ కరటకశాస్త్రి శిష్యుడు మధురవాణి	×	లుబ్ధావధాని అగ్నిహోత్రావధాని రామప్పంతులు

మతానికి మానవతకు ఘర్షణ వుంది - సామాన్యుడు మానవతనే ప్రేమిస్తాడు - ఈ అంశాన్ని గుర్తింపచేసే పాత్ర 'అసిరిగాడు' మతం మనిషిని ఎన్ని రకాలుగా దోస్తోందో చెప్పడంకోసం ఈ క్రింది వర్గం.

గవరయ్య సిద్ధాంతి బైరాగి యోగిని	×	అసిరిగాడు/మనవాళ్ళయ్య / వీరేశ మధురవాణి

ఏవృత్తిలోనూ స్వచ్ఛత కనిపించటం లేదు కాని అలాగని లేక పోలేదు.

హెడ్ హవల్దారు దుకాణదారు మునసబు నాయుడు భీమారావు పంతులు	×	సౌజన్యారావు, డిప్టీకలెక్టరు మధురవాణి

పై వర్గాల్లో ఎక్కడా ఇమడని 'గిరీశం' స్థితి ఏమిటి? నాటకంలో మొదటి, చివరి - పలుకులున్న' గిరీశం' ఏవర్గంలోనూ ఎందుకు చేరటంలేదు. కథలో ప్రత్యక్షంగా సంబధంలేని ఈ పాత్ర' మనలో కల్గించే'విచికిత్స' ఏమిటి?

ఆదర్శానికి — ఆచరణకు మధ్యన ఎంత'వెసులుబాటు'ను మనిషి సృష్టించుకోగలడో నిరూపించేపాత్ర 'గిరీశం.' అందుకే ఒక్క మధురవాణిదగ్గర, ఒక్కసౌజన్యారావు దగ్గర మాత్రమే గిరీశం పాత్ర బోల్తాపడుతుంది. ఆ రెండు పాత్రలూ 'నిజాయితీ'కి ప్రతీకలు. 'నిజాయితీ' అంటే ఏమిటో తర్వాత సాహిత్య జగత్తులో నిరూపించినవాడు ఒక్కడే— 'చలం.' ఆ చలం సృష్టికి పునాదులు మధురవాణిలోను, సౌజన్యారావులోను ఉన్నాయి.

అంచేతే మధురవాణి ఆదర్శగృహిణిగా మారిపోయి 'పునిస్త్రీ' అయినట్టుగా గురజాడ కల్పించలేదు. సౌజన్యారావును ప్రవరుడిలా తీర్చి దిద్దలేదు. 'ముద్దంటే చేదుకా'దని మధురవాణిని ముద్దుపెట్టుకోవటానికి సిద్ధపడ్డ సౌజన్యారావులో 'నిజాయితీ' వుంది. అది వేరేగా పరిశీలించాల్సిన విషయం.

పోగా గిరీశం - నిజాయితీ లేకపోవడానికి ప్రతిరూపంగా అవతరించాడు. మొదటి ప్రతిలో వైదీకిగా వుండి రెండో ప్రతిలో నియోగిగా మారిన రామప్పంతులు కూడా నిజాయితీ విషయంలో గిరీశం బ్రదరే. వారిద్దరి మధ్యా సంభాషణం చూడండి :

గిరీ : యవరన్నా మీరు మహానుభావులు.

రామ : నేను రామప్పంతుల్నిరా, అబ్బాయి.

గిరీ : తమరా ! యీ మాత్రానికి మంచంకింద దాగోవాలా మహానుభావా! నన్నడిగితే యిలాటి లంజల్ని యిరవై మందిని మీకు కన్యాదానం చేతునే.

పై మాటల్లో మనకి గిరీశం మాటల్లో కనిపించే చమత్కారం ప్రధానం కాదు. ఆ చమత్కారం అడుగున కనిపించే 'ద్రోహబుద్ధి ప్రధానమైంది.

అలాంటిదే రామప్పంతుల మాటకూడా !

(తనలో) బతికాన్రా దేవుడా ! (పైకి) నువ్వురా బాబూ దీన్నుంచు కున్నావు ? అలా తెలిస్తే నే రాకపోదును సుమా !

ఇక నాటకమంతా వీరి డైలాగుల్లో లోన ఒకటి పైకి ఒకటి - చేతల్లోనూ అంతే - అందుకే సౌజన్యారావు పంతులు నాటకంలో ఇద్దర్ని బహిష్కరించాడు.

ఒకరు రామప్పంతులు పుట. (207)

మరొకరు గిరీశం (పుట 257)

అందువల్ల గిరీశం ప్రతీకాత్మకంగా సౌజన్యారావుతో మధురవాణితో స్పర్ధిస్తూ కనిపిస్తాడు. లోకంలో గిరీశం లాంటి పాత్ర చెల్లిపోవడానికి అటు లుబ్ధావధాని వంటి చాదస్తుడూ; ఇటు రామప్పంతుల వంటి 'లౌక్యుడూ'ఇద్దరూ అవసరం - అందుచేత.

గిరీశం = రామప్పంతులు × సౌజన్యారావు = మధురవాణి

* * *

కెరీరిస్టులోని వాచాలత్వానికి రామప్పంతులతో అన్న పై వాక్యమే ప్రబలమైన నిదర్శనం. వాస్తవికతాదృష్టిఉన్న గురజాడవారు

గిరీశంలో భావకవిని ఒకణ్ణి ప్రతిష్ఠించి - వాడి మాటల్లో ఒక అతిలోకమైన ఆకర్షణను పుట్టించారు. శబ్దప్రియత్వం - అలంకారికత - ఊహానిర్మాణం - మొదలైన వాటిలో గిరీశం భావకవే - గురజాడ సమకాలీనంగా మొదలై తరువాతి 30 సంవత్సరాలదాకా తెలుగుదేశాన్ని ఏలబోతున్న భావకవిత్వాన్ని విమర్శించడం కోసమో అన్నట్టు ఇలా రాశారు.

పుల్లు మూను లైటటా
జాస మిన్ను వైటటా
మూనుకన్న
మొల్లకన్న
నీదుమోము బ్రైటటా
టా! టా! టా! (పు. 27)

-టా మీద చేసిన అంత్యప్రాస ఏదో చమత్కారం కోసం అని అనిపించదు. అలాంటి కవిత్వంమీద గురజాడకు ఎంత తక్కువ దృష్టి వుందో నిరూపిస్తోంది ఆప్రాస. రవీంద్ర కవిమీద గురజాడకున్న 'రిజర్వేషన్' ఈ అంశంలో మాత్రమే.

రెండవది వాడిఊహల్లో ఒక కొకిబికి లక్షణంవుంది. కొంత ప్రయత్నించి వుంటే సర్రియలిస్ట్ అయిపోయేవాడే. లేకపోతే వెంకటేశంతో అలా ఎవడు పొయెట్రీ చెప్పగలడు? (పు. 43)

మూడోది వాడు అనవసరంగా ఒక పాండిత్యం దర్బారు వెలగబెడతాడు. చుట్ట కాల్చటం వల్లనే తెల్లవాడు స్టీముయంత్రం వగయిరా కనిపెట్టాడంటూ ఈ రహస్యమూ శాస్త్రకారులు చెప్పారంటూ

ఖగపతి యమృతము తేగా
భుగభుగ మని పొంగి చుక్క భూమిని వ్రాలెన్
పొగ చెట్టై జన్మించెను
పొగ తాగని వాడు దున్న పోతై పుట్టున్.

ఈ పద్యం - బృహన్నారదీయం నాల్గవ ఆశ్వాసంలో ఉందంటూ రిఫరెన్సు ఇచ్చాడు. వెంకటేశంలాగా మనమూ 'కామోసు' అనుకోవడం కన్నా వాడి పాండిత్యాన్ని ఏమీ అనలేం.

ఆఖరువిషయం వాడి మాటకారితనంలో ఎంతో గడుసుదనం- సంస్కర్త లక్షణం కనిపిస్తూ - ఆకర్షిస్తుంది.

పొగతాగడం వల్ల లోకోపకారం జరుగుతుందని ఒక ప్రతిపాదనచేశాడు- ఎలాగండి అని అడిగాడు వెంకటేశం:

“యలాగా! యిదిగో ఇలా చుట్టకాలిస్తే స్టీము ఇంజను లాగా భగభగమని పొగ ఆకాశానికి పరిగెత్తి మేఘమై వర్షం కురిపిస్తుంది....' (పు. 141)

ఏమనాలి ఈ గడుసుదనాన్ని?

ఆపైన దేవుడితో తినడైలాగ్ ఒకటి చెబుతాడు.

“యేమనా! ఓ దేవుడా! నా మనస్సు ఇండిపెండెంట్‌గా సృజించావా! డిపెండెంటుగా సృజించావా!.... అక్కణ్ణించి నువ్వు తిరిగి వొచ్చేలోగా ఆరు ఘడియలు స్వర్గంలో నీ అధికారం నాకిస్తివట్టాయనా కొన్ని సృష్టిలో లోపాలు సవరణ చేస్తానంటాను....”

అలాంటి లోపాలు కొన్ని ఉన్నాయట
నెంబర్‌వన్-గిరీశంలాంటి అఖాజనుడైన మేష్టారుని సృష్టించటం. టూ-బుచ్చమ్మలాంటి బ్యూటిఫుల్ యంగ్‌గర్లుని విడోని చేయడం.

వ్యర్థంగా బోలెడంత సృష్టి చేశాడంటూ:

“పాలసముద్రం వుంటూ వుండగా మళ్ళీ పెరుగు సముద్రం నేతి సముద్రం యెందుకోయి? యిది ప్లియోనిజం. పునరుక్తి.”

ఈ అధిక ప్రసంగం ఎవరికి ప్రీతికరంగా వుంటుంది? వెంకటేశంలాంటి కుర్రాడికి. వాడికి బాగుపడాలని వుంది. ఏదో అభ్యుదయ మార్గంలో పడాలని వాడి ఆశ. అలాంటివాడికి గిరీశంలాంటి మాష్టారు చెప్పిన చదువు ఇది.

ఒకప్పుడు- 20వ శతాబ్దం తొలి దశకంలో కూడా బ్రాహ్మణ వర్గంలో ప్రధానంగా చదువుకున్న వాడంటే “నోటుబుక్కు తీసిరాయి: 1. రోయల్ రీడర్, 2. మాన్యూల్ గ్రామర్, 3. గోష్ జియామెట్రీ, 4. బాస్ ఆల్జీబ్రా, 5. శ్రీనివాసయ్యర్ అర్థమెటిక్”

మరొక్కటి కూడా వుంది. “కుప్పుస్వామయ్యర్ మేడ్ డిఫికల్టు.” సాహిత్యం కూడావుంది కాని ఎలాంటిదో చూడండి. “నలచరిత్ర, రాజశేఖర చరిత్ర, షెపర్డ్ జనరల్ ఇంగ్లీష్, వెంకటసుబ్బారావు మేడ్ ఈజీ '-(పు. 28)- అది ఆనాటి సగటు విద్యార్థికి సామగ్రి. అందుచేతే ఆ పాండిత్యంలో 'గిరీశం'చేసిన అధికపు ప్రసంగమే నాటకమంతా వినిపించేది.'అన్న వేదాల్లో ఉన్నాయష'అనే వాదస్తాన్ని తిరస్కరించిన వాడనేఅర్థం. అంతవరకు గిరీశంలో అభ్యుదయం కనిపిస్తోంది.

మరి శిష్యుడికి చేస్తున్న ఈ ద్రోహాన్ని ఏమనాలి!

“సాయంత్రానికి నీ తండ్రి వొచ్చేసరికి మాత్రం దీపం యెదట కూచుని పుస్తకం తిరగేస్తూ పులుసటుకులు ధ్యానంచెయి. ఇంగువవేసి బలే సొగసుగా తయారు చేస్తారు!” (పు. 142)

ఇలా శిష్యుణ్ణి వంచిస్తున్నాడని గుర్తించలేని వాడికి గిరీశంగారి మాటలు ఎంత బావుంటాయో! అలా గిరీశంపై పెంచుకున్న మరో అభాగ్యుడు శిష్యుడు (మహేశం) (చూ, పు. 48)

"అస్త్యుత్తరస్యాం - యీ శ్లోకం శుద్ధ అబద్ధంట. హిమాలయం రెండు సముద్రాలకి దొసి రూళ్ళకర్రలాగా లేదట - మ్యాపులో చూపించాడు.... ఈ పుస్తకం మీద నమ్మకం పోయింది. గిరీశంగారి నడిగి ఒక ఇంగ్లీషు పుస్తకం పట్టుకురానా!" (పు. 50)

బేకన్ విద్యా సంప్రదాయం ఆనాటి విద్యాతురుల మీద ఎంత ప్రభావాన్ని చూపిందో ఇతరత్రా మనం చూడవచ్చు. (చూ. కొత్తపల్లి వీరభద్రరావు 1960) ఆ ప్రభావం అటు గురజాడ మీదా వుందీ-ఇటు గిరీశం శిష్యుడి మీదా వుంది-అంచేతనే 'దుష్ట' పాత్రలో కూడా ఇంగ్లీషు విద్యవల్ల వచ్చిన కొత్త అవగాహనల్ని ఆయన తక్కువగా తీసి పారేయలేదు. గిరీశం ద్వారా అన్నీ 'చెడు' మాటలే అనిపించలేదు. ఎదుటివాణ్ణి బోల్తా కొట్టించడంలో భాగంగా ఒకోసారి అద్భుతమైన 'మానవత'ను గిరీశం ప్రదర్శిస్తాడు;

"యీడేమైనా సెల్లింగ్‌గర్ల్స్ - అనగా కన్యాశుల్కం - డామిట్ - యంతమాత్రమూ కూడదండి."

పై మాటల్లో వినయం వుంది. చాలా 'సిన్సియర్'గా అన్న మాటలాగే కనిపిస్తుంది. ఇలాంటివాళ్ళే గిరీశంలో కూడా మానవత్వపు లబ్‌డబ్‌లు వినిపిస్తాయని తిరుమలరావు గారి వంటివారు అనుకోవచ్చు.

అసలు గురజాడ 'మానవత'ను చూసిన దృష్టి మార్క్సిస్టు దృక్పథంకాదు-ఆదృష్టితో సమాజంలో రోగకారణం ఎక్కడుందో చూడకుండానే ట్రీట్‌మెంట్ మొదలుపెట్టాడాయన. కాని మనిషి 'కెరియరిస్ట్' ఎందుకవుతున్నాడో మార్క్సిస్టు అంచనాలకు అందుతుందనిపించడం లేదు. మార్క్స్ లెనిన్ మహాశయులూ దీన్ని గుర్తించలేదేమో! అందుకే గురజాడలాగే తిరుమలరావుగారూ ఏది 'మానవత' అన్న విషయంగా ఏమీ తేల్చకుండా రాసేశారు.

కన్యాశుల్కం వద్దనే వాడు 'బుచ్చమ్మ'ను గురించి ఏమంటున్నాడో చూడండి :

"....ఏమి దురవస్థ. మైహార్టు మెల్ట్స్. నేనే తండ్రినైతే యీ పిల్లకి విడోమ్యారియేజ్జేసి శాశ్వతమైన కీర్తి సంపాదిస్తును."

ఏమంటున్నాడో కూడా వినండి :

(తనలో) ఏమి చక్కదనం. యీ సొంపు ఎక్కడా చూళ్లేదే. పల్లెటూరు వూసు పోదనుకున్నాను గాని పెద్ద క్యాంపేనుకి అవకాశం కూడా దొరకడం నా అదృష్టం." (పు. 48)

విడోమారేజిని గురించి తపించినవాడు వీరేశలింగంగారు. తపన బాగానే వుంది. కాని పెళ్ళి - అంత సులభంగా జరుగుతోందా ! పెళ్ళిలో ముఖ్యంగా చూసేది అందం - విడోకయినా అదే ముఖ్యం. అందుకే శిష్యుడికి కూడా మాష్టారు ఇదే సలహా యిచ్చారు:

- "....మాంచి ఎర్రగా బుర్రగా వున్న యంగ్విడోని నువ్ పెళ్లాడకపోతే ఐషుడ్బి యషేమ్డావ్యూ" (పు.48) అని -

అంచేత విడో మారియేజి కూడు ననే గిరీశానికి ఓసారి అనిపించిందిట; అలాగే కన్యాశుల్కం కూడా (చూ. పు. 45 & 55)

దానికొకకుతర్కం కల్పిస్తాడు - బాల్యవివాహాలు లేకపోతే విధవలు ఏర్పడరు. విధవల్లేకపోతే విధవావివాహమన్న మహోద్యమం - తద్వారా సివిలిజేషన్ స్తంభించిపోతుంది. అంచేత బాల్య వివాహాలూ - కన్యాశుల్కము కూడా అవసరమే - అని చెప్పి సాధించినదేమిటి? అగ్నిహోత్రావధాన్ని 'పోకెట్'లో వేసుకోవటమే.

అంచేత గిరీశానికి సిద్ధాంతాలూగట్రా లేవు. వాడిమాటల్నినమ్మి బాగుపడ్డ వారెవ్వరూ లేరు. వాడు నాటకమంతటా ఇతరులచేత పనులు చేయించు కున్నాడుకాని, ఎవరికీ ఏమీచేసిపెట్టి ఎరగడు. అందుకే మధురవాణి ఇలా కీర్తిస్తోంది:

'గిరీశంగారు లోకోపకార పరులు' (పు. 255)

ఎక్కడా నిజంచెప్పి ఎరగుడు- అందుకే ఆమె ఇలా అన్నది.

'ఒకానొకరికి తప్పు' (పు. 253) - అని.

సౌజన్యారావు పద్ద ఎవరూ అబద్ధ మాడజాలరు. ఒకరు ఆడగలరు గిరీశంగారు.

ఇంకా మధురవాణి ఇచ్చిన కితాబులివి.

'ఒకానొకరు లేని మంచిని కూడా వున్నట్లు ప్రచుర పరచి లోకాన్ని భ్రమింపజేస్తారు. (పు. 254)

'నటనవల్ల కొద్దికాలమే లోకానికి కళ్ళు కప్పవచ్చునుగాని, నిడివి మీద బంగారాన్నీ, యిత్తడినీ లోకం యేర్పేస్తుందండి' అంటూ (పుట. 255)

గిరీశంగారితో 'ఏమంటారు' అంది.

ఇక్కడ కెరియరిస్టు స్వభావం ప్రధానమైన మరో లక్షణం కనిపిస్తుంది. అది మాట మార్చటం : అదొక బ్రహ్మాండమైన శిల్పం. అందరిచేతా కాని పని.

'పంతులుగారికి నిద్రాభంగమవుతుంది. మీరు వచ్చిన పనేదో' (పు. 255)

ఇక మధురవాణి ఏం మాట్లాడుతుంది ! ఎవరైనా సరే - ఆశిల్పం ముందు తల వంచాల్సిందే.

మరొకటి కూడావుంది. అది విననట్టునటించడం చెవిటి తనాన్ని అభినయించటమన్న మాట (మొదటి అంకంలో మొదటి స్థలంలో బంట్రోతుతో గిరీశం నటన ఇదే.)

ఇవన్నీ ఆపదలో తప్పించుకోవటానికి చక్కటి ఉపాయాలు. అంచేతే రామప్పంతుల్ని ఇటుజరిపి అటుగోడవైపుగా మధురవాణి మంచం కింద దాక్కోగలిగాడు (పు. 38) - పూటకూళ్ళమ్మ మంచం కింద దూరితే పైకివచ్చి రామప్పంతుల తలమీద చరిచి లఘువేసి పారిపోయాడు. ఈ పోవటం బుచ్చమ్మతో లేచిపోయేదాకా అలానే సాగిపోయింది.

గిరీశాన్ని ఎవడూ పట్టుకోలేడు. పట్టుకున్నా ఆముదం రాసుకున్న కొయ్యదిమ్మను ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు.

తన వేషం ఎలాంటిదో తానే నిర్వచించుకున్నాడు కూడా: అనుకోడాలు పనికిరావోయి బావా ! మనం ఏదైనా వేషం వేశామంటే ఒకడు చూస్తున్నాడని అనుకున్నప్పుడూ ఒకడు చూస్తూవుండ లేదను కున్నప్పుడూ కూడా, పొక్కమోస్తరుగా వేషం నడిపిస్తే 'సేఫ్‌సైడ్' (పు. 189)

ఇది ఎంత భయంకరమైన నిత్య సత్యమో అలాంటి గిరీశాలతో దెబ్బతిన్న వ్యక్తులకే తెలుస్తుంది. సంపూర్ణమైన 'ఆత్మ ద్రోహం' అంటే ఇదేమరి. మరి ఇలాంటి ఘటం చెయ్యలేని పని ఏముంటుంది!

అందుకే బుచ్చమ్మను దక్కించుకున్నా అంతటితో 'ఉద్యోగ' ప్రయత్నం ఆపలేదు. లుబ్ధను బుట్టలో వేసుకోడానికి బయల్దేరాడు. సౌజన్యారావునే గాలంలోకి దించే సమయంలో మధురవాణి అడ్డు పడబట్టి సరిపోయింది కాని లేకపోతే అక్కడ కూడా విజయుడై పోయేవాడే(చూ. తిరుమలరావు 1974) అని గిరీశం ఆత్మ ఈనాటికి ఘోషిస్తూనే వుందిట. (చూ. గిరీశం స్వగతం. రేడియో ఏకపాత్రాభినయం. 1972) అందుకే ఎప్పుడూ ఏదీ 'వద్దని' అనకపోవటమే కెరియరిస్టు కున్న 'యాంబిషన్‌కి' నిదర్శనం :

'యిచ్చినాసరే యివ్వకపోయినా సరేనండి (బహుమతి)' పు (59)

ఇన్ని సంఘర్షణలతో సతమతమవుతున్న వాడిబుర్రకువిశ్రాంతి ఎలామరి! అందుకోసం పుట్టిందే వాడిలో కవిత్వం- అది ఒక విచిత్ర ఊహాలోకం: ఊరిస్తూవుంటుంది. ఎదుటిమనిషిని 'మంచు' ముద్దపై కూర్చోబెట్టడమని ముందు చెప్పింది దీన్నే.

"ఏకాలానికి మనసు యలా ఉండునో! అప్పుడు కాలుజారిన తరువాత నువ్వు ఏమనుకుంటావు! అయ్యో నాడు గిరీశాన్ని శాస్త్రోక్తంగా పెండ్లాడి పునిస్త్రీ నయిపోతే పిల్లాపీకా గలిగి అష్టైశ్వర్యంతో తులతూగుదునుగదా! యీ దురవస్థ నాకు రాకపోవునుగదా "అనివిచారిస్తావు" (పు. 145)

ఈ మాటలువిని ఎవరు బోల్తాపడరు చెప్పండి. ఇదే 'ఆషాఢభూతి' లక్షణం. పంచతంత్ర కథల్లో గురువుని మోసగించాడు. ఇక్కడ సమాజాన్ని మోసగిస్తున్నాడు.

కాని అవసరమైతే తక్కున 'విలన్'గా మారిపోవడమూ ఇలాంటి వ్యక్తులకు చెల్లినవిషయమే; మృచ్ఛకటికంలోని శకార లక్షణం ఇదే:

"అసిరీ ! నాదెబ్బ నీకు తెలుసును.... పీక నులిమేసి నిన్ను నూతిలో పారేస్తాను" (పు. 244)

అందుకే ఈనాటి చలన చిత్రాల్లో ఒక బ్రహ్మాండమైన మార్పు వచ్చింది చూడండి. ముందు 'విలన్' వేష భాషల్లో 'హీరో' కన్నా వేరుగా వుండేవాడు. ఈనాడు అలాలేదు. వాడు యూనివర్సిటీ ప్రొఫెసరూ కావచ్చు — ఖద్దరు టోపీధారీ కావచ్చు— లేదా సంఘ సేవకుడూ కావచ్చు.— వీరికి తొలిరూపం 'గిరీశం.'

శ్రీశ్రీగారు అన్నట్టు అది బ్రహ్మాండమైన ట్రాజెడీయే, కాని వారు గుర్తించిన అగ్నిహోత్రావధాన్యాది 'శిష్టు' లతోపాటు 'గిరీశం' గారి 'దుష్ట' పాత్రనుకూడా మనం గుర్తించాలి— ఆ కరాళ నృత్యం చేసిన అవధానులూ— పంతుళ్ళూ— పోయినా' గిరీశం' గార్కు మాత్రం ఇంకా బ్రతికే వున్నారు. నిక్షేపంగా సాగిపోతున్నాడు. బిరుదులు తగిలించుకుంటున్నాడు. పరమపద సోపానపటం చకచకా ఎక్కిపోతూనేవున్నాడు. కారణం ధూర్తలక్షణమైన 'అతి వినయం.'

కెరియరిస్టుకి వున్న 'అతి వినయం' పొందే అభివ్యక్తి నాన్యతో దర్శనీయ వైచిత్రి కల్గింది:

'(నాపేరు) గిరీశం అంటారండి,'(పు. 58)

'యీగోద స్పష్టంగా మీదాన్లాగే కనబడుతూంది'(పు. 60)

'మామగార్కి నమస్కారం' (పు. 254)

'నేనే ఆ చెడ్డవాణ్ణి అనుకోండి'

వాడి మాటల్లో ఒక 'పట్టు' వుంటుంది. అందుకే గిరీశం మాటలు కన్యాశుల్కంలో నుంచి లోకంలోకి జారిపడ్డవి బోలెడున్నాయి. కొన్ని చూపెడతాను:

'అట్నుంచి' నరుక్కు రమ్మన్నాడు' (పు. 24)

'నాతో మాటాడ్డమే ఒక ఎడ్యుకేషన్'(పు. 24)

'నిన్ను సురేంద్రనాథ్ బానర్జీ అంత గొప్ప వణ్ణి చేస్తైను (పు. 27)

'రేప్పొద్దున్న ఇవ్వకపోతే మాలవాడి కొడుకు చండాలుడు' (పు. 28)

'ఇన్నాళ్ళకి జంఝప్పోస వినియోగంలోకి వచ్చింది' (పు. 28)

'నా పేరు గిరీశమే - నినద భీషణ శంఖముదేవదత్తమే' (పు. 38)

'నువ్వులేం జాగర్త చేశారా !' (పు. 35)

'ఒపీనియన్సు అప్పుడప్పుడూ ఛేంజి చేస్తుంటేనేగాని పొలిటీషను కానేరడు' (పు. 54)

'ట్రూరిపెంటెన్సు ట్వెంటీ ఫోరవర్సు చాలదా అండీ' (పు.257) అన్నిటి కన్నా ప్రసిద్ధంగా గురజాడ ఆలోచనా విధానానికి పర్యాయంగా మిగిలిపోయిన మాట :

'మనవాళ్ళు ఒట్టి వెధవాయలోయ్' (పు.25) అన్నది.

* * *

ఈ వ్యాసం ముగించే ముందు చర్చించాల్సిన అంశం గురజాడ ఎందుకు గిరీశాన్ని అంత ప్రాణవంతమైన పాత్రగా చిత్రించాడు ! వాణ్ణి ఎందుకు శిక్షించలేదు ! అన్నది.

గురజాడ కాదు కదా ! సాక్షాత్తు బ్రహ్మదేవుడు కూడా వాణ్ణి ఏమీచెయ్యలేడు. తిరుమలరావుగారి విమర్శ ఇది.

"మనకు సరిపోనివారిని కాన్‌సన్‌ట్రేషన్ క్యాంప్‌లో వేయగలమా ! వారికినిలోకమందు స్వచ్ఛందమైన ఉనికి కలదు— ఉనికి కధికారముగలదు." (పు. 81)

అని ఒప్పుకోవటం గురజాడ కూడా అంగీకరించాడనుకుంటే ఆయన నాటకంలో ఏ సామాజిక ప్రయోజనాన్ని ఆశించాడో అది విరుద్ధంగా పరిణమించిందని అంగీకరించాల్సివస్తుంది

"గిరీశం దేవాలయముల మీది బూతుబొమ్మల వంటి దిష్టిబొమ్మ" (పు. 7)

అనికూడా తిరుమలరావు గారంటున్నారు. దేవాలయాల మీద బూతుబొమ్మలు లేవు బాబోయ్ ! అంటూ భారతీయ కళా సరస్వతి ఆనందకుమారస్వామి ఉద్ఘోషించినా (చూ. తుమ్మపూడి కోటేశ్వరరావు 1976, 1980) తిరుమలరావుగారు ఇలా రాయటం 'గిరీశం' పాత్రను గురించిన సరైనఅవగాహనను కల్గించదు.

మరి ఈ గిరీశం ఎక్కడినుంచి ఊడి పడ్డాడు? ఈ ప్రశ్నను గురించి ఒక అంశం సూచిస్తూ ఈ వ్యాసాన్ని ఆపేస్తాను.

నాటకం రెండో ప్రతి తయారయ్యేటప్పటికి గురజాడను ఆకర్షించిన పాత్రలు రెండే గిరీశం- మధురవాణి

'మొగవాడి కయినా ఆడదానికయినా నీతి వుండాలి' (పు.29)- అంచేత మధురవాణి యిష్టమయింది- బాగుంది.

కాని గిరీశం పాత్రలో గురజాడ ఏ అంశంచేత ఆకర్షింపబడ్డాడని?- 'రచన'కు సంబంధించింది తప్పా- పాత్ర స్వభావం మీద ప్రేమకాదని- తిరుమలరావు గారు (పు.7) అన్నా అది సహేతుకంగా లేదు. ప్రధానంగా కథతో ఏసంబంధమూ లేని పాత్రను అంతగా మెచ్చుకుంటూ జవజీవాలుపోస్తూ పెంచితే నాటకాంతంలో నైనా 'కాటు వెయ్యడూ!'

అంచేతే మొదటి అంకంలో అంతంలో- చివరి అంకంలో చివరా- ఆ పాత్ర దాదాపు ఒకేలాగా మాట్లాడుతుంది.

'ఇక మధురవాణి ఇంటికి వెళదాం. మేక్ హే వైల్ ది సన్ షైన్స్ అన్నాడు' (పు. 29)

'డా'మిట్! కథ అడ్డంగా తిరిగింది' (పు. 257)

అంటూ గుమ్మం దాటిపోయాడు- ఈ తప్పించుకు పోవటం తప్పిందికాదు. అయినా కిందబడ్డా పై చేయి తనదేనన్న 'ధీమా' నటిస్తూ సాగిపోయాడు. ఆద్యంతాల్లో ఈ పాత్ర గురజాడ మనః కార్మికశాల నుంచి పుట్టినవాడు కాకపోతే ఎందుకు ప్రవేశం చాడని!

ఇక్కడే మనం కళారూపాల్లో రచయిత- కళాకారుడు- అప్రయత్నంగా తమనిగూఢ రూపాలతో ఎలాప్రవేశిస్తారో గుర్తించాల్సి వుంది. వేయిపడగల్లో విశ్వనాధ సత్యనారాయణ గారు ధర్మారావులో వున్నాడని చాలామంది అంటారు. జీవిత ప్రతి ఫలనమూ ఉంది కాబట్టి అక్కడ చెల్లిపోయింది.

కాని రామాయణ కల్పవృక్షంలో 'రావణాసురుడిలో ఉన్నాడాయన. ఈ మాట చాలా ఆలోచించి అంటున్నదే. వేరేగా రాయదగిందికూడా! రాముడిపాత్రలో లేదే మరి- అంటే- రచనవేళలో రచయిత వైయక్తిక విశ్వజనీన చిత్త వృత్తులకు సమన్వయ భూమికగా తయరవుతాడు. కల్పవృక్షంలో 'జీవుడివేదన' ప్రధానం. అలా రామాయణంలో ఘోషించిన భక్తులు శబరి- గుహుడు- హనుమ. కామమోహాదుల్తో తపించి తరించిన శివభక్తుడు అయరావణుడు- ఇటు విశ్వనాధ.

అలాంటి ప్రవేశం గిరీశంలో గురజాడ చేశాడు- అంచేత నైతిక వర్తన విషయంలో గిరీశాని కంటె ఫక్తు వ్యతిరేక మార్గంలో పోనెందినా తాత్త్విక- వస్తు- విచారణ పరిధిలో గురజాడ=గిరీశం.

అంచేతనే గిరీశంనోట బోలెడన్ని అభ్యుదయ కరమైన చర్యలు చేయించాడు. కొండు భట్టీయం రాస్తున్న రాజులలోకూడా (1909) గిరీశం తాలూకు 'స్పంద' ధర్మం గురజాడలో ఇంకా విచికిత్సను కల్గిస్తూనే వుంది. బియె పాసై గిరీశం సంస్కారోద్యమ 'కెప్టాను'గా మారినా 'వేషాలబుద్ధి' మాత్రం పోలేదు. ఆ నాటకం పూర్తికాలేదు! ఎలా పూర్తవుతుంది.! ఈ నాటకానికి సమాప్తి ఏముంది కాబట్టి!

జీవితాన్ని యథాతథంగా కలంలోకి దించడమే ఆయన నాటక శిల్పం: కన్యాశుల్కంలోని పాత్రల నడుమ ఉన్న సంఘర్షణకు ప్రతీక గిరీశం=గురజాడ.అందుకే కన్యాశుల్కానికి హీరోలేడు ఉంటే గురజాడే కావాలి. (తిరుమలరావు ఈ సిద్ధాంతం రాశాడుకూడా). రంగం మీద ఉన్నా గిరీశం గురజాడ చెప్పదలుచుకున్న అభ్యుదయ వాదాన్ని ప్రకటించే అనేక పాత్రల్లో ఒక పాత్రగా అప్రధానత పొందాడు.

వాస్తవిక కళారూపంగా కన్యాశుల్కం మనకు మిగిలిన ఏకైక నాటకం. తర్వాతకూడా ఈనాటివరకు అంత 'ఎపిక్ స్కోప్' (కట్ట మంచివారి మాటఇది) ఉన్న నాటకం రాలేదు. ఎపిక్‌-లో మాత్రమే రచయిత కళారూపంలో ఒకానొక స్థాయిలో అద్వైతమైన స్థితిని పొందుతాడు- తర్వాత ఆ రచయిత ఏమీ రచించలేడు- రచించినా కాల గర్భంలో కలిసిపోతాయి.

అంచేతనే గిరీశం పాత్రలో గురజాడ అభిరమణం పొందాడు. ఆ తాదాత్మ్యాన్ని ఆధారంగా పుల్లయ్యగారు రామారావుగారితో సినిమా తీసి 'హీరో'గా నిలబెట్ట చూసినా- సినిమా 'విజయవంత' మయిందని మనం అంగీకరించడం లేదు.

కడకి గురజాడ కూడా కెరియరిస్టేనా! అని అంటారేమో! బ్రతక నేర్వడం తెలియనివాడు ఎవడో 'నక్సలైటు' వంటి నిస్వార్థజీవి తప్ప అటు విశ్వనాథకాని- ఇటు గురజాడ కాని కడకు ఈ వ్యాస రచయిత వంటి ఎంతోమందికాని ఈ విద్య తెలియనివారుకారు కాకపోతే తరతమ భేదాలంతే. అందులోనూ విజయనగరం మహారాజుల 'సేవ' అలాంటిది. వారి డైరీలు- ఉత్తరాలు- ఈ విషయానికి ప్రబల తార్కాణాలు.

అందుకే ఈనాడు గురజాడ ప్రభృతుల్ని అంతర్జాతీయ బూర్జువా మేధావులని పిలుస్తున్నాం- ఆనాటికి అంతమాత్రం ఎదగటమే 'మహోదయం'. ఆ ఉదయాన్ని అంటిపెట్టుకున్న తమస్సు గిరీశం. జీవితంలో కూడా చీకటి వెలుగులు ఒకదాన్ని విడిచి మరోటి ఉండవని 'మానవతా' దృష్టితో గిరీశాన్ని (సౌజన్యారావు=గురజాడలోని మానవత) క్షమించి వదిలేసినా లోకం తిడుతూనే వుంది. గిరీశాన్ని అలా చిత్రిండడంలోనే గురజాడవారి 'నిజాయితీ' వుంది. వాస్తవిక కళకు ఇంతకన్నా నిర్వచనం ఎక్కడా దొరకదు. అందుకే 'గిరీశం' పాత్రను పోలినపాత్ర ప్రాచ్యపాశ్చాత్య కళారూపాల్లో ఎక్కడాలేదు.

రిఫరెన్సులు

అప్పారావు, గురజాడ, వెంకట.	'కన్యాశుల్కం' (1897), ఎమెస్కో ప్రచురణ (1977)
—	'కొండుభట్టియం' (బిల్హణీయంతో కలిపి) విశాలాంధ్ర ప్రచురణం. 1954 (పునః 1976)
—	'వ్యాస చంద్రిక', విశాలాంధ్ర ప్రచురణ (1953) (పునః 1962)
కోటీశ్వరరావు, తుమ్మపూడి	'రసజ్ఞుడు' ఎస్. వి. యు ఓరియంటల్ జర్నల్ (1976)
—	'శిల్ప భూమిక' రాచపాళెం చంద్ర శేఖర రెడ్డి 'శిల్ప ప్రభావతికి' తిరాసిన పీఠిక (1980)
తిరుమలరావు, సర్దేశాయి	'కన్యాశుల్క నాటక కళ', స్వీయ ప్రచురణ అనంతపురం (1974) ['గిరీశం స్వగతం' అన్న రేడియో కార్యక్రమ ప్రస్తావన అందులో చూసుకోవచ్చు]
రమణారెడ్డి, కె. వి	'మహోదయం', విశాలాంధ్ర ప్రచురణ (1969)
వీరభద్రరావు, కొత్తపల్లి	'తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము', స్వీయ (1960)
శ్రీ శ్రీ	'సెల్యులాయిడ్‌లో కన్యాశుల్కం', గురజాడ(లో) (1959),విశాలాంధ్ర ప్రచురణ (1967)
ఎస్. ఎస్. సి. ప్రచురణ	'ప్రజాస్వామిక సంస్కృతి- కందుకూరి, గురజాడల దోహదం', కావలి (1980)

ది డెత్

శ్రీ కావూరు పాపయ్యాశాస్త్రి

నా కళ్ళు సరిగా
తెరిపిళ్ళు పడకుండానే!
నా స్వరపేటిక తొలిసారిగా
పురిటి గదిని రోదన ధ్వనులతో నింపకుండానే!
నన్ను ఏదో అదృశ్య శక్తి
వెన్నాడటం మొదలైంది మెల్లగా!
నా గుండెల సవ్వడిలో
తన అడుగుల చప్పుడును మేళవించి
నా శ్వాసా స్పందనలో
తన నిశ్శబ్దమైన కదలికలను కలగలిపి
నను కడవరకు వీడని నీడలా!
నా నిజమైన జీవన సహచరుడిలా!
నా వెనుక మౌనంగా
ఎవరో తరుముకు వస్తున్న సవ్వడి!
రాలుతున్న పండుటాకువైపు
జాలిగా నేను చూస్తున్నపుడు!
నూనె యింకిన దీపానికి
మౌనంగా సానుభూతి తెలిపినప్పుడు!

తీరం చేరి విరిగి పడిన అలలను చూసి
భారంగా నేను నిశ్వసిస్తున్నపుడు!
నా వెనుక ఎవరో సన్నగా
నవ్వుతున్నట్లు అనిపిస్తుంది అపహాస్యంగా!
ఏదో సార్వకాలిక సత్యాన్ని
ఎదలోతులలోకి ఊదినట్లనిపిస్తుంది రహస్యంగా!
నా వెనుక శూన్యంలో నిరంతరం
ధనుర్విముక్త నారాచ నిస్వనం!
నా ప్రాణ విహంగం భయంగా
నలుదిక్కులకు చూచినపుడు మాత్రం
ఏ అలికిడీ లేని నీరవం!
అవిశ్రాంత జీవన మార్గాయానంతో నేను
అలసి సొలసి నిలువక తప్పదు!
అను క్షణం నను వేటాడే
ఆ అదృశ్య శక్తికి ఎప్పుడో చిక్కక తప్పదు!
ప్రతి ప్రాణికి ఈ ఓటమి తథ్యం!
ఇది జీవన నిత్య సత్యం!

★★★

శ్రీ బి. రాజవర్ధి
శ్రీ బి. సదానందరావు
శ్రీమతి జి. శశికళ

భారతదేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థల పాత్ర

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి ప్రభుత్వ రంగం పాత్ర అంతగా లేదు. ప్రస్తుతము ప్రభుత్వరంగం ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర వహిస్తున్నది. ప్రభుత్వము ప్రజలకు సేవలను అందించుటకు, ఖర్చుకు తగిన రాబడిని సంపాదించుటకు సరియైన పంపిణీని సాధించుటకు కొన్ని ప్రభుత్వ సంస్థలను చేపట్టును. అనగా ప్రభుత్వమే సంబంధిత సంస్థలను స్థాపించి, తక్కువ లాభంరేటుతో ప్రజలకు వస్తు, సేవలను అందించుటకు ప్రయత్నించును. అంతే కాకుండ అభివృద్ధి శక్తులను పోషించి. అభివృద్ధి వేగాన్ని నిర్ణయించే కొన్ని కీలకరంగాలు ప్రభుత్వ యాజమాన్యం క్రింద ఉండుటకు గాను ప్రభుత్వరంగ సంస్థలు ప్రారంభించబడినవి. 1954 సంవత్సరంలో "సామ్యవాద సమాజ స్థాపన" ఆర్థిక, సాంఘిక విధానానికి లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించుట వలన ఆర్థికరంగంలో ప్రభుత్వరంగం పాత్ర అధికమైంది. 1948, 1956 సంవత్సరాల పారిశ్రామిక తీర్మానాలు ప్రభుత్వరంగం పరిధిని ఇంకా విస్తృత పరచినవి. భారతదేశం మౌలికంగా మిశ్రమ ఆర్థిక విధానాన్నే అవలంబించే మిశ్రమ ఆర్థి వ్యవస్థను కలిగిఉన్న ప్రభుత్వం కాబట్టి ఎన్నో విధులను నిర్వహించ వలసిన ఆవశ్యకత ఏర్పడింది. తత్ఫలితంగా వివిధ పరిశ్రమలను. వాణిజ్య వ్యాపార సంస్థలను ప్రభుత్వ ఆధీనంలో ఉంచవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అందుకు గల ప్రధాన కారణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును,

1. నిత్యావసర వస్తువుల విషయంలో ఎక్కువ సప్లయ్ ఉండి, విచక్షణాయుత ధరలు అమలులో ఉండకూడదనే వినియోగదారుల అభిప్రాయము.

2. వినియోగ వస్తువుల తప్పనిసరిగా మన్నిక కలిగిఉండ వలెననే అభిరుచి పెరుగుట.

3. ఉన్నటువంటి కొరత వనరులను దుబారా వినియోగం చేయ కుండ, సరియగు ఉపయోగ కార్యక్రమాలకు మళ్ళించి, ప్రస్తుత, భవిష్యత్ తరాల వారికి సరియైన ఫలితాలు ఇవ్వవలెననే జాతీయ లక్ష్యము.

4. శ్రామికుల ఆరోగ్య, ఉద్యోగ రక్షణ చేయుట మరియు వాతావరణ జలకాలుష్యాల నుండి వ్యక్తుల శ్రేయస్సును రక్షించుట.

5. ప్రైవేట్ పెట్టుబడిదారులు లాభాపేక్షతో ఆర్థిక కార్య కలాపాలు సాగిస్తూ ఉంటారు. కాని సాంఘిక ప్రతిఫలం ఇచ్చే కార్య కలాపాలమీద పెట్టుబడి పెట్టడం జరుగదు. అందువలన సాంఘిక ప్రతిఫలాల నిచ్చే పెట్టుబడులు పెట్టుటకు ప్రభుత్వమే ముందుకు రావలెను.

6. 1954 సంవత్సరంలో మన ప్రభుత్వం సామ్యవాదరీతి సమాజ స్థాపనే ఆర్థిక విధానానికి లక్ష్యంగా ప్రకటించింది. అందువలన అభివృద్ధి ప్రణాళికా బద్ధంగా ఉండవలసిన అవసరమున్నప్పుడు ప్రాముఖ్యం ఉన్న మౌలిక పరిశ్రమలను, ప్రజోపయోగంగా ఉండే పరిశ్రమలు ఆ విధంగానే ప్రభుత్వం మాత్రమే భరించే పెట్టుబడి కావలసిన పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో ఉండక తప్పదు.

ప్రభుత్వరంగ సంస్థలు ఉత్పత్తులను, ఆదాయాలను, అభివృద్ధి వేగం చేస్తూ దేశ ఆర్థిక విధానంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. ప్రభుత్వరంగం పరిశ్రమల స్థాపన విషయంలో భారత ప్రభుత్వం ఈ క్రింది అంశాలను తన ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించింది.

1. క్రొత్త, క్రొత్త పరిశ్రమలను నెలకొల్పి, ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పరచుట.

2. ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించుట.

3. ప్రాంతీయ అసమానతలు తొలగించుట.

4. దేశ ఆర్థిక సంపద కొద్దిమంది చేతులలో కేంద్రీకృతం కాకుండ నిరోధించుట, తద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించుట.

5. వివిధ ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించుట ద్వారా ఉద్యోగ అవకాశాలను పెంపొందించుట.

6. ఎగుమతులను పెంచి అధిక విదేశీ కరెన్సీ సంపాదించుట.

7. సాంకేతిక అభివృద్ధి ద్వారా స్వయం సమృద్ధిని చేరుకొనుట.

8. సమాజంలో ఉన్న బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక జీవన ప్రమాణాన్ని పెంపొందించుట.

ప్రభుత్వరంగ సంస్థల రకాలు

1. డిపార్ట్‌మెంట్ సంస్థలు

ప్రభుత్వరంగ సంస్థలలో ఉన్నటువంటి రకాలలో ఈ విధానం చాలా సాంప్రదాయకమైనది. ఇదిచాలా కాలం నుండి వాడుకలో ఉన్నటువంటి పద్ధతి. ఈ సంస్థలను ప్రభుత్వశాఖలు నిర్వహించుతాయి. మనదేశంలో ఉన్న రైల్వేలు, పోస్టు-టెలిగ్రాఫ్, అణుశక్తి, రక్షణ మున్నగునవి డిపార్ట్‌మెంట్ సంస్థలను ఉదాహరణంగా చెప్పవచ్చు. ఇవి ప్రభుత్వ శాఖలు కావటంవలన బడ్జెట్ నియంత్రణకు లోబడి ఉంటాయి. ఈ సంస్థలు మంత్రిత్వశాఖల నిర్వహణలో ఉండటం మూలంగా ఆయా శాఖల మంత్రులు పార్లమెంటుకు బాధ్యతగా ఉండవలసి ఉంటుంది. అంతే కాకుండ పార్లమెంటులో సభ్యులు వేసిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు చెప్పవలసి ఉండును.

2. పబ్లిక్ కార్పొరేషన్లు

ఈ కార్పొరేషన్లు ప్రత్యేక చట్టం ఫలితంగా ఏర్పడును. కార్పొరేషన్ వ్యవహారాలను నిర్వహించుటకు ప్రత్యేకమగు బోర్డును నియమించును. ఈ కార్పొరేషన్లు ద్రవ్య వసతులు సమకూర్చటంలో పూర్తి స్వాతంత్ర్యాన్ని కలిగిఉంటాయి. వీటి అంతరంగిక విషయాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోదు. ప్రభుత్వ సివిల్ ఉద్యోగుల పరిధిలోకి కార్పొరేషన్ ఉద్యోగులు లెక్కించబడరు.

మనదేశంలో చాలా కార్పొరేషన్లు కేంద్ర శాసనాల ద్వారాను, రాష్ట్ర శాసనాల ద్వారాను నెలకొల్పుట జరిగింది. భారతదేశంలో మొట్టమొదటి సారిగా దామోదర్‌వ్యాలీ కార్పొరేషన్ ప్రారంభించబడింది. భారతఆహారసంస్థ, లైఫ్‌ఇన్సూరెన్స్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేచురల్ గ్యాస్ కమీషన్, ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్ లాంటి ప్రధాన సంస్థలు కేంద్ర శాసనాల ద్వారా రూపొందించబడినవి. రాష్ట్ర శాసనాల ద్వారా రోడ్డు రవాణా సంస్థలు ఎలక్ట్రిసిటీ, బోర్డులు' ఫైనాన్స్ కార్పొరేషన్లు స్థాపించ బడినవి.

3. జాయింట్ స్టాక్ కంపెనీలు

భారతీయ కంపెనీల చట్టం 1956 ప్రకారం జాయింట్ స్టాక్ కంపెనీలు స్థాపించబడినవి. జాయింట్ స్టాక్ కంపెనీలను పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ మరియు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలుగా విభజించవచ్చును. జాయింట్ కంపెనీలలో వాటాలన్నియు ప్రభుత్వమే తీసుకోవచ్చు లేదా అత్యధికవాటాలు ఉండవచ్చు. కంపెనీల చట్టంప్రకారం మూలధనంలో 51శాతం తక్కువ కాకుండ ప్రభుత్వపరమై ఉన్న కంపెనీలను ప్రభుత్వ కంపెనీలు అనిచెప్పవచ్చు. అందుకు ఉదాహరణంగా హిందుస్తాన్ మెషిన్ టూల్స్, హిందుస్తాన్ స్టీల్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ మున్నగు సంస్థలను పేర్కొనవచ్చు.

పైవిధంగా నేడు ప్రభుత్వరంగ సంస్థలు రూపొందినాయి. పైన పేర్కొనబడిన మూడేకాకుండ హోల్డింగ్‌కంపెనీ ప్రతిపాదన ప్రభుత్వరంగ సంస్థలలో ఇటీవల పరిమాణం. దీనినే పాలన సంస్కరణ సంఘంవిభాగ కార్పొరేషన్‌లుగా నిర్వచించుట జరిగింది. "ఒక ప్రత్యేక ప్రభుత్వరంగంలో ఒకే విధి స్వభావాన్ని కలిగిఉండి వేరువేరుగా పని చేస్తున్న వివిధ యూనిట్లను ఒకే అధికారం క్రింద నిర్వహించటం"ను విభాగ కార్పొరేషన్ అని చెప్పవచ్చు. అందుకు ఉదాహరణంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, కోల్ ఇండియా లిమిటెడ్‌ను పేర్కొనవచ్చు.

మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలలో మూలధనం మరియు పెట్టుబడి అధిక పరిమాణంలో ఉంది. మొదటి పంచవర్ష ప్రణాళిక ఆరంభంలో 29కోట్ల విలువగల 5సంస్థలు మాత్రమే ప్రభుత్వ అధీనంలో ఉండేవి. 1983మార్చి 31వతేదీ వరకు ప్రభుత్వరంగ సంస్థలయొక్క సంఖ్య 205కు పెరిగింది. పెట్టుబడులు రూ. 30, 039 కోట్లకు పెరుగుట జరిగింది. ఉక్కు, భారీయంత్రాలు, రసాయనాలు, మందులు మున్నగు వాటిల్లో ఎక్కువ పెట్టుబడి జరిగింది. ఈక్రింది పట్టికద్వారా ప్రభుత్వరంగ సంస్థలయందు పెట్టుబడి పెరుగుదలను తెలుసుకోవచ్చు.

ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడి

కాలం	మొత్తం పెట్టుబడి కోట్లలో	సంస్థలసంఖ్య
మొదటి ప్రణాళిక ఆరంభించే నాటికి (ఏప్రిల్. 1951)	29	5
రెండవ ప్రణాళిక ,, ,,	81	21
మూడవ ప్రణాళిక ,, ,,	953	48
మూడవ ప్రణాళిక అంతానికి	2415	73
నాల్గవ ప్రణాళిక ఆరంభించే నాటికి.	3902	54
ఐదవ ప్రణాళిక ,, ,, ,,	6237	122
ఐదవ ప్రణాళిక అంతానికి (31-3-1979) నాటికి	15602	176
ఆరవ ప్రణాళిక ఆరంభించే నాటికి (1-4-1980)	18225	186
31-3-1981 నాటికి	21102	195
31-3-1982 నాటికి	24706	203
31-3-1983 నాటికి	30039	205

ఆధారము :- 1. ఇండియా. 1983

2. 31-3-1983 నాటికి సంబంధించిన సంఖ్యలు పార్లమెంట్ నందు 1984 ఫిబ్రవరి 28వ తేదీన పబ్లిక్ సెక్టార్ సర్వేగురించి సమర్పించిన నివేదిక ఆధారంగా.

3. పైపట్టికలో రైల్వేలు, పోస్టల్ శాఖల పెట్టుబడులు చేర్చబడలేదు.

పై పట్టికను పరిశీలించినట్లయితే ప్రతి సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడి అభిలషణీయమైన స్థాయిలో పెరుగుతున్నట్లు స్పష్టమగుచున్నది. ప్రభుత్వరంగ సంస్థలలో ఉక్కు పరిశ్రమలకు అధిక పెట్టుబడి పెట్టడం జరిగింది. మొత్తం పెట్టుబడిలో ఉక్కుకు 19.28శాతం కేటాయించుట జరిగింది. అటు పిదప స్థానాలు మందులు, ఎరువులు, రసాయనాలు (14.43శాతం), బొగ్గు (11శాతం) ఆక్రమిస్తున్నాయి. ఈ పెట్టుబడులే కాకుండ రైల్వేలలో రూ. 8164కోట్లు, కమ్యూనికేషన్ రంగంలో రూ. 2779కోట్లు పెట్టుబడి పెట్టడం జరిగింది. కేంద్రపబ్లిక్ రంగంలో ఈ పెట్టుబడులే కాకుండ రాష్ట్రపబ్లిక్ రంగంలో కూడ పెట్టుబడులు పెట్టడం జరిగింది: 1982-83వరకు రాష్ట్రరవాణా సంస్థలు, విద్యుచ్ఛక్తి బోర్డులతో కూడ కలుపుకొని మొత్తం రాష్ట్ర పబ్లిక్‌రంగంలో రూ. 27000కోట్లు పెట్టుబడి పెట్టడం జరిగింది.

సంవత్సరం	నిర్దిష్టవస్తువుల ఎగుమతి (కోట్ల రూ. లు)	అనిర్దిష్టవస్తువుల ఎగుమతి (కోట్ల రూ. లు)	సేవల ఎగుమతి (కోట్ల రూ. లు)	మొత్తం	అంతకుముందు సంవత్సరం కన్న పెరుగుదల శాతం
1978-'79	723.12	465.65	645.39	1834.16	17.44
1979-'80	753.82	385.34	773:82	1912: 98	4.30
1980-'81	680.65	727.93	829.97	1216.75	15.88
1981-'82	611.99	1110.99	1033.70	2755.70	24.32
1983-'83	651.31	2737.45	1395.01	4693.77	79.32

ఎగుమతుల ఆదాయం

ప్రభుత్వరంగ సంస్థలు ఎగుమతులలో అధిక ప్రాధాన్యత వహిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతునే ఉంది. ప్రభుత్వరంగ ఎగుమతుల ద్వారా వచ్చిన ఆదాయం 1982-83 సంవత్సరంలో రూ. 4693.77కోట్లకు చేరుకుంది. 1978-79 సంవత్సరంలో ఆదాయం కేవలం రూ. 1634 కోట్లుమాత్రమే ఉండేది. నిర్దిష్టవస్తువులు, అనిర్దిష్ట వస్తువులు, సేవల ఎగుమతులు ఎంతగానో పెరిగినవి. గత 5 సంవత్సరాల ఎగుమతుల వివరాలను పట్టికద్వారా తెలుసుకోవచ్చు.

ఆధారం:- యోజన 1-15 ఏప్రిల్. 1984. పేజి నం. 22.

ఉద్యోగావకాశాలు

పబ్లిక్‌రంగ సంస్థలు చెప్పుకోదగిన ఉపాధి అవకాశాలు కల్పించినవి. 1983 జూన్‌లో వ్యవస్థీకృతరంగంలో ఉపాధి 239 లక్షల వరకు ఉండగా, అందులో మూడింట రెండు వంతులు (అనగా 164 లక్షలు) పబ్లిక్ రంగంలో కల్పించుట జరిగింది.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో 1981-'82 సంవత్సరం వరకు 19.02 లక్షల మందికి ఉపాధి కల్పించబడింది. వేతనాల రూపంలో రూ. 3088 కోట్లు ఉద్యోగులకు చెల్లించుట జరిగింది.

లాభాలు నష్టాలు

ప్రస్తుతము మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలుకొన్ని లాభంతోనూ, మరికొన్ని నష్టంతోనూ నడుస్తున్నాయి. మొట్టమొదట ప్రభుత్వరంగ సంస్థలవలన నష్టాలు హెచ్చుగా వచ్చుచుండేవి. కాని గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వరంగ సంస్థలు లాభాలతో నడుస్తున్నాయి. 1972-'73 సంవత్సరం నుండి మాత్రమే లాభాలు వస్తున్నవి. 1972-73 సంవత్సరంలో ఈ సంస్థలు 17.74కోట్లు నికరలాభం సంపాదించినవి. 1981-82 సంవత్సరంలో 445.92కోట్లు, 1982-83 సంవత్సరంలో 617.85కోట్లు లాభం గడించినట్లు పార్లమెంటుకు 1984 ఫిబ్రవరి 28వ తేదీన పబ్లిక్‌రంగ సంస్థల సర్వేగురించి సమర్పించిన నివేదికద్వారా తెలుస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలలో 1982-'83 సంవత్సరంలో అత్యధికంగా ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్‌కమీషన్ లాభాలను సంపాదించింది. ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్‌కమీషన్ రూ.1182కోట్లు లాభాలు సంపాదించింది. ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కమీషన్ పిదప, లాభాలు సంపాదించుటలో తరువాత స్థానాలు వరుసగా ఆయిల్ ఇండియాలిమిటెడ్(రు.205కోట్లు), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (రూ. 150కోట్లు), స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (రూ. 62కోట్లు), మినరల్స్ అండ్ మెటల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ (రూ. 55కోట్లు), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (రూ. 53కోట్లు), ఇండియన్ పెట్రో కెమికల్స్ కార్పొరేషన్ (రూ. 50కోట్లు), నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (రూ. 47కోట్లు), భారత్ ఎర్త్‌మువర్స్ (రూ. 42కోట్లు), సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ (రూ. 40కోట్లు)లు ఆక్రమిస్తున్నవి.

కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలతో నడుస్తున్నందు వలన పబ్లిక్‌రంగంలో స్వావలంబన పూర్తిగా సాధ్యపడుటలేదు. 1982-83 సంవత్సరములో 'స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా'కు రూ. 105 కోట్లునష్టం వచ్చింది. నష్టాలు పొందుటలో తరువాత స్థానాలు వరుసగా

ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (రూ. 78 కోట్లు) కుంద్రేముక్ ఇనుప రజను కంపెనీ (రూ. 66 కోట్లు), ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్‌కంపెనీ(రూ.66కోట్లు), ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్(రూ. 66కోట్లు), హిందూస్తాన్ ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్(రూ.56కోట్లు)ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (రూ. 56కోట్లు), భారత్ అల్యూమినియంకంపెనీ (రూ. 52 కోట్లు), హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్(రూ. 47కోట్లు) హిందూస్తాన్ కాపర్ (రూ. 29కోట్లు),ఆక్రమిస్తున్నట్లు 1984 ఫిబ్రవరి 28వ తేదీన పబ్లిక్ రంగ సంస్థల తీరుతెన్నుల గురించి పార్లమెంట్‌కు సమర్పించిన నివేదిక తెలుపుతున్నది.

పబ్లిక్‌రంగ సంస్థల నిర్వహణ తీరుతెన్నులు

ప్రభుత్వ రంగ సంస్థలు సరిగా పనిచేయటం లేదనే విమర్శ తరచుగా విన్పించుతున్నది. ఈ వాదనలో లాభాలను ఆర్జించుట లేదు అనేది ప్రధానమైనది. ప్రజాబాహుళ్యానికి ఉపయోగించే వస్తువుల విషయంలో లాభార్జన ప్రధానాంశము కాకూడదు. పెద్ద పెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో అధిక కాలయాపన జరుగుతున్నది. కార్మిక సంక్షేమ పథకాల విషయంలో కొంత ఉదారంగా ఖర్చు పెట్టవలసి వస్తున్నది. ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల కన్న ప్రభుత్వరంగంలోని ఉద్యోగులకు అధిక వేతనాలు, రక్షణ లభిస్తున్నాయి. వస్తువుల ధరలు సాంఘిక దృష్టితో నిర్ణయించబడుతున్నాయి. సామాజికమైన ఒత్తిడి, ఇతర పరిశ్రమలకు కావలసిన సామాగ్రి ఈ రెండు ప్రధాన కారణాల వలన ధరలు పెంచుట సాధ్యంకాదు. ఉదాహరణకు విద్యుచ్ఛక్తి,ఉక్కు, బొగ్గు వంటివస్తువులను, ఇతరసేవలను చాల తక్కువ ధరలో అందచేయుట జరుగుతోంది.

ప్రభుత్వరంగ సంస్థలలో ఉన్న లోపాలవలన కూడ కొన్ని సంస్థలకు నష్టాలు వస్తున్నవి. ప్రభుత్వరంగ సంస్థలలో యాజమాన్యంలో పై అధికారుల అసమర్థత,బాధ్యతారాహిత్యం, సుశిక్షితులగు మేనేజర్లుతగినంతమంది లేకపోవటం,కాలంచెల్లిన యాజమాన్య పద్ధతులు, అనవసర కాలయాపన, అసమర్ధ యాజమాన్యం, కార్మిక సంఘాల మితిమీరిన చర్యలు, రాజకీయాల ప్రమేయం, అలవాటుగా మారిన పని ఎగవేత, సరియైన అదుపు అజమాయిషీ లేకపోవటం వంటి ప్రధాన కారణాల వలన కొన్ని ప్రభుత్వరంగ సంస్థలకు నష్టాలు వస్తున్నవి.

ప్రభుత్వరంగ సంస్థలలో సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించు కోవటం లేదు. కొన్ని సందర్భాలలో వనరులు వృధాచేయటం జరుగుతోంది. మరికొన్ని సందర్భాలలో దెబ్బతినిన ప్రైవేట్‌రంగ పరిశ్రమలను ప్రభుత్వం చేపట్టుట వలన, ప్రభుత్వంమీద అనవసర మగు భారం పడుతున్నది. ఈ విధానాన్ని వీలైనంత త్వరగా వదిలి వేయటం మంచిది. పెట్టుబడి అధికంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలలో ఉపాధి కల్పన అంతగా జరుగుటలేదు. అందువలన పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా చిన్న పరిశ్రమలను నెలకొల్పినచో ఉద్యోగావకాశాలు పెరిగి, నిరుద్యోగ సమస్యకూడ కొంతవరకు తీరుతుంది. ప్రభుత్వరంగ సంస్థల ఆధిపత్యం నుంచి అనధికారులను తొలిగించినచో సమర్థవంతంగా నడిచే అవకాశాలు అధికంగా ఉన్నవి. కనీసం రాష్ట్రాలలో విద్యుచ్ఛక్తి బోర్డులను రాజకీయ పెత్తనం నుండి విముక్తం చేసినా ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వరంగ సంస్థలు లాభపడుతాయి.

ప్రభుత్వరంగ సంస్థలు సమర్థవంతంగా పనిచేయుచున్నాయనుటలో సందేహంలేదు. ఇవి ప్రజలను లాభార్జన దృష్టిగల ప్రైవేట్‌రంగం బారినుండి రక్షిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలలో ముందే పథకాలను జాగ్రత్తగా రూపొందించి, ఉత్పత్తి శక్తిని గరిష్ఠంగా ఉపయోగిస్తూ, నిర్వహణలో సమర్థత ప్రదర్శిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను లాభప్రదం చేయవలసి ఉంటుంది. [ఈ వ్యాసాన్ని రాసినవారు కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఆర్థికశాఖకి చెందినవారు]

సంప్రదింపు రచనలు

1. యస్. శంకరన్:—ఎకనమిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా,
2. కె. కె. సయన్ :— కంపేరిటివ్ ఎకనమిక్ సిస్టమ్స్.
3. ఇండియా- 1983.
4. పి. ఎ. సేమ్యూల్ సన్ :— ది ప్యూర్ థియరీ ఆఫ్ పబ్లిక్ ఎక్స్‌పెండిచరస్ రివ్యూ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ నవంబరు 1954.
5. భగవతి, జె; దేశాయ్, పి, :— ఇండియా ప్లానింగ్ ఫర్ ఇండస్ట్రియలైజేషన్, న్యూయార్క్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 1970.
6. బ్యూరు ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజస్, ఆన్యువల్ రిపోర్ట్స్ ఆన్ ది వర్కింగ్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ అండర్ టేకింగ్స్ ఆఫ్ ది సెంట్రల్ గవర్నమెంట్, న్యూ ఢిల్లీ.
7. ఏ. హెచ్, హాన్‌సన్ :— ది ప్రాసెస్ ఆఫ్ ప్లానింగ్ (లండన్: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీప్రెస్ , 1966)- పుట 152
8. యోజన. 1-15 ఏప్రిల్ 1984. పుట 22.
9. ఎం. కిష్టయ్య:— ప్రభుత్వరంగ సంస్థలు, భారతదేశ ప్రభుత్వ పాలన.

ప్రచురణ :— ప్రజాపాలనా శాస్త్ర విభాగము కాకతీయ విశ్వవిద్యాలయము.

కొత్త సీరియల్ ప్రారంభం!

సమిధలు

దిలావర్

అనగనగా ఓ కాలేజి. నేటి భారతంలో అది ఏ వూరి కాలేజి అయినా కావచ్చు.

పొదుగుతున్న నిరుద్యోగం -రెక్కలు విప్పుకునే స్వేచ్ఛ - ఉద్రేకపు అగ్నిపర్వతాలు-మౌఢ్యపు యిరుకు గోడలు - కట్టులు తెంచుకునే వుత్సాహం - రూపు కట్టిన అమాయకత్వం - ఊడలు దిగిన మూఢతత్వం-జండాలు - వర్గాలు - కులాలు - మతాలు-ప్రేమ-ద్వేషం-త్యాగం అన్నీ కలసి సహజీవనం చేస్తున్న మినీదేశం........ఆ కాలేజి....

గేట్లోంచి లోపలికి ప్రవేశించగానే ఎదురుగా కనిపించేదే ప్రిన్సిపాల్ గది. దానికి అనుకొని వుంది స్టాఫ్ రూం. స్టాఫ్‌రూం పక్కనే ఆఫీసు గది.

ఆ భవనానికి కొంచెం దూరంలో వుంది లేబొరేటరి.

రవి, రమణ, శేఖర్, కిష్టు, సుబ్బారావు, రషీద్, రేవతి, పుష్ప, భావన, లావణ్య వసంత.... బిలబిలమంటూ లాబ్‌లోకి ప్రవేశించారు.

"ఎక్స్యూజ్‌మి.... నాకేదో ఫోనొచ్చిందట. యిప్పుడే వస్తాను. ఈ లోపు మీరు సోడియం హైడ్రాక్సైడ్ ద్రావణాన్ని ప్రమాణీకరణం చెయ్యండి." అని పురమాయించి లాబ్‌లోంచి వెళ్లిపోయారు మాస్టారు.

లాబ్‌లో ఓ ప్రక్క అద్దాల బీరువాల్లో సిల్వర్ నైట్రేటు, మెర్క్యూరీ క్లోరేడు లాంటి ఖరీదయిన రసాయనాలున్నాయి. ఓ మూల డిస్టిల్డువాటరు ప్లాంటు వున్నది. కెమికల్ రియేజంట్సుమధ్య— రసాయనాల మధ్య విద్యార్థులు పక్క బెంచీల చుట్టూ సర్దుకున్నారు.



కొందరు బ్యూరెట్ను కడుగుతున్నారు.

కొందరు సొల్యూషన్ను తీసుకుంటున్నారు.

రేవతి పిపెట్టును, బ్యూరెట్టును, కానికల్ ఫ్లాస్కును శుభ్రం చేసింది. బ్యూరెట్టును రిటార్టు స్టాండుకు బిగించి ఘంటి జాడీలో వున్న హైడ్రో క్లోరిక్ ఆమ్లాన్ని బీకరు సహాయంతో బ్యూరెట్టులోకి పోసి మగపిల్లలవేపు ఓసారి చూసింది.

అంతవరకూ ఆమెనే గమనిస్తున్న కిష్టు "ఊఁ .... ఊఁ .... కానీయండి.... ....లేడీస్ ఫస్టకదా?" అన్నాడు నవ్వుతూ.

ఆడపిల్లల్ని తక్కువ చేసి మాట్లాడే వారిని చూస్తే రే మండుతుంది. మాటకు మాట అందించకపోతే తాను ఓడిపోయినట్టు లావిస్తుంది.

"లేడీస్ ఫస్ట్ అనకపోతే... మాకు చేతగాదు అని రాదూ?" అంది చిటపటలాడుతూ.

"ఆ నిప్పుకోడి జోలికి పోకురా కిట్టిగా. అసలే ఉ లిబరేషన్ రోజులు... ...." హెచ్చరించాడు రమణ.

"ఆ కందిరీగల తుట్టెను కదిలించకురా నాయనా ! ప్రయోగం వదిలిపెట్టి ఆమెగారిచ్చే మహిళాభ్యుదయం వుపన్యా వినాల్సివస్తుంది...." సుబ్బారావు మరికొంచెం సాంబ్రాణి పొగ వే

"మీలాంటి మగరాయళ్ళున్నన్నినాళ్ళూ యింకేం వుమెన్స్‌లిబ్ ండి...." అంది రేవతి నిట్టూరుస్తూ.

"ఒరేయ్. వదిలెయ్యండిరా. ఆమెను చూస్తుంటే జాలేస్తున్నది ాపం....!" అన్నాడు రషీద్ ఇంకొంచెం గుగ్గిలంవేస్తూ.

"మీవాళ్ళను సరిగా ప్రాంప్టింగ్ యివ్వమను బాబూ! ఆ ్లాగ్ మేం అనవలసింది." రషీద్ వేపు చురచుర చూస్తూ అన్నది.

"అబ్బ పోనీయవే. ఎందుకే వాళ్ళతో గొడవ...." అన్నది సంత ముదురుతున్న పాకాన్ని చూస్తూ.

"ఛీ! మీ రాడాళ్ళుకాదే? వాళ్ళట్లా నానా మాటలూ అంటుంటే ల్లంకొట్టిన రాళ్ళలా వులకరూ పలకరు? సిగ్గులేదూ?" అంటూ తన ఢబలగాన్ని కసురుకుంది రేవతి.

దగ్గులతో, తుమ్ములతో, పిల్లి కూతలతో తమ ఆనందాన్ని ్రకటించారు మగవిద్యార్థులు.

కిష్టు ప్రశంసాపూర్వకంగా వసంతవేపు చూశాడు. వసంత ష్టు కళ్ళలో కళ్ళు కలిపి చిన్నగా నవ్వింది. కిష్టు కళ్ళతోనే ఏవేవో ందేశాలు పంపించాడు. వసంతకళ్లు సంతోషంతో తూనీగ రెక్కల్లా పరెపలాడిచింది.

ప్రయోగం చేస్తున్న రవి రేవతి వేపు తలెత్తి చూశాడు.

ప్రయోగం పూర్తిచేసిన రేవతి బ్యూరెట్ నిరోధిని ఆపి కొలత సుకుంది. సమానంగా- టైటర్ విలువలు వచ్చేవరకు నాలుగైదు ార్లు ప్రయోగం చేసింది. తర్వాత వచ్చిన రీడింగ్ సహాయంతో ‌రియస్‌గా లెక్కలు వేస్తున్నది.

ప్రయోగంలో ఆసక్తిలేని కొందరు ఆడపిల్లలు రేవతి వెనక ‌బుర్లలో మునిగిపోయారు.

ప్రయోగం చేస్తూనే ఓరకంట రవి వేపుచూసింది రేవతి. 'ఎంత ‌ రకొచ్చింది?' అన్నట్టు కనుబొమ లెగరేసింది.

'ఐపోవచ్చింది' అన్నట్టు కళ్లువాల్చి జవాబు చెప్పాడురవి.

మిగతా విద్యార్థుల్లా వెకిలిచేష్టలు, కోతిపనులూ చెయ్యకుండా న పనేమిటో తాను చేసుకుపోయే రవి అంటే రేవతికి మంచి అభి ాయం వుంది. అందుకే అతనితో చనువుగా వుండేందుకు వెనకాడదు వతి.

వసంత బోయ్‌ఫ్రెండు కిష్టు. ఇద్దరూ విలాసపు పైమెరుగులకు ్రమసే వాళ్ళే. వాళ్లదగ్గర మూల్గుతున్న డబ్బు అందుకోవలసిన వకాశాలను కలిగిస్తున్నది. అనుభవించడానికి యింక అడ్డేముంటుంది?

చాలాసేపటి నుండి వసంతకేదో సైగ చెయ్యాలను కుంటు ్నాడు కిష్టు. వసంతేమో రేవతి వెనకవున్న గుంపులో కలిసిపోయింది. వసంత ఎటువేపు వుందో చూచి ఎట్లాగైనా తనప్రేమ సందేశం అందిం చాలని తంటాలు పడుతున్నాడు కిష్టు. వెనక్కి వెనక్కి నడిచి ముని గాళ్లమీద పైకిలేచి చేత్తో వూపుతూ వెనకనున్న బీరువా గుద్దుకొని ముందుకు తూలి ప్రయోగం చేస్తున్న రమణమీద పడ్డాడు. రమణ వర్కుబెంచీ మీది పరికరాలమీద బోర్లాపడి 'అమ్మా' అంటూ పెద్దగా కేకపెట్టాడు.

రసాయనాలున్న సీసాలు పెద్దచప్పుడు చేస్తూ క్రిందపడ్డాయి. వెంటనే గదంతా పొగ అలుముకున్నది చూస్తుండగానే భగ్గుమని మంటలు లేచాయి.

విద్యార్థుల గుండెలు గుబిల్లు మన్నాయి. దట్టంగా వ్యాపిం చిన పొగలో ఏమీకనిపించలేదు. కళ్ళు మంటలు మండుతున్నాయి. విద్యార్థులు శ్వాస అందక దగ్గుతున్నారు. భయంతో అటూయిటూ పరుగులు తీస్తున్నారు. ప్రాణభయంతో పెద్దగా కేకలు వేస్తున్నారు.

వాళ్ల తొక్కిసలాటలో సైన్సు పరికరాలు నేలమీదపడి ధ్వంసం అవుతున్నాయి. చిందర వందరగా పడ్డగాజుపెంకులు కాళ్లకు గుచ్చు కుంటున్నాయి.

ప్రాణాలరచేతుల్లో పెట్టుకొని పరుగులు తీస్తుంటే ఒకరికొకరు తగులుతున్నారు. ఎవరో పడుతున్నారు. ఎవరో లేస్తున్నారు. పెద్దగా ఏడుస్తున్నారు. కేకలు పెడుతున్నారు. మొత్తుకుంటున్నారు. వాళ్ల హాహాకారాలతో కాలేజి మార్మోగి పోతున్నది.

దిగ్భ్రాంతి చెందిన అధ్యాపకులూ, ఇతరక్లాసుల్లోని పిల్లలూ లాబ్‌ముందు గుమిగూడారు.

లోపల ఏంజరిగిందీ ఎవరికీ అర్థం గావడం లేదు.

లాబ్‌లోకి పోయేందుకు ఎవరూ సాహసించ లేక పోతున్నారు.

కొంచెంసేపటికి విద్యార్థులు ఒక్కొక్కరే మసిబారిన ముఖా లతో కళ్లనులుముకుంటూ దగ్గుకుంటూ లాబ్‌లోంచి తూలుకుంటూ బయటికొచ్చారు.

బయటవున్న విద్యార్థుల సహయంతో వాళ్లను బెంచీలమీద విశ్రాంతిగా పడుకో బెడుతున్నారు. అధ్యాపకులు.

చిట్ట చివరకు రమణ బయటికివచ్చి విరుచుకొని పడ్డాడు. అతని గుడ్డలన్నీ రక్తంతో తడిసిపోయాయి. కత్తిలా మొనదేలివున్న గాజు పెంకు అతని కడుపులో గుచ్చుకొని వుంది. రక్తం యింకా స్రవిస్తూనే వుంది. రమణ కళ్లుమూసుకు పోతున్నాయి. భారంగా శ్వాస తీసుకుంటు న్నాడు.

ఆ దృశ్యాన్ని చూసి నిశ్చేష్టులయ్యారంతా.

అందరిలోనూ ఏం జరుగుతుందో నన్నభయం, ఆందోళన!

ఎవరో తేరుకొని ఆసుపత్రికి ఫోన్ చేశారు.

వెంటనే వచ్చిన అంబులెన్సులో రమణను ఆసుపత్రికి చేర్చారు.

విద్యార్థులతో, అధ్యాపకులతో ఆసుపత్రి కిట కిట లాడుతున్నది.

ఈ వార్త తెలిసిన రమణ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ వచ్చారు.

"డాక్టర్‌గారూ! మాకు లేక లేకకలిగిన సంతానం. మాఆశలన్నీ వాడిమీదే. ఎంత డబ్బైనా కానీయండి, వాడ్ని బతికించండి మీ కాళ్ళు పట్టుకుంటాను డాక్టర్ బాబూ! నా కొడుకును బతికించండి" హృదయ విదారకంగా ఏడుస్తూ రమణ తల్లి చేతులు జోడించింది.

"రక్తం బాగాపోయింది........ రక్తం కావాలి.............. ఎవరైనా రక్తమిస్తే........" డాక్టర్ మాటలు పూర్తికానేలేదు. "తీసుకోండి డాక్టర్! నాశరీరంలోని చివరిబొట్టువరకూ తీసైనా నాకొడుకును బతికించండి...." అని దుఃఖోద్వేగంతో వూగిపోతూ అన్నాడు రమణ తండ్రి.

తండ్రి రక్తాన్ని పరీక్షించి పెదవి విరిచాడు డాక్టర్.

తనరక్తం యివ్వడానికి ముందుకొచ్చింది తల్లి! కాని.... ఆమె హిమోఫీలియా పేషెంటు. వి.డి, కాన్సర్, టి.బి, షుగర్, హీమోఫీలియాలాంటి జబ్బులున్న వ్యక్తుల రక్తం మరొకరికి ఎక్కించడానికి పనికిరాదు.

హతాశులయ్యారు ఆ తల్లిదండ్రులు. వారికి యీ లోకమంతా శూన్యంగా, చీకటిగా మారిపోయింది.

డాక్టర్ అసహనంగా అటూ యిటూ పచార్లుచేశాడు. ఓ నిమిషం గడిచాక "మీలో ఎవరన్నా రక్తదానం చెయ్యగలరా?" అని విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని చూస్తూ అన్నాడు.

అందరిలోనూ ఏదో కుదుపు. ఏదో చైతన్యం. ఏదో ఆవేశం. ఏదో త్యాగనిరతి........

"నారక్తం తీసుకోండి...." అంటూ ముందుకొచ్చారు ప్రకాశం మాస్టారు.

"మీరెందుకు మాస్టారూ? మేం వున్నాం కదా........"అంటూ విద్యార్థులంతా తోసుకుంటూ డాక్టర్‌ను సమీపించారు.

"బాబూ! చిన్నవాళ్ళైనా మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నా! మా బిడ్డకు ప్రాణదానం చెయ్యండి. మా యింటిదీపం నిలబెట్టండి బాబూ!" బావురుమన్నది రమణ తల్లి.

"ఏం ఫరవాలేదమ్మా! భయపడకండి...." రమణతల్లిని ఓదార్చి విద్యార్థుల్ని పరీక్షించాడు డాక్టర్.

శేఖర్ బ్లడ్ గ్రూప్ సరిపోయింది.

శేఖర్‌ను రమణ బెడ్‌కు సమీపంలో పడుకోబెట్టి బ్లడ్‌ట్రాన్స్‌ఫ్యూజన్ అమర్చాడు డాక్టర్.

బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్‌లోంచి రక్తం....ఎర్రగా....చిక్కగా. త్యాగంలా.... స్నేహంలా....

ప్రకాశం మాస్టారి మనసులో ఆలోచనల వెల్లువ..........

తమ రక్తాన్ని పంచుకుని పుట్టిన బిడ్డకే తమరక్తం ప రాలేదు. నవమాసాలు మోసి, తన మాంసంలోని మాంసాన్ని, రక్తంలోని రక్తాన్ని, తన వూపిరిలోని వూపిరిని పంచి యిచ్చి తల్లి రక్తం........ బిడ్డకు పనికిరాలేదు........

ఏ సంబంధమూలేని, ఏ బంధుత్వమూ లేని, కుల-మత- ప లకు అతీతంగా-కేవలం ఒక మనిషి అయినందుకు.... మనిషి అ నందుకు.... అతని రక్తం మరో మనిషి ప్రాణాలు ఆరిపోకుండా బెడుతున్నది........

మనిషి రక్తం ఓ మనిషిని మృత్యుముఖంనుండి తప్పిస్తుం మనిషి రక్తం ఓ మనిషికి ప్రాణం పోస్తుంది....!! ఓహో ఎం అద్భుత విషయం! ఎంత అమూల్యమైనది మనిషిరక్తం!

యుగయుగాల అంధవిశ్వాసాలను మనిషి రక్తం వెకి రిస్తున్నట్టనిపించింది.

కక్షలూ కార్పణ్యాలలో ప్రవించిందీ-యుద్ధ రంగాల వెల్లువై వుప్పొంగిందీ-త్యాగాల సిలువలను అభిషేకించిందీ....క్రౌ రక్తమే....యీ రక్తమే....మనిషిరక్తమే........

ఓ మనిషీ! నువ్వు తలుచుకుంటే-రక్తం చిందించడమే కాదు. రక్తం అందించగలవు....రక్తం అందించగలవు.

అపూర్వమైన విషయాన్ని అప్పుడే కనుగొన్న పసిపిల్లా మల్లే మాస్టారి మనసు ఆనందంతో గంతులు వేసింది.

2

రవి, శేఖర్, రషీద్, సుబ్బారావు, కిష్టు, రేవతి, వసం రమణను చూసేందుకు ఆసుపత్రి కెళ్లారు.

రమణ తల్లి అందర్నీ ఆప్యాయంగా పలకరించింది.

తన తోటి విద్యార్థుల్ని చూడగానే రమణ కళ్లలో నీ నిండాయి. అసలే పచ్చటి శరీరఛాయ రమణది. ఇప్పుడు పాలిపో యింకా పచ్చగా కనిపిస్తున్నాడు. కోలుకోడానికి యింకా టైం ప తుంది.

శేఖర్‌ను చూసినప్పుడల్లా సాక్షాత్తు దేవుణ్ణే చూసి నట్లని పిస్తుంది. రమణ తల్లికి. తమ వంశాంకురాన్ని కాపాడిన పుణ్యాత్ము నిగా శేఖర్‌ను ప్రత్యేకంగా అభిమానిస్తుందామె. శేఖర్‌ను దగ్గరకు తీసుకొని ఆప్యాయంగా తలనిమురుతూ మాతృత్వంలోని తియ్యదనాన్ని అనుభవిస్తున్నది.

"ఒంట్లో కులాసాగావుందా రమణా ?" పలకరించింది రేవతి.

"మీ అందరి దయవలన...." చేతులు జోడించాడు రమణ. అతని కళ్లలోంచి నీరు చిమ్మి బుగ్గల్ని తడుపుతున్నది.

అందరి కళ్లలోను నీరు వుబికింది.

రమణ తల్లి కొంగుతో అతని కన్నీరు తుడుస్తూ తనూ కళ్ళొత్తుకున్నది.

"ఛా....ఏమిట్రా...."? ఎందుకేడుస్తున్నావ్ ? ఇప్పుడేమ యిందని ? నువ్వు త్వరలోనే కోలుకుంటావని డాక్టర్ చెప్పాడు. ధైర్యంగా వుండాలిగాని యిలా బెంబేలు పడిపోతే మీ అమ్మగారు మాడు ఎలా తల్లడిల్లిపోతున్నారో...." అంటూ ఓదార్చ ప్రయత్నించాడు రవి.

స్నిగ్ధమైన, స్వచ్ఛమైన స్ఫటికం లాంటి స్నేహం వారి కన్నీటిలో ప్రతిఫలిస్తున్నది.

కొంచెంసేపు ఎవ్వరికీ నోట మాట పెగల్లేదు.

"ఏమండీ ! మీరు పెద్దవారు. మాకు ధైర్యం చెప్పేది పోయి మీరే యిట్లా అయిపోతే ఎలా ?" అంటూ రేవతి రమణ తల్లిని ఓదార్చింది.

వాళ్లు తెచ్చిన పండ్లు రమణ తల్లికిచ్చి కాసేపు రమణతో యీ మాటా ఆ మాటా మాట్లాడి, జోక్‌లతో నవ్వించి మళ్ళీ సాయంత్రం వస్తామనిచెప్పి బయలుదేరారు మిత్రబృందం.

"రేవతిగారూ ! యివ్వాళ మీ ఆతిథ్యం స్వీకరించక తప్పదు." అన్నాడు కిష్టు భారంగా వున్న వాతావరణాన్ని తేలిక పరుస్తూ.

"వెల్‌కమ్ సంతోషంగా ఆతిథేయ సత్కారాలు చేయబడును. రండి...." అంది రేవతి.

రేవతి యింట్లో కలుసుకోవడం మిత్రబృందానికి కొత్తేమీ కాదు.

రేవతి మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన పిల్ల. తల్లి చిన్నప్పుడే పోయింది. తండ్రి రేయింబవళ్లు పొలంపనులతోనే సతమతమవుతుంటాడు. తల్లిలేకపోవడం వల్లా, ఒక్కగా నొక్క కూతురు కావడం వల్లా రేవతిని గారాబంగా పెంచుకుంటున్నాడు. మంచి సంస్కారవంతుడు కావడం వల్ల కూతురి స్వేచ్ఛకు అడ్డురాకుండా మసలుకుంటున్నాడు.

ఇల్లుచేరగానే అంతా తలా ఓ కుర్చీలో కూలబడ్డారు.

"అమ్మా ! తల్లీ....! ఉత్తుత్తి కబుర్లతో మా కడుపు కొట్టక ఆ చేసేదేదో త్వరగా చేసి మా మొహానకొట్టు అపురావురుమంటున్నది కడుపు. ఓ లాగుడు లాగించాలి....." రేవతితో అన్నది వసంత.

"అమ్మడూ ! ఓ ఆడబకాసురురాలా ! కాస్త గుర్రం కట్టెయ్ తల్లీ..." అంటూ వసంత వేపు వెక్కిరిస్తూచూశాడు కిష్టు.

"ఓర్నాయనోయ్ ! యివ్వాళ లేచి మా వంటవాడి మొహమే చూసుంటాను. ఇహ దుప్పిభోజనమే గతి. నువ్వు ఆడ గీద...అంటూ లింగాలు మాట్లాడకయ్యా మగాడా ! అమ్మా ! రేవతీ....! ఈ ఒక్క తప్పుకాయ్ తల్లీ ! నా కసలే దడగా వుంది. మహిళాభ్యుదయం గురించి మళ్ళీప్పుడైనా తీరిగ్గా చెబుదూగాని.... యివి చేతులు కావనుకో....బాబ్బాబు....." అంది వసంత.

"చాల్చాల్లే. ఆ మగాళ్లముందు అట్లా జావగారి పోతావేమిటే? అలుసు కాదూ వాళ్లకు ?" కసురుకుంది రేవతి.

"గోవిందా ! ఏడుకొండలవాడా.... గోహోవిందా....! అయిపోయింది. అనుకున్నంతా అయింది...." చేతులు పైకెత్తి ఓరగంట కిష్టువేపు చూస్తూ అన్నది వసంత.

"ఎందుకే ఉత్తిపుణ్యానికి నన్నాడిపోసుకుంటారు ? కాని మాటలు ఏం అంటున్నానని ?" చిరుకోపంతో అంది రేవతి.

"పెదవి కదిపితే మహిళావిమోచనోద్యమం అంటూ విరుచుకు పడుతుంటే మీ మహిళామణులే జడుసుకుంటున్నారుగదా....యిక మా మగాళ్లదోలెక్కా ?.... అయినా తెలీక అడుగుతాను పురుషపుంగవుల మని విర్రవీగుతున్న మా అమాయక చక్రవర్తులకు మీ కంటే ఎక్కువ ఏం ఒరుగుతున్నదండీ యీ సమాజంలో....?" రేవతి వేపు చూస్తూ అన్నాడు కిష్టు.

"ఏం మహానుభావా ! యింకా ఏం తక్కువైందేమిటి మీ మగ మహారాజులకు ?" వ్యంగ్యంగా అన్నది రేవతి.

"మగవారితో సమానంగా ఆడవారికి హక్కులు కావాలి అని ఒహటే గోల పెడతారు. గాని నిజంగా ఆలోచిస్తే అసలు పురుషులకే స్త్రీలతో సమానమైన హక్కులు లేవు. ఉదాహరణకు ఓ విషయం చూడండి.... చట్టం దృష్టిలో స్త్రీ పురుష భేదం లేదుకదా ? మరి ఒక మగవాడు పరస్త్రీతో వ్యభిచరిస్తే 'ఎడల్టరీ' కేసు పెట్టి మూసెయ్యొచ్చు అదే నేరం స్త్రీకూడా చేసింది కదా ? కాని ఆమెను శిక్షించేదుకు చట్టం లేదు."

'నిజమే ఒప్పుకుందాం. కాని నైతికంగా స్త్రీ పురుషు లిద్దరూ బాధ్యులే కదా ? పురుషుడు వ్యభిచరిస్తే అది అతని మగ సిరి అని. దక్షిణ నాయకత్వం అని బిరుదులిచ్చే ఈ సమాజం వ్యభిచరించిన స్త్రీని ఎంత హీనంగా చూస్తున్నది ? ఎంత దారుణంగా చిత్రహింసలకు గురిచేస్తున్నది ? మానసికంగా ఆమె అనుభవించే శిక్ష ఏ జైలు శిక్షకు తీసిపోతుందో ఆలోచించండి ?" ఆవేశంతో కిష్టు వేపు చూస్తూ అన్నది రేవతి.

"ఆల్‌రైట్. అదట్లా వుంచండి. మరి వైవాహిక చట్టాల సంగతేమిటి ? ప్రతి స్త్రీ మగవాడితో సమానంగా సంపాదించే అవకాశ మున్నప్పటికీ ఆమెను భర్తఅనేవాడు పోషించి తీరాలి. అట్లా పోషించ లేని భర్తను సి. ఆర్. పి. సి. సెక్షన్ 126 క్రింద ప్రతినెలా జైలుకు పంపించ వచ్చు. ఇది న్యాయ మంటారా ?" తల ఎగరేస్తూ అన్నాడు కిష్టు.

"ఇది కేవలం దగాకోరు వాదన. ఏ ఆడదీ కావాలని పచ్చగా వున్న తన సంసారంలో చిచ్చుపెట్టుకోదు. తన కోసం, తన వారి కోసం శారీరకంగా మానసికంగా అంకితమైన స్త్రీ, కావాలని విడిపోదు. భర్త పరస్త్రీలోలుడయ్యో-లేక ధన వ్యామోహంలో పడిపోయో కట్టుకున్న భార్యను నిర్లక్ష్యం చేసి తనంతట తానుగా వదిలిపెట్టినప్పుడు భర్తనుండి వచ్చే ముష్టిమనోవర్తి గురించే కదా మీ ఏడుపు ? కాని ఒక్కటాలోచించండి....భర్త వదిలిపెట్టిన స్త్రీని యీ సమాజం కాకుల్లా పొడుస్తుంటే - ఆ రంపపుకోతను ఏ మనోవర్తి మాన్పుతుంది చెప్పండి ?" అంది రోషంగా ఏదోగుర్తుకు రాగా మళ్ళీ తనే మొదలెట్టింది.

"మిస్టర్ కిట్టూ! యిటీవల ఢిల్లీలో జరిగిన ఒక కేసు వివరాలు వినండి. భర్త తన భార్యను నిస్సహాయ స్థితిలో వుంచి వేధించడమే కాకుండా కోర్టుల చుట్టూ త్రిప్పడం దారుణమైన విషయమని అదనపు సెషన్స్ న్యాయమూర్తి ఎస్. ఎం అగర్వాల్ అంతటివాడు వ్యాఖ్యానించాడు. తన భర్త మరో స్త్రీతో చట్టవ్యతిరేకంగా కాపురం చేస్తున్నాడని కోర్టుకు మొరపెట్టుకుంటే జరిగిన న్యాయమేమిటో తెలుసా? భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 194లోని అంశాలను తగిన విధంగా సవరించ నంతవరకు, భర్త రెండవస్త్రీతో కాపురం చేస్తూ ఆమె ద్వారా పిల్లలను కన్నా నేరంగా పరిగణించేందుకు అవకాశం లేదుట....!!!" దీనికి మీ జవాబేమిటి అన్నట్టు ఎగతాళిగా కిష్టువేపు చూసింది రేవతి.

"లాయర్లయితే మీ యిద్దరికి దారుణమైన భవిష్యత్తు వున్నదని ఏకగ్రీవంగా విశ్వసిస్తూ, మా కర్మ యిలా కాలినందుకు పెనాల్టీగా ఫెడీఫెడీమని లెంపలు వేసుకుందుకు తీర్మానిస్తూ, ఇక ఈ డిస్‌కషన్ యింతటితో ఆపగలందులకున్నూ— ఉన్నఫళంగా యీ నిర్భాగ్యులు పారిపోవుటకున్నూ—అనుగ్రహించవలసినదిగా—అనుమతించవలసినదిగా...." రెండుచేతులతో నమస్కరిస్తూ డ్రామా డైలాగుల్లా ఉచ్చరిస్తూ లేచిన వసంతను రేవతి మోచేత్తో పొడుస్తూ "ఉండవే. ఆడదానివై వుండి ఆ మాటలు వింటూ బెల్లం కొట్టినరాయిలా వుండేందుకు నీకు సిగ్గులేదూ?" అంది కసిగా.

"ఒరేయ్! ఆమెగారు అలా ఎడాపెడా దంచేస్తుంటే గుడ్లప్పగించి చూస్తూన్నారేమిట్రా?" రవి భుజాలు పట్టుకొని వూపాడు కిష్టు

రవి కన్నార్పకుండా రేవతినే చూస్తున్నాడు. ఆమెలోని ఆవేశం చిత్తశుద్ధీ రవిని ముగ్ధుడ్ని చేస్తున్నాయి. అనర్గళంగా సాగిపోతున్న ఆమె వాగ్ధాటిని మంత్రముగ్ధుడై వింటున్నాడు.

"ఒరేయ్ శేఖర్! కొంపమునిగింది. మన రవిగాడ్ని నమ్ముకుంటే మనపుట్టి మునిగినట్టే. అమ్మగారి మాటల వలలో చేప పిల్లలా తన్నుకుంటున్నాడు చూడు...." నవ్వుకుంటూ రవి వేపుచూపించాడ కిష్టు.

"మేం రెడీ. నువ్వు ఊఁ అనడమే తరువాయి. రనింగ్‌రేసుల్లో విరివిగా పాల్గొన్న వాళ్లం. నిమిషానికి కిలోమీటరు చొప్పున పారిపోకపోతే నీ వుపన్యాసం విన్నంత ఒట్టు. ఊఁ అనవే...." అంది వసంత బేలగా రేవతి వేపు చూస్తూ.

"మొగుడు వదిలేసిందానిలా మరీ అట్లా ఏడ్వకే. ఇదిగో అర్జంటుగా టిఫిన్ తీసుకొస్తా కూర్చోండి" అంటూ లోనికెళ్లింది రేవతి

(ఇంకా వుంది)

శ్రీ శివలెంక ప్రకాశరావు

భావకవిగా తిలక్

ఆధునిక కవులలో దేవరకొండ బాలగంగాధర తిలక్ సుప్రసిద్ధులు. 'ఖచ్చితమైన మానవతావాది' గా, అకుంఠిత మానవీయ పతాకను ఎగురవేసే తత్వం గల అభ్యుదయ కవి'గా తిలక్‌ను విమర్శకులు[1] పేర్కొన్నారు, 'మొత్తంమీద చూస్తే అభ్యుదయభావనా, కాల్పనికోద్యమ కాలంనాటి శబ్ద సౌందర్యమూ— యీ రెంటి మేళవింపు తిలక్ కవిత్వమని చెప్పవచ్చు.... తిలక్ కవిత అభ్యుదయ కవిత్వం కొన్నిపాళ్ళు, భావకవిత్వం కొన్నిపాళ్ళు కలిసిన మిశ్రమ రూపం'[2] అంటూ విశ్లేషించారు.

అయితే కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందిన(1971('అమృతం కురిసిన రాత్రి' (1968)ని ఆధారం చేసుకొని పలికిన పలుకులు ఇవి. నేటిసాహిత్య లోకానికి (ఏ కొద్దిమందికో తప్ప) ఈ సంకలనం, 'కళాకేళి'లో ప్రకటించబడ్డ మరికొన్ని కవితలు మాత్రమే పరిచయం.

అంతేకాని అచ్చమైన భావకవిగా తిలక్‌ను నిరూపించే 'ప్రభాతము–సంధ్య'(1937)అనే మరోకవితాసంకలనంగూర్చి అంతగా తెలియదు. కోఅవెన్నువారిచే పీఠిక రచించబడిన ఈ పుస్తకం బయట పడితే "మావాడు" అని గుండెలు చరచుకొనే అభ్యుదయ కవులకు తిలక్ ఎక్కడ దూరమౌతాడో అని కాబోలు ఎంత వరకూ 'అమృతం కురిసిన రాత్రి' మాత్రమే పునర్ముద్రణ భాగ్యానికి నోచుకుంటున్నది. శ్రీశ్రీని భావకవిగా నిరూపించే 'ప్రభవ'(1928)ను మరోసారి ముద్రించిన విశాల హృదయులకు తిలక్ అంటే చిన్నచూపు చూపటంలో అంతర్యం ఏమిటో వారికే తెలియాలి !

తిలక్‌పై పరిశోధన చేసిన డా. అత్తలూరి నరసింహారావుగారు (ఆంధ్రవిశ్వవిద్యాలయం) నాకీ 'ప్రభాతము-సంధ్య' అనే ప్రతిని చూపించినప్పుడు ఆశ్చర్యపోయాను. సాహిత్యలోకానికి దానిని గూర్చి కొంచెం పరిచయం చేయడమే ప్రస్తుత వ్యాసోద్దేశం. ఈ ప్రయత్నానికి కారకులైన డా. అత్తలూరి వారికి కృతజ్ఞుణ్ణి.

ముఖ్యంగా తిలక్ రచించిన భావకవిత్వంలో 1. ప్రణయం 2. ప్రకృతి. 3. ఆధ్యాత్మికం అనే మూడు శాఖలు గోచరిస్తాయి.

ప్రణయం

ప్రతి భావకవినీ ప్రముఖంగా ఆకట్టుకొన్న విషయం ప్రణయం. కులసతినో, ఊహాసుందరినో నిజప్రేయసినో వస్తువుగా చేసికొని భావకవులు కవితలల్లారు. కొందరు భావ కవుల్లా 'పంచ భూతాత్మకుల పెంచి ప్రాణమిచ్చునమల గుణవల్లి ప్రకృతి' తన 'ఇల్లాలు'[3] అని ప్రకటించాడు తిలక్.

అంతేకాదు. 'యుగయుగాదుల నుండి కనగరాని శాశ్వత ప్రణయిని'గా 'భువన సుందరి'గా 'కన్నీటి కొలని విరియు పద్మినీ కళ్యాణ విమల మూర్తి'గా 'చారుకళా విలాసిని'గా, 'సరళ చంచల నయనోత్ఫుల్ల సుందర దరహాసలాస్య భామినిగా', 'జీవజీవనీ యాధారోద్యాన చిరతరస్నేహ మధువాహిని'గా. నిర్మలాకాశాన నిధులు కన్నట్టి సుందర జ్యోత్స్నలో తునక'గా, తన మధుర హృదయ భావ విరచితాప్సరోభామినీ సురుచిర పాటలాధరస్మితం'గా, 'హృదంతరాళమున ననారతమ్ము మ్రోగు ప్రణయ నాదము మురిసి దాల్చినదీ స్వాప్నిక మూర్తి'గా[4] ప్రేయసిని పేర్కొన్నాడు కవి.

ఆమెతో తనకు ఉన్నసంబంధం నిత్యమైందిగా, తమది అద్వైత ప్రణయంగా[5] భావించాడు. 'విశ్వకుహరం'లో ఆమె 'వలపు ప్రమిదల ప్రేమ నూనెలు వోసి'[6] ప్రేమదీపం వెలిగించుకున్నట్లు ప్రకటించాడు. ఆమె దివ్యాంకమందు వివిధమౌ ప్రేమ వాహినులు వీస్తాయనీ, అందులో. తానొక ప్రణయముగ్ధశక్తి'గా మునగవచ్చనీ తలంచాడు తిలక్.

ఆ సందర్భంలో

'నేటికిని చేలము వెనుక నెట్టినాదు
బ్రతుకు విస్తరిలో నీవె వడ్డనల నా
నర్తు వీవె నా సకలమ్ము, నా యనంత
గృహమునకు నీవె గృహలక్ష్మి కేవలమ్ము'[7]

అంటూ విన్నవించుకున్నాడు కవి. ఇక్కడ బ్రతుకును విస్తరిలో రూపించడం విశేషం.

ప్రేయసికి కవి ఇచ్చిన ప్రాముఖ్యం మరి కొన్ని కవితల్లోనూ కానవస్తుంది. 'వెలుగునీడల పందిళ్లలోన చిరునవ్వు కన్నీటి సిగ్గు మ్రుగ్గులల్లి','పూర్ణిమా నవనీత హృదయ మందు చిందు చీకటి చాయలో చేయిచేయి కలిపి[8] నిశీథుల్లో తన ప్రేయసితో కలిసి విహరించడం ఒక దివ్యానుభూతిగా భావించాడు. తిలక్.

ఆ సందర్భంలో ఆమె కొప్పులో మల్లియలు నవ్వితే ఆయన 'హృదంతరం'లో 'అనంతదేదీప్యరేఖ' అలము కుందట! ఆమె 'తెలి వాలుగన్నుల నీలినిగ్గులసిగ్గు ఆటాడితే', ఆయన 'బహిరంతరాత్మ తేజమ్ము నటరాజు'గా నిలిచిందట! ఆమె 'లలితాధరమ్ము నిర్మల హాసమ్ము ప్రాకితే, ఆయన 'తమో ప్రపంచాన నిస్తుల తేజం సింహాదట! ఆమె 'కిన్నరాంగన'యై నృత్యమొనరిస్తే ఆయన 'సుధర్మా పీఠిపై నిలిచి నిదుర [9] పోయాడట!

అంతేకాదు, కృష్ణశాస్త్రిగారిలా ఈ లోకంలో ప్రతి పదార్థమూ, వస్తువూ రూపమేలేని యూర్వశీ సుందరీమణిలా[10] గోచరించింది కవికి.

అందుకే ఆమె విరహాన్ని భరించలేక పోయాడు. ప్రేయసి ఒడిలో నిదురించి నిలువెల్లా పులకించగా తన యెదలో ఉన్న బాధ నంతా 'ఏడ్పు'గా వెళ్ళగక్కదలచాడు[11] కవి.

ఆ సమయంలోనే

'రమ్ము! ప్రేమమయీ రమ్ము
రమ్ము హృదయ శిల్పినీ రమ్ము
రాగబంధిత జగద్గృహిణీ రమ్ము!
.... ఈవిశ్వాలయమ్ములో
యేనె పూజారినై
యిడుదు జీవమే నివాళిగా
యిడుము నీదు చేలాంచలపు
టొడిలోని భాగ్యశ్రీల [12]

ఇత్యాదిగా స్వాగతించాడు తిలక్.

ఇంతకన్నా భావకవికి ప్రణయావేశమూ, ఆత్మార్పణ బుద్ధీ ఏంకావాలి?

తన ప్రేయసి నొసట'విశ్వమానవకల్యాణ కుంకుమ'ను తీర్చి, ఆమె కనుగవజిగిబాగుల తన నిర్మల గీతికాశ్రుతులు గల్పి, 'ప్రేమయే బ్రతుకులాట'గా పాడుకుంటూ ఆ దివ్య ప్రణయం ద్వారా విశ్వ శ్రేయాణాన్ని ఆకాంక్షించాడు కవి.

'ఏననంతానంద రేఖ-నేశింఖనిగ దాల్చి
మ్రోయింతు భువనాలు కంపిల్ల
మోయగాలేని మోదాంబుపాళి
వ్రాయగాలేని ప్రేమార్ద్రరవము'[13]

అనడంలోకూడా లోకానికి అసాధారణమైన అనుభూతిని కూర్చే లక్ష్యం స్ఫురిస్తుంది.

అయితే 'రేపో మాపో'[14] వదలిపోయే యౌవన శ్రీభరమ్ము'ను గుర్తించి జాగు చేయక 'నూత్నగృహమునకు' వెళ్ళి క్రొత్త పాత్రలో కూర్మి వేడి బాష్పములు రెండు రాల్చి ప్రజానిర్మిత ద్వేష దాహ, ఫలిత మండపమున శ్వాశతమగు స్మృతులుగా రచించిన చంచల కళలు నిల్పుదామని[15] అనడంలో ఐహిక సుఖ లోలులయే మానవాళికి ఒక కర్తవ్యోపదేశం ధ్వనిస్తుంది.

ఎందుకంటే బాహ్యలోకం ప్రణయాన్ని అదీ స్వేచ్ఛా ప్రణయ ప్రవృత్తిని అసలు ఒప్పుకోదు. కాబట్టి చుట్టూ లోకాన అలము కొన్న చీకటి తెరల మాటునతాను నిలువగలనో లేదో అనీ, నిలిచి విలపించి 'బ్రతుకు విరజిమ్మ'గలనో లేనో అనీ, సందేహించాడు. కవి ఉన్నకాస్త అవకాశాన్నీ జారవిడుచు కోలేక 'కరుణింపవాసఖీ-కరుణతో మరణింపవా' [16] అంటూ ప్రాధేయపడ్డాడు తిలక్.

కవి కన్నీరు నిఖిలభాగ్య 'మనీ' 'నిస్త్రాణ జగతికి నిషాగొల్పు మధు'వనీ[17] అభిప్రాయపడడంలో విరహంలోనే సుఖమున్నదనే భావ కవుల విశ్వాసమే ప్రకటితమవుతున్నది.

'అమృతం కురిసిన రాత్రి'లోని 'అద్వితీయం' 'స్వేచ్ఛా విహారం,' 'నువ్వులేవు నీ పాట వుంది' మొదలైన కవితలు కూడా ప్రణయకవితకు చెందినవే!

ప్రకృతి :-

భావకవితలో మరో ప్రముఖ శాఖ ప్రకృతి దీన్నిగూర్చి కూడా తిలక్ కొన్ని కవితల్లో చవిచూపాడు.

ఉదాహరణకు -'దీపావళి' అనే కవితలో

'దుర్విధి పెనుయుచ్చునబద్ధ దుష్టనిశికి
బాణసంచుల మంటలు ప్రాకి చిమ్మ
చీకటుల చీర నంటించి చిటినిపేర్చె
వత్సరమున కటికి అమవసికినంత' ! [18]

అనడంలో' చీకటుల చీర నంటించడం' లాంటి భావాలుకొత్త రుచుల్ని వెలారుస్తాయి.

అలాగే 'నీల జలదమ్ము నిండు చూలాలు వోలె నిలిచె, నాము గర్భమున పునీతమైన శిశువు నవ్వు కొనెడిని, సుస్నేహపటలి శ్యామ కన్యకలెందరు చలువకనుల పురుడు పోసి పెంచదరొ యభ్యుదయ మంచు'[19] అని చెప్పడంలో తిలక్ భావనాశక్తి, పద్యరచనా ధోరణి పద ప్రయోగ వైఖరీ వ్యక్తమవుతాయి.

'అమృతం కురిసిన రాత్రి' లోని 'సంధ్య,' 'యుగళగీతిక,' 'రాత్రి'. వానకురిసిన రాత్రి' అనే శీర్షికలు కూడా ప్రకృతికి సంబంధించినవే!

ఆధ్యాత్మికం :

మిగిలిన భావకవుల లాగా తిలక్‌కూడా భావావేశంగల ఆధ్యాత్మికతను ప్రకటించాడు.

ఉదాహరణకు- 'భిక్ష' అనే కవితలో

'శ్రీయుషసి చిర్నగవు
చిందు లాడేవేళ
చిన్ని జాబిలి నవ్వు
మిన్నులలమే వేళ
స్వర్గద్వారము నందు
ప్రేమ ప్రాంగణమందు
రవము లీనెడి గీతికా
రసమాధురుల ఝరులతో
ఈ జీవవేణువును నింపవోయీ!
ఈ మూగగొంతులో మీటవోయీ !20

అనడంలో భగవంతుణ్ణి ప్రాధేయ పూర్వకంగా వేడుకోవడం కానవస్తుంది.

ఉన్నతమైన భావన, దానికితగ్గ పదాల పోహళింపు, తిలక్ హృదయ స్పందనను ప్రతిధ్వనిస్తున్నాయి. ఇక్కడ అందుకే దిశల కొసల్ని జోలెగా చేసుకొని ఒకనాదం కోసం, గీతికకోసం తిరిగే భిక్షుకుడుగా తనను చెప్పుకున్నాడు కవి. భావకవుల అన్వేషణ తత్త్వం స్పష్టంగా గోచరిస్తుంది ఇందులో.

అలాగే 'ఆహుతి' అనే శీర్షికలో కాలమనే కాగితంపై కలంతో గీతాలురాసి మడుతలుపెట్టి 'చిల్లిజేబు'లో ఉంచుకున్నా నని చెపుతూ

'స్వామి! ఎంతమహోగ్ర మౌర్యమొకొయీ త
పస్సు! జీవమే సమిధగా వైచినాను
కాని లేచి విసిగియున్న కాచియున్న
యెదద్రవణమైన జేయక వెడలినావు!' 21

ఇత్యాదిగా కవి అనడంతో భక్తుడికి వలసిన ఆత్మార్పణ తత్త్వం ద్యోతం. ఎదదకు ద్రవణమైనా పరవాలేదనడంలో ఆర్తిసలక్షణం గోచరిస్తుంది.

అలాగే 'మూగనోము' అనే కవితలో 'పగల వెలుగుల నిలిచి' సతమతమవుతూ

'కదలు నా కన్నీట
చెదరిపోయిన పడవ!
సత్యాలయమ్ములో
స్వామి చరణ సన్నిధికి' 22

అంటూ జీవన ప్రయాణంలో అడుగడుగునా ఎదురయే సంశయాన్ని వ్యక్తీకరించాడు తిలక్.

అలాగే 'కొఱకు' అనే కవితలో

'ఎపుడొ నన్ను జూడగవత్తువేమొ యనుచు
దలచిపాడిల్లు తిరిగి సుధావినూత్న
శిలలవేదుల కుడ్యమాదుల రచించి
మించు కేళీ గృహమ్ము నిర్మించినాను
....మోసపోయితి నన్ను నమ్ముకొని నేనే!' 23

అనడంలో మధురభక్తి తత్త్వం వ్యక్తం.

'సఖినౌదునా! నీ
చారుగీతముల కేను శ్రుతి నౌదునా !
ఈ వేణు నేనెత్తి
నీమోవి నిలుపనా?
నీలోని మృదు బాధగా
నీలోని వలవంతగా
నీలోన వెలిగేటి
ముల్లోక మూర్తిగ-నేనౌదునా!'24

ఇత్యాది పాదాల్లో ('సఖి') కృష్ణశాస్త్రిని తలపించే తిలక్ మధుర గేయ ప్రక్రియా వైశిష్ట్యం తొణికిసలాడుతూంది.

అదే విధంగా 'నివాళి'లో

'వేడిమిలేని కాంతుల పవిత్రత నొందిన ముగ్ధమూర్తినై
పాడిన పాటనే మరల పాడుచు జీవన విపంచికా శ్రుతిన్
ఆడిన యంగుళీ నవనవారుణ రోచులె యాగియాడనీ
వేడుకలాలపింతు నరవిచ్చిన మెత్తనిగుండెగొంతులన్.25

అంటూ ఆలపించడంలో కూడా తిలక్ ఆధ్యాత్మిక భావావేశం ఉట్టిపడుతుంది. 'మెత్తని గుండె గొంతు' లాంటి పదబంధాలు భావకవుల ప్రయోగధోరణినే తెల్పుతున్నాయి. తిలక్ ధారాశుద్ధిగల వృత్తరచనకు ఈ పద్యం ఒక మచ్చుతునక. ఈ విధంగా 'ప్రభాతము-సంధ్య'లో కృష్ణశాస్త్రిదులను తలపించే చక్కని భావ కవితావేశం ప్రకటితమవుతుంది. మొత్తంమీద ప్రణయమూ, ఆధ్యాత్మికమూ ఎక్కువ, ప్రకృతి చాలా స్వల్పం ఇందులో. 'నవనవాలైన ఊహా వర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడూ,' 'గాజు కెరటాల

వెన్నెల సముద్రాలూ, జాజి పువ్వుల అత్తరుదీపాలూ, మంత్రలోకపు మణి స్తంభాలూ, కవితా చందన శాలలో కలం అనే కుంచెతో చిత్ర విచిత్రంగా చిత్రించిన చిత్రకారుడూ' తిలక్. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అంటూ తన కవిత్వాన్ని గూర్చి ఆయన చెప్పుకున్న మాటలు వాస్తవానికి ఈ కావ్యంలోని భావ కవిత్వానికే వర్తిస్తాయనిపిస్తుంది.

'మాటలు పేర్చడం కవితకాదు... కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి - విస్తరించాలి చైతన్యపరిధి. అగ్నిజల్లినా-అమృతం కురిసినా-అందం-ఆనందం దాని పరమావధి ('నవత-కవిత) 'వ్యక్తిలోపలి జీవితంలోకి చూపును త్రిప్పేదే ఉత్తమ కవిత' అనే తిలక్ అభిప్రాయాలకు ఈ ఖండకావ్యం ఒక లక్ష్యప్రాయం.

ఇకనైనా ఈ కావ్యాన్ని సంకుచిత తత్వం విడిచి వెలుగులోకి తెచ్చి పుణ్యం కట్టుకొందురుగాక!

అ ధో జ్ఞా పి క లు

1,2 'మావాడు-మహాగట్టివాడు'- కుందుర్తి- అమృతంకురిసిన రాత్రి-విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్—విజయవాడ-పు 4-5.
3. పూరిల్లు-'ప్రభాతము- సంధ్య'-పు. 72
4. సంధ్య - పు. 7,
5. ఏనాటిది - పు. 80
6. తుదికోర్కె - పు. 83
7. గృహాలక్ష్మి - పు. 77
8. నీవూ - నేనూ - పు. 9
9. అదే
10. దివ్యాలోకము - పు. 10
11. ప్రత్యూహము - పు. 17
12. ఆహ్వానము - పు. 21
13. నీకనులు - పు. 60
14. రేపో - మాపో - పు. 30
15. తర్పణము - పు. 37
16. తుదికోర్కె - పు. 83 - 84
17. కవి కన్నీరు - పు. 28
18. దీపావళి - పు. 19
19. దివ్యాలోకము - పు. 14
20. భిక్ష- పు. 8
21. ఆహుతి - పు. 11
22. మూగనోము - పు. 12
23. నీకొఱకు - పు. 29
24. సఖి - పు. 58 - 59
25. నివాళి - పు. 93 - 94

నీ కళ్ళు

మాధవుడు

స్త్రీ కనులభాషను గ్రహింపలేక
నా కళ్ళు ఓడి పోతున్నాయి
వాటి శతకోటి హావభావ పరం పరలకు
నాకు ఊపిరి ఆగినంత పనౌతోంది
వాటిపై ఎన్నెన్నో కావ్యాలు, గేయాలు
రాయాలన్నది
గాయమై నన్ను క్షీణింప చేస్తోంది
వాటి లోతులు నేనెఱుగనని
అవి అందాలకు ఆటు పట్లని
సౌందర్య భవంతులకు
ద్వార బంధాలని,
వాటి రెపరెపలు ప్రేమ మూర్తిని
కలపెట్టువని నా అంతరాత్మ
నాకు సొంతం గ్రహింప చేస్తోంది
ఆమె ముఖం అద్దమని
దానిలో కనిపించేది నా ప్రతిబింబమేనని
గ్రహింపుమని బుద్ధి చెప్పి
పక్కున నవ్వింది అంతరాత్మ—

అన్నదాతా! సుఖీభవ!



అరణి

మెరంగలి నాగు పిల్లలా పచ్చగా, సన్నగా అతని కాలికి ంగారు కడియం చుట్టుకొని ఉంది. దానికి ఉన్న ఎఱ్ఱరాళ్ళు పసుపు చ్చని ఎండని చూసి, పలకరింపు నవ్వు నవ్వుతున్నట్టుగా మెరు స్తున్నాయి.

అతను పావంచాలను ఒకొక్కటిగా దిగుతున్నాడు. గోదావరి ీటికి దగ్గరగా ఉన్న పావంచా మీద నిలబడి–నీటి మీద పుప్పొడి జల్లి ట్టున్న ఎండని చూసి ఆనందించాడు. తుండుగుడ్డను ఎగువ పావంచా ప నుంచి—

"హర హర మహ దేవ" అంటూ నీటిలో మునిగాడు. మూడు మునకలయిన తర్వాత తలను ఒక్కసారిగా విదిలించాడు. గోదావరిపై ానజల్లు కురిసినట్టయింది. పెద్ద పెద్ద పాయలుగా మెడ వరకూ న్న జుత్తును విదిలించటంతో ఓ క్షణం అతను నిల్చున్న మేర ోదావరి మీద నల్లమబ్బు నిలిచినట్టయింది. పిచ్చుక గూడులా ఉన్న అతని గడ్డంలో నీటి ముత్యాలు !

సుమారుగా అతనికి నలభై ఏళ్ళుంటాయి. నాపరాయి బల్లలా ల్లగా ఉన్నాడు. బల్లకి దారం చుట్టి నట్టుగా యజ్ఞోపవీతం ! మెళ్ళో ద్రాక్షమాల !

చేతులెత్తి కర్మసాక్షికి అర్ఘ్యం ఇస్తున్నాడు.

"బాగున్నావా పంతులూ" ఎవరో గట్టు మీంచి కేకేశారు.

"బాగు బాగు" అన్నాడు. నిలువు నీళ్లలో ఎగువ పావంచా ిదికి చేరుకొన్నాడు. తుండుగుడ్డతో కళ్లొత్తుకొని, తర్వాత దాన్నే ుంటికి చుట్టుకొని పంచెను జాడించాడు. జాడించిన పంచెను సగం ుజమ్మీద వేసుకొని— మిగిలిన సగం కొసలను చేతుల్తో గాలిలో ుపుతూ, ఆరబెడుతూ పావంచాలను ఒకొక్కటిగా ఎక్కి గట్టు ందికి చేరాడు.

ఆకలిగా ఉంది పంతులుకి!

"నమస్కారం పంతులు" ఊరి ప్రముఖుడు చేతులెత్తలేదు. ాట వరసకి అనేసి అటుగా వెళ్లిపోయాడు. కేకేసి అతన్ని పిలుద్దా నుకొంటూనే ఎందుకో ఆగిపోయాడతను.

బ్రాహ్మలెవరో అస్థికలను నిమజ్జనం చేసేందుకు గోదావరి ుపువస్తున్నారు. పోయిన వ్యక్తిది పెద్దకుటుంబంలా ఉంది పాతిక ందికి పైగా తరలి వస్తున్నారు. పంతులు వాళ్ల దగ్గరకి ఆత్రంగా రుకొన్నాడు. అడిగాడు—

" ఏసత్రంలో దిగారు బాబూ! వంటలెవరు చేస్తున్నారు".

ఎగాదిగా చూశారు వాళ్లు పంతుల్ని.

"ఎందుకు" అనడిగాడు.

"నేను వంట బ్రాహ్మణ్ని! శుచిగా రుచిగా వండి పెట్టగలను. తమరు రమ్మంటే ..." అని ఆగాడు

"హోటల్లో దిగాం! భోజన సదుపాయం కూడ అక్కడే ఉంది" అని వెళ్లిపోయారు వాళ్లు.

పంతులు నిరాశతో నిల్చున్నాడు. గత మూడు రోజులుగా అతనికి తిండిలేదు. ఆకలితో అల్లాడి పోతున్నాడు. 'దేహీ' అని ఎవర్నీ అడగడు. అటువంటి మనస్తత్వం కాదు. "కష్టపడతాను! పిడికెడు మెతుకులు పడేయండి !" అంటాడు.

అతను పడే కష్టం—

అతనికి తెలిసిన కష్టం ఒక్కటే!

వంటలు చేయడం!

భారీగా వంటలు చేస్తాడు. పెళ్లి వంటలు, సంతర్పణ వంటలు అంటే పంతులికి పెట్టింది పేరు. వెయ్యిమంది జనాభాకి "అరగంటలో వండి వార్చేస్తాడు. అంత వేగం వంటలు చేయడంలో లేదా చేయించడంలో రోజులు తప్పుతాయనుకోనేరు! అది జరగనిపని! ఇంతవరకూ అతని చేతి వంటలు తిని——

"మా భేషుగ్గా ఉన్నాయి" అన్నవారేగాని, మరోమాట అనేవారు లేరు. అతను గరిటె పట్టిన దగ్గర్నుంచీ మెచ్చుకోళ్లే పొందాడు.

"పంతులుకి తండ్రి తర్ఫీదు బాగా ఉంది." అని కొందరంటే!

"ఆ మాట ఎందుకు ? ఒకొక్కరి చేతి మహత్మ్యం అది". అనేవారు కొందరు. ఏదేమయినా పంతులు వంట పసందయిన విందులా ఉండేది.

ఒప్పుకొన్న ప్రకారం కాక, మధ్యలో వంద, యాభై విస్తర్లు లేస్తాయని పెళ్లి వారంటే——

"కుదరదు" అని విసుక్కునేవాడు కాదు. మళ్లీ పప్పులు, ఉప్పులూ కావాలని సాధించేవాడూ కాదు.

"రానీయండమ్మా! పదిమంది కలిస్తేనే పందిరి కళకళ్లాడేది" అని భరోసా ఇచ్చి కాగుని వెంటనే గాడిపొయ్యి మీదికి లాగేవాడు.

అప్పుడు——

అన్నం ఒక్కటే మళ్లీ వండేవాడు. ఔపత్యాల ఊసు ఎత్తేవాడు కాదు. ఉన్న పప్పు, పులుసులనే మరింత పల్చన చేసి ఉప్పు, కారం, పులుపూ వేసి అందరికీ సర్ది వచ్చేలా చేసేవాడు. దుబారాతనం లేదు.

అందుకే—

పదేళ్లక్రితం——

పెళ్లి వంటలకి, సంతర్పణ భోజనానికి పంతులును పిలిచేందుకు ఊళ్లోవాళ్లు వంతులు వేసుకొనేవారు.

"పంతులూ! పూర్ణం బూరెలు మిగిలిపోయాయి. ఏం చేస్తావో ఆలోచించు!" అని ఇంటి పెద్ద అంటే-

"రాత్రికి అవే బొబ్బట్లండీ" అనేవాడు. బూరెలమీది తొడుగును తీసేసి, పూర్ణంతో పిండివంట మరొకటి చేసేవాడు.

ఉదయం మిగిలిన పప్పు రాత్రికి సాంబారు-

ఉదయం మిగిలిన పులుసు రాత్రికి రసం-

అదీ పంతులు వంట ప్రతిభ! వాసన వేయడం, అరుచి పుట్టడం అతగాడి వంటల్లోనే లేదు.

వందల మందికి తృప్తిగా భోజనాలు ఏర్పాటుచేసే పంతులుకి-

తన నీడన పదిమందికి బతుకు తెరువు చూసే పంతులుకి-

ఇప్పుడు-

గుప్పెడు మెతుకుల్లేవు. ఆకలి కరకర లాడుతూంది.

తాలింపు వాసన ముక్కున సోకింది. పంతులు వాసన వస్తోన్నదిక్కుగా చూశాడు. లాంచీ మీద సరంగు వండుకొంటున్నాడు. వెల్లుల్లి వేయలేదు. వేస్తే వాసన ఇంకా గుమాయించేది అనుకొన్నాడు. వచ్చే వాసనను గ్రహించే వంటల్లో ఎక్కువ తక్కువలు చెప్తాడు. వంట చెడితే ప్రాణం పోయినట్టు గిలగిల్లాడేవాడు. జట్టును అమ్మా, ఆలి చేసి తిట్టేవాడు.

పెళ్లాన్నయినా ఆ విషయంలో లెక్క చేయలేదు!

ఆ రోజు-

శాస్త్రులు గారింటి వంట!

ఓ ప్రక్క సత్యనారాయణ వ్రతం జరుగుతోంది. మరోప్రక్క వంటలవుతున్నాయి.

పంతులు వంకాయ ముద్దను తొక్కుతుంటే, భార్య అన్నపూర్ణ పప్పును కలియ బెట్టింది.

వడ్డనలు జరిగాయి. అన్నంలో పప్పుకలిపి, గురుగులు కట్టి పులుసు అడుగుతున్నారు.

"వచ్చేవచ్చే" అని వడ్డన వాళ్లు తిరుగుతున్నారు. ముద్దను పులుసులో ముంచి నోట పెట్టారో లేదో భోక్తలు——

"పప్పులో ఉప్పు తక్కువయింది." అని ఒకటే గోల !

తప్పనిసరయి మనిషి మనిషికి నూరిన ఉప్పును అందిస్తున్నారు శాస్త్రులుగారు. అన్నేళ్లకి తల కొట్టేసినట్లయింది పంతులుకి.

అంతే !

జుట్టుపట్టి, అన్నపూర్ణని తిట్టరాని తిట్లు తిడుతూ అక్కడికక్కడే చెమ్మాలాడ గొట్టేశాడు !

"వద్దు ! వద్దు !" అని ఎవరు ఎంత వారించినా విన్పించుకోలేదు. కోపం వస్తే ఇనుపదేవుడే !

అన్నపూర్ణ సిగ్గుతో కుంచించుకు పోయింది. భర్త కొట్టారని బాధకాదు. పదిమంది ముందూ నోటికొచ్చిన తిట్లు తిట్టారని ఆవేదన చెందింది.

రాత్రి

గంగాళాలకి, వడ్డన పళ్లాలకి, గోకర్ణాలకి మధ్యన పడుకొని ఏడ్చింది. పంతులు వెళ్లి నిల్చున్నాడక్కడ.

"పూర్ణా ! నేను చేసింది తప్పంటావా ?" అనడిగాడు రుద్ధ కంఠంతో.

అన్నపూర్ణ సమాధానం చెప్పక వేల కళ్లతో చూసింది,

"మనకింత తిండి పెడుతూ, పదిమందినీ సంతృప్తిపరిచే ఈ వృత్తిలో అవకతవకలు జరిగితే భరించలేనే ! అందుకే నేనలా రెచ్చి పోయాను. నా తిట్లు ఆశీర్వచనాలే పిచ్చిముండ !" అని ఆమె తలను చేత్తో నిమిరాడు.

అన్నపూర్ణకి కోపం పోయింది. నవ్వొచ్చింది. నవ్వుతూనే మర్నాటివంటలకి తయారయింది. మూడడుగులు లోతు గాడీ పొయ్యి మీద ఎకాఎకీన పది కాగులకి ఎసరు ఎక్కించింది.

జల్లి గంపల్లో బియ్యం కడుగుతున్నారు. కూరగాయలు తరుగుతున్నారు. పిండి వంటకి కావాల్సిన నూనె ఇంకా రాలేదని పంతులు పెళ్లి వాళ్లపై కేకలేస్తున్నాడు.

ఇంతలో

గంపలోని బియ్యం కాగులోనికి పోస్తూ కాలు వసలడంతో అన్నపూర్ణ గాడీలోనికి పడిపోయింది.

మంటలు ! మంటలు !

కాగుల్ని మరగించే మంటలు !

అన్నపూర్ణను నిలువునా దహించే మంటలు !

పంతులు గుండెల్లో మంటలు !

అయితే—

ఆనాడు భార్య చనిపోయిందన్న బాధకంటే వంటలు చెడి పోయాయన్న బాధతో అతను ఏకధాటిగా ఏడ్చాడు.

"శాస్త్రులుగారూ ! ప్రారంభించిన వేళా విశేషం. బాగాలేదు ! నన్ను క్షమించండి." అంటూ బేరానికి ఒప్పుకొన్న డబ్బు కూడా తీసుకోకుండా వెళ్లిపోయాడు.

మామూలుగానే ఆనాడు కూడా—

గోదావరిలో తలస్నానం చేశాడు. సంధ్యావందనం ముగించాడు శుచిగా మరచెంబుతో నీళ్లు తోడ్చుకువచ్చి పాత్ర సామగ్రిని, వంట సామగ్రిని శుద్ధి చేశాడు.

గాడీని మండించి –

అగ్ని దేవుడికి అరచేతి నిండా నెయ్యిని తీసి ఆహుతి చేశాడు. అయినా ఆ దేవుడికి ఆకలి తీరలేదేమో అన్నపూర్ణను పొట్టన పెట్టుకొన్నాడు. పంతులు పొట్ట మీద దెబ్బ తీశాడు,

భార్య పోయినందుకు కొన్నాళ్లు –

తర్వాత చాలా రోజుల వరకు పంతులు వంటలకి వప్పు కోలేదు.

చిన్నప్పట్నుంచీ గాడీ పొయ్యి అతనిపై కక్షసాధిస్తూంది.

పదేళ్ల వయసులో —

గోదావరిలో మునుగీత కొడుతూ, తేలుతూ డబ్బులు ఏరు కొంటున్నాడు. చేతులనిండా చిల్లర నాణాలే ! సంతోషంతో తుళ్లి తుళ్లి పడుతున్నాడు.

గట్టు మీంచి అమ్మకేక ఏడుపు గొంతుతో విన్పించింది.

"అమ్మా ! ఏమయిందీ !" అని పెద్ద పెద్ద బారలు వేసి గట్టును చేరుకొనే సరికి

"నాన్న గాడీలో పడ్డాడే తండ్రీ" అంటూ ఏడ్చిందామె.

వెళ్లి చూశాడు.

తండ్రి శవం నూనెలో వేలిన పచ్చిమిరపలా ఉంది.

కాలి కొరకంచులా నల్లగా ఉంది.

తర్వాత మరి పదేళ్లకి --

అదే గాడీ పొయ్యి నుండి మంటలెగసి అమ్మ కళ్లను పొగొట్టాయి. ఆ బాధతో మంచం ఎక్కి తీసుకొని తీసుకొని చనిపోయిందామె.

ఇప్పుడు అన్నపూర్ణ !

పంతులు పిచ్చెక్కి పోయాడు. దాదాపుగా ఆరేడు నెలలు వంటల జోలికి పోలేదు. ఈ లోపు అతని శిష్యులే కొత్త ఇట్టుగా తయారయ్యారు. పంతులు పేరు వాళ్లకొచ్చింది. దాంతో పంతుల్ని పిలవడం అంతా మానుకొన్నారు.

శిష్యుల్లో శిష్యుడిగా చేరలేదు పంతులు. అలాగని పెద్దరికాన్ని కూడ అడగలేదు. అతను, అతని వృత్తి మూలన పడ్డాయి.

ఓ సాయంకాలం

శిష్యులంతా కట్టగట్టుకొని పంతులింటికి వచ్చారు. నమస్కరించారు.

"మీరు నేర్పిన విద్య మాకింత కూడు, గూడును కలుగజేస్తోంది. అందుకు కృతజ్ఞతగా...." అంటూ ఎర్రరాళ్ళు పొదిగిన బంగారు కడియాన్ని అతని కాలికి తొడిగారు. అప్పుడతను పాల పొంగయ్యాడు. కళ్ళంట పాలు పొర్లాయి. పేరు పేరునా అందర్నీ కౌగిలించుకొని ఆశీర్వదించాడు.

'నాతో పాటే ఇదీ...." అని కాలికున్న కడియాన్ని ఆప్యాయంగా చూసుకొన్నాడు.

వాళ్లు వెళ్లిపోయారు.

అతను మిగిలిపోయాడు.

తర్వాత్తర్వాత వాళ్లూ ఎటువంటి వంట పనులూ లేక ఖాళీగా మిగిలిపోయారు.

సంప్రదాయంలో మార్పులొచ్చాయి.

సంస్కృతిలో మార్పులు సంభవించాయి.

నవీన నాగరికత నాలుగు చెరగులా పాకింది.

పెళ్లిళ్లు ఇళ్లలో జరగడం లేదు. పూర్వంలా వారం, పది రోజుల పెళ్లిళ్ల అసలు లేనేలేవు. వందలాది మంది బంతులు తీరి కూర్చుని భోజనాలు చేయడం. ఆ భోజనాలు వంట బ్రహ్మలు వండి, వార్చడం లేవు.

ఉదయం ఉపనయనం—

మధ్యాహ్నం పెళ్లి —

రాత్రి శోభనం—

ఆహూతులు లెక్కపెట్టినట్టుగా వస్తున్నారు. లెక్కగట్టినట్టే నాలుగంటే నాలుగే నిమిషాలుండి వెళ్లి పోతున్నారు.

కొంచెం కలిగిన వాళ్లయితే-

హోటల్స్‌ను బుక్ చేస్తున్నారు. యూనిఫామ్‌ల్లో సర్వర్లు సర్వ్ చేస్తూంటే 'బఫే' డిన్నర్లు బలంపుంజు కొన్నాయి.

కోవెల పెళ్లిళ్లు-

ప్రైవేట్ కళ్యాణ మంటపాలూ వెలిశాయి. పెళ్లికూతురు, పెళ్లికొడుకూ ఉంటే చాలు! పెళ్లిళ్ల ఆయా సంస్థల వారు నిర్విఘ్నంగా జరిపిస్తున్నారు. ప్రస్తుతం అటువంటి సంస్థలే పెళ్లికూతురికి - పెళ్లికొడుకుని; పెళ్లికొడుక్కి - పెళ్లికూతుర్నీ కూడా చూసేసి—

సంబంధాలు కలిపేసి-

కులాల పేరిట ప్రముఖంగా వర్ధిల్లుతున్నాయి.

ఎవరికి కావాలి పచ్చి పులుసు?

ఎవరికి కావాలి వంకాయ, జీనుగుల ముద్ద!?

కావాల్సింది అవి కానేకావు.

బిర్యానీ!

చికెన్ బిర్యానీ!

మటన్ బిర్యానీ కావాలి! అవి చేయడం పంతులుకి చేతనవునా!?

కాదు.

అందుకే-

దీపం లేని దేవుడిగుడిలా పంతులు!

లోకం తెలియని పసిపాపలా పంతులు!

పంతులు ఆకలికి కనలి పోతున్నాడు. గట్టునపడ్డ చేప పిల్లలా ఉందతని పరిస్థితి. అతని కళ్లలో గోదావరి!

అరటిడొప్ప సాయంతో కుర్రాడెవరో గోదావరిలో ఎగువకి ఈదుతున్నాడు, ఆత్రంగా వెళ్తున్నాడు. జీడిమామిడి పళ్లతో చెట్టుకొట్టుకొస్తోంది. ఆబగా దాన్ని అందుకొంటున్నాడు.

ఆకలి పోరాటం అది! ఆ పోరాటంలోనే ఆఖరికి తడి, మడి విడిచిపెట్టి—

నగరంలో ఉన్న అధునాతన ఉడిపి బ్రాహ్మణ హోటల్‌కి పని చేసేందుకు వెళ్లాడు. అక్కడి సూపర్‌వైజర్‌కి పొట్టను రెండు చేతుల్తోనూ చూపించి, చేతులెత్తి నమస్కరించాడు.

"ఏం చేస్తావు"

"వంటలు"

"డిప్లొమా ఉందా"

ఆ మాట అర్థం కాలేదు పంతులికి. అదేమయినా అటువంటిది ఏదీ అతని దగ్గర లేదని చెప్పాడు.

"అయితే పనికిరావు" అన్నాడు.

పంతులు నిరాశగా వెను తిరిగాడు. అతని వెనక తెల్లని ఎత్తు టోపీల్లో, తెల్లనయిన బట్టల్లో, తెలతెల్లని ఏ(ప్రాన్లలో కుర్క్స్!

వాళ్లంతా నవ్వుకొంటున్నారు.

ఇంగ్లీషులో మాట్లాడు కొంటున్నారు. పరబ్రహ్మ స్వరూపాన్ని 'రైస్' అంటున్నారు.

పంతులుకి నవ్వు రాలేదు.

ఏడుపు అంతకన్నా రాలేదు.

రెండూ కలగలిసిన భావం——

గోదావరి పరవళ్లు తొక్కుతూ పాపి కొండల వరకు యాత్రికులను పల్టీ కొట్టిస్తే——

తల్లి గోదావరిని చూసి ఆనందించాలో

ఘోరంగా బలయిన యాత్రికుల్ని చూసి

దుఃఖించాలో తెలియనట్టు

నిర్లిప్తత అతనిలో చోటు చేసుకుంది.

గత మూడు రోజులుగా అతను ఆ నిర్లిప్తతలోనే ఉన్నాడు. అయినా ఆకలి వేస్తోంది. అడుక్కోడు. కష్టపడతానంటాడు. అతనికి చేతనయిన కష్టం ఇంకెవరికీ ఇష్టంలేదు.

ఏం చేస్తాడు?

ఏం చేయగలడు?

గట్టుమీంచి గోదావరి లోనికి దిగాడు. దోసిలిపట్టి నీరు తీశాడు. కడుపు నిండుగా తాగాడు. '(బేవ్'మని (తేన్చాడు. అలవాటుగా——

'అన్నదాత! సుఖీభవ!'

అని ఆశీర్వదించాడు.

అతని కాళ్లపై గోదావరి మోకరిల్లింది.

ప్రయాణించే పాదాలు

శ్రీ రామా చంద్రమౌళి

ప్రయాణించే పాదాలు ఒక్క క్షణం ఆగిపోతే
హృదయం నిండా ద్రవాన్ని కోల్పోయిన సీసాలా ఒట్టి శూన్యం
అలసట ప్రవాహాన్ని తెంపే ఓ ఇసుక మేట తన్నుకు పోవాలి దాన్ని దాటుకుని
పరిస్థితులు, బాధ్యతలు ఎప్పుడూ సంకెళ్ళను విసిరే శత్రువులే
విజ్ఞత, ధైర్యం - పోరాటం ఇవీ మనను ముందుకు నడిపించుకు పోయే సహచరులు
'రాజీ' అనే శబ్దం ఓ పిరికివాడు కప్పుకునే దుప్పటి –
తల వంచుకుని నడచిపోవడం ఎంత వికారంగా ఉంటుందో ఊహిస్తున్నాను,
గుడ్డుపొత్తును చీల్చుకుని పక్షి బయటికి వచ్చినట్టు
ధైర్యం శూలంతో గుండె జెండాను ఎగురేసుకుంటూ
చూపులను నక్షత్ర శ్రేణుల్లోకి సంధించి లక్ష్యాలను సాధిస్తూంటే
ఓహ్ ఏది నీకు లొంగనిది. ఏది నీకు చెందనిది. ఏది నీది కానిది.
"ప్రశ్న" అనే ద్వీపం చుట్టూ
సమస్య లెప్పుడూ సముద్రాలే ... ముంచేయాలని గర్జిస్తాయి
ఆలోచనలను విదిలించి సాధనతో విక్రమిస్తే
చరిత్ర నీ వశమౌతుంది
చూచి, విని, పొందీ ఆనందించడం కాదు
ఆనందింప జేయడం నేర్చుకో
సృష్టివి కావడం కాదు సృష్టి కర్తవు కావడం నేర్చుకో

శ్రీ కె. రామాంజనేయులు

రాయవాచక భాషలో వ్యావహారికత

0.1 సమాజం-భాష : ఇవిరెండు చైతన్యవంతమైనవి. నిత్యపరిణామ శీలత గలవి. వీటికి కొన్ని అవసరాలు విలువలు ఉంటాయి. ఈ లక్షణాలతో నిత్యపరిణామం పొందుతాయి. ఆదిమ మానవ సమాజానికి, ఆధునిక మానవ సమాజానికి సంస్కృతి నాగరికతల్లో తేడా ఉన్నట్లే, ఆదిమ మానవ భాషకు, ఆధునిక మానవ భాషకు చాల తేడా ఉంది. సమాజం కాని, భాషకాని కాల క్రమంలో పరిణామం చెందుతూ ఉంటాయి. ఈ పరిణామంలో పాత దనం పోయి, కొత్త దనం చోటుచేసుకుంటుంది. అలా మరుగై పోయిన పాతదనాన్ని (చరిత్రను) తెలుసుకోవాలంటే చారిత్రక నేపథ్యం ఎంతైనా అవసరం.

0.2. భాషా-పరిణామం : భావ వ్యక్తీకరణ సాధనం భాష. ఆదిమ మానవుడు తోటి జీవచరాల్లాగే తన అనుభూతుల్ని (ఫీలింగ్స్.) కొన్ని ధ్వనుల (సౌండ్స్) చేత అభివ్యక్తం చేశాడు. పరిణామ దశలో ఈ అభివ్యక్త ధ్వనులకు సంజ్ఞలు (సైన్స్) ఏర్పడ్డాయి. ఈ సంజ్ఞలే క్రమ క్రమంగా సంకేతాలై (సింబల్స్) భాష (ల్యాంగ్వేజ్)గా పరిణమించింది. తదనంతర కాలంలో ఈ భాషకు లిపి (స్క్రిప్ట్) ఏర్పడింది.

0.3. భాష-రూపభేధాలు : లిపి ఏర్పడినప్పటినుండి భాషలో ద్వైవిధ్య మేర్పడుతూవచ్చింది. ఈ ద్వివిధరూపాలే తర్వాత గ్రాంథిక భాష (బెక్నువల్ ల్యాంగ్వేజ్,) వ్యావహారిక భాష (కలోక్వియల్ ల్యాంగ్వేజ్)లుగా పిలువబడ్డాయి. నిజానికి వ్యావహారిక భాషే కొన్ని ప్రమాణాలతో గ్రాంథిక భాషగా ఏర్పడింది. ఈ మారిన గ్రాంథిక భాషకు,వ్యావహారికభాషకు మధ్య భేదం అలాగే దూరమౌతూవచ్చింది. తర్వాత గిడుగు రాకతో ఈ భేదం క్షీణించిపోయిందనే చెప్పాలి.

0.4. వ్యావహారిక భాష - పరిణామం : వ్యావహారిక భాషకు పూర్వరంగంగా శాసనకాలంనుండి చెప్పుకున్నా, నేటి ఆధునిక వ్యావహారిక భాషకు 16వ శతాబ్దం ప్రారంభదశ (ఇనిషియల్ స్టేజి)గా గుర్తించవచ్చు. ఎందుకంటే 16వ శతాబ్దం నాటి నుండి వ్యావహారిక భాషానిర్మాణం, పదప్రయోగాలు ఎక్కువగా ఆయాగ్రంథాల్లో చోటు చేసుకుంటూవచ్చాయి. ఆ తర్వాత గిడుగువారిప్రభావంతో వ్యావహారిక భాషావాదం విజయ దుందుభి మ్రోగించింది.

1.0. రాయవాచకం-వ్యావహారికత : రాయవాచక భాషవ్యావహారిక భాష నోటిమాటకు చేతి వ్రాతకు సామరస్యం కుదిరిన భాష. లక్షణగ్రంథాల్లోని సూత్రాలకు కట్టుబడనిభాష. సమకాలీన శాస నాల్లో కనబడేభాష[2]. రాయవాచకంలోని భాషనుగూర్చి పలువురు తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. 1914లో రాయవాచకాన్ని ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలో మొదటిసారిగా ప్రకటిస్తూ జయంతి రామయ్య పంతులుగారు, "భాష తరచుగా లక్షణ విరుద్ధమయినను జరిత్రాంశముల ప్రధానముచేసియు దక్షిణదేశ మందానాడు వ్యాపించి యున్న వ్యావహారికాంధ్రభాషా స్వరూపము లోకమునకు దెలియుట మంచిదనియు వాక్యరచన మున్నది యున్నట్లే ప్రకటించుచున్నాము.[3]"

1933లో రాయవాచకాన్ని పుస్తక రూపంలో ప్రకటిస్తూ, జయంతి రామయ్యపంతులుగారు పై అభిప్రాయాన్నే, తమ ఆంగ్ల పీఠికలో కొంత విపులీకరించారు. "ది బుక్ ఈజ్ రిటన్ ఇన్ ది కలోక్వియల్ తెలుగు విచ్ సీమ్స్ టు హ్యావ్ బీన్ కరెంట్ అమాంగ్ ది ఆంధ్రరెసిడెంట్స్ ఇన్ ద ట్యామిళ్ డిస్ట్రిక్ట్స్ ఎబౌట్ ది మిడిల్ ఆఫ్ ది సిక్స్టీన్త్ సెంచురి ఎ. డి. ది ల్యాంగ్వేజ్ ఈజ్ ఆఫన్ ఫాల్టీ అండ్ ది స్టెయిల్ ఇన్‌వాల్వ్‌డ్ అండ్ సమ్‌టైమ్స్ అబ్స్క్యూర్. పేరాగ్రాఫ్స్ అండ్ సమ్‌టైమ్స్ సెన్షన్ రన్ ఇన్‌టు వన్ అనదర్ వితౌట్ ఎనీ రిగార్డ్ టు క్లియర్‌నెస్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ పంక్చుయేషన్ వాజ్ అన్నోన్ టు ది రైటర్"[4]

ఆ ప్రచురణకే వ్రాసిన ఫోర్‌వర్డ్‌లో కృష్ణస్వామి అయ్యంగార్ "ది ల్యాంగ్వేజ్ ఆఫ్ ది వర్క్ ఈజ్ ఎ రాధర్ పాపులర్ ఫార్మ్ ఆఫ్ తెలుగు అండ్ సర్టయిన్ ఫీచర్స్ ఆఫ్ ది ల్యాంగ్వేజ్ వుడ్ ఇండికేట్ దట్ ఇట్ ఈజ్‌ది తెలుగు ఆఫ్ ది తమిళ్ కంట్రీ పర్‌హ్యాప్స్ ది ఏజెంట్ వాజ్ ఎ తెలుగు ఆఫ్ టమిళ్ డోమసైల్."[5]

'తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము'(1968)అనే తమ గ్రంథంలో ఉర్దూ, పారసీ పదాలలో కొన్నిటికి అర్థనిరూపణచేస్తూ, కె. గోపాలకృష్ణారావుగారు, "ఇది చారిత్రక ప్రాధాన్యముగల వచన కావ్యం. విజయనగర వృత్తాంతము, శ్రీకృష్ణరాయల చరిత్రము మున్నగు అంశములిందు నాటి వ్యవహార భాషయందు వివరింపబడుట ప్రధానముగ గమనింపదగిన విశేషము. నాటి ఆంధ్ర వ్యవహారభాషా స్వరూపము గ్రహించుట కిది ఎంతయు తోడ్పడినట్లు, ఉర్దూ, పారశీక

పద ప్రయోగ స్వరూపము కూడ బరిశీలించుటకు సహాయకారికాగలదు. ఇతర కావ్యములందు గన్పట్టని విశిష్ట ప్రయోగములిందుగలవు."[6] అర్ద్ర, "రాయవాచకం అనాటి వ్యావహారికంలో వ్రాసిన చక్కని వచనగ్రంథం" అన్నారు.[7]

దక్షిణాంధ్ర సాహిత్యాన్ని గూర్చి వ్రాస్తూ నేలటూరి వెంకట రమణయ్యగారు : "రాయవాచకము, 16వ శతాబ్దాంతమున రాయ సామ్రాజ్యమున రాజకార్య వ్యవహారములను నడుపు అధికారవర్గము నందు చెలామణి యందుండిన భాషయందు వ్రాయబడినది."[8]

దక్షిణాంధ్ర సాహిత్యాన్ని గూర్చి వ్రాస్తూ, యస్వీ జోగారావు గారు, "అది (రాయ వాచకము)రాయ సామ్రాజ్యమునకు సంబంధించిన చరిత్రాదికము నప్పటి (16వ శతాబ్దాంతము) రాజకీయోద్యోగుల వాడుకభాషలో కట్టుకథలతో నేకరువుపెట్టు గ్రంథము." అన్నారు [9]

ఇంకా కులశేఖరరావుగారు తమ (సిద్ధాంత) గ్రంథంలో రాయ వాచక వచనశైలిని ప్రస్తావిస్తూ ఇట్లన్నారు." రాయవాచకమున అన్నిటికి మించి ముఖ్యముగా చెప్పవలసినది తత్కర్తయవలంబించిన వచనశైలి. ఇట్టిశైలి యాంధ్రమునందపూర్వ మైనది. వ్యావహారికమునకు సన్నిహితమై, కథనాత్మకముగాను, సరళముగాను"నున్నది. [10 a] వారింకా ఇట్లు వివరించినారు. "వ్యావహారికశైలిని యభిమానించిన రాయవాచక కర్త వ్యావహారిక పదజాలమును కూడ నభిమానించి యున్నాడు. తన పరిసరములలో వాడబడు పదములను, రాజకీయ యోగమున నున్నపదములను ఈతడు యథేచ్ఛగా గ్రహించి యుప యోగించెను. ఇందు దేశ్యపదములును, అన్యదేశ్య పదములును కలవు. దేశ్యపదములు చాలవరకు యథాతథముగా కాక మార్పు చెందిన రూపములలో నుపయోగింపబడినవి. కొన్ని మార్పుల పదములు, నేడు ప్రాచుర్యమున లేనివియు నిందుకలిగినవి. ఇక అన్యదేశీయ పదములు కూడ మార్పుతో నున్నవి యధికము, కొన్ని యున్నవి యున్నట్లే లేకపోలేదు." [10b]

2.0. లేఖన సంప్రదాయాలు : నన్నయ కాలం నుంచి వాఙ్మయం బయలుదేరింది. కావ్యాలు తాళపత్రాల మీద ఘంటంతో వ్రాసేవారు. క్రీ. శ. 6వ శతాబ్దం నుండి నేటిదాక అంటే ఈ 15 శతాబ్దాల కాలంలో తెలుగు అక్షర స్వరూపంలో, లేఖన సంప్రదాయాల్లో ఎన్నో మార్పులువచ్చాయి. కొన్ని ధ్వనులు భాషలో లోపించి పోయాయి. కొన్ని నూతన ధ్వనులేర్పడ్డాయి. కొన్నిసందర్భాల్లో లోపించిపోయిన ధ్వనులకు లిపి చిహ్నాలు అలాగే ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ధ్వనులకు లిపి చిహ్నాలు ఏర్పడలేదు. అయినప్పటికీ ఆంగ్లం మొదలైన కొన్ని యితర భాషలతో పోల్చిచూస్తే తెలుగులో మనం ఉచ్చరించే ధ్వనులకు వ్రాసేవ్రాతకు ఎక్కువ వైరుధ్యం లేదని చెప్పవచ్చు.

రాయవాచకంలోని కొన్ని లేఖన సంప్రదాయ లక్షణాల్ని వివరిస్తూ, డా॥ సి. వి. రామచంద్రరావుగారు;. "రాయవాచకంలో లేఖన సంప్రదాయం (స్క్రిప్టల్ ట్రెడిషన్) చాలవరకు, నోటిమాటకు చేతి వ్రాతకు పొత్తుకుదిర్చే ప్రయత్నంగా ఏర్పడిందన్నారు."

రాయవాచకంలోని లేఖన సంప్రదాయాల్లోని లక్షణాల్ని వివరించేముందు ఒక్కవిషయం చెప్పాలి. పుస్తకాలు ప్రచురించేవాళ్ళు సాధారణంగా ప్రాచీన లేఖనంలో కొన్ని మార్పులుచేసి ఆధునికలేఖన పద్ధతికి కొంత అనుగుణంగా ప్రకటిస్తూ ఉంటారు. ఇటీవల అన్నమాచార్యుల సంకీర్తనలు అచ్చువేసినప్పుడు ఇదే జరిగింది. రాగి రేకుల మీద ఉన్నవ్రాతలకి, అచ్చులో కనబడేవాటికి పదలేఖనం (స్పెల్లింగ్)లో తేడా కనిపిస్తుంది. ఈ విధంగానే రాయవాచకంలో కూడా వినిమయాన్ని బట్టి చూస్తే కొంతమార్పు జరిగి ఉండవచ్చునని ఊహ. స్థూలదృష్టికి ప్రాచీన లేఖన పద్ధతిని ముద్రాపకులు చాలవరకు పాటించినట్లే కన్పిస్తుంది.[12]

2. 1. పూర్ణానుస్వారం మీది హల్లు ద్విత్వంగాను, ద్విత్వ రహితంగాను ఉంది. అనుస్వారంమీది హల్లు తేలికగా పలుకబడుతుంది.

ఉదా : కూర్చుండ్డుక (17-14), కూర్చుండుకొని(17-9)
సంవ్వత్సరానికి (41-18), సంవత్సరము(14-8)

(బ్రాకెట్లలో ఇచ్చిన అంకెలు వరుసగా పుటను పంక్తిని తెలియజేస్తాయి)

2. 2. అనుస్వారంతో కూడిన స్పర్శవర్ణం వ్రాసేటప్పుడు అనుస్వారంతోపాటు వర్గానునాసికం కూడ వ్రాయడం కనిపిస్తుంది. ఇక్కడ అనునాసికం మీద ఊనిక (స్ట్రెస్) పడుతూంది.

ఉదా : పంఙ్క్తి (67-1), పంక్తి(17-6)
నుణ్డి(61-2), నుండి(49-17)

2. 3. ద్విత్వమకారం వ్రాయటానికి పూర్ణబిందువువ్రాసి దాని మీద మకారమో లేక ద్విత్వ మకారమో వ్రాసేవారు. అలాగే నకార విషయంలో కూడ.

ఉదా : అంమ్మవార్కి(1-12-18) వెలదం మి(25-9)
పింమ్మట (2-19),
దిక్కుంన్నె(80-20), ఉదయాంన్నే(99-17)

2. 4. సంయుక్తాక్షరాల నడుమ ఒక అచ్చునుచేర్చి ఉచ్చరించటంవల్ల ఉచ్చారణ సౌలభ్యమేర్పడుతుంది. ఈ ప్రక్రియను 'స్వర భక్తి' (ఎనాప్టిక్సిస్) అంటారు.

ఉదా : దరిశనము (< దర్శనము) (8-18)
పాతరలు (<పాత్రలు) (85-13)

2. 5. పదమధ్యంలో అచ్చు లోపించి హల్లు మీద హల్లుతో కూడికొనుట. దీన్నే 'పదమధ్యాజ్లోపం' (సింకోప్) అంటారు. వ్యావహారిక భాషలో ఈ మార్పు తరచుగా కన్పిస్తుంది. అయితే ఈ విషయంలో ప్రాచీనభాషకి నేటిభాషకి భేదం వుండొచ్చు. పాల్కురికి సోమనాథుడు పెర్గు, కస్వులాంటి రూపాలు వాడేడు. అప్పటి శాసనాల్లో 'కొడ్కు' అనే రూపం తరచుగా కన్పిస్తుంది. ఇలాంటి రూపాలే రాయవాచకంలో కూడ కన్పిస్తాయి.

ఉదా : గుడ్కి (< గుడికి) (112-14), వార్కి (< వారికి) (112-18) వార్లను (<వారలను) (54-10)

2. 6. ఒక వర్ణంలోపించి తత్పూర్వస్వరం దీర్ఘం కావటం లోపదీర్ఘత (కాంపెన్సేటరీ లెంగ్తనింగ్). వ్యావహారిక భాషలో ఈ రూపాలు కోకొల్లలు.

ఉదా : అడ (< అక్కడ) (80-21)
వజ్రాలు (< వజ్రములు) (105-10)
దానానకు (< దానమునకు) (7-20)
అనుగ్రహించేరు (< అనుగ్రహించెదరు) (9-18)

2.7. రేఫ తర్వాత హల్లు వచ్చినపుడు, హల్లుద్వాసి, తర్వాత రేఫకు బదులుగా వలపలగిలక వ్రాయటం వెనుకటి రోజుల్లో ఉండేది. రాయవాచకంలో ఒకప్పుడు వ్రాయటం, ఒకప్పుడు వ్రాయకపోవటం, కొన్నిచోట్ల రేఫ + వలపలగిలక వ్రాయటం— ఈ విధమైన అనియత స్థితి కన్పిస్తుంది.

ఉదా॥ వార్తలు (61-8), తూర్పున (57-5)
దుర్గములు (59-16)

వలపలగిలక వ్రాసినపుడు కొన్నిచోట్ల రేఫమీది హల్లు ద్విరుక్తమౌతుంది.

ఉదా॥ వార్ల్లు (64-2)
కర్న్నాటకం వారున్ను (57-4)

2. 7. 'ఎక్స్' (ఏ) అనేధ్వని కొన్ని సందర్భాల్లో ఏకపదంలోనే అ, ఇలవర్ణ సమీకరణంవల్ల, ఉచ్చస్వరం నిమ్నస్వరం కావటం వల్లనో, నిమ్నస్వరం ఉచ్చస్వరం కావటం వల్లనో భాషలో బయలు దేరింది. కావ్యభాషలో దీనికి గుర్తింపులేదు. వ్యావహారిక భాషలో ఎక్స్ కారోచ్చారణను సూచించటానికి ఆయా శబ్దాల్లో యావత్తు వ్రాసే పద్ధతి ఉండేదని మనకు రాయవాచకంలోని ఉదాహరణాల్ని బట్టి తెలుస్తుంది. ఆధునిక భాషలో కూడ దీనికి లిపి చిహ్నం ఏర్పడ లేదు.

ఉదా : వ్యాళ (78-8)
నిమిత్త్యమేమి (81-20)
పల్ల్యి (29-14)

ఆ మిద్యాలు (94-2). పదమధ్యంలో ఊనికలేని స్థానంలో ఉ > ఇగా ఉచ్చరింప బడుతుంది.

పెట్యె(లో) (78-5), పదాంత ఎకారం (ఉచ్చస్వరం)అకారం (నిమ్నస్వరం) అయింది.

2. 9. ఉచ్చారణ విధేయంగా 'సింహ' శబ్దాన్ని 'సింహ్మ' అని వ్రాయటం ఒకటి రెండుచోట్ల 'సింహ్వ' అనికూడ ఉంది.

నృసింహ్మరాయలు (2-8)
సింహ్మాసనస్థుండు (19-8)
సింహ్వాపు పిల్లలు (87-12)
'జిహ్వ' శబ్దం జింహ్మ' అని వ్రాయబడింది.
రెండువేల జింహ్మలున్ను (70-16)

2. 10 పదమధ్యంలో 'య' బదులుగా ఇకారం వ్రాయటం కన్పిస్తుంది.

'ఇ' తాలవ్యాచ్చు. 'యి' తాలవ్యాంతస్థం, వీటిమధ్య భేదం చాల సూక్ష్మమైంది. అందువల్ల వినిమయం కన్పిస్తుంది.

పోఇరి (92-1) / పోయి (75-1)
అఇత్తపడి (107-16/ఆయిత్తపాటు 83-17)
పోఇనట్లాయను (90-8)

2. 11. పదాది అకారాన్ని ఎకారంచేసి పలకటం ఆధునిక రాయలసీమ శిష్టేతరభాషలో చాల విరివిగా వినిపిస్తుంది. అయితే ఈ మార్పు రాయవాచకంలో అనేకచోట్ల కనిపించడం విశేషం.

ఉదా: చెలనం (13-19), గెంప్ప (80-15)
మిడియ (32-4), గెడ్డపారలు (80-14)

అలాకాకుండ కొన్నిచోట్ల పదమధ్య, పదాంతాల్లోకూడ ఉంది.

ఉదా : పరిమెళములు (115-)
పూనికె (39-15.)

2. 12. తెలుగు భాషలో పదాది యకార, వకారంబులు నిషిద్ధములైనప్పటికి రాయవాచక భాషలో అవి ఎక్కువగానే వాడబడ్డాయి. సాధారణంగా వ్యావహారిక భాషలో తాలవ్యాచ్చుల ముందు యకారం తాలవ్యేతరాచ్చులముందు వకారం అగ్రాగమాలు (గ్లైడ్స్‌గా) వస్తాయి. గ్రాంథిక భాషలో ఇవి పదాదిని పరిహరింప బడ్డాయి.

ఉదా : యిచ్చి (8-17) | వుచితాసనము (8.3)
యీశ్వరనాయుడు (28-16) | వొకటి (3-9)
యెమునిరాజ్యం (61-9) | వోరగంటి ప్రతాప
యేవూర (6-22) | రుద్రుడు (65-21)

యాల (46-19) (అపవాదం)

(ఇది ఉచ్చస్వరం నిమ్నస్వరం కావటంవల్ల ఏర్పడింది.)

2. 13. తత్సమ శబ్దాల్లో కొన్నిచోట్ల క్రావడికి వ్రటువసుడి వ్రాయడం.

ఉదా : అకృతులైన (71-19)
పాతృనికిన్ని (78-20)/పాత్రులను (96-15)

2. 14. దీర్ఘంమీద పూర్ణబిందువు చాలచోట్ల కనిపిస్తుంది. బాలవ్యాకర్త, "దీర్ఘం మీద సాధ్యపూర్ణంలేదని చెప్పాడు.[13] రాయవాచక కర్త దీన్ని నియతంగా పాటించినట్లు కనబడదు.

ఉదా : దాంటి (78-6) / దాటి (77-15)
మీంద (84-14) / మీద (84-17)

2. 15. కొన్నిపదాల్లో శ్వాసస్పర్శ నాదస్పర్శగాను, నాదస్పర్శ శ్వాస స్పర్శగాను మారిన సందర్భాలున్నాయి. ఇవి భాషలోని విలక్షణతను తెలియజేస్తాయి.

ఉదా : అక్కడగ్గర (< అక్కడక్కర) (91-14)
సంకోజపదక(< సంకోచపదక) (9-13)
కండ్డికోట (< గండికోట) (91-15)
కాకితములు (< కాగితములు) (49-17)
తాకీతు (< తాకీద్) (104-12)

2. 16. 'చ' వర్ణాని 'స' కల్పు వ్రాయడం, 'స' వర్ణానిక 'శ' వ్రాయడం.

'చ'కు 'స' : ఉదా : భేరిపూజ సేయించ్చి (90-23)(< -చేయించి)
'చ'కు 'శ' : ఏమి శేతును (7-1) (< -చేతును)
విన్నపంశాయమని (5-2) (< -చేయమని)
'స'కు 'శ' : కొంతశేపు (88-7) (< సేపు)
శేవించ్చి (84-18) (< -సేవించి)

2. 17. వ్యావహారిక భాషలో కొన్నిపదాలు ఊనిక స్ట్రెస్ కోసం దీర్ఘాన్ని కాని మహాప్రాణత్వాన్ని కాని స్వీకరిస్తాయి. వీటినే కృతక ప్రామాణిక రూపాలు'(హైపర్ కరెక్టెడ్ ఫార్మ్స్)అని అంటారు.

కైజీతము లేఖ (40-20) (< లేక)
ఘాలి (98-17) (< గాలి)
ఘట్టిగా (9-14) (< గట్టిగా),ధొరతనమేమి (40-2)
(< దొరతనమేమి)

3.0 సంధి : భాషా వ్యవహారంలో అవ్యవహితంగా వచ్చిన శబ్దాల్లో జరిగే ధ్వనుల మార్పు సంధి. సంధిలో స్వరలోపమూ దాని ఫలితంగా సన్నిహితంగా వచ్చిన హల్లుల్లో సమీకరణాది మార్పులు జరుగుతాయి.

ఉదా : కడుగు + కొని < కడుక్కొని (69-4)
అడుగు + కొని < అడుక్కొని (68-9)
అన్ని + నాళ్ళు < అన్నాళ్ళు (11-21)

'అన్నాళ్ల'లో పూర్వపదాంత స్వరం లోపించి హల్లు మీది హల్లుతో కలిసింది. ఈ సూత్రం వ్యావహారిక భాషలో సర్వత్రా వర్తించదు.

ఉదా : యెక్కు + కొని > యెక్కుకొని (48-8)

3.1 గ్రాంథిక భాషలో వున్న సంధి నియమాలు యథాతథంగా వ్యావహారిక భాషకు పట్టవు. గ్రాంథిక భాషలో ఉత్వసంధి నిత్యం, ఇత్వసంధి వైకల్పికం అత్వసంధి బహుళం అని చెప్పారు.[14] కాని వ్యావహారిక భాషలో ఏదీ నిత్యం కాదు. సంధి చేసి తీరాలన్న నియమం లేదు. అలా లేకపోవటమే వ్యావహారిక భాషాలక్షణం.

ఉదా : నాలుగు + ఆరు > నాలుగారు(41-22) (సంధి)
ఉత్తరువు + ఇచ్చి > ఉత్తరువు యిచ్చి (65-5) (యడాగమం)
ఉత్తరువు + ఇయ్యగానే > ఉత్తరువు ఇయ్యగానే (58-1) (విసంధి)

గ్రాంధికభాషలో యడాగమం కేవలం సంధిజరగని సందర్భాల్లో మాత్రమే వస్తూండగా, వ్యావహారిక భాషలో సంధి జరిగేచోట్ల కూడ వస్తూంది అంటే ఇక్కడ సంధి ఐచ్ఛికమని చెప్పవచ్చు.

3. 2. ద్వంద్వ సమాసంలో తొలిపదం మీది పరుషాలకు గసడదవలు వస్తాయి[15]. కాని రాయవాచకంలో గసడదవలు రాని రూపాలున్నాయి.

ఉదా : కాళ్ళుచేతులు (99-2)

రాయవాచకంలో ఏ కాలంలోగాని వాడుకభాషలో వినిపించవట్టి లాక్షణికులు అంగీకరించని అచ్చంధులు హల్సంధులు ఉన్నాయి. ఇట్టి లాక్షణిక విరుద్ధ ప్రయోగాలకు ఉదాహరణలు దక్షిణ దేశీయాంధ్ర కవుల కావ్యాల్లో చాలా ఉన్నాయి.[16]

(ఇంకా వుంది)

అమ్మాయి ప్రయాణం

సమ్మెట విజయ సౌజన్య



"అదిగో స్టేషన్ వచ్చేసింది! తాతయ్యా! తాతయ్యా! స్టేషనే కదూ!"-గోలగోలగా అరుపులు వినిపించడంతో స్టేషన్ వైపుకి తొంగి చూడడానికి ప్రయత్నించి,ముందున్న బుజ్జిగాడు అడ్డంగా నిలబడడంతో విసుగ్గా వంగి మరీచూసింది అమ్మాయి.

ఇంతలో రైల్వేస్టేషన్ రానే వచ్చింది. ఆటో యెక్కినా సంబరమంతా పోయింది. అయినా స్టేషన్ రాకతో క్రొత్త ఉత్సాహం తెచ్చుకుని బుజ్జిగాడు దిగగానే చంగున దూకిందమ్మాయి.

"ఈడొచ్చిన పిల్లవి ఎగుర్తావా?"- అంటూ ఖయ్యి మన్నారు తాతయ్య.

నీ ప్రశ్నలోనే ఉంది తాతయ్యా సమాధానం - అందా మనుకుని మళ్ళీ సంభాషణ సాగించడం యిష్టంలేక గబగబా రెండు బ్యాగులు అందుకుంది అమ్మాయి. లేకపోతే ఎక్కడ ఆ మూట బెడ్డింగు పట్టుకోమంటారోనని. అంతా తలా రెండు పట్టుకుని బుకింగ్ దాకా వచ్చారు. అక్కడ ఓ పొడుగాటి 'క్యూ' దర్శన మిచ్చింది. ట్రైన్ రావడానికి ఇంకా అరగంట టైమున్నా ఆ క్యూ మాత్రం ఇప్పుడప్పుడే తరిగేట్టులేదు.

సగటు తాతగారు చూసారు. లాభం లేదనుకున్నారు. భార్యామణి సరోజినమ్మని ఆడవాళ్ళ క్యూ తక్కువగా ఉందని టికెట్స్ తెమ్మన్నారు తాతయ్య. ఆవిడది భారీకాయం. ఆ జనంలో నావల్ల కాదందామె. పిల్లలిద్దరూ చిన్నవారు కావడంతో వాళ్ళు తేలేరని పించింది తాతయ్యకి.

చివరికి ఈడొచ్చిన అమ్మాయి లాభం లేదనుకుని తాతయ్యని "పోనీ నేను తేనా తాతయ్యా?" అంది. తాతయ్య తన కళ్ళద్దాల్లోంచి ఓ సారి ఆడవాళ్ళక్యూ వంకా, మరోసారి మగవాళ్ళక్యూవంకా చూసి తన గడియారంతో బేరీజు వేసుకుని తప్పదని అమ్మాయి చేతిలో డబ్బులు పెట్టాడు.

"హమ్మయ్య!"- అమ్మాయి అనుకుంది. అమ్మాయికి చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ ప్రయాణాన్ని మాగ్జిమమ్ ఎంజాయ్ చేద్దామనే అన్నయ్య సంతానమైన ఇద్దరు పిల్లల్తో, తాతయ్యా, నాన్నమ్మలతో ప్రయాణం కట్టింది!

చకచక నడిచి ఆడవాళ్ళ క్యూలో నిలుచుంది. ఓ సారి తన పమిట సర్దుకుంది. మరోసారి జుట్టుని పైకినెట్టి పిన్నులాగి తలకు పోసుకున్న ఆ కురులు తిరిగి ముఖంమీదకు జారకుండా గట్టిగా పెట్టు కుంది.

క్యూ నత్తనడక నడుస్తుంది. ఈ లోగా క్యూలోని ఆడవాళ్ళ వైపు చూసింది అమ్మాయి. నడి వయసు వాళ్ళు అయిదుగురు కొంచం అటుఇటుగా ఉన్న స్త్రీలు కొందరు, కొందరు చంకలో పిల్లో, పిల్లాడో ఉన్నవాళ్ళు, ఒకరిద్దరు మరీ పెద్దవయసువారు ఉన్నారు. ఒకామె తనంత వయసే ఉన్నా ఉట్టి పల్లెటూరిపిల్ల. చీర కట్టుకున్నా నల్లగా మోటుగా ఉంది. ఎటొచ్చి కాస్త లేతవయస్సులో పరికిణీ పావడా వేసుకున్నది, కాస్త ఎట్రాక్టివ్‌గా ఉన్నది తనొక్కతే నన్నమాట! అనుకుంది అమ్మాయి. అప్రయత్నంగా చేతులు పమిటను సర్దు కున్నాయి. క్యూ మరికాస్త కదిలింది.

కౌంటర్‌లో ఇద్దరు మగవాళ్ళకి, ఒక స్త్రీకి చొప్పున టికెట్లు యిస్తున్నారు. తన ప్రక్కన ఉన్న మగవాళ్ళ క్యూవైపు చూసిందో సారి అమ్మాయి. ఒక స్టూడెంటులా కనిపించే యువకుడు దీక్షగా అమ్మాయివైపే చూడటంతో అమ్మాయి లోలోపలి 'అహం' గర్వంతో పొంగిపోయింది. ఒక నడివయసాయన మింగేసేలా చూడ్డంతో భయం కూడా వేసిందమ్మాయికి. మిగిలిన వారంతా అమ్మాయితండ్రిలా ఉన్న వారే (వయసులో). క్యూకదిలింది. తనవంతు టికెట్టు తీసుకుని అక్కడే ఆగిపోయిన యిందాకటి యువకుడ్ని వెనుక వాళ్ళు "జరగ వయ్యా జరుగు" అంటూ కసురుకోవడంతో అతగాడు సదరు లైట్ బ్లూకలర్ షర్ట్అబ్బాయి అమ్మాయి కేసిచూసి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళిపోయాడు.

"అత్తా మరే ప్రక్కకి నిలబడమన్నాడు తాతయ్యా!" అంటూ బుజ్జిగాడు కొంగు లాగుతూ చేయిపట్టుకుంటే స్పృహలోకి వచ్చిందాన్లా

యిటు తిరిగి బుజ్జిగాడి మాటలకి మండిపోయి "సర్లే నువ్వు వెళ్లు" అని వాడ్ని కసిరిపంపి ఎలాగో టికెట్స్ తెచ్చింది అమ్మాయి.

ట్రైన్ స్టేషన్‌లోకి వచ్చింది. తాతయ్య, నానమ్మ హడావుడిగా ట్రైన్ ఎక్కడ వెళ్ళిపోతుందోననే కంగారులో ఏ కంపార్ట్‌మెంటో కూడా చూడకుండా ఒకటే పరుగు పెడ్తున్నారు.

"పదండ్రా! ఒసే మంగతాయీ పదవే!" అనడంతో వాళ్ళ మీద అమ్మాయికి పిచ్చికోపమొచ్చేసింది. అంత హడావుడిలోనూ "లక్షాతొంభై ఒక్కటోసారి" ఆ పేరు తనకి పెట్టినందుకు తిట్టుకుంది పెట్టిన వాళ్ళని. పోనీ ముద్దుగా మంగా అని పిలవమంటే వినరు. పోనీ కనీసం 'మంగతాయారూ' అని పిలిచేడవండంటే అదీ వినరు. ఏంటీ తాయీ అట తాయీ! - కసిగా అనుకుంది అమ్మాయి. ఆ విసుగులో సరిగా వాళ్ళని చేరుకోలేక ఆయాసంతో ఆగిపోయింది. వెనక్కి తిరిగి చూసిన నానమ్మ, తాతయ్య, పిల్లలు తిరిగి వెనక్కు వచ్చేసారు- అమ్మాయి కదలక పోవడంతో !

అమ్మాయి కసురుకుంది "ఏమిటి తాతయ్యా అట్లా పరుగు పెడ్తావ్! ఎందులోనో ఓదాంట్లో ఎక్కక! అయినా ఇదిక్కడ అర గంట ఆగుతుంది తెలుసా?" అంది.

"ఈ వెతుకులాటలో అదెళ్ళిపోతుందిగానీ పదపద" అన్నాడు తాతయ్య.

నడవక తప్పలేదమ్మాయికి. చివరి కంపార్టుమెంట్ వచ్చింది. అది జనరల్ కంపార్టుమెంటు. వాళ్ళు ఎక్కవలసిందదే. జనంతో కిట కిటలాడుతుంది. తాతయ్య, నానమ్మ, పిల్లలు అందులోకి ఎక్కుతుంటే అమ్మాయి గత్యంతరంలేక ఎక్కింది. కానీ మనస్సులోమాత్రం ఛీ తను ప్రయాణమంటే ఏమనుకుంది? ఎంచక్కా "మల్లెలు - మంచు పూలు" నవల్లో తన అభిమాన రచయిత్రి వ్రాసినట్లుగా. అందులో హీరోయిన్ తనలాగే పరికిణీ పావడా వేసుకుంటుంది. తనువేసుకున్న గులాబీరంగు దుస్తులే వేసుకుంటుంది. తనంత అందంగా ఉంటుంది.

"ఒసేవ్ తాయీ ! నిన్నేనే ఆ సామాన్లు తీసుకురా !"— అన్న కేకతో తేరుకుని గబగబా సామాన్లు అందించింది. కాస్త ఫ్రీగా నిలబడడానికి చోటు దొరికింది సామాన్లు పైన పెట్టడంతో. నాన్నమ్మ భారీ కాయం కాస్తా ఎదురుగా కూర్చున్న ఓ ముసలాయన ప్రక్కన ఉన్న కాస్త జాగాలో సర్దుకుంది. పిల్లలు కిటికీల దగ్గర నిలబడి తల బయటకు పెట్టి చూస్తున్నారు. తాతయ్య పరుగువల్ల వచ్చిన ఆయాసం తీర్చుకుంటున్నాడు. తాతయ్య ప్రక్కనే నిలబడిందమ్మాయి.

కిటికీలోంచి బయటకు చూడాలనే అమ్మాయి ప్రయత్నానికి ఒక కిటికీలో బుజ్జిగాడు మరొక కిటికీలో చిన్నిగాడు అడ్డంగా కన్పించారు. దాంతో ఈ వైపు లాభం లేదనుకున్న అమ్మాయి ఆ వైపు కిటికీలోంచి చూద్దామనుకునే సరికి కిటికీ దగ్గర కూర్చున్న ఒక వ్యక్తి నల్లగా, భయంకరంగా కనిపించాడు. చూడ్డానికి అతగాడు కుర్రాడి లాగే ఉన్నా అమ్మాయి కోరుకునే అందానికి భిన్నంగా ఉండడంతో అతడ్ని అంత భయంకరంగా ఊహించుకుంది అమ్మాయి. ఇంక ఆ వైపుకి తల తిప్పకూడదనుకుంది అమ్మాయి.

కంపార్ట్‌మెంట్‌లో ఎవరెవరున్నారా అని చూసింది అమ్మాయి. ఒకరిద్దరు తప్ప అంతా పిల్లాజెల్లల్తో, మూటా ముల్లెలతో ఉన్నవాళ్లే నలుగురయిదుగురు ఉద్యోగాలు చేసేవారు. ఇద్దరు ముగ్గురు ఒంటరిగా ప్రయాణించే ఒంటరివాళ్ళు కనిపించారు అమ్మాయికి. ఈలోగా ట్రైన్ కదిలింది. అంటే అలా ట్రైన్ కదిలిందో లేదో నాన్నమ్మ ఒక కేక పెట్టింది. ఏదో పరధ్యానంలో ఉండడంతో నాన్నమ్మ ఎందుకలా అరిచిందో అర్థం కాలేదు అమ్మాయికి కానీ నవ్వుకుంటూ బుజ్జిగాడు, చిన్నిగాడు చేతులు, తల లోపలికి తీసుకోవడంతో నాన్నమ్మ పెట్టిన కేక వాళ్ళని లోపలికి తలపెట్టుకోమని అని అర్థమైంది నాన్నమ్మ అరుపుకి - సిగ్గుతో ఎవరైనా చూసారేమోనని అటూ యిటూ చూసింది. అందరూ ఎవరిగోలలో వాళ్ళుండడంతో కాస్త తేరుకుంది. వెనుకకు తిరిగి అటువైపు ఎవరున్నారా అని కుతూహలంగా చూసింది అమ్మాయి. అంతే ! టక్కున నిలిచిపోయాయి అమ్మాయి చూపులు. అతను....అతను....యిందాక కౌంటర్‌లో అమ్మాయికేసి చూసిన లైట్‌బ్లూకలర్ షర్ట్ వేసుకున్న అబ్బాయి.

"అబ్బ అచ్చం హీరోలా ఉన్నాడు."-అనుకుంది అమ్మాయి.

"అత్తా ! అత్తా !" అన్న కేకతో తల యిటు తిప్పింది అమ్మాయి విసుగ్గా.

"అదిగో చూడత్తా" అంటూ ఏదో చూపిస్తున్నాడు చిన్నిగాడు ఒళ్ళు మండి పోయిందమ్మాయికి. యింత చిన్న వయస్సులో ఉన్న తనను అత్తా అత్తా" అంటూ పిలవడం ఎంత మాత్రమూ నచ్చలేదు అమ్మాయికి. కానీ ఎంత చెప్పినా "అత్తా" అనే పిలవడంతో ప్రతీ సారీ ఇలా ఒళ్ళుమండి తర్వాత ఆ మంటలు ఆరిపోయి మామూలుగా అయిపోతుందమ్మాయి.

"ఆ....బాగానే ఉన్నాయి" అంది చివరికి సమాధానంగా మళ్ళీ ఒకసారి అతని వైపుకి చూడగానే తన అభిమాన రచయిత్రి నవల గుర్తుకు వచ్చింది అమ్మాయికి. అంటే తల మామూలుగా తిప్పి సుదీర్ఘంగా ఆ నవల్లోని హీరో, హీరోయిన్‌లను తలుచుకుంది. ఇప్పుడు అమ్మాయి పూర్తిగా నవల్లో లీనమయి దానిలోని కొన్ని సీన్స్‌ని గుర్తుకు తెచ్చుకుంటుంది.

నవల్లో ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో కిటికీ ప్రక్కన హీరోయిన్ పల్లవి కూర్చుంటుంది. చేతిలో వీక్లీ. ఎదురుగా హీరోగారు బెర్త్ మీద

నుంచి పల్లవిని చూపుల్తో తింటుంటాడు. హీరో చూపులు తింటుంటే ఓ సారి అలవోకగా చూసి సరిగ్గా తింటున్నాడో లేదో చూస్తుంది పల్లవి. ఆమె చూపుకి జన్మ ధన్యమైనట్లుగా భావించేస్తాడు హీరో. అసలు హీరోయిన్ ఒక్కతే ఎలా ప్రయాణం చేస్తుందో! హీరో ఒక్కడే అదే ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులోకి ఎలా వస్తాడో అక్కడ రచయిత్రి చెప్పలేదు. కనుక యిక్కడ అమ్మాయి అది ఆలోచించ లేదు. (సో మనం కూడా ప్రస్తావించ కూడదు!)

అమ్మాయి ఆ తర్వాత హీరో ప్రవీణ్, పల్లవిని పలకరించడం, ఆ తర్వాత వాళ్ళిద్దరి డైలాగ్స్ అన్నీ మననం చేసుకుంటుంది. అవన్నీ ఈ క్షణం ఎవరన్నా చెప్పమంటే తడుముకోకుండా చెప్ప గలదు అమ్మాయి. అలా వాళ్ళిద్దరి అరగంట డైలాగుల తర్వాత (25 పేజీల తర్వాతన్నమాట) హీరో ప్రవీణ్ బెర్త్‌దిగి పల్లవిని ముద్దుపెట్టుకుంటాడు! గంటలోనే అంత చనువు ఎలా వచ్చిందనేది అక్కడ రచయిత్రి రాయలేదు. అమ్మాయికి తట్టలేదు. (కనుక మనకి తట్టకూడదు. ఊరికినే చదివేసి ఎక్సైట్ అయిపోవాలంతే!)

"ఒసేవ్ తాయీ! పలకవేమే? యివిగో నాలుగు బఠానీలు నువ్వు నములు—" అంటూ అమ్మాయి చేయి పట్టి లాగింది నాన్నమ్మ. అందమైన నవలాలోకంలో విహరిస్తుంటే వెధవ బఠానీలు చెడగొట్టాయనుకొని విసుగ్గా చూసింది నాన్నమ్మవైపు, ఆమె చేతిలోని బఠానీల వైపు. అంతలోనే నవల్లో పల్లవి చక్కగా ఫ్లాస్క్‌లోని కాఫీ సిప్ చేయడం తలుచుకుని "ఛీ ఛీ నాకొద్దు" అంది అమ్మాయి.

"అదేమిటే నచ్చకపోతే వద్దను అంతే కానీ ఛీఛీ ఏమిటే ఛీ ఛీ?" అంటూ నాన్నమ్మ చేయి వెనక్కి తీసుకుంది.

"నాన్నమ్మా నాకిచ్చేయ్" అని బుజ్జిగాడు "నాకూ" అంటూ చిన్నిగాడు ఎగబడ్డారు ఆ బఠానీల కోసం.

"ఛీఛీ నాన్‌సెన్స్" అనుకుంది అమ్మాయి. ప్రక్కన చూస్తే తాతయ్య లేడు. ప్రక్కనున్న మనిషి ప్రక్క కూర్చొని బుజంమీదుగా వరుగుతూ నిద్రలోకి జారుకున్నాడు!

బుజ్జిగాడు, చిన్నిగాడు తలో ప్రక్కనా యిరికారు. అయితే తనేనా కూర్చోనిది! లేదు లేదు.... ఈసారి ఆలోచనలు కట్టిపెట్టి ఎలా అయినా సీటు సంపాదించాలి – అనుకుంది గట్టిగా, తలతిప్పి చూసింది. ఏదోస్టేషన్ వస్తున్నట్లుంది. ఇటువైపు సరిగా కనిపించడం లేదని అటువైపు ఎర్రకళ్ళ మనిషి సంగతి మరిచిపోయి చూసింది. కానీ ఎర్రకళ్ళ మనిషి– అమ్మాయిని ఉద్దేశించి తన సీట్లో కూర్చోమని తను బెర్త్‌పైకి (నిద్రొస్తుందేమో పాపం!) ఎక్కేసాడు. ఎవరూ ఆ కిటికీ వైపుకి చేరకముందే రెండు గెంతుల్లో కిటికీ ప్రక్కన లక్కీగా సెటిలయిందమ్మాయి. మనసులోనే ఎర్రకళ్ళ కుర్రాడికి దణ్ణం పెట్టేసుకుంది. అతని విషయానికొస్తే మనిషి భయంకరంగా ఉన్నా ప్రవర్తన ఎందుకు భయంకరంగా లేదో అర్థం కాలేదు అమ్మాయికి. సీట్ దొరికిన సంతోషంలో తను గెంతినందుకుగాను ఈ సారి నాన్నమ్మ సణుగుళ్ళు వినిపించ లేదమ్మాయికి.

"హమ్మయ్య!" అనుకొని హాయిగా తల వెనుకకు ఆనించి కిటికీలోంచి మనసారా బయటకి చూసింది అమ్మాయి. తిరిగి లోపలికి చూస్తూ తనహీరో అయిన లైట్‌బ్లూకలర్ షర్టబ్బాయి కనిపించడు కదా అని విచారించింది అమ్మాయి. కానీ అంతా అమ్మాయి లక్కే! ఇందాక అమ్మాయి నిలబడ్డ స్థలంలో అమ్మాయి చదివిన నవల్లో ప్రవీణ్‌లాగా ప్రత్యక్షమయ్యాడు లైట్ బ్లూకలర్ షర్టబ్బాయి ఉరఫ్ అమ్మాయి హీరో. మళ్ళీ నవల్లో లీనమయిం దమ్మాయి. ముద్దుపెట్టు కున్న సీన్ తర్వాత పల్లవి ప్రవీణ్ ఎదురెదురుగా కూర్చుని అరగంట సేపు తదేకంగా చూసుకుంటారు. సడన్‌గా దోమకుట్టినట్లుగా పల్లవి బుగ్గలు కందిపోయాయి. అమ్మాయి ఎదురుగా కనిపిస్తున్న లైట్ బ్లూకలర్ షర్ట్ అబ్బాయికేసి అలానే చూసింది. అంతే, అమ్మాయి బుగ్గలు కూడా దోమకుట్టినట్లుగా ఎర్రగా అయిపోయాయి. ఇంతలో ప్రక్కన చేరాడు చిన్నిగాడు. "అత్తా నేనక్కడికి రావద్దా?" అరుస్తున్నాడు బుజ్జిగాడు. "వద్దువద్దు" కంగారుగా చెప్పిందమ్మాయి. చిన్నిగాడు ఏమీ అడక్కుండానే అమ్మాయి ఒళ్ళో కూర్చున్నాడు. నాన్నమ్మ, తాతయ్య కునుకు తీస్తున్నారు. చిన్నిగాడి తలప్రక్కనుంచి కిటికీలోంచి నవల్లోని పల్లవిని చూసినట్లుగా అలవోకగా కాసేపు ప్రకృతిని చూసిందమ్మాయి. నవల్లో పల్లవికి పచ్చని చేలు పట్టు తివాచీల్లా కన్పిస్తాయి. అమ్మాయికి మాత్రం తుమ్మచెట్లు, ఆ వెనుక బీటలు వారిన భూమి కనిపించాయి. వాటిని ఏమనుకోవాలో తెలీలేదమ్మాయికి. పోనీలే సీజను కాదేమో అనుకుంది. (కానీ నిజానికి కరువువల్ల ఆ యేడు పంటలు పండక భూములలా ఉన్నాయని మన అమ్మాయికి తెలీదు. ఎందుకంటే అమ్మాయి లోకం యిదికాదు కనుక.) క్రమంగా ఇళ్ళు కనిపించాయి. స్టేషన్ ఏదో పెద్దదే వచ్చింది. పదిహేను నిమిషాలదాకా ఆగుతుందేమో! 'ఛాయ్, ఛాయ్,' 'బిస్కెట్, బిస్కెట్స్' మొదలైన కేకలతో అంతా నిద్ర లేచేసారు.

పిల్లలు మరచెంబులో నీళ్ళు ఆఖరుచేసారు. తాతయ్య దిగి నింపి తీసుకొచ్చి తాగమన్నాడు అమ్మాయిని. మరచెంబులో నీళ్ళు తాగాలంటే ఎలాగో అనిపించిందమ్మాయికి. కానీ దాహం వేస్తుంటే ఎవరైనా చూస్తున్నారేమోనని గబగబా తాగేసింది. అందరూ తాగాక వెళ్ళి మళ్ళీ నింపి పెట్టాడు తాతయ్య. దూరంగా లైట్ బ్లూకలర్ షర్ట్ అబ్బాయి జేబులోంచి దువ్వెనతీసి అలవోకగా దువ్వుకుని ప్లాట్‌ఫాం మీద ఓ కప్పు టీ తాగి డబ్బులిచ్చాడు. ఇంతలో నలుగురయిదుగురు కుర్రాళ్ళు అమ్మాయి వైపు చూస్తూ– హాయ్‌బ్యూటీ! వండర్‌ఫుల్! టాటా!"

అంటూ తిరిగి వెళ్ళారు. వాళ్ళని చూసి తాతయ్య, నాన్నమ్మ తిట్టు కుంటుంటే అమ్మాయికి మాత్రం అలా తిట్టాలనిపించలేదు. ట్రైన్ కదిలింది. కదుల్తున్న రైల్లోకి మెల్లగా ఎక్కాడు లైట్ బ్లూకలర్ షర్ట్ హీరో.

అమ్మాయికి యిప్పటిదాకా ప్రయాణం కొన్ని ఎడ్జెస్ట్‌మెంట్స్‌తో బాగానే ఉన్నా రానురాను మరీ విసుగెత్తి పోయింది. కారణం అమ్మాయి కంటే కాస్త అందంగాఉన్న మరో అమ్మాయి అదే కంపార్ట్ మెంట్‌లో ఎక్కడం. ఆ కొత్త అమ్మాయి వాళ్ళ నాన్నతో కావచ్చు ఓ సూట్‌కేసుతో ఎక్కింది. యిప్పటి వరకు తన హీరో అనుకున్న లైట్ బ్లూకలర్ షర్టబ్బాయి కాస్తా తనని చూడ్డం మానేసి యిందాక తనని చూసినట్లుగానే ఈ క్రొత్తమ్మాయిని చూడ్డం మొదలుపెట్టాడు.

ఇంతలో "శివ శివశంకర" పాటపాడ్తూ అడుక్కుంటున్నాడు ఒకతను. మరీ పాడేదేదో ఆ పాటలు కాకుండా ఏ 'న్యూ సాంగ్స్' పాడితే బాగుండుననుకుని అదీ ఎంజాయ్ చేయలేక పోయిందమ్మాయి. ఈ హీరో అతడికి నవల్లో హీరోలాగా ఐదురూపాయలు కాకపోయినా ఒక్క రూపాయన్నా వేస్తాడనుకుం దమ్మాయి. కానీ ఒక్కనయాపైస (అవిప్పుడు లేవు కనుక ఐదుపైసలన్నా) కూడా వేయలేదు పాపం అమ్మాయిహీరో! తాతయ్య ఓ ఇరవై పైసల బిళ్ళ వేసాడు. హమ్మయ్య ఫరవాలేదను కుందమ్మాయి.

తను గమనించలేదుగానీ ఎదురుగా ఉన్నశాస్త్రీ తనకాళ్ళు మెల్ల మెల్లగా అమ్మాయికాళ్ళకి తగిలేలా జరుపుతుండడం గమనించింది అమ్మాయి. పక్కన పెళ్ళాన్ని పెట్టుకుని పాడుబుద్దులు పుడ్తున్నందుకు వాడ్ని "దొంగవెధవా!" అని తిట్టుకుని కాళ్ళు జరుపుకుంది అమ్మాయి. రాను రాను ట్రైన్ మరీ రద్దీగా తయారయ్యింది. గాలిరాక, ఊపిరాడక, తనేదో నరకంలోకి ప్రవేశించి నట్లుగా తాను పొరపాట్న ఈ మిడిల్ క్లాస్‌లో పుట్టినట్లుగా బాధపడి పోయిందమ్మాయి.

ఎప్పుడెప్పుడు తను దిగాల్సిన స్టేషన్ వస్తుందోననే ఎదురు చూస్తూ గడిపిందమ్మాయి.

మళ్ళీ ఇందాకటి క్రొత్తమ్మాయివైపు చూసిందమ్మాయి. తన హీరో ఆ అమ్మాయిని అనుకుని నిలబడ్డట్టుగా నిలబడ్డాడు పాపం. ఆమె తండ్రి కూతురితో ఈ వెధవపక్కన నిలబడాల్సి వచ్చింది కదా అన్నట్లుగా బాధగా నిలబడ్డాడు. తనకన్నా అందంగా ఉన్న ఆ అమ్మాయిని చూడగానే ఇందాకట్నించీ 'హీరోగా' భావించిన వెధవకి పుట్టిన నీచపుబుద్ధి ఇది అన్నమాట! ఒక వేళ తనే ఆ ప్లేస్‌లో ఉంటే తనూ అలాంటి స్థితిని ఎదుర్కోవాల్సిందే కదా! ఛ తనెంత మానర్‌లెస్‌గా ఆలోచించింది ? ఏదో మత్తులోంచి తేరుకుంటున్నట్లుగా సాగుతున్నాయి అమ్మాయి ఆలోచనలు.

"హాయ్‌బ్యూటీ! హలో స్మార్టీ!" అన్న మాటలకి కాస్తవంగి చూసిందమ్మాయి. డోర్ దగ్గర యిందాక తనను అవే మాటలంటే తాను పొంగిపోయిన ఆ కుర్రాళ్ళు నిలబడి క్రొత్త అమ్మాయి కేసి చూస్తూ అవేమాటలంటున్నారు. ఈ సారెందుకో ఆ మాటలు రుచించ లేదమ్మాయికి తల తిప్పడానికి కూడా వీలులేని స్థితిలో ఉన్న కొత్త మ్మాయి తనలా పొంగిపోయి నవ్వుకోకుండా కోపంగా వాళ్ళకేసి చూడగానే ఒకడు కన్ను గీటాడు. కంపరంతో తల దించుకున్న క్రొత్తమ్మాయి కేసి చూసింది అమ్మాయి. తలంతా గిర్రున తిరిగి నట్లయింది ఆలోచనలతో. యిప్పుడు అమ్మాయి ఆలోచనలు నవల్లోకి సాగటం లేదు. ఇందాకట్నించి తన ఊహల్ని ప్రస్తుతం కనిపిస్తున్న వాస్తవంతో విశ్లేషించుకుంది.

"కాస్త జరగవయ్యా, జరుగు" అన్న అరుపులకి ఉలిక్కిపడి అటుకేసి చూసిందమ్మాయి. బెర్త్ మీద పడుకున్న ఎర్రకళ్ళ కుర్రాడు ఎప్పుడు లేచాడో తెలీదు కానీ అరుస్తూ గభాలున దిగి ఇందాక హీరో అనుకున్న రోగ్‌ని యివతలకి లాగాడు. అమ్మాయి వింతగా చూసిం దతని వైపు. మరో ప్రక్క తననెక్కడ సీట్‌లోంచి లేచిపొమ్మంటాడో అనికూడా భయపడింది అమ్మాయి. కానీ అమ్మాయి ఊహలకి భిన్నంగా అమ్మాయి నుద్దేశించి "చూడమ్మా మీరు మీరు సర్దుకొని కాస్త ఈమెక్కూడా చోటివ్వండి" అన్నాడు అమ్మాయితో. తల ఊపి తను జరిగి ప్రక్కనామెని జరగమని క్రొత్తమ్మాయికి చోటి చ్చింది. ఇందాకట్నించి తనకా ఊహే రానందుకు ఆశ్చర్యపోయింది! కృతజ్ఞతగా చూస్తున్న క్రొత్తమ్మాయిని, ఆమె తండ్రినీ చూసేసరికి ఎందుకో తనెప్పుడూ పొందని అనుభూతి కలిగింది అమ్మాయికి. యిప్పుడు అతడు ఎర్రకళ్ళతో భయంకరంగా అనిపించలేదు అమ్మాయికి చాలా ఉన్నతంగా కనిపించాడు.

దూరంగా తాను దిగాల్సిన స్టేషన్ వస్తుండడంతో సామాన్లు పట్టుకొని రైలు ఆగగానే దిగడానికి సన్నద్ధమవుతూ అతనికేసి చూసింది అమ్మాయి. అతడు స్నేహంగా నవ్వడం, రైలు స్టేషన్‌లో ఆగడం ఒకేసారి జరిగాయి. అమ్మాయి ప్రయాణానికి, ఫుల్‌స్టాప్ పెడ్తూ.

(26వ పేజి తరువాయి)

భావంగాని చలనంగాని నాలో కలగలేదు ఏనాడూ ! ఈనాడు వేరుగా భావించడానికి నా మనస్సొప్పుకోదు. ఆ శక్తి నాకు లేదు. వదులు, మంజరీ - వదులు.

మంజ : బావా ! బావా ! !

రాజ : అబ్బా - వదులు - (గట్టిగా) వదులు !

మంజ : (క్రోధావేశంతో) ఆఁ ! నన్ను తోసేస్తావా ఇంత జోరుగా ? ఇంత నిరసనా నేనంటే - సరేకానీ......

రాజ : నన్ను క్షమించు మంజరీ !

21

రాజ : సొరంగం పనిపూర్తయింది. పనివాళ్లందరూ వెళ్లిపోతున్నారు. సూర్యాస్తమాన సమయం ఆసన్నవుతున్నట్లుంది. ఆ మెట్ల గదిలో నుండి కొద్దిగా వెలుగు వస్తున్నది. అందరూ పైకి వెళ్లగానే ఆ చివరి రాతిపలక తన స్థానంలో బిగుసుకు పోతుంది. ఇదే ఆఖరుసారి నీ వెలుగు చూడడం ! హే సూర్య భగవాన్ ! నా తుది నమస్కారం! అందుకో నమస్తే.

(చాలాదూరాల నుండి ఒక్కొక్కపిలుపు దగ్గరకు వస్తుంది)

సుజాత: రాజా ! రాజా ! రాజా !

రాజ : ఆఁ ! ఎవరది ? ఎక్కడ రజని ! నా రజని ! రజని గొంతు రజనీ - రజనీ ! కాదు - రజని కాదు - కలగంటున్నాను.

సుజా : కలగాదు - నిజమే ! మీ రజనినే ! రాజా !

రాజ : రజనీ !

సుజా : రాజా

రాజ : రజనీ

సుజా : రాజా !

రాజ : ఎలావచ్చా వీ లోపలికి రజనీ ?

సుజా : మిమ్మును తప్పించడానికి ప్రయత్నించి ఓడిపోయాను. చివరకు సొరంగపు పనిమనుషులను మంచిచేసుకొని వారిలో కలిసి పనిమనిషిగా లోపలకు వచ్చాను. అందరూ వెళ్లిపోయేంతవరకు ఆ పలక బిగుసుకునేంతవరకు ఒక గుహలో నక్కి దాక్కున్నాను. దేవుని దయవల్ల చివరకు మీ పాదాల సన్నిధి చేరుకున్నాను.

రాజ : పాదాలు కాదు—నా హృదయంలోనికే !

సుజా : అవును - ఇప్పుడు మనదొకటే హృదయం - రాజా !

రాజ : రజనీ !

[నీళ్లచప్పుడు అంతకంతకు ఎక్కువ అవుతూ ఉంటుంది!]

పాట

బృందగానం :- ఇరువురిదీ ఒకటే హృదయం !

ఇరువురిదీ ఒకటే హృదయం ! !
అతి పవిత్రమౌ ప్రేమాలయం ! ! !
ఇరువురిదీ ఒకటే హృదయం ! ! ! !

(పాట దూరాలకు జారుతుంది.)

(నీళ్ల చప్పుడు)

అజరామర ప్రణయగాథ -
రాజ - రజని ప్రేమ గాథ !

యుగయుగాల తరతరాల
యువహృదంత రాళ హేల—
వలపు కలల అలల లీల,
తరుణ తరళ రాగ మాల !

రాజ - రజని ప్రేమ గాథ -
కరుణ రస విషాద గాథ !


[హోరున నీళ్ల చప్పుడు]

(అ యి పో యిం ది)

పెద్దకథ

శారద నిర్ణయం

'అన్నపూర్ణ'



అది ఒక జిల్లాకు ముఖ్య పట్టణం. ఆ పట్టణానికి దక్షిణ పార్శ్వంలో ఉంది శ్రీనివాసనగరు. ధనవంతుల పేట అనేది దాని మరో పేరు. అక్కడ అధునాతన భవంతులతో పాటు పాతకాలం నాటి ఇళ్ళూ కొన్ని వున్నయ్. వాటిని వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. అలా లెక్కించ దగిన వాటిల్లోదే సోమశేఖరంగారి యిల్లు...... ఆయన తండ్రి హయాంలో గామలు దాన్ని కట్టించారు.

చేసే గుమాస్తా ఉద్యోగంనుంచి రిటైర్‌మెంట్ పుచ్చుకున్నారు ఈ మధ్యనే, పెన్షన్ రూపంలో వచ్చేకొద్దిమొత్తం చాలక కుటుంబ పోషణార్థం ఓ ప్రైవేట్ ఫరంలో తిరిగి గుమాస్తాగా కుదిరాడు.

ఉదయం తొమ్మిది గంటలకు భోజనం చేసివెళ్ళిన సోమశేఖరం తిరిగి ఇంటికి వచ్చేది రాత్రి తొమ్మిది గంటలకే.

అప్పుడు కూతురు శారద అభిమానంతో తోడి యిచ్చిన నీళ్ళతో స్నానంచేసి, భార్య అప్యాయంగా వడ్డించిన నాలుగు మెతుకులూ తిని కొంతలోకొంత తృప్తి ఫీలవుతూ పడుకుంటాడు_ అయినా ఓ పట్టాన నిద్ర పట్టదు. పెరుగుతున్న ధరలు, ఎదిగిన కూతురు శారద పెళ్ళి, ఎదుగుతున్న పిల్లల చదువులు, తరుగుతున్న తన ఆరోగ్యం___ ఇవన్నీ సోమశేఖరం మనసును కలచివేసే సమస్యలు.... అన్నీ ఆలోచిస్తూ చాలా ఆలస్యంగా నిద్ర పోతాడు.... ఇది ప్రతిదిన చర్య.

అలాగే ఆ రోజు రాత్రి ఆయన మామూలుగానే ఇంటికి వచ్చారు....స్నానం చెయ్యటానికి వెళ్ళినప్పుడు బావిదగ్గిర కూతురు శారద కాకుండా భార్య అనసూయమ్మ నీళ్ళుతోడుతూ కనిపించడంతో సోమశేఖరంగార్కి అనుమానం వచ్చింది.

"నీళ్ళు నువ్వుతోడుతున్నావ్, అమ్మాయి ఏది ?" అడిగాడు.

"అమ్మాయి ఎవరో స్నేహితురాలింటికని వెళ్ళిందండీ"- దాచకుండా చెప్పేసింది.

"ఎవరు ఆ స్నేహితురాలు ?"

"అప్పుడప్పుడు మన యింటికి రాదుటండీ....కళ్యాణి ! వాళ్ళింటికనే వెళ్ళింది."

"ఏ స్నేహితురాలైనా - ఆడపిల్ల - ఇలా ప్రొద్దు బోయే వరకు తిరగటం నాకేం నచ్చలేదు. ఈ మాట అమ్మాయ్‌రాగానే చెప్పేయ్" అన్నాడు బొక్కెనలో నీళ్లు బుడబుడ ఒంటిమీద దిమ్మ రించుకొంటూ.

స్నానం చేసి వచ్చిన సోమశేఖరం గార్ని ముందు గదిలో కూర్చొని చదువుకొంటున్న పదమూడేళ్ళ రమణ, పదేళ్ళ లలిత - ఇంగ్లీంషు పాఠంలో తమకు బోధపడని పదాలకు అర్థం అడగడంతో భోజనం మాట మరిచిపోయి అక్కడే వాలుకుర్చీలో కూర్చుండి పోయారు, వాళ్ళు అడిగినది విడమరిచిచెబుతూ.

"వడ్డించాను రండి...." అనసూయమ్మ మూడవసారి కూడా పిలవటంతో తప్పదన్నట్లే లేచారు సోమశేఖరం.........అదే సమయంలో ఓ ఫియట్‌కారు రయ్‌న వచ్చి తమ యింటి ముందు ఆగటం, దాని లోంచి దిగిన శారద హుషారుగా లోపలికి వస్తూండటం గమనించిన ఆయనలో కదలిక నశించిపోయింది కొద్దిసేపు. శారదను దింపిన కారు వెంటనే వెళ్ళిపోయింది.

లోపలికి వచ్చిన శారదకు ముందుగదిలోనే తండ్రి కనిపించ టంతో పెద్ద 'షాక్' అనిపించింది. అయినా తమాయించుకొని, 'కళ్యాణి బలవంతంచేస్తే సినిమాకు వెళ్ళక తప్పలేదు నాన్నగారూ.... ఆ కారు వాళ్ళదే.... అంటే వాళ్ళ అన్నయ్యగారిది...." చెప్పింది సంజాయిషీగా.

సోమశేఖరం మనసు పరిపరి విధాల పోతున్నా - అప్పటికి మాట్లాడవలసింది తోచనట్లు, "సరే, భోంచేద్దువుగాని రా....ఏమే.... అమ్మాయి కూడా వచ్చింది....వడ్డించు...." అన్నారు.

2

తండ్రి మనస్తత్వం గురించి శారదకు పూర్తిగా తెలుసు. ఆయన నిండు కుండలాంటి మనిషి. తొందరగా బయటపడడు. తూలి మాట అనడు. అన్నాడో - ఇక దానికి తిరుగేలేదు... ఇంట్లో అంతా పడుతున్న అవస్థలు చూసి తను ఉద్యోగం చేస్తానంది. "వీల్లేదు. రేపు పెళ్ళయ్యాక మీ ఆయన ఇష్టపడితే అలాగేచెయ్యి"అన్నాడు. అంతే. ఆ ప్రసక్తి మరి తేనివ్వలేదు......... అయితే వివాహప్రయత్నాలు ఎన్ని చేస్తున్నా పరిస్థితులు అనుకూలించటంలేదు ....

కానీ....ఒకవిధంగా తను తండ్రిని మోసంచేస్తోంది?.... చేస్తు న్నది ఆయన దృష్టిలో తప్పేకావచ్చు. కానీ: తనకుమాత్రం ఇంతకు మించి గత్యంతరం లేదు.

ఆశలు, ఆనందాలు - వీటికి దూరమై ఎవరు మాత్రం ఎంతకాలం బ్రతకగలరు ?.... పుట్టి బుద్ధెరిగింది మొదలు ఓ అందమైన బట్టకట్టింది లేదు. ముచ్చటకైనా ఓ నగ పెట్టుకున్న పాపాన పోలేదు.... ఏ ఉద్యోగంలోనైనా చేరితే తన ఆకాంక్షలు కొంతలో కొంత తీరతయ్యనుకుంటే పడనివ్వలేదు. అధమం పెళ్ళై ఏ పరాయింటికైనాపోతే అక్కడైనా తన ఆనందాలు నెరవేర్చుకోవచ్చను కుంటే అదీ జరిగేట్టు లేదు.

ఈ ఆశనిరాశలమధ్య బహుకాలం కొట్టుకులాడలేకే తను తెగిం చింది...కలిసివచ్చిన అదృష్టంగా భావించుకొని హేమంత్‌ను ప్రేమిం చింది... అతడు పెద్దఅందగాడు కాకపోయినా ఐశ్వర్యవంతుడు! పైగా తన ప్రాణస్నేహితురాలు కళ్యాణికి అన్నయ్య - పెద్దమ్మ కొడుకట.... తను అతడికి ఎంతోనచ్చిందిట... అందుకే మనసులు కలిశాయి.

ఇందాక హేమంత్ కారులోంచి తను దిగటం తండ్రిచూశాడు. మనసులో ఏం మధన పడుతున్నాడోగాని - పైకి మాటమాత్రం అనలేదు... ఏదైతేనేం ? తనుపెదవి విప్పి చెప్పకుండానే ఆయనకు కొంతలో కొంత నిజం తెలిసిపోయివుంటుంది. ఇదీ ఒకందుకు మంచిదే ....

- ఆలోచనల మధ్య శారదకు నిద్ర పట్టటంలేదు.

కళ్యాణి, తను క్లాస్‌మేట్స్...... ఆర్థిక సారూప్యమేనేమో తమని మరింత దగ్గరగా చేర్చింది...... సమయం చిక్కినప్పుడల్లా కళ్యాణి తమ యింటికి రావటం, తను వాళ్ళయింటికి వెళ్ళటం జరుగు తూండేది.... చదువు అయిపోయాక కూడా అంతే.... పరిస్థితులిలా ఉండగానే కళ్యాణి తండ్రి అనుకోకుండా కన్నుమూశారు. దాంతో వాళ్ళ కుటుంబ పరిస్థితులు మారిపోయి-ఉద్యోగ ప్రయత్నంలోపడింది అది.......

అటువంటి సమయంలోనే తను ఓ రోజు సాయంత్రం కళ్యాణి వాళ్ళ ఇంటికి వెళ్ళింది.అక్కడ కనిపించాడు హేమంత్! తన పెద్దమ్మ కొడుకుగా అతణ్ణి పరిచయంచేసి,

"అన్నయ్య మొన్నమొన్నటి వరకూ నాకూ తెలియదు. అసలు నాకో పెద్దమ్మ ఉన్నట్లు కూడా చెప్పలేదు అమ్మ....అదంతా ఓ పెద్ద కథట.... అన్నయ్యమాత్రం చాలా మంచి మనిషే. నాన్నపోయి మేము ఇబ్బందుల్లో ఉన్నామని తెలిసి ఆదుకోవటానికి వచ్చాడు.... నువ్వు చూడలేదేమోగాని ఈ మధ్య అప్పుడప్పుడు మా యింటికి వచ్చి పోతూనే ఉన్నాడు అన్నయ్య....సందర్భం కలిసిరాక నేనే నీకు చెప్ప లేదు ఈ విషయం." అంది కళ్యాణి.

"అలాగా!" అని "సరేగాని కళ్యాణీ, ఇందాక మీ పెద్దమ్మ గార్ని గురించి చెప్పబోయి అదో పెద్ద కథ అన్నావు. ఏమిటది?" అనడిగింది తను కుతూహలంకొద్దీ.

"ఏముందే.... ప్రేమకథ.... షరా మామూలే....మా అమ్మ ప్రేమించి పెళ్ళిచేసుకున్న బాపతు.... కులగోత్రాలు పట్టించుకోకుండా అమ్మ పెళ్ళి చేసుకోవటం పెద్దమ్మ దృష్టిలో పెద్దనేరమైంది....అవిడ పూర్వకాలపు మనిషి...ఆ చాదసౌలతో అప్పట్నుంచీ ఇప్పటి వరకు మా గడప తొక్కలేదు.... స్వంత చెల్లెలి పసుపు కుంకుమలు పోయా యని తెలిశాక కూడా ఆవిడ రాతిగుండె కరగలేదు... అయితే పెద్దమ్మకు తప్పు పుట్టాడు అన్నయ్య. అయిన వాళ్ళమైన మేము ఇబ్బందుల్లో ఉన్నామని తెలిసి-తల్లికి ఇష్టంలేకపోయినా మా యింటికి వస్తూ పోతూ - తనకు చేతనైన విధంగా సహాయపడుతున్నాడు.... నిజంగా ప్రస్తుత పరిస్థితుల్లో అన్నయ్యే ఆదుకోకపోతే మేము ఏమై పోయేవాళ్ళమో....?"

అంటూ కళ్యాణి చెప్పినదాన్నిబట్టి కథంతా అర్థమైపో యింది శారదకు....దాంతో హేమంత్ ఒక ఉదార స్వభావుడిగా చిత్రించుకు పోయాడు తన హృదయంలో.

హేమంత్‌తో అక్కడ - అలా పరిచయమైంది.

"అతిశయోక్తిగా భావించుకోనంటే మీకోమాట చెబుతాను శారదగారూ" అన్నాడు హేమంత్ - ఓ రోజు.

"చెప్పండి...." అని మాత్రం అనగలిగింది తను. అసలు అతడి ఎదురుగా నిలబడట మంటేనే తగని సిగ్గుగా ఉంది. ఇక ధైర్యంగా ఏం మాట్లాడ గలుగుతుంది?

"మీరు చాలా అందంగా ఉంటారు."

అతడి ఆ కాంప్లిమెంట్ విన్నాక అక్కడ నిలబడలేక తుర్రున లోపలికి పారిపోయింది.

"ఎందుకే శారిదా, అంతసిగ్గు?....అన్నయ్య ఏమైనా నిన్ను నములుతాడా. మింగుతాడా?....సరదాగా మాట్లాడటం అతడికి అల వాటు...నువ్వు అందంగా ఉన్నావు. ఆ మాటే అతడుపైకి చెప్పాడు ఆ మాత్రం దానికేనా నువ్విలా పారిపోయిరావటం ? ఎంత చదువుకున్నా నువ్వు ఈ కాలానికి పనికిరావే."

—కళ్యాణి ఎత్తిపొడుపుకు ఓర్వలేకపోయింది తను.

"ఏం, మీ అన్నయ్యంటే నాకేంసిగ్గు ? ....నేనతడి ముందు నిలబడలేనా. మాట్లాడ లేనా ? పద...." - అంటూ తిరిగి కళ్యాణితో ఇవతలికి వచ్చింది.

"....పనుంది. వస్తాను పిన్నీ...." అంటూ కళ్యాణి తల్లి శ్రీలక్ష్మికి చెప్పి హేమంత్ అప్పటికే బయటికి వెళ్ళిపోవటంతో - తనగుండెల మీద బరువు తాత్కాలికంగా తీసినట్లైంది.

అప్పట్నుంచీ కళ్యాణి వాళ్ళ ఇంట్లో తరచు కనిపించేవాడు అతడు. పైగా మంచి కలుపుగోలు మనిషి...రాను రాను హేమంత్ అంటే తనకు పూర్తిగా బిడియం పోయింది. చాలా సాయంత్రాలు కళ్యాణి వాళ్ళ ఇంటివెనక పొన్నావి చెట్టుక్రింద కూర్చొని కబుర్లాడు కున్నారు....ముగ్గురూ కూర్చున్నాక ఏదో విషయం మీద చర్చ - మధ్యలో ఉన్నట్లుండి కళ్యాణిని తల్లి పిలిచేది. 'ఇప్పుడేవస్తాను. మీరు మాట్లాడుతూండండి' అని చెప్పివెళ్ళేది అది. తమ ఇద్దర్నీ ఒంటరిగా వదిలివేయటం దాని ఉద్దేశ్యం కావచ్చు....అలా వెళ్ళిన కళ్యాణి చాలా సేపటివరకు వచ్చేది కాదు....ఈలోగా హేమంత్" మీరు అందంగా నవ్వుతారు. ....అణకువగా మాట్లాడతారు....అందుకే మీరంటే నాకెంతో ఇష్టం...." అంటూ మొదలు పెట్టి "మాకు కావలసినంత ఆస్తి ఉంది....నేను మా అమ్మగారికి ఒక్కడినే కొడుకును....పుట్టి బుద్ధెరిగాక ఇంతవరకు ఆవిడ నా మాట కాదన లేదు. ఇకముందూ అలాఅనదు....నాకు ఆ నమ్మకం ఉంది.....ఇక మీస్థితి గతులతో నాకు నిమిత్తం లేదు. .... నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్న మీరు కనుక హృదయపూర్వకంగా అంగీకరిస్తే— మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నాను" అంటూ తన నిర్ణయం చెప్పి "మీ అభిప్రాయం ఏమిటి ?" అని అడిగేవాడు.

ఆ వ్యక్తి మంచితనం చూసి, అతడి ఆ మాటలు విన్నతర్వాత ఏమని జవాబిస్తుంది? సంతోషంతో తల మున్కలవటం మినహా సమాధానం చెప్పేదికాదు. తన మౌనాన్ని అతడు వేరేవిధంగా అర్థంచేసుకొని, "పిన్ని విషయంలో ఎంతో కఠినంగా వ్యవహరించ టాన్ని బట్టి - మాఅమ్మగార్ని మీరు వేరేవిధంగా అంచనా వేసుకొనే అవకాశం ఉంది.... ఒకవేళ మన ప్రేమను ఆవిడ కాదన్నా మిమ్మల్ని నేను పెళ్ళాడి తీరుతాను. ఆస్తి పాస్తులు రాకుండా పోయినా-నాకు మన సారా నచ్చిన మీరుతోడుంటే - ఎంతో హాయిగా బ్రతకగలను. ఏ చిన్న ఉద్యోగమో చూసుకొని ...." అంటూ ధైర్యం చెప్పేవాడు.

"మా అన్నయ్య ఎంతో యోగ్యుడు. నువ్వంటే ఇష్టపడు తున్నాడు.... ఇది అందివచ్చిన అదృష్టంగా భావించుకొని 'ఊఁ' అనే సెయ్యి శారదా" అని కళ్యాణి వత్తిడిచేసేది.

తన మనసులోని ఆశలు, కుటుంబ పరిస్థితులు, హేమంత్ కలిపించే ధైర్యం, కళ్యాణి పెట్టే వత్తిడి— వీటి అన్నింటి కారణముగా తను అతడి విషయంలో సుముఖమైన నిర్ణయానికివచ్చి— ఆ మాటే ఓ నాడు చెప్పేసింది బయటికి.......

ఇంతకాలం తమ ప్రేమవ్యవహారం అంతా కళ్యాణి ఇంటి నాలుగ్గోడలమధ్యే— అయితే ఈరోజు హేమంత్‌తో సినిమాకు వెళ్ళటం, సరాసరి అతడికారులోనే ఇంటికి రావటం- ఆ దృశ్యం తండ్రి కంట పడటం- అంతా ఓ కలలా జరిగి పోయింది.

....అయినా భయపడవలసిన పనిలేదు... తనంటే ఎంతో ఇష్టపడే హేమంత్— తననిపెళ్ళాడే విషయంలో ఎటువంటి శంకలకు తావులేదు.

ఇక .... లక్షాధికారైన హేమంత్‌కు తాను అర్ధాంగి కాబోతోంది. అతడు తనవాడు అతడికారు.... వాళ్ళ లంకంత ఇల్లు.... అన్నీ తనవే.... కోరినతిండి, నచ్చిన బట్టలు, నగలు....! తమ్ముడు, చెల్లాయి- వాళ్ళు చదువుకున్నంత వరకు తానే చెప్పించవచ్చు.

....కళ్యాణి అన్నట్టు నిజంగా తను అదృష్టవంతురాలే...ఎంతో తృప్తి ఫీలవుతూ హాయిగా నిద్రలోకి జారుకొంది శారద.

3

రామానగరం ఆ పట్టణానికి అతి దగ్గరలో ఉన్న ఓ పల్లెటూరు. డెల్టా ఏరియా అవటం మూలాన పాడిపంటలకు కొదువలేదు. సిటీ బస్ సౌకర్యం ఉంది. పేరుకుపల్లె అయినా చాలావరకు బస్తీపోకడే కనిపిస్తుంది అక్కడ. సీటీ కొళాయిలు, సిమెంట్‌రోడ్లు, ఓ పర్మినెంట్ సినిమా థియేటర్, కొన్ని హోటళ్ళు-బడ్డీలు- అన్నీ ఉన్నయ్ సౌకర్యాలు.

ఆ రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత హేమంత్ కారు అందమైన రామానగరం నకిరోడ్డుమీద పోతూ కుడివైపు మలుపుతిరిగింది. అక్కడ ఓ పెద్దలోగిలి- దానికి విశాలమైన ఆవరణ, చుట్టూ ప్రహరీగోడ- గేటు- ఆ గేటుముందు కారుఆపి హారన్‌కొట్టాడు గట్టిగా. ఏమూలో పడుకొని కునుకుతున్న పనివాడు కొండయ్య ఆదరాబాదరాగా, ఊడి పోతున్న గోచిని సరిచేసుకొంటూ వచ్చి- గేటుతెరిచి వినయంగా నిల బడ్డాడు.

హేమంత్ మాట్లాడకుండానే కారులోపలికి పోనిచ్చి షెడ్‌లో పార్కుచేశాడు.... ఈలోపల అతడితల్లి జగదీశ్వరి సింహద్వారం తలుపుతీసి బయటికి వచ్చింది.

"ఏమిటమ్మా, నువ్వింకా నిద్రపోలేదా?" అంటూ తల్లిని అను సరించి లోపలికి వచ్చాడు హేమంత్.

"....ఇంత పెద్దలోగిలి.... నేనేమో ఒంటరిదాన్ని.... నువ్వు ప్రొద్దస్తమానం ఊరుపట్టుకొని తిరుగుతావ్.... ఎవరూతోడు లేకుండా నేను ఈ ఇంట్లో ఉండలేక పోతున్నారా అబ్బాయ్.... పడుకున్నది మొదలు- వెధవవి- ఒకటేపీడకలలు...." అంది జగదీశ్వరి.

తల్లి పరిస్థితిని తలుచుకొని జాలిపడ్డాడు హేమంత్.

"అదివరకు కొంచెం సేపైనా ఇంట్లో ఉండేవాడివి.... ఆ కారు కొన్నాకే నీకుతిరుగుడు ఎక్కువైంది అయినా స్కూటరు ఉండగా కారు ఎందుకు?.... నువ్వేమైనా లక్షలు సంపాదించే వ్యాపారస్తుడివా, వేలకువేలు సంపాదించే ఉద్యోగస్థుడివా?.... పెట్రోలుకనీ, రిపేర్లకనీ తెగ తినేస్తోంది ఆ పాడు కారు... నా మాటవిని దాన్ని అమ్మెయ్‌రా" అంది జగదీశ్వరి.

"అలాగేలే అమ్మా... ఏదో మనసుపడి కొన్నాను. మోజు తీరి పోయిందిగా.... ఇక అమ్మేస్తాను...." అనేవాడు రోజూతల్లి పెట్టే పోరుపడలేక.

...."సరే....రా....వడ్డిస్తాను, భోం చేద్దువుగాని" అంటూ వంట ఇంటివైపు నడిచింది జగదీశ్వరి.

హేమంత్ బట్టలు మార్చుకొని భోజనానికి వెళ్ళాడు.

"ఈ వేళ ఎక్కడికి వెళ్ళావ్?"

కలుపుకున్న ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న హేమంత్ - తల్లికి ఏమని సమాధానం చెప్పాలో అన్న ఆలోచనలోపడ్డాడు. స్నేహితులనీ, పార్టీలనీ రోజూ ఒకటే సమాధానం అయితే ఆవిడకు తన మాట మీద నమ్మకం పోతుంది....మరి ఏమని చెప్పాలి?

ఏమిట్రా ఆలోచన?.... వెళ్ళిన చోటు, చేసిన పని చెప్పటానికి ఎందుకు అంత జాగు? దానింటికి వెళ్లావా?

"....పిన్నివాళ్ళ ఇంటికా?.... వెళ్ళానమ్మా.... బాబాయి పోయాక పాపం వాళ్ళు చాలా ఇబ్బందుల్లో పడ్డారు...."

"చేసుకున్న దానికి చేసుకున్నంత మహదేవ అన్నారుమరి.... ఇప్పుడుచూడు. ఆడపిల్లపెళ్ళి, మగపిల్లడి చదువు- దానివల్ల అవుతుందిరా?"

"ఎందుకుఅమ్మా, ఒకేతల్లికడుపున పుట్టిన పిన్నిఅంటే నీ కింతకసి ?"

"పుట్టాంరా... అయితే మాత్రం ?... పెద్దలమాట విని లక్షణంగా పెళ్ళిచేసుకొని నాలా హాయిగా బ్రతక్కుండా - ప్రేమ దోమ అంటూ ఎవడో కులం లేనివాణ్ణి కట్టుకుంటుందా అది ?.... దాని దిగులుతోనేరా గుండ్రాయిలా ఉండే మానాన్న, ఏ జబ్బూ లేని మా అమ్మా — అంత తొందరగా చనిపోయింది.... పోనీలే. చల్లటి వేళప్పుడు ఆ పాపిష్టిదాని ఊసు మనకెందుకు గాని - మామయ్య మొన్నరాసిన ఉత్తరానికి ఏమని జవాబురాస్తావ్ ?.... నువ్వు హైద్రాబాద్ ఎప్పుడు వెళ్తావ్ ?"

తల్లి మామయ్య, హైద్రాబాద్ — ఆ ప్రసక్తి తేవటంతో హేమంత్ ముఖంలో రంగులు మారిపోయాయి. చక చక రెండుముద్దలు తినేసి చెయ్యికడిగి ఇవతలకి వచ్చేశాడు.

"నాకు తెలుసు హేమంత్ నీమనసు.... ఈ విషయంలో నేను నిన్ను బలవంతపెట్టను.... అయితే కొంచెం లోతుగా ఆలోచించమంటున్నాను....రజని అంటే మొదట్నుంచీ నీకు ఎంత ప్రేమో నాకుతెలుసు ....జరిగి పోయిన దానికి ఇప్పుడు అదీ ఎంతో పశ్చాత్తాప పడుతోందట....ఈ ఒక్కసారికి నామాట విని హైదాబాద్ వెళ్ళు.... ఎందుకంటే రజనిని నువ్వు అగ్నిసాక్షిగా పెళ్ళాడావు!"- వంటగది సర్దివచ్చి హాలులో ఆలోచిస్తూ కూర్చున్న కొడుకుతో అంది జగదీశ్వరమ్మ.

"అగ్ని....సాక్షి....పెళ్ళి ...." అంటూ కసిగా వత్తి వత్తి పలికి "అదో పీడకల దాన్ని మరిచిపోయి నేను చాలా కాలమైంది.... చివరిసారిగా చెబుతున్నాను. అమ్మా, నేను ఆత్మాభిమానం ఉన్న మనిషిని. అది చావాల్సివచ్చిన రోజున దానితోపాటు నేనూ చచ్చిపోతాను." అని తెగవేసినట్లు చెప్పి, వెనుకనుంచి తల్లి ఏమిటో అంటున్నా వినిపించుకోకుండా తనగదిలోకి వెళ్ళి ఫెళ్ళున తలుపులు మూసేసుకున్నాడు హేమంత్.

మెత్తని పరుపు కూడా అతడికి అంపశయ్యలా ఉంది.... బయటి వాతావరణం ఎంత చల్లగా ఉన్నా ఉక్కపోస్తున్నట్లు చిరాకు అనిపిస్తోంది.... లేచివెళ్ళి కిటికీ దగ్గిర నిలబడి సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తూ గుప్పుగుప్పున పొగ వదులుతున్నాడు....ఎంత నిగ్రహించుకుందామన్నా గతం జ్ఞప్తికి వస్తూనే ఉంది హేమంత్‌కు....

4

హేమంత్ తండ్రి నారాయణరావు. ఆయన చెల్లెలు సీత.... 'లోకంలో అందరు అన్నా చెల్లెళ్ళకంటే వాళ్ళిద్దరి మధ్య అప్యాయానురాగాల పాలు కొంచెం ఎక్కువేమో !' అన్నట్లు నడుచుకొనేవారు. అదేం చిత్రమో ! వాళ్ళ ఇద్దరికీ ఒక్కరొక్కరే బిడ్డలు....ముందు హేమంత్ పుట్టాడు. తనకు అల్లుడు పుట్టాడని మురిసిపోయింది సీత....తర్వాత యాణ్ణర్థానికి రజనిపుట్టింది. తనకు కాబోయేకోడలు పుట్టిందని ఆనందించాడు నారాయణరావు. వాళ్ళిద్దరూ భార్యాభర్తలుగా చిన్నప్పుడే గుర్తింపు పొందారు.

అప్పుడు హేమంత్‌కు పధ్నాలుగవ ఏడు. రజనికి పన్నెండవ సంవత్సరం వచ్చింది..... ఉన్నట్లుండి సీతమ్మ జబ్బున పడింది. కడుపులో వ్రణం. ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు ... ఏ ఆపరేషన్ చేసినా ఇకతాను బ్రతికి బట్టకట్ట గలగటం మీద అపనమ్మకం బయలుదేరిన సీత- 'అనుకున్న ప్రకారం నాకూతుర్ని నీ కోడలిగా చేసుకో అన్నయ్యా- వాళ్ళిద్దరూ పసుపు బట్టలతో నిలబడితే చూసి ఆనందించాలని ఉంది' అంటూ తన కోర్కెను బయటపెట్టింది. 'అదెంతభాగ్యం, అలాగే జరిపిస్తాను సీతా!' అంటూ చెల్లెలిమీది మమకారం కొద్దీ వెంటనే ఏర్పాట్లు చేయించాడు నారాయణరావు.... హేమంత్, రజని కూడా పెళ్ళంటే సిగ్గుపడ్డారే గాని 'ఇప్పుడే మాకెందుకు పెళ్ళి?' అని ఎదిరించలేక పోయారు. అయినా అప్పుడు వాళ్ళ వయసెంత, మనసెంత?... బొమ్మల పెళ్ళిలా తంతు జరిగిపోయింది.

చివరికి ఆపరేషన్ పూర్తయి సీతమ్మ బ్రతికింది.... అయితే తర్వాత ఓ రోజు అకస్మాత్తుగా గుండెపోటువచ్చి నారాయణరావే కన్నుమూసాడు. విధివిలాసం మరి!

"భగవంతుడిలా అన్యాయం చేస్తాడని అనుకోలేదు వదినా.... అంతజబ్బునపడ్డాను. నేనే పోవలసింది....కానీ, అన్నయ్య నిమిషంలోకి చెయ్యిదాటిపోయాడు....ఇక ఈ లంకంత ఇంట్లో మీ తల్లీకొడుకు ఒంటరిగా ఉండాలంటే కష్టమే....అందుకనే మీ యిద్దరూ హైదరాబాద్ వచ్చి మా యింట్లో ఉండిపోండి వదినా...." - అంది సీతమ్మ.

"ఎప్పుడూ పదిమందితో కళకళలాడుతూండేది ఈ లోగిలి.... అలాంటి దీన్ని పాడుబెట్టి నేను, నా కొడుకు మీ యింటికి వచ్చి ఉండటమా?.... వద్దుసీతా. ఉన్నభూమిని, కన్న కొడుకును కనిపెట్టుకొని నేను ఇక్కడే ఉండిపోతాను." - అంది జగదీశ్వరమ్మ దృఢంగా.

"....పోనీ, వదినా, చదువుకొని వృద్ధిలోకి రావలసినవాడు హేమంత్ .... ఈ వూళ్ళో హైస్కూలు లేదు.... రోజూ బస్తీకి

పోయి రావాలంటే కష్టం. చదువు సాగదు. ఇంత కాలం అంటే అన్నయ్యా లేదు.... నువ్వేమో ఆడదానివి.... నా ఉద్దేశ్యమేమిటంటే వదినా, హేమంత్‌ను హైదరాబాద్ తీసుకువెళ్తే రజని, అతడు కలిసి చదువుకుంటారు....ఒకచోట మెసిలితే వాళ్ళమనసులూ దగ్గరవుతయ్'' అంటూ తన అభిప్రాయం చెప్పింది సీత.

"సరే సీతా, కూతుర్నిచ్చి చేసినవాళ్ళు మీరు. మీ అల్లుడి బాగోగులు నాకంటే మీకే ఎక్కువ తెలుస్తయ్.... హేమంత్‌కు ఇక్కడ ఒకటే గారాబం....నాకూ దూరంగా ఉంటేనైనా చదువు శ్రద్ధగా సాగుతుందేమో.... నీ మాటప్రకారమే కానియ్'' అంటూ జగదీశ్వరమ్మ తన సమ్మతి తెలిపింది.

హైదరాబాద్ వంటి మహానగరం వెళ్లి— అక్కడ చదువుకోవటమంటే హేమంత్‌కూ సరదాగానే ఉంది. పైగా రజని ఎప్పుడూ తన పక్కనే ఉంటుంది... ఎందుకంటే ఆమె అంటే అతడికి తగని ఇది.... అందుకే ఏమాత్రం ఎదురు చెప్పలేదు.

* * *

హేమంత్ చిన్నప్పట్నుంచి ఆటలన్నా, సరదాగా తిరగటమన్నా ఎక్కువ ఇష్టపడేవాడు. చదువులో మాత్రం మందమే.... హైదరాబాద్ వచ్చాక రజనితండ్రి రామచంద్రరావు అతణ్ణి, కూతుర్ని కలిపి మెట్రిక్‌కు కట్టించారు. వాళ్ళిద్దరి కోసం ఓ ట్యూటర్ని కుదిర్చాడు. ఆయనే ఇంటికివచ్చి చదువు చెబుతూండేవాడు.

రజని అందమైనదేకాదు. తెలివైనదికూడా ! చదువంటే ఎంతో శ్రద్ధ. హేమంత్‌కు ఆమెపెట్టిన ముద్దుపేరు 'కోతిబావ'. అందుకు తగినట్లే ఉండేవి అతడి పనులూను...

ఓ రోజు రాత్రి హేమంత్, రజని ఒకేటేబిల్ ముందు రెండు కుర్చీలలో కూర్చొని చదువుకుంటున్నారు. రజని మరోధ్యాస లేకుండా పుస్తకంలోకే చూస్తోంది. హేమంత్ పనల్లా రజనివైపు చూడటమే. కొన్నిసార్లు ఆమెను మాట్లాడించటానికి ప్రయత్నించాడు. అందుకు విసుక్కొంది రజని... 'నీపని ఇట్లాకాదు' అని లేచి బయటికి వెళ్ళినట్లేవెళ్ళి— పిల్లిలా తిరిగివచ్చి రజని రెండుజడలను కుర్చీకి కట్టేడు. తర్వాత "మీఅమ్మ పిలుస్తున్నట్లుంది. వెళ్ళు రజనీ" అన్నాడు. 'అమ్మకేం పనిలేదు' అంటూ అయిష్టంగానే లేచివెళ్ళబోయింది. కానీ లేవలేకపోయింది.... తన జడలు కుర్చీకి కట్టి ఉండటం, పక్కనే కూర్చున్న హేమంత్ పగలబడి నవ్వుతూండటంతో, ఏయ్, కోతీ... చేసిన పాడుపని చాలక నవ్వుతున్నావా? '' అంది కోపంగా.

అయినా, ఆమె మాటలను పట్టించుకోని హేమంత్ "కోపంలో ఉన్నప్పుడే నువ్వు అందంగా ఉంటావు రజనీ.... అందుకే— నీకు కోపం తెప్పించాలని ఇలాచేసాను '' అంటూ ఆమె జడకట్లను తానే ఊడదీశాడు.

అటువంటి పనులు మరెన్నోచేసి 'కోతిబావ' గానే స్థిరపడిపోయాడు హేమంత్ రజని మనసులో.... రజని అలా పిలవటమే ఇష్టంగా ఉండేది హేమంత్‌కు.

పరీక్షా ఫలితాలు తెలిసినయ్.... రజని ప్యాసైంది. కానీ, హేమంత్ తప్పాడు.

"నాకు ముందే తెలుసు కోతిబావా, నువ్వు తప్పుతావని. నేను అనుకున్న ప్రకారమే జరిగింది. మరి ఒక్కరోజైనా సరిగ్గా చదివితేగా? .... పైగా చేసేవన్నీ తిక్కపనులు....'' అంది రజని.

"తప్పటం, ప్యాసవటం మనచేతుల్లో ఉన్నయ్యా హేమంత్? ఏదో చేతనైన ప్రయత్నం చెయ్యగలుగుతామేగాని— అంతకుమించి ఎవరుమాత్రం ఏం చేయకలుగుతారు?'' అంటూ హేమంత్ మనసు నొచ్చుకోకూడదని సర్దిచెప్పింది సీతమ్మ.

"ఔనోయ్ హేమంత్, మరోసారి ప్రయత్నించు.... ఈసారి నువ్వు తప్పకుండా ప్యాసవుతావు. నాకు ఆ నమ్మకం ఉంది'' అన్నాడు రామచంద్రరావు అల్లుడికి గుండె ధైర్యాన్నిస్తూ.

"ఎన్నిసార్లు ప్రయత్నించినా బావ ప్యాసుకాలేడు నాన్నా... వట్టి మట్టిబుర్ర'' అంది రజని తేలికభావంతో.

-- చిన్నప్పట్నుంచీ ఎంత గారాబంగా పెంచినా - అప్పుడు అలా మాట్లాడిన కూతుర్ని ఆ చెంప ఈ చెంప వాయించాలన్న కోపం వచ్చింది సీతమ్మకు. కానీ, తొందరపడి చేతికి పని చెప్పలేక, "నోరుమూసుకో నువ్వు....అలా మాట్లాడవచ్చా బావముందు? రాను రాను నీకు తెలివి ఎక్కువైపోతున్నట్లుందిలే'' అంటూ హెచ్చరించింది.

"అవునమ్మా రజనీ....బావను గౌరవించటం నేర్చుకోవాలి గాని - అలా గేలి చేసినట్లు మాట్లాడకూడదు.'' అంటూ రామచంద్రరావు కూడా కూతుర్ని సున్నితంగా మందలించాడు.

ఈసారి హేమంత్‌కు పౌరుషంవచ్చి కొంచెం శ్రద్ధగానే చదివాడు. అలాగే సప్లమెంటరీ పరీక్ష కట్టి - ప్యాసయ్యాడు.

"ఇప్పుడేమంటావ్ రజనీ.... ? నాది మట్టి బుర్రయితే ఎలా ప్యాసయ్యానిప్పుడు?'' అడిగాడు రజనిని సగర్వంగా-పరీక్షా ఫలితాలు తెలిసిన రోజున.

"నీది ముమ్మాటికీ మట్టి బుర్రే.... ఇప్పుడు నువ్వేం చదివి ప్యాసుకాలేదు.. మానాన్నే నిన్ను కావాలని ప్యాసు చేయించాడు లంచం పెట్టి...." అంది రజని అతడి అహాన్ని దెబ్బతీస్తూ.

"నేను స్వశక్తి మీద ప్యాసు కాలేదా?.... మామయ్య లంచం పెట్టి ప్యాసుచేయించాడా నన్ను?-'' అయోమయంలో పడిపోయాడు

హేమంత్. పరీక్ష ప్యాసయ్యాడన్న ఉత్సాహం నీటి బుడగ చందమైంది.

“ఔను. నీకు ఇంగ్లీషు పేపరులో మార్కులు తగ్గితే వేయించారట. మొన్న ఈ మాట నాన్న అమ్మతో చెబుతుంటే విన్నాను. కావాలంటే ఆయన్నే అడుగువెళ్ళి” అంది రజని ధృవీకరణగా.

దాంతో హేమంత్ మనస్సు కకావికలమైపోయింది.... తనకు తెలివితేటలు లేవు.... చదువంటే శ్రద్ధలేదు.... రజనిముందు జీవితాంతమూ - ఇలాగే తల వంచుకొని నిలబడవలసిందే ?

“ఇంగ్లీషులో ఒక్కమార్కు తగ్గిందని తెలిసి దాన్ని కలిపించాను.........ఆ ఒక్కమార్కు గురించి నువ్వు నిరుత్సాహపడిపోకుండా - ఏదో చేశాను. అయినా ఇదేమంత పెద్ద విషయమని ? దీన్ని గురించి నువ్వు ఆలోచించటం, బాధపడటం అనవసరం హేమంత్” - అల్లుడు అడిగినమీదట అసలు విషయం దాచలేకపోయాడు రామచంద్రరావు.

“అసలు నీకీవిషయం చెప్పిందెవరు హేమంత్?.... రజనియేనా....అది రానురాను మరీ పెంకిఘటమైపోతోంది” - అంటూ సీతమ్మ కూతురిమీద అక్కసు పడింది.

తర్వాత హేమంత్ తన స్వగ్రామం వెళ్ళి కొంతకాలం గడిపి వచ్చాడు.

5

హేమంత్‌తో పాటు రజనీని కాలేజీలో చేర్పించాడు రామచంద్రరావు.

అసలు మెట్రిక్ ప్యాసవగానే నేను కాలేజీలో చేరతానని పట్టుబట్టింది రజని. కానీ, వయసు సరిపోదని అడ్డుపెట్టి ఆమెను ఆ ప్రయత్నం మానేట్లు చేశాడు రామచంద్రరావు. నిజానికి డబ్బు పలుకుబడి ఉన్న ఆయన తలుచుకోబట్టే వయసు కొంచెం తగ్గినా రజని మెట్రిక్ పరీక్ష రాయగలిగింది.అలాగే చేర్పించదలిస్తే కాలేజీలో కూడా చేరగలిగేదే ఆమె. తనని వదిలి రజనిని కాలేజీలో చేర్పిస్తే హేమంత్ ఎలా ఫీలవుతాడోననే అలా చేయలేదు రామచంద్రరావు.

అదృష్టమో దురదృష్టమోగాని - ఆ ఏడూ హేమంత్ పి. యు. సి. పరీక్ష ప్యాసుకాలేదు. పరీక్షాఫలితాలు తెలిసినప్పుడు అతడు స్వగ్రామం రామనగరంలో ఉన్నాడు....దాంతో తనకు చదువురాదు. పట్టు బలవంతాన చదివినా ఏ పరీక్షా ప్యాసుకాలేడు అన్న అపనమ్మకం ఏర్పడి ఆ మాటే తల్లితో అన్నాడు.” నాకింకా చదువుకోవాలని లేదు. ఇక్కడే ఉండి వ్యవసాయపు పనులు చూసుకుంటాను” అని. కన్నతల్లి, ఒక్కగానొక్క కొడుకు - ఏమంటుంది జగదీశ్వరమ్మ ? “అలాగే కానీ.... దేనికైనా ప్రాప్తం అనేది ఉండాలి.” అని ఊరు కొంది....కానీ, సీతమ్మ, రామచంద్రరావులు అలా అని సరిపెట్టుకోలేదు. “పరీక్షపోయినందుకు ఏ మాత్రం బాధపడవద్దు. మరోసారి ప్రయత్నించి చూస్తే బాగుంటుంది” అంటూ ఉత్తరాలు రాశారు. అయినా చలించలేదు హేమంత్.

....స్వగ్రామంలో ఉండి వ్యవసాయపు పనులు చూసుకుంటున్నాడు హేమంత్. రజని హైద్రాబాద్‌లో బి.ఎ. లో చేరి చదువుతోంది.... రామచంద్రరావు వాళ్ళు రెండుమూడుసార్లు ఉత్తరాలు రాశారు ఒకసారి ఇక్కడికివచ్చి వెళ్ళమని, కానీ రజని - ఆమె చేయబోయే అవహేళనల గురించి ఊహించుకొని అలా వెళ్ళలేక పోయాడు.

తను చదువు మానేయటం, భార్య దర్జాగా చదవటం - రాను రాను అవమానకరంగా తోచసాగింది హేమంత్. అందుకు కారణం ఊళ్ళోపరిస్థితులు, తెలిసినవాళ్ళు దెప్పి పొడుపుగా అందించే చురకలు..

జగదీశ్వరమ్మ కొడుకులో వచ్చిన మార్పునుబట్టి, అతడి మనసును అర్థంచేసుకొంది. అదీ కాకుండా పనివాడు కొండయ్య ఊళ్ళో పరిచయస్థులు హేమంత్‌ను చేసే అవహేళన్ను గురించి వివరించి చెప్పటంవల్ల కూడా ఆమెకు కొడుకు పరిస్థితిని త్వరగా అవగాహన చేసుకోవటానికి వీలుకలిగింది.... కోడల్ని చదువుమాన్పించి తమ ఇంటికి తీసుకురావటమే అన్ని సమస్యలకు పరిష్కారంగా భావించుకున్న ఆమె ఓ మంచిరోజు చూసుకొని రామచంద్రరావు, సీతమ్మలతో మాట్లాడటానికి హైద్రాబాద్ వెళ్ళింది.

రజని వయసులో చిన్నది. అప్పుడే కార్యం చేసి అత్తవారింటికి పంపటానికి ఇష్టపడలేదు రామచంద్రరావు దంపతులు.... కనీసం హేమంత్ ఆవేదన తగ్గించటానికి రజనిచేత చదువైనా మాన్పించమని అడిగింది జగదీశ్వరమ్మ. అందుకు తల్లీదండ్రీ ఒప్పుకున్నారు. కానీ, రజనిమాత్రం తను చదివితీరాలని పట్టుబట్టింది.... దానిమీద అలిగి ఓరోజల్లా అన్నం తినకుండా పడుకొందికూడా. చివరికి ఏం ఆలోచించుకున్నారో ఏమో- రామచంద్రరావు దంపతులు జగదీశ్వరమ్మ మాట ప్రకారమే వెంటనే కార్యం చేయటానికి అంగీకరించారు. అది తెలిసిన రజని పూర్తిగా రెచ్చిపోయింది. తన చదువును ఎవరైనా ఆపుచేయాలని చూస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఇక లాభం లేదని తిరిగి వచ్చేసింది జగదీశ్వరమ్మ.

‘రజనికి తనంటే ఆకర్షణ, సదభిప్రాయం లేవు... ఇప్పుడే ఇంత చులకన భావం ఏర్పరచుకొంటే రేపు చదువుపూర్తి అయ్యాక తననెంత హీనపరుస్తుందో ఆమె?’ -కృంగిపోవటం మొదలుపెట్టాడు హేమంత్, తల్లిద్వారా అన్నివిషయాలు తెలుసుకున్న తర్వాత.

...ఆ ఆలోచనల మధ్య వ్యవసాయపు పనులమీద శ్రద్ధ చూపలేక పోతున్నాడు హేమంత్. తరచు స్నేహితుల్తో ప్రక్కనేఉన్న పట్నంపోయి సరదాగా కాలక్షేపం చేసిరావటం మొదలుపెట్టాడు... అర్ధరాత్రి అపరాత్రి తిరగటానికి ఇబ్బందిగా ఉందని స్కూటరు కొన్నాడు. కాదనలేదు జగదీశ్వరమ్మ.

*   *   *

ఒక ఏడాది గడిచింది అలా.... అదివరకులా కాకుండా హేమంత్ ఇప్పుడు ఒక్కక్షణం కూడా ఇంటి పట్టున ఉండటం లేదు. స్నేహాలు, తిరుగుళ్ళు బాగా ఎక్కువయ్యాయి. దీనిమీద ఆలోచించి కోడలు తమఇంటికి వస్తేనే కాని కొడుకుమనసు కుదుట పడదన్న నిర్ణయానికి వచ్చేసింది జగదీశ్వరమ్మ. అందుకే ఓ రోజు హేమంత్‌ను కూడా తీసుకొని హైదరాబాద్ బయలుదేరింది.

తల్లితో ప్రయాణ మవ్వటానికి ముందు తటపటా యించాడు హేమంత్. తనువెళ్తే- 'రజనిముందు తలవంచుకొని నిలబడ వలసి వస్తుంది. మరివెళ్ళక?... ఎంతకాలం?.... తను రజనిని చూసి చాలా కాలమైంది. అప్పుడు పసిమిఛాయలో బక్కపలచగా ఉండేది రజని... ఇప్పుడు ఎలాఉందో? బాగా ఎదిగి- పరిపూర్ణ యవ్వనంతో నిండుగా ఉంటుంది... అవమానాలను ఎదుర్కొన్నా తను ప్రియాతి ప్రియంగా బావించుకునే రజనిని ఒకసారి కళ్ళారా చూసుకు తీరవలసిందే' అంటూ మనసును దృఢపరుచుకొని బయలుదేరాడు.

నారాయణగూడలో ఉన్న రామచంద్రరావు గారి ఇంటికి చేరే సరికి మధ్యాహ్నం మూడు గంటలైంది.

*   *   *

హేమంత్ ఊహించుకున్నట్లుగానే రజని ఎదిగింది... ఎంతో అందం, ఆకర్షణా కూడా కనిపిస్తున్నాయి ఆమెలో... కాలేజీనుంచి ఇంటికివచ్చి ఒకసారి అందరికీ కనిపించి తనగదిలోకి వెళ్ళింది. తర్వాత బయటికి రాలేదు.

రజని తననిచూసీ మాటమాత్రమైనా పలకరించక పోవటం బాధనిపించింది హేమంత్‌కు. ఒకవేళ తనంటే ఉండే సహజమైన సిగ్గు చేత, చుట్టూ పెద్దలున్నారని బిడియపడి- తనతో మాట్లాడలేక పోయిందేమో? -'ఏదోఒకటి తేల్చుకోవాలి' అనుకొని వీలుచూసి ఆమె గదిలోకి వెళ్ళాడు.

రెండోధ్యాస లేకుండా ఏదోపుస్తకం దీక్షగా చదువుతోంది రజని.

చొరవగావెళ్ళి రజని ముందు టేబిల్‌మీద కూర్చున్నాడు హేమంత్.

అతడి ప్రవర్తనకు విస్తుబోయినట్లు ఒకసారి చూసి తలదించేసుకొంది రజని.

"ఏమిటి రజనీ, పలుకే బంగారమై పోయింది" అన్నాడు. మాట్లాడలేదు రజని.

"నామీద కోపమా?"

"........."

"నన్నిలా శిక్షించటంలో నీ ఉద్దేశ్యం?"

దాంతో కదలిక వచ్చిన రజని "ఎవర్ని ఎవరు శిక్షిస్తున్నట్లు?" అంది.

"నువ్వేరజనీ... నువ్వే... నన్ను శిక్షిస్తున్నావు."

"అది నీభ్రమ."

"భ్రమకాదు రజనీ, పచ్చినిజం! ఇందాకనువ్వు కాలేజీ నుంచి వచ్చి నన్ను చూసీ చూడనట్లు ఊరుకున్నావ్... మాట మాత్రమైనా పలకరించావా?"

"ఓ, అదా!... నిన్ను చూడగానే మాట్లాడించాలనే అనిపించింది... కానీ, ఎందుకో గొంతు పెగిలిరాలేదు... అయినా ఇటువంటి చిన్నచిన్న విషయాలకు ఫీలయ్యే వాళ్ళంటే నాకు గిట్టదు."

రజనిమాటలకు కొయ్యబారిపోయాడు హేమంత్... అప్పుడే ఆమెకు స్వంత అభిప్రాయాలు, అభిరుచులు కూడా నన్నమాట!

"-ఇది చిన్న విషయమా రజనీ?- అదే నాస్థానంలో ఉంటే నీకు అర్థమయ్యేది... ఎవరో పరాయి వ్యక్తి నన్ను ఎలా బిహేవ్ చేసినా నేనసలు ఫీలయ్యేవాణ్ణి కాదు.... కానీ, నువ్వు నాదానివై యుండీ -అలా ప్రవర్తించావంటేనే నాకుబాధగా ఉంది... ఒకవేళ నువ్వే నన్ను వెతుక్కొంటూ మా ఇంటికి వస్తే- నీలా నేనూ చేస్తే- అప్పుడు నీకెలాంటి అభిప్రాయ మేర్పడుతుంది?"

"అటువంటి అనవసర విషయాలు ఊహించుకొని నేను మనసు పాడుచేసుకోను.. సరే వాదన ఎందుకుగాని- నావల్లేమైనా తప్పు జరిగిందంటే క్షమించి వదిలెయ్.... నేను చదువుకోవాలిక."

"అంటే?... నన్నిక్కణ్ణుంచి వెళ్ళమనేగా?"

"అర్థం చేసుకోగలిగితే థాంక్స్."

"సరే, నీమాట ప్రకారమే వెళ్తాను ఇప్పుడు... రేపు మాత్రం నువ్వు నాతోపాటే మాఊరు రావాలి."

"అది అసంభవం."

అడుగు ముందుకు వేయబోయి టక్కున ఆగాడు హేమంత్.

" ఏం నువ్వు మాయింటికి రావా ?"

అది నీయిష్టం బట్టికాదు. నాయిష్టాన్నిబట్టి జరగాలి."

"సరే, నీ తలపొగరేమిటో చూస్తాను...." అని పౌరుషంగా ఇవతలకి వచ్చేశాడు హేమంత్.... పైకి బింకంగా అలా అన్నా లోపల అతడిలో ఆత్మ సంఘర్షణ జరుగుతూనే ఉంది.

తను ఎంతో అపురూపంగా భావించుకొనే రజని అలా మాట్లాటం మేమిటి?— ఎందుకు ఈదురదృష్టం?.... అసలే పట్టుదల గల మనిషి రజని... ఆమెను తమయింటికి రప్పించగలడా ? ఒకవేళ బలవంతాన రప్పించగలిగినా— ఆనందంగా బ్రతకగలడా ?— ఏమైనా ఈ విషయంలో తను తొందరపడి లాభంలేదు. పెద్దది. అమ్మ— భారమంతా ఆవిడమీదేవేసి తను నిమిత్తమాత్రంగా ఉండటం మంచిది అన్న నిశ్చయానికి రాకతప్పలేదు హేమంత్‌కు.

సమయం కనిపెట్టి జగదీశ్వరమ్మ అప్పటి తమ రాకలోని ఆంతర్యాన్ని విడమరిచి చెప్పింది.... దీనిమీద వెంటనే తమ అభిప్రాయ మేమిటో చెప్పలేకపోయారు రామచంద్రరావు దంపతులు... చాటుగా కూతుర్ని పిలిచి మంతనాలు జరిపారు వాళ్ళు చాలాసేపు.

" నీకు ఏ విషయం అయిందీ త్వరలో ఓ ఉత్తరం రాస్తాం వదినా" అంది సీతమ్మ వచ్చి.

జగదీశ్వరమ్మ ఇంకేమని మాట్లాడుతుంది. ?—ఉస్సూరంటూ కొడుకుతో సహా తిరిగి రామానగరం వచ్చేసింది.

అలాగే ఓ వారం తర్వాత ఉత్తరం వచ్చింది. "రజనిది ఇంకా చిన్నతనం. బంధాలను, అనుబంధాలను పూర్తిగా అర్థం చేసుకోలేక పోతోంది.... మరికొంత కాలం ఓపికపడితే అన్ని పరిస్థితులూ అవే చక్కబడతయ్.... హేమంత్ యోగ్యుడు. మాకు తెలుసు. అతడు పెద్దల మాటను గౌరవిస్తాడని ఆశిస్తున్నాను" అని రాశాడు రామ చంద్రరావు.

రోజులు భారంగా గడుస్తున్నయ్.... హేమంత్ తిరుగుళ్ళు ఇంకా ఎక్కువయ్యాయి.... అడప దడప రామచంద్రరావు ఉత్త రాలు రాస్తూనే ఉన్నాడు.

ఆరోజు రాత్రి ఇంటికి వచ్చిన హేమంత్‌కు " నీకు ఏదో ఉత్తరం వచ్చిందిరా అబ్బాయ్" అంటూ ఓ కవరు ఇచ్చింది జగదీశ్వ రమ్మ.

రామచంద్రరావు మామయ్య రాసే ఉత్తరాలు తల్లి పేరనే వస్తుంటయ్. మరి తనకు అంత ఇదిగా ఉత్తరం రాసింది ఎవ రబ్బా— అనుకొంటూ కవరు చించాడు.

" ప్రియమైన హేమంత్ బావకు, నీ రజని—" — హేమంత్ కళ్ళు జిగేలుమన్నయ్. "తనకు.... ! .... రజని ఉత్తరం రాయటమా! " ఆశ్చర్యానందాలు మేళవించి పరవశించి— నర్తించింది హేమంత్ మనసు.

'బావా! నేనో పచ్చి మూర్ఖురాలన్న అభిప్రాయం స్థిరపడి ఉంటుంది నీలో .... తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ల అనితేలిగ్గా నవ్వేసే పసి స్వభావం బావా నీది! అలాంటి మనఃస్థితి నుంచి నువ్వు ఎదగాలి. నన్ను నా ఆశయాన్ని అర్థంచేసుకోవాలి.

నేను ఎంత చదివినా నీ అర్థాంగినే. చదువు మన యిద్దరి మధ్య అంతరాలు సృష్టిస్తుందని నువ్వు అంటే - అది సరికాదని నేను అంటాను. ఆడది కూపస్త మండూకం అన్న మూఢ విశ్వాసాన్ని ఛేదించుకొని 'నేనూ ఓ మనిషినే. నాకూ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, శక్తి సామర్థ్యాలు ఉన్నయ్యని ఎలుగెత్తి చాటుతున్న కాలం ఇది. నేనూ ఆడదాన్నే. కాబట్టి - చదువు ద్వారా నా తెలివితేటలను నిరూపించుకోవాలి. అదే నా ధ్యేయం.... ఆ ధ్యేయం నెరవేర్చుకోవటం కోసమే నీకు దూరంగా ఉండటం జరుగుతోంది.... నీ పట్ల నేనేమైనా అమర్యాదగా ప్రవర్తించి ఉంటే నన్ను క్షమించమని మనసారా అడుగు తున్నాను.

ఏదైనా బావా, నీవు నా విషయంలో మరికొంత కాలం ఓపిక పట్టక తప్పదు. మరో సంవత్సరన్నరలో నా డిగ్రీ పూర్తైతుంది. ఆ తర్వాత నువ్వు వద్దన్నా నేను మీ యింటికి- కాదు- నా యింటికి వచ్చే స్తాను. నీ అర్థాంగిగా ఆ యింట్లో నాకుగల హక్కును చాటుకుంటాను. ఈ లోపుగా మాత్రం నువ్వు ఇక్కడికి రావద్దు. ఒక యాణ్ణర్థం తర్వాత మాత్రమే మన తీయని వలపుతలపుల - తలుపులు తీయ బడతాయి. అప్పుడు మనల్ని అడ్డేవాళ్లు, ఆపేవాళ్ళు ఉండరు.... నిజం బావా!....ఇలా ఉత్తరం రాయటం నా బలహీనతగా భావించి-మనస్సు పట్టలేక వచ్చావో నా సంగతి తెలుసుగా ?.... మరంతే అబ్బాయి గారూ.... అత్తయ్యకు ఈ ఉత్తరం చూపించి నాపరువు తీయకేం?... మరి ఉంటాను.

ప్రేమతో 'నీ'

- రజని

ఆ ఉత్తరాన్ని ఒకటికి పదిసార్లు చదువుకున్నాడు. మొత్తానికి రజనిలో తనంటే మంచి అభిప్రాయమే ఉందన్నమాట!.... రజని తనదే....ఒక సంవత్సరంన్నర తర్వాత ఈ ఇంటికి వచ్చేస్తుంది.... అప్పుడు తను.... రజని....ఒకటే తీయని ఊహలు హేమంత్ మనసు నిండా.

రజని ఉత్తరం రాసినట్లు తెలుసుకున్న జగదీశ్వరమ్మ ఆనందానికి అవధులే లేవు.

6

అలా ఓ ఆరుమాసాలు గడిచాయి...వారానికి ఒకటి చొప్పున రజని అలా ఉత్తరాలు రాస్తూనే ఉంది.... ఈలోగా ఓరోజు మిత్రుడు శివరామ్‌కు హైద్రాబాద్‌లో అర్జంటు పని తగిలి- హేమంత్‌ను కూడా బలవంతం చేసి తీసుకు వెళ్ళాడు.

పనిపూర్తి అయ్యాక శివరామ్‌ను ఊరు పంపించి తను-రజన్ని ఓ సారి కళ్ళతో చూసైనా తృప్తి పొందుదామని వాళ్ళ ఇంటికి వెళ్ళాడు.

అప్పుడు దాదాపు సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది..... వెళ్ళేసరికి రామచంద్రరావు ఇంట్లోలేడు. సీతమ్మ ఒక్కర్తే ఉంది. 'రజని ఏది అత్తయ్యా ? అని అడిగితే డాబామీద ఉంది.'' అని 'తడుము కోకుండానే చెప్పింది ఆవిడ...ఆఘమేఘాల మీద వెళ్ళాడు డాబాపైకి.

ఏదో పుస్తకంలో లీనమైపోయి ఉన్న రజని హేమంత్ ఉనికినే గమనించలేదు.

"నేను....వచ్చాను రజనీ...." ఆనందాతిరేకంగా అన్నాడు హేమంత్.

ఆ మాటలకు ఉలిక్కిపడ్డట్లైన రజని తలఎత్తి హేమంత్‌ను చూసి నివ్వెరపోయింది.

"నువ్వు పెట్టిన గడువు తీరకుండానే నేను వచ్చాను.... అయితే, నేనిప్పుడు వచ్చింది కేవలం నీ కోసంకాదు....ఓ స్నేహితుడు బలవంతం చేస్తే పని ఉండి ఈ ఊరువచ్చాను...." అన్నాడు సంజాయిషీగా.

అతడి మాటలు రజనిని తికమకపెడుతున్నాయి.

"నిరాశతో కృంగిపోతూ, జీవితమంటేనే విరక్తి చెందిన నాకు నీ ఉత్తరాలు జీవంపోస్తున్నాయి రజనీ....నువ్వు పెట్టిన సంవత్సరన్నర గడువులో ఆర్నెల్లు తీరిపోయింది....మరో సంవత్సరమే కద— ఎలాగో ఓర్చుకుంటాలే...." అన్నాడు. హేమంత్ తన ధోరణిలో.

తను ఉత్తరాలు రాయటమా ?.... సంవత్సరన్నర గడువు పెట్టటమా ?.... చిత్ర విచిత్రంగా ఉంది రజనికి అంతా.

"రజనీ ! జీవితాంతమూ నువ్వు చెప్పినట్లే నడుచుకుంటాను ....అయితే నాదో చిన్న కోరిక. తీరుస్తావారజనీ ?" అంటూ దగ్గరగా వెళ్ళి ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండానే ముద్దుపెట్టుకోబోయాడు కానీ, రజని పడనీయలేదు.

"ఏమిటిది మేనర్స్ లేకుండా ?" అంటూ వెనక్కు జరిగింది ఆవేశపడుతూ ..

హేమంత్ చెంప ఛెళ్ళుమన్నట్లైంది.

"రజనీ ! ఏమిటి నువ్వు మాట్లాడేది ?.... నాకు మేనర్స్ లేవా ?...."

"మరి ?.... నన్నుతాకే అధికారం నీకెవరిచ్చారు ?"

అదో హఠాత్పరిణామం....

"ఏమన్నావ్, రజనీ ! నిన్ను తాకే అధికారం నా కెవరు ఇచ్చారు అనికదూ - అడుగుతున్నావ్ ?" అంటూ గబుక్కున ఆమె మెడలో మంగళసూత్రాన్ని బయటికితీసి, "ఇది రజనీ....ఇదే నాకు నీపై సర్వాధికారాలూ ఇచ్చింది !.... ఇంతకాలం నేనెవరో, నా అధికారమేమిటో నీకు తెలియజెప్పకపోవటం నిజంగా నా పొరబాటే ....ఇప్పుడు చెబుతున్నాను విను.... నువ్వు నా భార్యవు .... నేను చెప్పినట్లు నడుచుకోవటం నీ విధి. తెలిసిందా ?" అన్నాడు భీకర స్వరంతో.

"ఒకళ్ళు చెప్పినట్లు నడుచుకోవటానికి నేనేం అజ్ఞానినికాదు.... నా వ్యక్తిత్వాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ చంపుకొని బ్రతకలేను" అంటూ రజనికూడా గట్టిగానే నిలబడింది.

" మరి అలా నాకు ఎందుకు ఉత్తరాలు రాస్తున్నట్లు ?"

"...ఇందాకకూడా నువ్వు నేను ఉత్తరాలు రాస్తున్నట్లు చెప్పావు— మరి నీకా ఉత్తరాలు ఎలా వస్తున్నయ్యో నాకు తెలియదు గాని— నేనుమాత్రం నీ కింతవరకు ఒక్క ఉత్తరం కూడా రాయలేదు."

ఆ మాటలు విన్న హేమంత్ తను నిలబడ్డ డాబా ఎక్కడికో కదిలిపోతున్నట్లు అనిపించింది.

అదే సమయంలో అక్కడికి వచ్చాడు రామచంద్రరావు. ఇంటికి రాగానే హేమంత్ రాకను గురించి తెలుసుకొని ఖంగారు పడుతూ.

కనిపిస్తున్న వాతావరణాన్ని బట్టి జరగవలసింది జరిగిపోయిందనిపించింది అతడికి.

తండ్రి రాకను గమనించి చరచర క్రిందికి వెళ్ళిపోయింది రజని అక్కణ్నుంచి.

"ఏం హేమంత్, కులాసా?" - లేని ఉత్సాహాన్ని నటిస్తూ వచ్చి చైతన్య రహితంగా ఓచోట నిలబడిఉన్న హేమంత్ మీద చేయి వేశాడు రామచంద్రరావు.

సమాధానం బదులు అతడివైపు వెర్రిగా చూడటం మొదలు పెట్టాడు హేమంత్.

ఆ చూపులకు తట్టుకోలేనట్లు కొంచెం వెడంగా జరిగాడు రామచంద్రరావు.

"రజని ఏమన్నది హేమంత్?" - ఎటో చూస్తూ అడిగాడు.

"అనవలసింది అన్నది. చెప్పవలసింది చెప్పింది... అసలు రజనివి నిలకడలేని మాటలు. తొందరపాటు నిర్ణయాలు మావయ్యా... ఇన్నిరోజులుగా నాకు ఎన్నో ఉత్తరాలు రాసి - అసలు తాను ఉత్తర మనేదే రాయలేదని బుకాయిస్తోంది..." - మనసును దాచుకోలేక చెప్పాడు హేమంత్.

"రజని అబద్ధం చెప్పలేదు హేమంత్..." రామచంద్రరావు కంఠంలో మార్పు వచ్చింది.

హేమంత్ కొయ్యబారిపోయాడు.

"అదినీకు ఉత్తరాలు రాయని మాట వాస్తవమే.... రజని పేరుతో నీకువచ్చిన ఉత్తరాలన్నీ మీ అత్తయ్య చేత నేను చెప్పి వ్రాయించినవే" చెప్పేశాడు రామచంద్రరావు అసలు విషయం.

"ఎందుకు?....నన్ను వంచించటానికి ఎందుకు ప్రయత్నించావు మావయ్యా?" దీనస్వరమైంది హేమంత్‌ది.

"నిన్ను వంచించటం కాదు హేమంత్ - రజని కన్నతండ్రిగా నా బాధ్యతను నేను నిర్వర్తించటానికి అలా చేశాను... నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు బాబూ....రజని మాకు ఒక్కగానొక్క కూతురు.... అదంటే మాకు ప్రాణం.... అసలు జరిగిన పొరబాటల్లా చిన్నతనంలోనే మీకు పెళ్ళి జరిపించటం....అది దిద్దుకోలేని పొర బాటు....ఇంతకాలం తెలిసీ తెలియని వయస్సు రజనిది... బుద్ధిజ్ఞానం తెలిశాక వివాహ బంధాన్ని అర్థంచేసుకొని తన ప్రవర్తనను మార్చు కొంటుందన్నదే మా ఆశ.... రజని మా కన్నబిడ్డ... అదెప్పుడూ మా దృష్టిలో....చిన్నపిల్లే మరి నీ దృష్టిలో....రజని నీ భార్య. ఆమె మీదఎన్నో ఆశలు పెంచుకొని, అవి నెరవేరక నిరాశ నిస్పృహలకు గురవుతూంటావు నువ్వు. అశాంతి చెలరేగే మనసు - ఏ మార్గానికి మళ్ళమంటే ఆ మార్గానికి మళ్ళుతుంది.... కానీ, అలా జరగకూడదు నా కూతురిస్థానం నీలో పదిలంగా ఉండాలి. అందుకే ఆలోచించి అలా ఉత్తరాలు రాయించటం మొదలుపెట్టాను. రజనే నీకు ఆ ఉత్తరాలు రాస్తోందన్న భ్రమ కలిగించాను.... ఒక విధంగా నేను చేసింది వంచనే.... ఆ బూటకపు ఉత్తరాలు నిన్ను తీయని ఊహ ల్లోకి తోసి ఉంటాయి.... మరి ఈ వేళ ఆ ఊహాసౌధాలన్నీ గాలి మేడలని తెలిసిపోయి - నువ్వు ఎంత కృంగిపోయేదీ నేను అర్థం చేసుకోగలను హేమంత్...." అని అంటున్న రామచంద్రరావు కంఠం వణికింది.

"....ఎవరు అర్థం చేసుకొన్నా ప్రయోజనం ఏముంది మామయ్యా ?"— హేమంత్ కంఠం జీరబోయింది.

'హేమంత్! నువ్వు మగవాడివి.... ఆఫ్టరాల్ ఓ ఆడదాని విషయంలో నువ్వింత బేలగా మారటం నాకేం నచ్చలేదు."

– అలా అన్న రామచంద్రరావువైపు విస్మయంగా చూశాడు హేమంత్.

"ఔను హేమంత్! నీ జీవితం - నీ యిష్టం.... ఇక నువ్వు ఎలా నడుచుకున్నా నాకు అభ్యంతరం ఉండబోదు. ఆప్తబంధువుగా నీకీమాట చెబుతున్నాను.... అయితే రజని కన్నతండ్రిగా మరోమాట- నీ భార్యవిషయంలో మరో కొంతకాలం ఓపికపట్టు చేతనైతే. ఎందు కంటే కాలం తెచ్చేమార్పులు - వాటిని నేను విశ్వసిస్తాను" అన్నాడు రామచంద్రరావు.

ఆ మాటలనుబట్టి అతడు ఎంత నిష్పక్షపాతో అర్థమైంది హేమంత్‌కు. ఆ వెంట ఆయనపై ఓ విధమైన గౌరవభావం పుట్టుకు వచ్చి "ప్రయత్నిస్తాను మామయ్యా" అనిమాత్రం అనగలిగాడు.

హేమంత్ నుండి వచ్చిన అమాత్రపు హామీకే ఉప్పొంగి పోయాడు రామచంద్రరావు. "నాకు తెలుసు హేమంత్, నీ దెంతో మంచి మనసు !.... క్రిందికి పద. కాఫీ తాగుదాం" అంటూ హేమంత్ చెయ్యి పట్టుకొని మెట్లుదిగాడు రామచంద్రరావు.

తీరా లోపలికి వచ్చి చూస్తే ముందు గదిలో కూర్చొని మరో యువకుడితో నవ్వుతూ మాట్లాడుతోంది రజని.

జరిగిపోయిన దుస్సంఘటనను ఎంతో తేలిగ్గా మరిచిపోయి హాయిగా నవ్వుతూ మరో మగాడితో తృప్తిగా మాట్లాడటం చూశాక హేమంత్ మనసు ఉద్వేగపడింది. అది చూచాయగా గమ నించిన రామచంద్రరావు,

"ఏమిటి హేమంత్ అలా చూస్తున్నావ్ ?.... రజని మాట్లా డుతున్నది ఎవరితోననా ?... అతడు మావాళ్ళ అబ్బాయే .... దగ్గరలోనే పల్లెటూరు వాళ్ళది .... డిగ్రీ అయిపోయింది .... ఉద్యో గాన్వేషణలో ఉండి — ప్రస్తుతం ట్యూషన్లు చెప్పు కుంటున్నాడు. కాలక్షేపం కోసం .... అప్పుడప్పుడు మా యింటికి వచ్చి వెళ్తొంటాడు. పేరు ప్రసాద్ .... రా. పరిచయం చేస్తాను" అని అతణ్ణి పరిచయం చేశాడు హేమంత్‌కు.

(ఇంకా ఉంది)

తాళ్ళపాక తిమ్మక్క మరొక అపూర్వ కృతి

ఇటీవల డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారి "తాళ్ళపాక కవుల కృతులు — వివిధ సాహిత్య ప్రక్రియలు" సిద్ధాంత వ్యాసం చదువుతుండగా, "సుభద్రా కళ్యాణము (మంజరి) ; — కర్త్రి తాళ్ళపాక తిమ్మక్క. అన్నమాచార్యుని ప్రథమ కళత్రము. నరసింగన్న తల్లి. సంగీత సాహిత్య చతుర. ఈమె కృతులలో నీ సుభద్రా కళ్యాణ మొక్కటే నేడు మనకు లభ్యమగుచున్నది."[1] అనే వాక్యాలు కనిపించాయి. వాటిని చదివి నాకు కొంచెం ఆశ్చర్యమయింది.

తిమ్మక్క వేంకటేశ్వరునిపై మేలు కొలుపులు మొదలు పవళింపు వరకు పెక్కు గేయ కృతులు రచించినట్లు మా నాన్నమ్మ శ్రీమతి తిరుమల జానకమ్మ చెప్పేది. నాకు ఊహ కలిగి ఆ గేయ కృతులు వ్రాసుకుందామనే కాలానికి 80 ఏళ్ళు పైబడడం వల్ల "గుర్తుకు రావడం లేదే, వరుసగా" అనేది ఆమె. అమూల్యమైన గేయాలు కోల్పోయానే అని చాలా బాధపడ్డాను.

కాని, ఒక్క కృతిని మాత్రం అదృష్టవశాత్తు సంపాదించ గలిగాను - అది మేల్కొల్పుపాట. ద్విపదలో ఉంది; అక్కడక్కడ గాయనుల ఉచ్చారణ లోపం వల్ల ఇతర కారణాలవల్లా యతులు తప్పింది. పాదాలలోను వ్యత్యాసం ఉంది. దీనిని మా మేనత్త శ్రీమతి తిప్పగంతుల అన్నపూర్ణమ్మగారు తరచు ఉదయం పాడగా విన్నాను. ఆమె దీనిని తమ పెద్దలనుంచి మౌఖికంగా నేర్చుకున్నారు. మొదట విన్నప్పుడు ఇది అపూర్వమనే భావం కలుగలేదు. తరువాత దీని ప్రాముఖ్యం తెలిసింది.

ఈ గేయకృతి వేంకటేశ్వరుడు గరుడాద్రిపై శేషాహి పాన్పుపై యోగనిద్రా కేళిలో ఉన్నప్పుడు వనజాసనాది దేవతలు వచ్చి మేల్కొల్పు పాడినట్లు రచితమైంది. ఇది కృష్ణావతార కథను వర్ణిస్తుంది. శ్రీమతి అన్నపూర్ణమ్మగారు పాడినది పాడినట్లుగా ఇక్కడ పొందు పరిచాను. ఉండవలసిన మార్పులను అధస్సూచికల్లో తెలిపాను. గేయం పూర్తిగా ద్విపదలో ఉంది. చివర రచయిత్రిని తెలిపేది మాత్రం మంజరి. అక్కడక్కడ గ్రంథపాతం ఉందేమో ననిపిస్తుంది. ఇంత మాత్రం లభించింది కదా అనే సంతోషంతోను, ఆధునిక గృహిణులు ఇలాటి వాటిని పాడే అవకాశం లేదు కనుక, ఖిలమవుతుందన్న భయంతోనూ, అందజేస్తున్నాను.

పాట - భూపాలరాగం

శ్రీగరుడాద్రిపై శేషాహియన్న [2]
యోగనిద్రా కేళి యున్న యత్తరిని
వనజాసనాది దేవత లేగుదెంచి
వినిపించిరప్పుడా విధమట్టిదనిన —
శ్రీ కర వేంకట శ్రీదరహాస
నాకేశ వరద మానాథ మేల్కొనవే ॥
వసుదేవ దేవకీ వర గర్భజాత
కిసలయ వరరామకృష్ణ మేల్కొనవే ॥
తపము పెంపున యశోదానందులకును
కృపతోడ శిశువైన కృష్ణ మేల్కొనవే ॥
పూతన పయ్యోద దురితదుర్వార
చైతన్య హరణ ప్రశస్త మేల్కొనవే॥
అరిమురి శకటాసురాంగంబులెల్ల
విరుగదన్నిన యదువీర మేల్కొనవే ॥
సుడిగాలి రక్కసి సుక్కంగబట్టి
గడిపిన [3] యదువీర కృష్ణ మేల్కొనవే ॥
ఆననమ్మున తల్లి కఖిలలోకములు
పూని చూపిన జగత్పూజ్య మేల్కొనవే ॥
మద్దుల గూలిచి మరిసంతసిల్లు
ముద్దుల గోపాలమూర్తి మేల్కొనవే ॥
అద్రిరూపంబైన యసురు మర్దించి
రౌద్రంబు మెరయు శ్రీ రమణ మేల్కొనవే
చతురాననుడు వత్స సమితి దాచినను
ప్రతి యొనర్చిన పరబ్రహ్మ మేల్కొనవే ॥
గురుతర గోపాల గోపికాలోల
ధరణ[4] గోవర్ధనోద్ధరణ మేల్కొనవే ॥
వినయవాక్యోదార విఖ్యాత చరిత
వనజాక్ష అక్రూర వరద మేల్కొనవే॥
చతుర మాలాకార శరణంబవైన
అతుల కుబ్జా మనోహరుడ మేల్కొనవే॥
జట్టి పోరుల బట్టి చాణూర మల్లు
చట్టలు బాపిన శౌరి మేల్కొనవే॥
[5]వినుతింప జగదేక శరణంబవైన
కంసుని తల గుండు గండ మేల్కొనవే॥

పరలోక గతుడైన బాలుని దెచ్చి
గురుని కిచ్చిన జగద్గురుడ మేల్కొనవే ॥
కలిత నక్ర గ్రాహ గాంభీర్య ధుర్య
వెలయుచు ద్వారకా [6] రమణ మేల్కొనవే ।
శ్రీ రుక్మిణీ వంద్య స్థిర కేళిలోల
[7]——— ——   ——— ——— ———
వరరూపవతి జాంబవతి తోడి రతుల
నిరతంబు బాయని నిలయ మేల్కొనవే ॥
సత్యభామా వధూ సంభోగ నిలయ
నిత్య మహోత్సవ నిరత మేల్కొనవే ॥
కాళింది మిత్రవిందా కుచద్వంద్వ
కేళీ విహార శ్రీకృష్ణ మేల్కొనవే॥
లక్షణా పరిరంభ లక్షితోదార
వక్షః కటాక్ష వీక్షా మేలుకొనవే॥
శ్రీధర గోపికా చిత్రాబ్జలోల
రాధా మనోహరా రమణ మేల్కొనవే ॥
వేడుక పదహారువేల కామినుల
కూడి బాయని పెండ్లి కొడుక మేల్కొనవే ॥

బాణ బాణాసుర బలభీమ బాణ
పాణి ఖండన చక్రపాణి మేల్కొనవే ॥
ఇంపొంద నటుకుల నిడిన కుచేలు
సంపన్ను జేసిన చతుర మేల్కొనవే ॥
రాజ సూయాగ[9] మర్త్యల ముందు మున్న
పూజలొందిన జగత్పూజ్య మేల్కొనవే ॥
వీరకౌరవ సభ విశ్వ రూపంబు
ధీరత జూపిన దేవ మేల్కొనవే ॥
సధమలానంద నిశ్చల మూలకంద
విదురుని విందు గోవింద మేల్కొనవే ॥
చండ భారత రణ చాతుర్య ధుర్య
గాండీవి సారథ్య ఘనత మేల్కొనవే ॥
వెలయ మేల్కొమ్మని [10] విన్నవించినను
కొలకుల నమృతంబు కురియ మేల్కాంచి
సరసిజాక్షుడు దేవసంఘంబు నందు
కరుణాకటాక్ష వీక్షణ దృష్టినిల్పి
శ్రీ వేంకటాచల శిఖర మధ్యమున
[11]మాణిక్య మణిమయ సింహాసనమున

కరకంకణ క్వణత్కారముల్ మొరయ
సరసిజముఖులు వింజామరల్ వీవ
బంగారు బెత్తాల పటువేత్ర ధరులు
[12]ఇన్నించి పడి బరాబరులను చేయ
నారదవీణ[13] వినోదంబులు సేయ
చేరి తుంబురుల వీణియ[14] మీటిపాడ
నానాప్సరో రాజి నాట్యముల్ సలుప
మానవేంద్రులు మహామహులు సేవింప
[15]....   ....
అనియిట్లు తాళ్ల పాకాన్నమయ కూర్మి
తరుణి తిమ్మక చెప్పె ధరలోన వెలయ
వ్రాసిన చదివిన పాడిన విన్న
అనుదినంబును ప్రాతః కాలంబునందు
మరువక చదివిన మనుజ భక్తులకును
[16]తొలగక వైకుంఠ పదవి సిద్ధించు.

ప్రారంభంలో శ్రీ వేంకటేశ్వరుడు శేషాద్రి అనే పాన్పుపై యోగనిద్రలో ఉన్నాడని చెప్పడం రచయిత్రి అభిమతం గనుక, ఒకటి రెండు చరణాలు పోయాయని భావిస్తున్నాను. తక్కిన కృష్ణావతారగాథ అంతా ఆనుపూర్విలోనే ఉంది. చివర "మానవేంద్రులు మహామహులు సేవింప" అని అసమగ్రంగా ఉంది. సమగ్రం కావడానికి మరొక ద్విపద అవసరం.

దీనికవిత సుభద్రా కళ్యాణకవితతో సమానం గానే ఉంది; సరళంగా, సహజంగా, వివరణ అనవసరమను కుంటాను.

ఇలాటి అపూర్వ కృతి ప్రతి ఉదయమూ పాడుకుంటూ పరిరక్షిస్తున్న శ్రీమతి అన్నపూర్ణమ్మ గారికి తెలుగువారు, ముఖ్యంగా తెలుగు మహిళలు ఎంతో ఋణపడి ఉండాలి.

అధోజ్ఞాపికలు

1. తాళ్లపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు : పుట 314
2. ఇక్కడకొంత పోయింది. శ్రీగరుడాద్రిపై శేషాహిశయ్య, యోగనిద్రను స్వామి యున్న యత్తరిని - అని సవరించు కోవచ్చు.
3. గెడపిన (పడదోసి)
4. ధరను
5. శంసింప అని దిద్దితే యతి ప్రాస సరిపోతాయి.
6. విభుడ
7. ఇక్కడ ఒక ద్విపద ఖిలమై ఉంటుంది.
8. ఇక్కడ యతిపోయింది.
9. రాజసూయమున రారాజులమున్న
10. విన్నవింపగను
11. మంజరీ ద్విపదగా భావిస్తే-చెలువైన మణిమయ సింహాసనమున అని గాని మాణిక్యమయ సింహాసనమునను అనిగాని సవరిచం వచ్చు. లేక అవిరళమణి సింహాసనమునను అంటే యతి ప్రాసలు సరిపోతాయి.
12. ఐంగించి
13. నినాదంబు.
14. ఇక్కడ అచ్చుమాత్రమే యతికలిసింది.
15. ఇక్కడ చివరి ముగింపు ద్విపద పోయి ఉంటుంది.
16. వదలక

డాక్టర్ నీరజా చక్రవర్తి

"ప్రమాదో ధీమతామేవ"

ఆంధ్రప్రదేశ సాహిత్య ఎకాడమీవారు నా పరిష్కరణ విపుల పీఠికతో 1980 సంవత్సరమున ప్రచురించిన 'తాలాంక నందినీ పరిణయము' అనే ప్రబంధాన్ని 1985 ఫిబ్రవరి 'భారతి'లో పాండితీ మండనులైన శ్రీ బులుసు వేంకట రమణయ్యగారు 'గ్రంథ విమర్శలు' శీర్షికలో సమీక్షించినారు.

సమీక్షకులు పత్రికలో 74 పుట మూడవ కాలంలో వ్రాసిన విషయం సరిగాదని తెల్పుకొనుచున్నాను. శ్రీ వేంకటరమణయ్యగారు "గ్రంథకర్త తెలంగాణకు చెందిన సూర్యాపేట నివాసి.... ఈ శతాబ్దానికి చెందినవారు. ఈయన ప్రబంధములు, నాటకములు, యక్షగానములు, స్తోత్రములు శతకములు మున్నగు పెక్కు గ్రంథములను రచించినారు...." అని తెల్పిరి.

ఈ కవి కనగల్లు నివాసి, చరమదశ కూడా కనగల్లులోనే గడిచినది. కవికాలము క్రీ. శ. 1817-1880 మధ్యకాలం, కావట్టి ఈ శతాబ్దివాడు కాడు. ఈయన ఒక ప్రబంధం (ప్రస్తుత కృతి) ఒక యక్షగానం వ్రాసినాడు. కొన్ని చాటువులున్నవి. ఈ విషయాలను పీఠిక 14-21 పేజీలలో వివరించినాను.

అయితే బులుసువారు పొరపాటున 11పుటలో వివరించిన వేంకట నరసింహా చార్యులను మరియొక కవినిగూర్చిన విషయమును చూచి- పైనతెల్పిన దానిని వ్రాసినట్లున్నారు. ఇట్టి పొరపాటు వారి లేఖిని నుండి వచ్చినందుకు బాధగానున్నది.

సాహిత్యాభిమానులైన పాఠకులు ఈ విషయాన్ని నేను వ్రాసినట్లుగా సవరించుకో గలరని, గ్రంథ పరిష్కర్తనగు నాకు గల బాధ్యతతో ఈ చిన్న విషయాన్ని వివరించినాను.

శ్రీ రంగాచార్య
హాలెం

గ్రంథ విమర్శలు

రఘువంశము

[రెండవ భాగము. కాళిదాస మహాకవి కావ్యమునకు తెలుగు వ్యాఖ్య. వ్యాఖ్యాత, విద్వాన్ శిరోమణి, శ్రీ కేశవపంతుల నరసింహ శాస్త్రి. డెమ్మీ సైజు 8 + 440 పేజీలు, వెల 8రూ: లు ప్రకాశకులు – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు-4]

సంస్కృత భాషను అభ్యసించేవారు మొదట పంచకావ్యాలను అభ్యసిస్తారు. అవి కాళిదాసత్రయం,భారవి మాఘకవుల కావ్యాలున్నూ. వీటిని పూర్తిగా కాకుండా కొన్నికొన్ని సర్గలనే చదవడం సంప్రదాయం. దీనివల్ల తగినంత భాషాజ్ఞానం అలవడుతుంది. ప్రారంభంలో చదివేది రఘువంశం. ఇందులో పందొమ్మిది సర్గలున్నాయి. ఇందులో ఇక్ష్వాకు వంశరాజుల సంగ్రహచరిత్ర ఉన్నది: మొదటి తొమ్మిది సర్గల లోను దిలీపునితో ప్రారంభమై దశరథుని వరకూ ఆ రఘువంశ రాజుల చరిత్ర ఉన్నది. తర్వాతి చాలా సర్గలలో రామాయణకథ ఉన్నది. ఈ వంశస్థులలో, రామునికి పూర్వం సుప్రసిద్ధుడైన రాజు రఘువు కాబట్టి అతని పేరే కావ్యానికి పెట్టబడింది.

మహాకవి కాళిదాసు రచన సులలితమై, అర్థ గాంభీర్యం కలిగి, చక్కని ఉపమానాలతో అందరినీ ఆకర్షిస్తుంది. అయినా ప్రారంభంలో దానిని గురువు మూలంగానే అభ్యసించాలి. గురువు చెప్పినది, తాను తిరిగి స్వయంగా అభ్యసించేటప్పుడు కొంత మరుపునకు రావచ్చు. కాబట్టి శాస్త్ర గ్రంథాలకు వలెనే కావ్యాలకు కూడా వ్యాఖ్యలు అవసరం. పంచకావ్యాలకూ అంధుడైన మల్లినాథసూరి సంస్కృతంలో వ్యాఖ్యలు వ్రాసి, విఖ్యాతి గడించాడు. రఘువంశానికి వావిళ్ళవారు పదచ్ఛేద, ప్రతి పదార్థ, టీకాతాత్పర్య, ఆకాంక్షాదులతో తెలుగులో అయిదు సర్గలకు మాత్రం ఎన్నడో వ్యాఖ్యను ప్రకటించారు. అదే ఎంతో పెద్ద గ్రంథమయింది. అది యిప్పుడు దొరకదు కూడా.

రఘు వంశానికి తెలుగు వ్యాఖ్య అత్యవసరమని గ్రహించి, సంస్కృతాంధ్రభాషా వాఙ్మయాలకు ఎనలేని సేవ చేస్తున్న ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వారు, సమగ్రంగా, విద్యార్థులకు ఉప యోగకరంగా, నాతి విస్తరంగా వ్యాఖ్యను ప్రకటింపదలచి, సమర్థ విద్వాంసులు కేశవ పంతుల – నరసింహశాస్త్రిగారి చేత వ్యాఖ్య వ్రాయించారు. శాస్త్రిగారు, విద్యార్థులకు సులభంగా ఉండేటట్లు సంధులను విడదీసి చూపుతూ, అవసరమైనచోట్ల విపులంగా తాత్పర్యాన్నిస్తూ మంచి వ్యాఖ్యను రచించారు. కావ్యమంతా ఒకే సంపుటంగా ప్రకటించడంలోని కష్టనష్టాలను గమనించి అకాడమివారు మొదటి తొమ్మిది సర్గలనూ మొదటి సంపుటంగా ఇదివరకే ప్రకటించారు. మిగతా పది సర్గలూ ఇప్పుడు రెండవ సంపుటంగా వెలువడుతున్నది. ఈ సర్గల పాఠ ప్రవచనాలు ఎక్కువ ప్రచారంలో లేకపోయినా రామాయణ కథను తెలుపుచున్నందున ఈ ద్వితీయ సంపుటపు ప్రయోజనంకూడా అధికమే అని గ్రహించాలి. ఎక్కువ శ్రమపడి వ్యాఖ్య రచించిన నరసంహశాస్త్రిగారూ. దీనిని ప్రకటించిన ఆం.ప్ర. సాహిత్య అకాడమి వారూ అభినందనీయులు.

దుర్గా–భర్గ శతకములు

రచయిత : శ్రీ కపిలవాయి లింగమూర్తి, డెమ్మీసైజు 30 + 68 పేజీలు, వెల 5 రూ. లు. ప్రతులు దొరకు చోట్లు – (1) శ్రీ. ఎమ్. శేఖరరెడ్డి, బి. ఒ. ఎల్ రాకొండ (పోస్టు). అచ్చం పేట తాలూకా, మహబూబ్‌నగర్ జిల్లా.(2) శ్రీ కె. కిశోరుబాబు. 16 – 34. వాణీ సదనం: నాగర కర్నూలు – 509209. మహబూబ్ నగర్ జిల్లా.

సంస్కృతాంధ్రాలలో గట్టి విద్వాంసులూ, కవులూ అయిన రచయిత శ్రీమత్ప్రతాప గిరిఖండం, చక్రతీర్థ మాహాత్మ్యం మొదలైన గ్రంథాలనురచించి మంచిపేరు తెచ్చుకున్నారు.వాగర్థాలవలె కలిసిఉన్న దుర్గా భర్గులను విడదీయక, ఆ యిద్దరినీ గురించిన ప్రత్యేక శతకాలు రెండూ ఒకే సంపుటలో ప్రచురించడం దీని ప్రత్యేకతకు గుర్తు. రచయిత పాలెం ఓరియంటల్ కాలేజీలో ఉపన్యాసకులుగా పనిచేయటంవల్ల, విద్యార్థులకు ఛందోలంకారాలు బోధించ వలసి వచ్చింది. ఆ అనుభవాన్ని పురస్కరించుకొని ఈ శతక ద్వయంలో మొదటి దానిలో అలంకారాలనూ, రెండవ దానిలో యతి ప్రాసలనూ సమన్వయిస్తూ రచన సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ రెండు శతకాలూ సులభమైన ఆటవెలదులలోనూ, గీత పద్యాలలోనూ క్రమంగా ఉన్నందున పాఠకులకు, పఠనంలోనూ, అర్థావగతిలోనూ, శ్రమ ఉండదు. కొన్నిచోట్ల తప్పని సరిగా కఠినంగా తోచే పదాలు పడి ఉండ వచ్చును. అట్టి పదాలకు అర్థాలు కూడ పుస్తకం చివర ఇవ్వబడినవి దుర్గాదేవిని భర్గదేవుని స్తుతించ దలచిన వారికి ఈ పద్యాలు కంఠస్థం చెయ్యడానికి ఉత్సాహం కలిగిస్తాయి. ప్రతీ పద్యం ప్రక్క అందలి అలంకారం ఏదో, అందులో ఏ యతులూ, ఏ ప్రాసలు ఉన్నవో తెలుప బడినది. ఛందో లక్షణానికి విరుద్ధమైనవి కూడా సోదాహరణంగా చూపబడినవి. చివర ఆయా అలంకారాల లక్షణాలు, యతి ప్రాసల లక్షణాలూ చేర్చబడినవి. ఇది కేవలం స్తుతిరూప గ్రంథంగానే కాకుండా అలంకార గ్రంథంగానూ, ఛందో గ్రంథంగానూ కూడా ఉపయోగ పడుతుంది. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైనది.

పుస్తకం మొదట ముద్రణానికి ద్రవ్య సహాయం చేసిన దాతల జీవిత చరిత్రలు వారి ఛాయా చిత్రాలతో కూడా చేర్చబడినవి. వారికి కృతజ్ఞత తెలుపుట ధర్మమే; కాని వారి చరిత్రలు ఇట్టి దైవస్తుతి గ్రంథాలలో చేర్చడం, గ్రంథం యొక్క విలువను కొంత తగ్గిస్తుందని నా అభిప్రాయం.

బులుసు వేంకట రమణయ్య

మహా భాగవత కల్పకుసుమ మాల

[కూర్పరి - డాక్టర్ శ్రీమతి పి. యశోదారెడ్డి, డెమ్మీ 20+136 పేజీలు. వెల: రూ 3 లు. ప్రకాశకులు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, సైఫాబాదు. హైదరాబాదు-500004]

తెలుగులో, భారత రామాయణాలకంటె, బమ్మెర పోతనా మాత్యుని భాగవతానికే ప్రచారం ఎక్కువ. చాలామందికి అందులోని ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షం, రుక్మిణీ కళ్యాణం, కుచేలోపాఖ్యానం కంఠస్థంగా వస్తాయి. పోతనగారి భాగవత పద్యాల్లో ఏ కొద్ది అయినా రానివారు ఆంధ్రదేశంలోని పాఠకలోకంలో ఎవ్వరూ ఉండరని చెప్ప వచ్చును. ఆ మహాకవి రచనా వైశిష్ట్యం అట్టిది.

భాగవతం పన్నెండు స్కంధాల బృహద్గ్రంథం. అన్ని పద్యాలు బాగానే ఉన్నట్లు తోచినా, కొన్ని ఘట్టాలు అతి ముఖ్య మైనవిగా ప్రసిద్ధి పొందాయి. ఆ మహాగ్రంథంపైని ఆదరాభిమానాలు ఉన్నా, అది పెద్దదగుటవల్ల, దాని వెల ఎక్కువగా ఉన్నందువల్ల అందరికీ అందుబాటులో ఉండదు. ఎంతో శ్రమపడి సంపాదించినా - చదవడానికి తీరుబడి ఉండదు. ముఖ్యమైన ఘట్టాలను చదవదలచినా - వాటిని పుటలు తిరగవేసి వెతుక్కోవలసి వుంటుంది. ఈ పరిస్థితులను గమనించి యే ఆంధ్రభాషావాఙ్మయ ప్రచారానికి సాటిలేని కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారు పోతన భాగవతంలోని ప్రధాన ఘట్టాలను సంపుటీకరించి యీ చిన్న పుస్తకాన్ని ప్రకటించి మిక్కిలి తక్కువ వెలకే అందిస్తున్నారు.

ఈ సంకలనాన్ని ఏర్చికూర్చినవారు శ్రీమతి. డాక్టర్. పి. యశోదారెడ్డిగారు. ఆమె ఎంతో పరిశీలించి కల్పతరువు నుండి కుసుమాలను ఏరి మాలగా కూర్చినట్లు ఈ మహాభాగవత కల్పకుసు మాలను తయారు చేశారు. భాగవతంలో పన్నెండు స్కంధా లున్నట్లు ఇందులో పన్నెండు గుచ్ఛాలున్నవి. పోతన యొనర్చిన ఇష్టదేవతాస్తుతి మొదలుకొని భీష్ముడు చేసిన శ్రీకృష్ణస్తుతి వరకూ వివిధ ముఖ్యఘట్టాలు ఇందు కూర్చబడినవి. భాగవతంలో శ్రీకృష్ణుని వృత్తాంతం దశమస్కంధంతో ప్రారంభమవుతుంది. ఇందులో అష్టమ గుచ్ఛం నుంచీ ఆ శ్రీకృష్ణునికి సంబంధించిన ఘట్టాలలోని పద్యాలే ఉన్నవి. ఈ ఎంపిక సమంజసంగా ఉన్నది. అందరి ఆదరాన్ని పొందదగిన గ్రంథం యిది.

"ఆంగీరస"

తిరునామములు సమగ్ర పరిశీలనము

[డా॥ కిడాంబి నరసింహాచార్య, ప్రతులకు: రచయితపేర, తెలుగుఉపన్యాసకులు- ప్రభుత్వకళాశాల, ఆర్మూరు, నిజామాబాదు జిల్లా-503 224, వెల: రు 20-00,]

'శ్రీ సాంప్రదాయికములైన భగవత్పరమైన గీతములు తిరునామములు కీర్తనలను మాట లేకున్నను కీర్తనలను దివ్యనామములనెడి వారని తెలిసినందున నామశబ్ద సామ్యమున తిరునామములకు గూడా కీర్తనలనుటలో విప్రతిపత్తిలేదు'.

అని ఆచార్య నిర్వచించారు కనుక నేను సరే అని అనవలసిందేగాని 'అరే'అని అనవక్కరలేదు. వెదకి వెదకి అర్థం తేల్చుకుని వ్రాయవలసే బరువు నాకు లేకుండా ఆయనే చేశారు.

తిరునామములను సలక్షణంగా సమగ్రంగా సనాతనాధునాతన సంప్రదాయ ప్రదర్శనగా జరిపిన పరిశీలనాత్మక మైన యీ వ్యాసం బృహద్గ్రంథ రూపం ధరించింది. దీనికి ఆంధ్రప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారశాఖ, తిరుమల తిరుపతి దేవస్థానము ఆర్థికంగా చేయూతనిచ్చి ఆంధ్ర వాఙ్మయానికి విశిష్టమైన గ్రంథాభరణాన్ని సంతరించాయని సంతోషిస్తూ రెండు సంస్థల యాజమాన్యాన్నీ అభినందిస్తున్నాను.

ఆచార్యులుగారు చెప్పినట్టే నామైకదేశే నామగ్రహణం అన్నట్టు తిరునామ శబ్దం దైవిక కీర్తనాత్మకమే అవుతుంది.

ఇక్కడ గ్రహించవలసే తాత్వికమూ లేక తాంత్రికమూ అయిన ముఖ్యవిషయం 'శ్రీసాంప్రదాయకము' అనే పదములో ఉన్న 'శ్రీ' శబ్దప్రయోగం-

విష్ణువును 'శ్రీపతి' 'శ్రియఃపతి'- అని అనడంలో ఏవో నామాంతరములు అని అనుకోడం అలా ఉండగా శ్రీప్రధానమైన పతి అని అర్థం చెప్పవలసిఉంది. నేను దీనిని ఇంకొక నామములో సమర్థిస్తాను.

సీతారాములు, పార్వతీ పరమేశ్వరులు, వాణీహిరణ్య గర్భులు,- ఈ ద్వంద్వసమాసములో ముందున్న శబ్దాన్నిపట్టి రెండో పదానికి లౌకికమూ ఆధ్యాత్మికమూ అయిన శక్తిస్ఫూర్తి కలుగుతుంది. కాదని వక్రమార్గాన నిల్చి ఎదిరించే ప్రబుద్ధులకు 'నమోవాకం ప్రశాస్మహే'.

దీనికి ప్రోద్బలకంగా' శ్రీ విష్ణులోకే భగవాన్ హరిర్నారాయణః స్వయం ప్రోక్తవాన్ మంత్ర రత్నాదీన్ శ్రీ యైతాపాది పూర్వకమ్మని' ఆచార్యులు గారిచ్చిన ప్రామాణిక శ్లోకం చదువుకోవచ్చు. తరువాత శ్రీదేవివల్ల ప్రవృత్తి మార్గాన జీవలోకానికి సంక్రమించిది కాబట్టి అది! శ్రీ సంప్రదాయం' అయింది.

నాటినుంచి నేటివరకు విష్ణు సంబంధమైన స్తుతిపరకగీత వాఙ్మయాన్ని ' తిరునామములు' - పేరలో ఎత్తి చూపుతూ శ్రీ వైష్ణవ ధర్మాలను నవవిధభక్తి ప్రదర్శకముగా సోదాహరణంగా ఆచార్యుల వారు ఎదురులేని తీర్పుతో ఈ గ్రంథాన్ని సంఘటించి సుసంపన్నం చేశారు. ఈ బృహత్తర పరిశీలనవల్ల ఆయనికి ' డాక్టరేట్' పట్టమే కాదు ఏదో సమున్నత స్థాయిలో దేశం అంతా ఉత్తమ సమ్మాన పట్టం కట్టవచ్చు.

' ఈ పరిశీలన రూప గ్రంథములో సంగీత రీతులు' కూడా కనిపించడం ప్రత్యేకత -

దీనిలో మాతువునే యిచ్చారు గానీ ధాతువునివ్వలేదు. మోహన రాగానికి ప్రాచీన నామం ' రేగుప్తి ' - అన్నారు. అది ఆలోచించాలి.

కీర్తనలో ధాతుమాతువులు రెండున్నూ భావప్రకటన చేసేవే. రాగానికి అంతర రూపం ధాతువు, బాహ్య రూపం మాతువు.

తిరునామములు బాహ్యావిశేషములు అన్వేషకణం సంధి సమాసాధులు తిరునామములలో ఏ విధంగా ఉన్నాయి అనేది ముచ్చటగా చెప్తుంది.

రామానుజ ప్రధానం శ్రీ వైష్ణవం - దానికి ప్రకృష్ట ప్రతీక గోదా సాహిత్యం. ఆ విషయాలు కూలంకషంగా ఇచ్చి ఆచార్య,గారు కృతార్థులయారు.

శ్రీ వైష్ణవ స్వరూప స్వభావాలను నిశ్శంకంగా తెలుసుకోవాలనే వారికి యీ గ్రంథం సువిమలా దర్శం.

యామిజాల పద్మనాభస్వామి

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 61247.


అమృతాంజన్‌కే
తెలుసు
ఒంటి నొప్పులు
మరియు
బెణుకుల బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తికి రక్షణ
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
1984 ఒలింపిక్స్ క్రీడలలో
పాల్గొన్న భారత క్రీడాకారులకు
అధికారపూర్వకంగా పెయిన్ బామ్
సరఫరా చేసినవారు.
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
OBM 8777 TG